

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 | సంచిక: 266

SUNDAY Special | ఆదివారం 9-6-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



విపక్ష నేతగా రాహుల్

లోక్‌సభలో విపక్ష నేతగా రాహుల్ బాధ్యతలు స్వీకరించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం చేసింది. తనకు కాస్త సమయం కావాలని.. దీని గురించి అతి త్వరలో నిర్ణయం తీసుకుంటానని రాహుల్ చెప్పారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్‌గా సోనియా తిరిగి ఎన్నికయ్యారు.

- వివరాలు 6లో



చాంపియన్ స్వియాటెక్

వరల్డ్ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ ఎర్రమట్టిపై తన జోరును కొనసాగిస్తూ 'హ్యాట్రిక్' నమోదు చేసింది. ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో వరుసగా మూడో ఏడాది ఆమె చాంపియన్‌గా నిలిచింది. ఫైనల్లో స్వియాటెక్ 6-2, 6-1 స్కోరుతో 12వ సీడ్ జాస్మిన్ పావోలినిపై ఘన విజయం సాధించింది.

- వివరాలు 12లో



సమీప భవిష్యత్తులో 'ఇండియా' సర్కారు

సమీప భవిష్యత్తులో కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వం కొలువుదీరుతుందని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు.

వివరాలు 6లో ▸



'నీట్'పై ఉన్నత స్థాయి కమిటీ

నీట్ ఫలితాలపై విమర్శలు రావడంతో.. గ్రేసు మార్కులపై పునఃసమీక్ష చేయడానికి కేంద్ర విద్యా శాఖ ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమించింది.

వివరాలు 6లో ▸

రామోజీ కన్నుమూత


గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురైన రామోజీ గ్రూప్ సంస్థల చైర్మన్

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస

రామోజీ ఫిలింసిటీకి భౌతికకాయం తరలింపు

పలువురు సినీ, రాజకీయ ప్రముఖుల నివాళి

ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నేడు ఫిలింసిటీలో అంత్యక్రియలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రముఖ వ్యాపారవేత్త, రామోజీ గ్రూపు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు (88) కన్నుమూశారు. ఈ నెల 5న గుండె పోటుతో తీవ్ర అస్వస్థతకు గురైన రామోజీని కుటుంబ సభ్యులు నానక్‌రాంగూడలోని స్టార్ ఆస్పత్రికి తరలించారు. గుండె పనితీరు దెబ్బతిన్నదని, బీపీ పడిపోయిందని గుర్తించిన వైద్యులు.. ఆయనకు వెంటిలేటర్ అమర్చారు. యాంజియోగ్రామ్ చేసి గుండె నాళాల్లో స్టంట్ వేశారు. అయినా ఆయన కోలుకోలేదు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆరోగ్యం మరింతగా క్షీణించి.. శనివారం తెల్లవారుజామున 4.51 నిమిషాలకు తుదిశ్వాస విడిచారు. ఆస్పత్రి నుంచి

మిగతా 14వ పేజీలో ▸

దాడులపై పోలీసులు ప్రేక్షక పాత్ర

మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నాని మండిపాటు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఇష్టానుసారం టీడీపీ దాడులు

- ఆపాల్సిన పోలీసులు ప్రేక్షకులుగా మారడం దారుణం
- ఆధారాలతో హైకోర్టులో ప్రైవేట్ కేసులు వేస్తాం
- ఎస్పీకి విన్నవించేందుకు వస్తున్న నేతల నిర్బంధం విచారకరం
- చంద్రబాబు, లోకేశ్‌లే దాడులను ప్రోత్సహిస్తున్నారు
- రౌడీలే సీఐలు, ఎస్‌ఐల అవతారం ఎత్తారు.. బాధితులు అందరికీ అండగా ఉంటాం
- దాడులు ఆపకపోతే మేమూ రోడ్లపైకి వస్తాం
- శాంతి భద్రతల సమస్య ఎదురైతే పోలీసులదే బాధ్యత

2లో



మీడియా సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు పేర్ని నాని, కొడాలి నాని, సింహాద్రి రమేశ్, ఉప్పాల రాము

ఆగని దాడులు.. ఆస్తుల ధ్వంసం

అధికారం కిక్కుతో టీడీపీ కార్యకర్తలు పేట్రేగిపోతున్నారు. గుంపులు గుంపులుగా బైక్‌లపై విన్యాసాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. గ్రామాల్లో పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లలోకి చొరబడి విధ్వంసం సృష్టిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులకు సైతం నష్టం జరుగుతున్నా ఎవరికీ పట్టడం లేదు. ఇంత జరుగుతుంటే అడ్డుకోవాల్సిన పోలీసులు చోద్యం చూస్తున్నారు. టీడీపీ నేతలు, కార్యకర్తల వైఖరిపై జనం విస్తుపోతూ.. అధికారం అప్పగించింది ఇందుకేనా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2లో

కొబ్బరి కొత్త ఊపిరి

- పాత చెట్ల స్థానంలో కొత్తవి నాటేందుకు అవకాశం
- జిల్లాలో వెయ్యి హెక్టార్లలో ఆర్‌అండ్‌ఆర్
- హెక్టారుకు రూ.53,500 రాయితీ వర్తింపు



సాక్షి, అమలాపురం: కర్ణుడి చావుకు వెయ్యి కారణాలు అన్నట్టుగా కొబ్బరి సంక్షోభానికి కారణాలు అనేకం. కొబ్బరి కాయల దిగుబడి తగ్గడం.. కొబ్బరి (చిప్ప) దిగుబడి మందగించడం.. నాణ్యత లేకపోవడం.. పరిపక్వత లేని కొబ్బరి కాయలను దింపుగా తీయడం.. ఇతర దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే కొబ్బరి కాయ సైజు చిన్నగా ఉండడం.. ఉత్తరాది ఎగుమతుల్లో వెనుకబడడం.. చెట్లను ఆశించే తెగుళ్లు.. వివిధ రకాల పురుగులు.. చెప్పుకొంటూ పోతే ఎన్నెన్నో. అయినా అంతిమంగా కోనసీమ జిల్లాలో వయసు మళ్లిన కొబ్బరి తోటలు ఉండడమే ప్రధాన సమస్య. దేశవాళీ కొబ్బరి చెట్టు (ఈస్టుకోస్టాల్) వయసు వందేళ్లు. కానీ 60 ఏళ్ల వరకూ మాత్రమే పూర్తిస్థాయి దిగుబడి వస్తోంది. తరువాత తగ్గిపోతుంది. జిల్లాలో 1.03 లక్షల కొబ్బరి తోటలు ఉండగా, మరో 25 వేల ఎకరాలకు సరిపడా కొబ్బరి చెట్లు ఇళ్ల వద్ద, తోటలు, చెరువు గట్లు, రోడ్ల వెంబడి ఉన్నాయి. ఇప్పుడున్న తోటల్లో 90 శాతం దేశవాళీ రకం కాగా, ఇందులో 50 శాతానికి పైగా తోటలు ఇవే రకాలు ఉండడం గమనార్హం. దేశవాళీ రకం సగటు దిగుబడి చెట్టు కు ఏడాదికి సగటున 70 కాయల వరకూ వస్తాయి. ఇంతకన్నా అధికంగా దిగుబడి ఇచ్చే సంకర జాతి (హై బ్రీడ్) రకాలు ఉన్నాయి. ఇందులో గోదావరి గంగ ఒక టి. ఇది సగటున 140 కాయల వరకూ దిగుబడి ఇస్తోంది.

దిగుబడి పతనం

గతంలో ఎకరాకు 1,200 వరకూ కొబ్బరి కాయల దిగుబడి వచ్చేది. ఇప్పుడు 600 నుంచి 800 కాయలకు పడిపోయింది. 45 రోజులకు ఒకసారి చొప్పున సగటు ఎనిమిది దింపులు వచ్చేది. అది కాస్తా ఇప్పుడు 60 రోజులకు ఒకసారి ఆరు దింపులకు మాత్రమే పరిమితమైంది. ఈ విధంగా చూస్తే గతంలో 9,600ల కాయలు దిగుబడిగా వస్తే, ఇప్పుడు కేవలం 4,800 కాయలు మాత్రమే వస్తోంది. కాయలో కొబ్బరి సైతం తగ్గిపోతోంది. దేశవాళీ రకంలో 125 గ్రాముల వరకూ ఉండేది. దీని నుంచి 64 శాతం నూనె ఉత్పత్తి అయ్యేది. కానీ ఇప్పుడు 100 గ్రాములకు పడిపోయిందని, నూనె శాతం 61 మాత్రమే వస్తుందని అంచనా.

ఆర్‌అండ్‌ఆర్‌తో మేలు

కోకోనట్ బోర్డు (సీడీబీ) రీ ప్లాంటేషన్ అండ్ రిజువేషన్ (ఆర్‌అండ్‌ఆర్) పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో భాగంగా దిగుబడి తక్కువగా వచ్చే చెట్లను, తెగుళ్లు, పురుగులు ఆశించిన చెట్లను, పిడుగుపాటుకు గురై దెబ్బతిన్న చెట్లను తొలగించి కొత్తవి నాటుకోవచ్చు. గతంలో సీడీబీ నేరుగా అమలు చేసే ఈ పథకాన్ని ఇప్పుడు ఆయా రాష్ట్రాల్లో ఉద్యాన శాఖ ద్వారా చేపడుతున్నారు. చెట్లను తొలగించడం, వాటి స్థానంలో కొత్తవి నాటుకోవడం, వాటికి రెండేళ్ల పాటు ఎరువులు ఉచితంగా అందించడం ఈ పథకం ఉద్దేశం. చెట్టు తొలగింపునకు రూ.వెయ్యి చొప్పున రాయితీ అందిస్తారు. దీనికి హెక్టారు పరిమితి కాగా, హెక్టారుకు 32 చెట్లను తొలగించుకునే సౌలభ్యం రైతుకు ఉంది. ఇందుకు గాను రూ.32 వేలు రాయితీగా అందుతోంది. దీనితోపాటు కొత్తగా నాటుకునేందుకు చెట్టుకు రూ.40 చొప్పున హెక్టారుకు 100 చెట్ల వరకూ రైతుకు రూ.4 వేలు, ఎరువులు హెక్టారుకు ఏడాదికి రూ.8,750 చొప్పున రెండేళ్లకు గాను రూ.17,500 చొప్పున మొత్తం రూ.53,500 అందజేయనున్నారు.

పెద్ద ఎత్తున కేటాయింపులు

జిల్లాలో ఈ ఏడాది వెయ్యి హెక్టార్లలో పథకం అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉద్యానశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపగా, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన కృషి ఫలితంగా జిల్లాకు పెద్దఎత్తున కేటాయింపులు జరిగాయి. గతంలో జిల్లాకు కేవలం 400 హెక్టార్లకు మించి ఇచ్చేవారు కాదు. కానీ ఈసారి వెయ్యి హెక్టార్లకు అనుమతి వచ్చింది. అర ఎకరం, ఎకరం ఉన్న చిన్న, సన్నకారు రైతులకు సైతం అమలు చేస్తున్నారు. అందుకు తగినట్టుగా రాయితీ అందజేయనున్నారు.



మూడు రోజులు తేలికపాటి వర్షాలు

13లో

రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమల్లో మరో మూడు రోజులు అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. అలాగే ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు కూడా సంభవిస్తాయని భారత వాతావరణ విభాగం తెలిపింది. శనివారం ప్రకాశం జిల్లా బెస్తవారిపేటలో అత్యధికంగా 3.6 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

నేడు మోదీ మూడోసారి..

రాత్రి 7.15 నిమిషాలకు ప్రమాణస్వీకారం

మంత్రివర్గ కూర్పుపై కొనసాగుతున్న కసరత్తు

మిత్రపక్షాలతో అమిత్‌షా, రాజ్‌నాథ్, నడ్డా మంతనాలు.. టీడీపీ నుంచి రామ్మోహన్, పెమ్మసాని

జేడీయూ నుంచి లలన్‌సింగ్, సంజయ్ ఝాలలో ఒకరు.. మిత్రపక్షాలకు 5 నుంచి 8 బెర్తులు

6లో



- నరేంద్ర మోదీ 3.0 ఆదివారం నుంచి మొదలుకానుంది. రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం రాత్రి 7.15 గంటలకు ప్రధానిగా మోదీ వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మూడుసార్లు ప్రధానిగా చేసిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును సమం చేయనున్నారు. బీజేపీకి సొంతంగా 240 సీట్లు మాత్రమే రాగా... మిత్రపక్షాలతో కలిపి ఎన్డీయే 293 సీట్లతో మెజారిటీ సాధించింది. సొంతంగా మెజారిటీ లేని నేపథ్యంలో మంత్రిపదవులపై మిత్రుల డిమాండ్లను తీర్చడం బీజేపీకి కత్తిమీద సాములా మారింది. శనివారం కూడా బీజేపీ సీనియర్ నేతలు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా మిత్రపక్షాలతో సంప్రదింపులు కొనసాగించారు.



ఎంతో కష్టపడ్డాం.. మంత్రి పదవి ఇవ్వండి

- చంద్రబాబును కోరుతున్న సీనియర్, జూనియర్ ఎమ్మెల్యేలు
- లోకేశ్ చుట్టూ అదే పనిగా చక్కర్లు
- ఎవరికీ హామీ ఇవ్వని తండ్రీకొడుకులు
- మంత్రివర్గం, కీలక పదవులపై పార్టీ నేతల్లో ఉత్కంఠ

14లో



జనసేనకు నాలుగు మంత్రి పదవులు!?

- చంద్రబాబు నుంచి సంకేతాలు..
- కేంద్రంలో రాష్ట్రానికిచ్చే పదవులు, రాష్ట్రంలో బీజేపీకిచ్చే పదవుల ఆధారంగా జనసేనకు ఐదో పదవి
- పవన్, నాదెండ్ల మంత్రివర్గంలో ఉంటారని పార్టీలో చర్చ

14లో

నితీశ్‌కు ప్రధాని పదవి ఆఫర్



- తమ కూటమిలో చేరితే ప్రధానిగా నియమిస్తామంటూ జేడీ (యూ) అధినేత నితీశ్‌కు ఇండియా కూటమి ఆఫర్ ఇచ్చిందని జేడీ(యూ) నేత కె.సి.త్యాగి వెల్లడించారు. కానీ ఆ ఆఫర్‌ను నితీశ్ కుమార్ తిరస్కరించారని చెప్పారు. కె.సి.త్యాగి వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ఖండించింది.

6లో

సెంట్రల్ గాజాలో భీకర పోరు



- సెంట్రల్ గాజాలో నుసెయిరత్‌లో హమాస్ మిలిటెంట్లు, ఇజ్రాయెల్ భద్రతా దళానికి మధ్య పోరు భీకరంగా కొనసాగుతోంది. ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 210 మంది చనిపోగా, మరో 400 మంది గాయపడినట్లు హమాస్ తెలిపింది. హమాస్ చెర నుంచి నలుగురిని రక్షించినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది.

6లో

క్లుప్తంగా...

టీడీపీ దాడులు దుర్మార్గం
వైఎస్సార్‌సీపీ నేత పేరాడ తిలక్


మోహనరావును పరామర్శిస్తున్న పేరాడ తిలక్, నాయకులు

కాశీబుగ్గ: టీడీపీ అధికారంలోకి వచ్చాక.. ప్రమాణ స్వీకారం చేయకముందే రాష్ట్రవ్యాప్తంగా అలజడులు సృష్టించడం దారుణమని శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకుడు పేరాడ తిలక్ అన్నారు. పలాస మండలం లక్ష్మీపురం ఎంపీటీసీ సభ్యుడు గండు మోహనరావుపై శుక్రవారం టీడీపీ కార్యకర్తలు కిష్టుపురంలో దాడులకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండించారు. పలాస సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోహనరావును శనివారం పరామర్శించారు. అనంతరం తిలక్ మాట్లాడుతూ.. విజయగర్వంతో విర్రవీగి హత్యాయత్నాలకు పాల్పడటం తగదన్నారు. ఐదేళ్ల పాటు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఈ ప్రాంతంలో ఎక్కడా ఇటువంటి ఘటనలు జరగలేదన్నారు. ఎన్నికలు ఫలితాలు వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ జెండాలను తొలగించడం, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పానిల శ్రీనివాసరావు, ఉంగ సాయికృష్ణ, పైల వెంకటరావు, గొర్లె వేణు, చింతాడ మాధవరావు, దంతం వైకుంఠరావు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటిపై దాడి
- ఇంట్లోకి చొరబడి కట్టెలతో చితకబాదిన టీడీపీ కార్యకర్తలు
- దంపతులిద్దరికీ తీవ్ర గాయాలు
- పరిస్థితి విషమం.. కర్నూలు ఆస్పత్రికి తరలింపు



దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త హరి దంపతులు

కొలిమిగుండ్ల: నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం బెలుం శింగవరంలో వీరపాపులమ్మ ఆలయం సమీపంలో ఉంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త అంపినేని హరిపై టీడీపీ కార్యకర్త దాడి చేశారు. టీడీపీ కార్యకర్త శ్రీరాములు, మరికొందరితో కలిసి శనివారం ఒక్కసారిగా హరి ఇంట్లోకి చొరబడి కట్టెలతో దాడి చేశారు. దీంతో హరి, అతని భార్య తిరుపతమ్మ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం ఇద్దరినీ కుటుంబ సభ్యులు బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతంలో ఇరు కుటుంబాల మధ్య మనస్పర్థలు ఉండటం, ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో కక్ష సాధింపులో భాగంగా దాడికి దిగారని స్థానికులు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హరి దంపతులను మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరామర్శించారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. గాయపడిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు.

గ్రామ సూచిక బోర్డులు ధ్వంసం

భీమవరం అర్బన్: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం యనమదుర్రు గ్రామ శివారులో ఏర్పాటు చేసిన సూచిక బోర్డులను శుక్రవారం అర్ధరాత్రి జనసేన, టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన సర్పంచ్ బూరబత్తులు రామ్మూర్తి, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు ఫొటోలతో కూడిన గ్రామ సూచిక బోర్డు అక్కడ ఉండటాన్ని నిరసిస్తూ వారు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. గెలిచి నాలుగు రోజులైనా కాకముందే జనసేన, టీడీపీ కార్యకర్తల దౌర్జన్యాలు, ఆగడాలు పెరిగిపోయాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సర్పంచ్ ఇంటిపై టీడీపీ కార్యకర్తల దాడి


గాయపడిన అవినాష్


శ్రీనివాసరావు

రాజుపాలెం: పల్నాడు జిల్లా రాజుపాలెంలో తెలుగుదేశం కార్యకర్తలు పెట్రేగిపోయారు. బజారులో జరిగిన చిన్న గొడవ నేపథ్యంలో సుమారు 20 మంది తెలుగుదేశం కార్యకర్తలు గ్రామ సర్పంచ్ పులిబండ్ల అశోక్ ఇంటిపై దాడికి తెగబడ్డారు. సర్పంచ్ ఇంటి ముందు వారి కుటుంబ సభ్యులు కూర్చొని ఉండగా టీడీపీ కార్యకర్తలు ఒక్కసారిగా కర్రలతో దాడి చేశారు. దాడిలో పులిబండ్ల శ్రీనివాసరావు, పులిబండ్ల అవినాష్, పులిబండ్ల అంకమ్మరావు, పులిబండ్ల వెంకటరమణలు గాయపడ్డారు. వారిని సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దాడులపై పోలీసులు ప్రేక్షక పాత్ర

మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నాని మండిపాటు


టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడిన బాబి దంపతుల ఫొటోలను చూపుతున్న మాజీ మంత్రి పేర్ని నాని

మచిలీపట్నం టౌన్: కృష్ణా జిల్లాలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ, జనసేన కార్యకర్తలు చేస్తున్న దాడులను నియంత్రించకుండా ప్రేక్షక పాత్ర పోషిస్తున్న పోలీసులపై హైకోర్టులో ప్రైవేటు కేసులు వేస్తామని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని), మాజీ మంత్రి కొడాలి శ్రీవేంకటేశ్వరరావు (నాని) వెల్లడించారు. శనివారం వారు కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పేర్ని నాని మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజు నుంచి జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ, జనసేన రౌడీ మూకలు ఉద్దేశ పూర్వకంగా, అధికార మదంతో మారణహోమం సాగిస్తున్నా, విధ్వంసం సృష్టిస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు, జిల్లాలో గెలుపొందిన ఎమ్మెల్యేలు.. వారి కార్యకర్తలు చేస్తున్న దాడులపై ప్రేక్షకపాత్ర వహించేలా పోలీసులకు ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. ఆ ఆదేశాలను పోలీసులు తూచా తప్పకుండా పాటిస్తుండటం విచారకరం అన్నారు. గతంలో బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితిని చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌లు ఆంధ్రప్రదేశ్‌లోనూ తీసుకొచ్చారని విమర్శించారు. రౌడీ షీటర్లు స్థానికంగా ఉన్న డీఎస్పీ, సీఐ, ఎస్సైలను ఏరా.. ఉద్యోగం చేయాలని లేదా.. నువ్వు ఇక్కడే ఉంటావా.. లేక వీఆర్‌కు వెళతావా.. అని మాట్లాడుతున్నా పోలీసులు మిన్నకుండి పోవడం విచారకరం అన్నారు. ఈ ఘటనలకు సంబంధించిన వీడియోలతో కోర్టుకు వెళతామని స్పష్టం చేశారు.

కళ్లెదుటే దాడులు.. అచేతనంగా పోలీసులు

'బందరు గొడుగుపేటలోని ఎంకులు బంకులు ఎదురుగా ఉన్న సందులో ఒక యాదవ కుటుంబం ఇంట్లో సామగ్రి, టీవీని ధ్వంసం చేస్తే, కేసు పెట్టినా ఇనుగుదురుపేట పోలీసులు పట్టించుకోలేదు. బాధితులను వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించి సామగ్రి కొనుగోలుకు ఆర్థిక సాయం చేస్తే మళ్లీ సామగ్రి కొంటే ఇలాగే ధ్వంసం చేస్తామని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హెచ్చరిస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడం దారుణం. స్థానిక చిలకలపూడి గోడౌన్స్ ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ కాలనీలో కూలీ పనులు చేసుకునే భార్యాభర్తలు వైఎస్సార్‌సీపీకి పని చేశారనే కారణంతో వారి ఇంటిపై దాడి చేసి సామగ్రి ధ్వంసం చేశారు. అడ్డుపడిన వీరిద్దరినీ తీవ్రంగా గాయపరిచారు. ఆ దంపతులను ఆసుపత్రిలో చేర్చుకోకుండా అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు వారిని ఆసుపత్రిలో చేర్చారు. ఆ సమయంలో 25కు పైగా కేసులు ఉన్న రౌడీషీటర్ నవీన్.. ఆసుపత్రికి వెళ్లి నెలల పిల్లాడిని ఎత్తుకున్న ఆ మహిళను అసభ్య పదజాలంతో దూషించాడు. ఇదంతా పోలీసుల కళ్లెదుటే జరిగింది. అయినా రౌడీ షీటర్‌పై కేసు పెట్టకపోగా, బాధితులపైనే ఎదురు కేసు పెట్టారు. మర్డర్ కేసు ముద్దాయిలు, రౌడీలే డీఎస్పీలు, సీఐలుగా భావించేలా చంద్రబాబు తయారు చేశారు. మహేష్ అనే వ్యక్తి విచ్చలవిడిగా బరితెగించి కుర్చీలతో ఎస్ఐ పైనే దాడి చేశాడు. కార్లు ధ్వంసం చేశాడు. అయినా ఇంత వరకు కేసు నమోదు చేయలేదు. ఇంత జరుగుతున్నా జిల్లా ఎస్పీ స్పందించకపోవటం విచారకరం. మాజీ ఎమ్మెల్యేలు అందరం ఎస్పీని కలిసి విన్నవించాలని నిర్ణయం తీసుకున్నాం. విజయవాడ నుంచి బయలుదేరిన వల్లభనేని వంశీ, కైలే అనిల్‌కుమార్‌లను పోలీసులు రానివ్వకుండా నిర్బంధించారు. రేపో, ఎల్లుండో డీజీపీ, ఎస్పీలను కలిసి దాడుల ఘటనలపై ఆధారాలతో ఫిర్యాదు చేస్తాం. ఈ దాడుల ఘటనలపై వీడియో ఆధారాలతో హైకోర్టులో ప్రైవేటు కేసు వేస్తున్నాం' అని పేర్ని నాని తెలిపారు.

మేం వస్తున్నాం.. ధైర్యంగా ఉండండి...

మాజీ మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం వైఎస్సార్‌సీపీ శ్రేణులను నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భౌతిక దాడులకు దిగుతూ చేతులు, కాళ్లు విరగ్గొట్టడంతో పాటు గ్రామాల్లో ఉండొద్దని హెచ్చరిస్తున్నారన్నారు. ఈ ఘటనలకు పోలీసులే ప్రత్యక్ష సాక్షులుగా ఉన్నారని తెలిపారు. 'దాడులు జరుగుతుంటే పోలీసులు నిలబడి చూస్తూ ఎంజాయ్ చేస్తుండటం దారుణం. స్థానికంగా దాడులు జరుగుతున్న సమయంలో ఆయా ప్రాంతాల పోలీసులకు సమాచారం అందించినా, స్పందించడం లేదు. వచ్చినా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఈ ఘటనలపై కేసులు కట్టడం లేదు. దాడులు చేస్తున్న వారే కాకుండా దాడులను చూస్తూ మిన్నకుండిపోయిన పోలీసులపై కూడా కేసులు వేస్తాం. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎలాంటి భయాందోళనకు గురికావాల్సిన అవసరం లేదు. రెండు రోజుల్లో జిల్లాలోని ముఖ్య నాయకులందరం ప్రతి నియోజకవర్గానికి వెళ్లి దాడులకు గురైన వారి ఇళ్లకు వెళ్లి ధైర్యం చెబుతాం. ఇకనైనా దాడులు ఆగకుంటే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రోడ్డు పైకి వస్తారు. లా అండ్ ఆర్డర్ సమస్య ఎదురైతే దానికి పోలీస్ వ్యవస్థే బాధ్యత వహించాలి' అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, మచిలీపట్నం, పెడన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), ఉప్పాల రమేష్ (రాము) పాల్గొన్నారు.

పేర్ని కిట్టు, నాయకులను అడ్డుకున్న పోలీసులు


పేర్ని ఇంటి వద్ద పోలీసుల పహారా

టీడీపీ శ్రేణుల దాడిలో గాయపడిన బాబి దంపతులను పరామర్శించేందుకు బయలుదేరిన వైఎస్సార్‌సీపీ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. బందరు పట్టణంలోని చిలకలపూడి ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉండే బాబి దంపతులు వైఎస్సార్‌సీపీ పక్షాన నిలిచారనే నెపంతో కూటమి శ్రేణులు వారి నివాసంపై దాడికి పాల్పడ్డారు. సామగ్రి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా శనివారం బాధితులను పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) తన నివాసం నుంచి నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్లతో కలిసి బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారి పరామర్శకు వెళ్లేందుకు అనుమతి లేదని అడ్డుకున్నారు. అదనపు బలగాలను రప్పించి దారికి అడ్డంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. పరామర్శకు అనుమతి ఏమిటని పేర్ని కిట్టు, తదితరులు పోలీసులను దాటుకుని వెళ్లి బాబి దంపతుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, జోగి చిరంజీవి, ఐనం తాతారావు, మాచవరపు రాంప్రసాద్, పల్లి శేఖర్, పర్ణం సతీష్, శ్రీరాం చిన్నా ఉన్నారు.


బాబి దంపతులను పరామర్శిస్తున్న పేర్ని కిట్టు

కవ్వింపులు.. ఆపై గొడవలు

- టీడీపీ నేత బాణసంచా కాల్పులతో ఎగిసిపడిన నిప్పురవ్వలు
- ప్రజలను ఇబ్బంది పెట్టొద్దన్న వైఎస్సార్‌సీపీ నేతలు..
- ఇరు వర్గాల మధ్య వాగ్వాదం.. పరస్పరం దాడులు
- గొడవతో సంబంధమే లేని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డిపై అక్రమంగా కేసు నమోదు


సత్యనారాయణరెడ్డిని కోర్టుకు తరలిస్తుండగా అడ్డుకుంటున్న అనుచరులు

పెళ్లకూరు (తిరుపతి జిల్లా): పెళ్లకూరు మండలం చిల్లకూరులో టీడీపీ కార్యకర్త దుందుడుకు చర్యలతో గొడవ చోటుచేసుకుంది. టీడీపీ, వైఎస్సార్‌సీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ దాడులతో సంబంధం లేని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డిపై అక్రమ కేసు నమోదైంది. వివాదాస్పద ఈ గ్రామంలో కొద్ది రోజులుగా పోలీసు పికెట్ ఏర్పాటు చేసి 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. అయితే గ్రామానికి చెందిన టీడీపీ నేత దువ్వూరు విజయసేనారెడ్డి టీడీపీ విజయం సాధించిన నేపథ్యంలో గురువారం రాత్రి పెద్ద ఎత్తున బాణసంచా కాల్చాడు. గడ్డివాములు, చిన్న పిల్లలపై నిప్పు రవ్వలు పడ్డాయి. దీంతో అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మురళి, మరి కొందరు విజయసేనారెడ్డితో మాట్లాడేందుకు వెళ్లారు. అక్కడ మాటామాటా పెరిగి వాగ్వాదానికి దిగారు. ఇరు వర్గాల వారు దాడులకు పాల్పడటంతో పలువురు గాయపడ్డారు. నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి ఘటన స్థలానికి చేరుకుని వేర్వేరు వాహనాల్లో చికిత్స నిమిత్తం ఒక వర్గాన్ని శ్రీకాళహస్తికి, మరో వర్గాన్ని నాయుడుపేట ఆసుపత్రులకు తరలించారు. అదే సమయంలో సత్యనారాయణరెడ్డిపై కక్ష సాధించడం కోసం దాడుల్లో గాయపడిన రాకేష్‌రెడ్డికి మద్దతుగా నాయుడుపేటకు చెందిన కొందరు టీడీపీ యువత పెళ్లకూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. సత్యనారాయణరెడ్డి తమపై దాడి చేయించాడంటూ రాకేష్‌రెడ్డి, విజయసేనారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు పెట్టాలని పోలీసులపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఇరు వర్గాల ఫిర్యాదులతో ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డితో పాటు ఆయన వర్గానికి చెందిన పిల్లిమిట్ట మురళి, వంశీకృష్ణ, ఆళ్ల చంద్రబాబు, సుజిత్, మణి, నాగార్జున్, చెంచయ్య, పుట్టయ్యలతో పాటు రాకేష్‌రెడ్డి, విజయసేనారెడ్డిలపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. సత్యనారాయణరెడ్డిని కూడా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనతో సంబంధంలేని సత్యనారాయణరెడ్డిపై కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుక్రవారం పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. నాయుడుపేట రూరల్ సీఐ జగన్‌మోహన్‌రావు అత్యుత్సాహం వల్లే సత్యనారాయణరెడ్డిని అన్యాయంగా కేసులో ఇరికించారని ఆవేదన వ్యక్తం చేశారు. అడిషనల్ ఎస్పీ జక్కా కులశేఖర్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని కేసు వివరాలను పరిశీలించారు. సత్యనారాయణరెడ్డితో పాటు మరో తొమ్మిది మందిని అరెస్టు చేసి సూళ్లూరుపేట కోర్టులో హాజరు పరిచారు. ఎన్నికల సమయంలో డబుల్ గేమ్ ఆడుతున్న సీఐని బదిలీ చేయాలని అప్పట్లో ఎమ్మెల్యే సంజీవయ్యకు సూచించడాన్ని మనసులో పెట్టుకొని అన్యాయంగా తనను కేసులో ఇరికించినట్లు సత్యనారాయణ రెడ్డి తెలిపారు.

ఆగుతున్న వైఎస్సార్‌సీపీ అభిమానుల గుండెలు
పార్టీ ఓటమిని జీర్ణించుకోలేక చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల్లో ఇద్దరి మృతి


రాజప్ప(ఫైల్)


వంజంగి రాజన్న(ఫైల్)

పలమనేరు (చిత్తూరు జిల్లా)/టెక్కలి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పరాజయాన్ని జీర్ణించుకోలేక ఆ పార్టీ అభిమానుల గుండెలు ఆగిపోతున్నాయి. పలమనేరు మండలం పెంగరగుంట పంచాయతీ ముసలిమడుగు గ్రామానికి చెందిన రాజప్ప(66) వైఎస్సార్ అభిమాని. ఎన్నికల ఫలితాలను టీవీలో చూస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడి వైద్యులు.. తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడి స్విమ్స్‌లోనూ కాదనడంతో ఇంటికి తీసుకొచ్చారు. శనివారం ఇంట్లోనే ఆయన ప్రాణాలు విడిచినట్టు కుటుంబీకులు తెలిపారు. మృతుడికి భార్య, ఐదుగురు పిల్లలున్నారు.

శ్రీకాకుళం జిల్లాలో..

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం అక్కవరానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త వంజంగి రాజన్న(37) ఈ నెల 4న ఎన్నికల ఫలితాలు వెల్లడైనప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ ఓడిపోయిందని తల్లడిల్లిపోతున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలిపోయి ప్రాణాలు విడిచాడు. వ్యవసాయ కూలీ అయిన రాజన్నకు భార్య, ఇద్దరు కుమారులున్నారు.

విశాఖలో టీడీపీ కార్యకర్తల స్వైర విహారం
- విజయోత్సవ ర్యాలీల పేరుతో రాత్రిళ్లు రోడ్లపై హంగామా
- వైఎస్సార్‌సీపీ నేత సునీల్ ఇంటి వద్ద కత్తులతో హల్‌చల్
- మందు గుండు సామగ్రి కాల్చుతూ బీభత్సం.. కారుపై దాడి

సీతమ్మధార(విశాఖ ఉత్తర): విశాఖలో టీడీపీ కార్యకర్తలు స్వైర విహారం చేస్తున్నారు. విజయోత్సవ ర్యాలీల పేరుతో రాత్రి సమయాల్లో రోడ్లపై హంగామా చేస్తున్నారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి సునీల్ ఇంటి వద్ద కత్తులతో హల్‌చల్ చేశారు. జీవీఎంసీ 26వ వార్డులోని తెలుగుదేశం నాయకులు శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అక్కయ్యపాలెంలో నివాసం ఉంటున్న సునీల్ ఇంటి దగ్గరకు వచ్చాక.. ముక్క సాయి, ముక్క సన్ని, దిండి పవన్ మందు గుండు (బాణసంచా) సామగ్రి కాల్చారు. ఆ అగ్గిరవ్వలు సునీల్ ఇంట్లోకి వెళ్లాయి. కారుపై పడ్డాయి. అదే సమయంలో ఆ ముగ్గురు యువకులు కత్తులు పట్టుకుని సునీల్ ఇంటి వైపు వెళ్లారు. సునీల్ కారుపై దాడి చేశారు. దీంతో కుటుంబ సభ్యులు భయాందోళనతో ఫోర్త్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ విజయకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని, 41 నోటీసు ఇస్తూ శనివారం స్టేషన్ బెయిల్ ఇచ్చారు. మరో ఏడుగురి కోసం గాలిస్తున్నారు.

అధికారంలోకి రాగానే టీడీపీ దాడులు

- మా ప్రభుత్వ హయాంలో ఎవరిపైనా దాడి చేయలేదు
- దెందులూరు వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి




గాయపడిన నిట్టా గాంధీ

దెందులూరు: తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాము ఎక్కడా దాడులు చేయలేదని ఏలూరు జిల్లా దెందులూరు వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. కానీ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తమ కార్యకర్తలు, నేతలు, వారి ఆస్తులపై దాడులు చేస్తోందన్నారు. శనివారం దెందులూరులో అబ్బయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు. గెలుపోటములను హుందాగా స్వీకరించి ప్రజల కోసం బాధ్యతాయుతంగా పనిచేయాలని చెప్పారు. అంతేతప్ప.. వ్యక్తులు, ఆస్తులపై దాడులు చేయడం ఏం సంప్రదాయమని ప్రశ్నించారు. దాడులు, దౌర్జన్యాలు, హింసాత్మక ఘటనలపై కూటమికి పార్టీల పెద్దలు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. టీడీపీ శ్రేణులు వృద్ధులని కూడా చూడకుండా ఇళ్లకు వెళ్లి దాడులు చేయడం బాధాకరమన్నారు. శ్రీరామవరం గ్రామ సచివాలయంపై టీడీపీ జెండా ఎగురవేయడం సబబేనా అని ప్రశ్నించారు. శ్రీరామవరం–సీతంపేటకు వేసిన రోడ్డు శిలాఫలకాన్ని కూల్చివేశారన్నారు. దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం మామ, జోగన్నపాలెం వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు నిట్టా గాంధీపై దాడి చేసి గాయపరిచారని చెప్పారు. శ్రీరామవరంలో వైఎస్సార్‌సీపీ క్రియాశీలక కార్యకర్త రవీంద్ర ఆటోను పగలకొట్టారన్నారు. దెందులూరు నియోజకవర్గంలో టీడీపీ దాడులపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌కు వివరించామన్నారు. బాధిత కుటుంబాలకు తాను, పార్టీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

బొమ్మరాజుపల్లిలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ
పలువురు వైఎస్సార్‌సీపీ వర్గీయులకు గాయాలు


సుబ్బుయాదవ్

ఈపూరు: సోషల్ మీడియాలో పెట్టిన పోస్టుల విషయంలో వివాదం చెలరేగి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఈ సంఘటన పల్నాడు జిల్లా ఈపూరు మండలం బొమ్మరాజుపల్లి గ్రామంలో శనివారం జరిగింది. వైఎస్సార్‌సీపీని కించపరిచేలా టీడీపీ నేతలు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఇలా పోస్టు పెట్టడం తగదని, అలా ఎందుకు ఎందుకు పెట్టారని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అడగడంతో వివాదం చెలరేగింది. టీడీపీ నేతల దాడిలో వైఎస్సార్‌సీపీకి చెందిన కొండవర్జు సునీత, కొండవర్జు నాగలక్ష్మి, కొండవర్జు సుబ్బుయాదవ్, బోయినబోయిన చిన్న నాగేశ్వరరావుకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఈపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన కార్యకర్తకు 'కంబాల' పరామర్శ
అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే జోగులు హామీ


గాయపడిన కనకారావును పరామర్శిస్తున్న కంబాల జోగులు

ఎస్.రాయవరం (అనకాపల్లి జిల్లా): టీడీపీ మూకల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పార్టీ పాయకరావుపేట సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు శనివారం పరామర్శించారు. పెట్టుగోళ్లపల్లి గ్రామంలో కౌంటింగ్ రోజున టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కార్యకర్త కొంద్ర కనకారావుపై దాడి చేయడంతో ఆయన గాయపడ్డారు. చేతులు, తలపై బ్లేడుతో కోసి, కర్రలతో కొట్టి తీవ్రంగా హింసించారని కనకారావు ఎమ్మెల్యేకు వివరించారు. దీనికి జోగులు మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా వెంటనే సమాచారం ఇవ్వాలని, తాను అండగా నిలబడతానని కుటుంబ సభ్యులకు జోగులు ధైర్యం చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ చొప్పా రాజు, సర్పంచ్‌లు కర్రి సత్యనారాయణ, ధూళి శ్రీనుబాబు, చోడిపల్లి గోవిందు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మె ధ్వంసం

- పంచాయతీ కార్యాలయంపై టీడీపీ, జనసేన జెండాలు
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన


వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెను ధ్వంసం చేయడంపై నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

లింగపాలెం: ఏలూరు జిల్లా లింగపాలెం మండలం కలరాయనగూడెం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెను శనివారం టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. దీనిపై స్థానిక సర్పంచ్ చలగొళ్ల రవిబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. టీడీపీ కార్యకర్తల తీరును ఖండించారు. పంచాయతీ కార్యాలయంపై టీడీపీ, జనసేన జెండాలను కట్టడంతో, ఇరు పార్టీల శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. జెండా దిమ్మె ధ్వంసం పట్ల ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ రవిబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెను ధ్వంసం చేయడం అప్రజాస్వామికమని, గతంలో ఎప్పుడూ ఇటువంటి ఘటనలు చోటుచేసుకోలేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్ మాట్లాడుతూ పార్టీ దిమ్మెను టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేయడం, వేములపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటిపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. రౌడీయిజం చేయడానికి టీడీపీకి అధికారం ఇవ్వలేదన్నారు. బాధితులకు పార్టీ అండగా ఉంటుందని, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మాజీగూడెం సొసైటీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.మధు, కె.రఘు, సీహెచ్ సూరిబాబు, పోశ్చానగరం ఎంపీటీసీ ఎస్.శివాజీ, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజాపేటలో టీడీపీ బీభత్సం
- శిలా ఫలకాలు, జనం కూర్చునే బల్లలు ధ్వంసం
- సచివాలయంపై టీడీపీ జెండాలు


నవరత్న పథకాల లోగోను ధ్వంసం చేస్తున్న దృశ్యం

చిలకలూరిపేట టౌన్: పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం రాజాపేటలో టీడీపీ కార్యకర్తలు శనివారం వీరంగం వేశారు. గ్రామ సచివాలయంలో నవరత్నాల పథకాల లోగోను ధ్వంసం చేశారు. సచివాలయంపై టీడీపీ జెండాలను కట్టి నినాదాలు చేశారు. గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఉన్న శిలాఫలకాన్ని పడగొట్టారు. వీధుల్లో జనం కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బల్లలను సైతం ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్ని, ఎస్సీలను బెదిరించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో రెండుబొట్ల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు ఆయా గ్రామాల్లో పర్యటించారు.

పంచాయతీ భవనం, విలేజ్ హెల్త్ క్లినిక్, ఆర్బీకేపై దాడి
గుంటూరు జిల్లా గుళ్లపల్లిలో టీడీపీ కార్యకర్తల వీరంగం

చెరుకుపల్లి: ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం నుంచి టీడీపీ కార్యకర్తల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. శనివారం గుంటూరు జిల్లా చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని పంచాయతీ భవనం, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలలో జొరబడి పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఆయా కార్యాలయాల వద్ద ఉన్న శిలాఫలకాలను పగలగొట్టారు. కార్యాలయాల్లోని వైఎస్ జగన్ చిత్రపటాలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకుని ఘటన స్థలం వద్దకు వెళ్లిన పాత్రికేయులపై సైతం దాడులకు యత్నించారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవటం గమనార్హం.

గత చరితకు దర్పణం

- బ్రిటిష్ జ్ఞాపకాలకు నెలవు
- ఇక్కడే కాటన్ హయాంలో ఉపయోగించిన పరికరాలు
- నాటి రికార్డులు, వస్తువులు పదిలం
- శెట్టిపేట ఇరిగేషన్ కార్యాలయం ప్రత్యేకత

నిడదవోలు: శతాబ్దానికి పైబడిన ఘన చరిత్రకు నేటికీ సజీవ దర్పణంగా నిలుస్తోంది నిడదవోలు మండలం శెట్టిపేట వద్ద ఉన్న జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) కార్యాలయ భవనం . ఇందులో గత చరితకు సంబంధించిన ఎన్నో సాక్ష్యాలు నేటికీ పదిలంగా ఉన్నాయి. గోదావరి ఆయకట్టు మూడు డెల్టాలుగా ఉన్న విషయం తెలిసిందే. ఇందులో తూర్పు డెల్టా కాకినాడ, కోనసీమ జిల్లాలు, మధ్య డెల్టా కోనసీమ జిల్లా పరిధిలో ఉన్నాయి. సుమారు 5.30 లక్షల ఎకరాల ఆయకట్టు కలిగిన పశ్చిమ డెల్టా తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో విస్తరించి ఉంది. మొత్తం గోదావరి డెల్టా ఆయకట్టులో దాదాపు సగం పశ్చిమ డెల్టాలోనే ఉంది. ఇంత కీలకమైన పశ్చిమ డెల్టా ఆయకట్టుకు గుండెకాయ జలవనరుల శాఖ ఈఈ కార్యాలయం నిడదవోలు పట్టణానికి చేరువన శెట్టిపేట వద్ద ఉంది. బ్రిటిష్ హయాంలో ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకూ గోదావరిపై బ్యారేజీ నిర్మించారు. ఆ నదీ జలాలను ఒడిసిపట్టి, ప్రధాన కాలువలు, పంట కాలువలు, పిల్ల కాలువలు, డ్రెయినేజీలతో డెల్టా వ్యవస్థకు రూపుదిద్దిన అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్. ఆయన హయాంలోనే ఈ కార్యాలయాన్ని నిర్మించారు.

పక్కన 1870లో ఈ భవన నిర్మాణం ప్రారంభించారు. ఈ పనులు 1892లో పూర్తయ్యాయి. ఈ భవనం గోడలను రాయి, నాటు కోడిగుడ్ల సొన కలిపిన గానుగ సున్నంతో నిర్మించారని ఇక్కడ పని చేసిన విశ్రాంత ఉద్యోగులు చెబుతున్నారు. కార్యాలయం పై కప్పు నిర్మాణానికి బర్మా నుంచి ప్రత్యేకంగా తెప్పించిన కలపను ఉపయోగించారు. అప్పట్లో ఎంతో నాణ్యతతో నిర్మించడంతో 131 ఏళ్లు గడచినా ఈ భవనం ఇంకా చెక్కు చెదరకుండా ఉంది. పై నుంచి చూస్తే ఈ కార్యాలయం శిలువ ఆకృతిలో కనిపిస్తుంది. అప్పట్లో బ్రిటిష్ వారు ఎటువంటి కట్టడం నిర్మించినా దానిని ఇదే ఆకారంలో నిర్మించేవారని అంటారు.


బ్రిటిష్ కాలం నాటి తక్కెడ

ఇదీ ప్రాధాన్యం

గోదావరి పశ్చిమ డెల్టా పరిధిలోని 5.30 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి నియంత్రణ పూర్తిగా ఈ కార్యాలయ పర్యవేక్షణలోనే జరుగుతుంది. అంతేకాకుండా పశ్చిమ డెల్టా పరిధిలోని నాలుగు సబ్ డివిజన్లలో పనుల అంచనాలు రూపొందించడం, కాలువ పనుల పర్యవేక్షణ, ధవళేశ్వరం హెడ్ వర్క్స్ పర్యవేక్షణలో శివారు భూములకు సాగునీటి విడుదల వంటి కార్యకలాపాలను ఇక్కడి నుంచే నిర్వహిస్తారు.

ఘన చరిత్రకు సజీవ సాక్ష్యాలు

- కాటన్ దొర హయాంలో వినియోగించిన పలు వస్తువులు ఇప్పటికీ ఈ భవనంలో పదిలంగా ఉన్నాయి. వీటిల్లో పలు వస్తువులను ఇప్పటికీ సిబ్బంది ఉపయోగించుకుంటున్నారంటే ఇవి ఎంత నాణ్యమైనవో అర్థం చేసుకోవచ్చు.
- 1871లో అప్పటి మొదటి బ్రిటిష్ ఇంజినీర్ జీఐ వాల్క్ నుంచి ఇప్పటి వరకూ గోదావరి డెల్టాకు సంబంధించిన రికార్డులు ఈ కార్యాలయంలో భద్రంగా ఉన్నాయి.
- నాడు ఏర్పాటు చేసిన ఫర్నిచర్ ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది.
- అప్పట్లో ఏర్పాటు చేసిన ఫ్యాన్లను కార్యాలయం సిబ్బంది నేటికీ దర్జాగా ఉపయోగిస్తున్నారు.
- ఆ రోజుల్లో వాడిన తక్కెడ కూడా చెక్కుచెదరకుండా ఉంది.
- ఈ కార్యాలయంలోని బీరువాకు వేసిన తాళం కప్ప ఎటువంటి మరమ్మతులూ లేకుండా నేటికీ పని చేస్తూండటం విశేషం. ఈ తాళం కప్పపై లండన్ దేశపు ముద్రతో విక్టోరియా స్ట్రీట్ అనే పదాలు కనిపిస్తాయి. దీనిపై 863775 అనే నంబర్ కూడా ఉంది. అప్పటిలో ఈ నంబర్ల ఆధారంగానే వస్తువులను దిగుమతి చేసుకునే వారని చెబుతారు. ఈ తాళం కప్పకు ఇప్పటి వరకూ తుప్పు కూడా పట్టకపోవడం దీని నాణ్యతకు నిదర్శనం.
- కార్యాలయానికి వచ్చిన వారు ఇక్కడి తాళం కప్పను, నాటి ఫ్యాన్లను నేటికీ వినియోగించడం చూసి ఆశ్చర్యపోతూంటారు.
- ఈ భవనంలో సుమారు 9 అడుగుల ఎత్తున ఉన్న బీరువాలు కూడా ఇప్పటికీ వినియోగంలో ఉంది. దీనికి చెదలు కూడా పట్టకపోవడం విశేషం.
- నాడు పూర్తి ఐరన్‌తో తయారు చేసిన బోషాణాన్ని కూడా ఇక్కడి సిబ్బంది ఇప్పటికీ నిక్షేపంలా ఉపయోగించుకుంటున్నారు. గోడలో 10 అంగుళాల లోపలకు ఈ బోషాణాన్ని అమర్చారు. దీనిపై గుర్రం, సింహం గుర్తులతో ఉన్న రాజముద్రను ముద్రించారు. అప్పట్లో బ్రిటిష్ వారు ఈ రాజముద్ర ద్వారా పరిపాలన సాగించినట్లు పూర్వపు ఉద్యోగులు చెబుతున్నారు. అప్పట్లో డీడీలు, చెక్కులు, చలానాలు, నగదు, పనుల మంజూరు పత్రాలను ఈ బోషాణంలో దాచేవారు.
- అలాగే, అప్పట్లో ఉపయోగించిన తక్కెడ కూడా ఈ కార్యాలయంలో ఇప్పటికీ ఉంది.
- 1908లో అప్పటి బ్రిటిష్ ఇంజినీరు జేఎం లేసె కుటుంబ సభ్యులు మరణించగా.. కార్యాలయం సమీపాన నిర్మించిన సమాధి ఇక్కడ ఉంది. ఆ బ్రిటిష్ ఇంజినీర్ కుటుంబ సభ్యులు కొంత కాలం ఇక్కడకు వచ్చి నివాళులర్పించే వారని సీనియర్ ఉద్యోగులు చెబుతున్నారు.


శెట్టిపేటలోని ఇరిగేషన్ ఈఈ కార్యాలయం



నేటికీ వినియోగంలో ఉన్న తాళం కప్ప


ఈఈ కార్యాలయంలో గోడలో అమర్చిన బోషాణం

ఇంజినీర్ల బంగ్లా

శెట్టిపేటలోని ఇరిగేషన్ ఈఈ కార్యాలయం సమీపాన ఉన్న ఇంజినీర్ల రెండంతస్తుల బంగ్లా ఇప్పటికీ పదిలంగా ఉంది. దీని నిర్మాణంలో బర్మా నుంచి తీసుకుని వచ్చిన కలపను ఎక్కువగా ఉపయోగించారు. కొద్దిపాటి మరమ్మతులు చేయడం మినహా ఈ బంగ్లా ఇప్పటికీ ఎంతో పటిష్టంగా ఉంది. ఈఈలుగా ఎవరు వచ్చినా ఇక్కడ నివాసం ఉండాల్సిందే. దీంతో ఇది ఇంజినీర్ల బంగ్లాగా పేరొందింది. జిల్లాలో శివారు భూములకు సాగునీటి సరఫరా, వేసవిలో మంచినీటి చెరువులకు నీటి మళ్లింపు, నీటి విడుదల క్రమబద్ధీకరణ, గోదావరి జలాల పర్యవేక్షణ వంటి కీలక విధులను ఈ బంగ్లా నుంచే నిర్వహిస్తారు.

ఇంజినీర్ల బంగ్లా


ఆలోచింపజేసిన సాంఘిక నాటకాలు

పొన్నూరులో తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలు ప్రారంభం

పొన్నూరు: ప్రముఖ రంగస్థల నటుడు కుప్పిలి వెంకటేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకుని పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో నిడుబ్రోలు జెడ్పీ హైస్కూల్లోని డాక్టర్ నన్నపనేని జ్ఞానేంద్రనాథ్ కళావేదికపై 23వ ఉభయ తెలుగు రాష్ట్రాలస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు గుంటూరు అభినయ ఆర్ట్స్ నిర్వహణలో ఇంద్రప్రస్థం నాటిక ప్రదర్శించారు. ప్రేమ అనేది సృష్టిలో గొప్పదే కానీ ఆ ప్రేమలు హర్షించే విధంగా ఉండాలే తప్ప అనాలోచితంగా వెర్రిగా ఉంటే జీవితం, విలువలు నాశనం అవుతాయనే విషయాన్ని నటన రూపంలో చూపించారు. గోపి సత్యప్రకాష్ రచనకు, ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు. విజయవాడ మైత్రీ కళానిలయం నిర్వహణలో బంధం సాంఘిక నాటిక ప్రదర్శించారు. మనిషి జీవితం బంధంతో మొదలవుతుంది.. ఆ బంధం కారణంగా కుటుంబంలో జరిగే పరిణామాలు, ప్రేమానురాగాలను తెలియజేస్తూ తమ నటనతో కళాకారులు ప్రేక్షకుల మన్ననలు పొందారు. మాడుగుల రామకృష్ణ రచనకు, టి.వి.పురుషోత్తం దర్శకత్వం వహించారు. విశాఖపట్నం తెలుగు కళాసమితి నిర్వహణలో నిశ్శబ్దమా నీ ఖరీదెంత సాంఘిక నాటికను ప్రదర్శించారు. అనాదిగా కుటుంబ వ్యవస్థను మెరుగు పరచేందుకు చట్టంలో అనేకమార్పులు చేస్తున్నారు. ఆ మార్పులు కష్టాలు అనుభవిస్తున్న వారికి ఎంతవరకు ఉపశమనం కల్పిస్తున్నాయనే సందేశాన్ని కళాకారులు అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకులను ఆలోచింపచేశారు. పి.టి.మాధవ్ రచనకు, చలసాని కృష్ణప్రసాద్ దర్శకత్వం వహించారు. అనంతరం కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.శివకుమార్, డాక్టర్ కీర్తి, లయన్ సూరా రామారావు, పి.నిర్మల పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షుడు ఎస్.ఆంజనేయులు నాయుడు, గౌరవాధ్యక్షుడు నన్నపనేని రఘునాథ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆకుల సాంబశివరావు, ఉపాధ్యక్షులు ఎస్.శివకుమార్, కోటేశ్వరరావు, కార్యదర్శి సీహెచ్‌వీ రామకృష్ణారావు పర్యవేక్షించారు.

పూల తోట.. సిరుల బాట

జిల్లాలో 60.02 హెక్టార్లలో పూల తోటలు • మార్కెట్ అంచనాలను వేస్తూ సాగు

కంకిపాడు: పూల తోటల సాగుపై రైతులకు ఆసక్తి అధికమవుతోంది. సాగులో వైవిధ్యం ప్రదర్శిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని.. సిరుల బాట పట్టవచ్చని పూల తోటలు సాగు చేసే రైతులు ఆచరణలో చూపిస్తున్నారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా అనువైన రకాలను ఎంచుకుని రైతులు సాగు చేస్తున్నారు. ఉద్యానశాఖ సలహాలు, సూచనలతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు.

జిల్లాలో 60.02 హెక్టార్లలో సాగు

నీటి నిల్వ, ముంపు ప్రభావం లేకుండా ఉండే భూముల్లో రైతులు ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు. ప్రధానంగా మెట్ట భూములను ఎంచుకుని ఉద్యాన పంటల్లో ముఖ్యంగా లాభాలను అందించే పూల తోటలను వేస్తున్నారు. జిల్లాలో లిల్లీ, బంతి, చామంతి, గులాబీ, మల్లి, కనకాంబరాలు, అలంకరణకు వినియోగించే జర్బరాలు వంటి పూల తోటలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రధానంగా కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు, తోట్లవల్లూరు లంక గ్రామాలు, జిల్లాలోని పలు ప్రాంతాల్లో పువ్వుల తోటలను ప్రధాన సాగుగా చేస్తున్న రైతులూ ఉన్నారు.

మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా..

వివాహాది శుభ కార్యాలు, ప్రత్యేక మాసాల్లో నిర్వహించే పూజా కార్యక్రమాలకు ఉండే డిమాండ్ మేరకు రైతులు సాగుకు ఉపక్రమిస్తుంటారు. ప్రధానంగా దసరా, వినాయకచవితి, కార్తీక మాసం, ఇతర పండుగల్లో నిర్వహించే పూజలకు ఉండే డిమాండ్, అధికంగా కొనుగోలు చేసే పూలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది. దీని ప్రకారం ఆయా మాసాల్లో పువ్వులు అందుబాటులోకి వచ్చేలా సాగులో నిమగ్నమవుతున్నారు. ప్రస్తుతం గులాబీ, బంతి,చామంతి, మల్లి, కనకాంబరాలు, అన్ని సీజన్లలో డిమాండ్ ఉండే లిల్లీ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.



అనువైన రకాలను ఎంచుకోవాలి

మార్కెట్‌లో డిమాండ్, ఆ ప్రాంతానికి అనువైన రకాలను ఎంచుకుని సాగు చేసుకోవాలి. గత సీజన్‌లో బిందు సేద్యంకు ఐదెకరాల లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీ, 5 ఎకరాలకు పైగా ఉన్న పెద్ద రైతులకు 50 శాతం రాయితీపై బిందు సేద్యం యూనిట్ ఇస్తారు. నీరు నిల్వ లేకుండా, ముంపు బారిన పడకుండా ఉండే భూములను ఎంచుకుని సాగు చేయడం ఉత్తమం.

–జోసఫ్ చందు,
ఉద్యానశాఖ అధికారి, కంకిపాడు

ఉబ్బసం రోగులకు చేపమందు పంపిణీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మృగశిర కార్తె సందర్భంగా కొండపల్లిలో ఉబ్బసం వ్యాధిగ్రస్తులకు శనివారం వనమూలికలతో కూడిన చేపమందు ఉచితంగా పంపిణీ చేశారు. దివంగత జనాబ్ హాజి హకీమ్ మహ్మద్ యూసఫ్ ఆలీ 103 ఏళ్ల క్రితం ప్రారంభించిన ఉచిత చేపమందు పంపిణీ తదనంతర కాలంలో నిలిచిపోయింది. తిరిగి 1996 నుంచి యూసఫ్ ఆలీ మనవళ్లు మహ్మద్ మసూద్ ఆలీ జిన్నా, మహ్మద్ మహమూద్ ఆలీ ప్రతి ఏటా ఆస్తమా రోగులకు చేపమందు అందిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, గోదావరి, తెలంగాణకు చెందిన పలు జిల్లాల నుంచి వచ్చిన సుమారు 250 మంది వనమూలికలతో కూడిన చేపమందు స్వీకరించినట్లు మహ్మద్ మసూద్ ఆలీ జిన్నా తెలిపారు. చేపమందు స్వీకరిస్తే శ్వాసనాళాలు బిగుసుకుపోవడం, కండరాలు పట్టేయడం, కఫం పేరుకు పోవడం, ఆయాసం, దగ్గు, పిల్లికూతలు వంటివి నివారణ అవుతాయని ఆయన తెలియజేశారు. చేపట్టాల్సిన నియమాలను రోగులకు వివరించారు.

గండికోట..ఉజ్వల భవిత

- 'స్వదేశీ దర్శన్'తో పర్యాటకులకు మెరుగైన వసులు
- ఇటీవల కోట ప్రాంతంలో అధికారుల పరిశీలన

కడప కల్చరల్: గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియాగా ప్రపంచవ్యాప్తంగా గండికోటకు గొప్ప పేరుంది. అయినా క్షేత్రస్థాయిలో ఆశించిన ప్రగతి లేకపోవడంతో పర్యాటకాభిమానులు, చరిత్రకారులు నిరాశ పడ్డారు. స్థానిక చరిత్ర ,వారసత్వ, పర్యాటక సంస్థలు అభివృద్ధి అవసరాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లారు. ప్రజల మనోభావాలను గుర్తించిన జిల్లా అధికారులు సైతం గండికోట అభివృద్ధి దిశగా చర్యలు చేపడుతున్నారు .ఈ పరిణామాలు జిల్లా పర్యాటకులకు సంతోషాన్ని కలిగిస్తున్నాయి.

కోటలో పరిశీలన

జిల్లా అధికారుల చర్యల ఫలితంగా గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు దానికి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని స్వదేశీ దర్శన్ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల రాష్ట్ర కేంద్ర పర్యాటక పురావస్తు శాఖల అధికారులతో కూడిన వారసత్వ విభాగం గండికోటను పరిశీలించింది. ప్రధానంగా కోట లోపల, వెలుపల ఏమేం సౌకర్యాలు కల్పించాలో చూసి అందుకు తగిన ప్రాంతాలను ఎంపిక చేశారు. ఇందుకోసం వారు కోటంతా కలియతిరిగారు. గండికోటలో ముఖ్య ఆకర్షణలుగా ఉన్న మాధవరాయస్వామి, రఘునాథ స్వామి ఆలయాలు, మధ్యలోని జుమ్మా మసీదు వద్ద తొలి దశలో ప్రజలకు అవసరమైన వసతులు కల్పించాలని నిర్ణయించారు.



గండికోట వ్యూ

పార్కులు, టాయిలెట్లు, ఇతర వసతులు

గండికోట గ్రామం నుంచి మాధవరాయ స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో ఇళ్ల చివర పర్యాటకుల కోసం రిసెప్షన్ సౌకర్యాన్ని కల్పించనున్నారు. అక్కడే సెమీ సబ్ మెర్జ్‌డ్ పద్ధతిలో అత్యాధునికమైన టాయిలెట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇక్కడే మంచినీటి సౌకర్యం కూడా కల్పిస్తారు. ఈ రెండు ఆలయాలు, మసీదు వద్దగల ఖాళీ స్థలాలను పచ్చికతో నింపి , పార్కులుగా మార్చి, ఆ పరిసరాలను ఆహ్లాదకరంగా తయారు చేసేందుకు నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ రెండు దేవాలయాలతో పాటు మసీదు వద్ద, ధాన్యాగారం సమీపంలో కూడా పూర్తిస్థాయి సౌకర్యాలతో టాయిలెట్ సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు. కోట కేంద్రపురావస్తు శాఖ పరిధిలో ఉండడంతో ఆ శాఖ నియమ నిబంధనల మేరకే సౌకర్యాలు కల్పించడానికి అవసరమైన చర్యలు చేపట్టారు.

మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి

స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా గండికోటలో వసతుల కల్పన కోసం ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 80 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు సమాచారం. అధికారుల సూచనల మేరకు తయారుచేసిన మాస్టర్ ప్లాన్‌ను బట్టి ఆ నిధుల మొత్తాన్ని 300 కోట్ల రూపాయలకు కూడా పెంచే అవకాశం ఉంది. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల నుంచి వచ్చే పెట్టుబడులే గాక ప్రైవేటు పెట్టుబడులను కూడా ఆహ్వానించే అవకాశం ఉందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే గండికోటలో రోడ్డు సౌకర్యం మెరుగైంది. అధికారుల అభివృద్ధి సృజనాత్మకతను బట్టి కోటలో గుర్రపు స్వారీ కోర్టును కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇది పూర్తయి అందుబాటులోకి వస్తే గండికోటలో సందర్శకుల సందడి పెరిగే అవకాశం ఉంది. ఒబెరాయ్ హోటల్స్ నిర్మాణం కోసం స్థలాన్ని నిర్మాణ కర్తలకు అప్పగించే ప్రక్రియ సాగుతోంది. దీంతో గండికోటకు జాతీయ స్థాయిలో మంచి ప్రచారం కూడా లభిస్తోంది. తలపెట్టిన పనులన్నీ ఆటంకాలు, ఆలస్యం లేకుండా పూర్తయితే జిల్లాలో పర్యాటకానికి మంచి రోజులు వచ్చినట్లేనని పర్యాటకాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


కోటలోని మాధవరాయస్వామి ఆలయం


జుమ్మా మసీదు

టీకా.. చింత లేదిక!

పశువుల్లో సీజనల్ వ్యాధుల నివారణకు టీకాలు దోహదం

- జిల్లాకు 80 వేల హెచ్ఎస్ వ్యాక్సిన్ డోసులు
- ఇప్పటికే జిల్లాలో జబ్బవాపు వ్యాధికి 2400 డోస్‌లు అందజేత
- ఈటీ వ్యాక్సిన్ 4.30 లక్షల గొర్రెలకు అందజేత
- జిల్లాలో ప్రారంభమైన హెచ్ఎస్ టీకా కార్యక్రమం

బాపట్లటౌన్: నైరుతి రుతు పవనాలు వచ్చేశాయి.. తీరప్రాంతంలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడుతుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో జల్లులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. వర్షాకాలంలో సహజంగా పశువులకు సీజనల్ వ్యాధులు వస్తాయి. తొలకరి వర్షాలతో కొత్తగా పశుగ్రాసం మొలకెత్తుతుంది. ఈ మొలకెత్తిన పశుగ్రాసాన్ని తినడంతోపాటు సీజనల్‌గా ఆవులు, ఎద్దులు, గేదెలకు గొంతువాపు వ్యాధి, గొర్రెలు, మేకలు, పొట్టేళ్లకు చిటిక వ్యాధి వ్యాపించే అవకాశాలున్నాయి. వీటి నివారణకు పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఉచితంగా టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.



నల్లజాతి పశువుల్లో గొంతువాపు వ్యాధి..

నల్లజాతి పశువులైన గేదెలు, దున్నపోతుల్లో ప్రస్తుత సీజన్‌లో అధికంగా గొంతవాపు వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి వ్యాపించిన పశువుల్లో గొంతు కింద భాగం వాపులు వస్తాయి. దీంతోపాటు ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరుతుంది. తద్వారా పశువులకు ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. ఆయాసం, గురకతోపాటు తీవ్రమైన జ్వరంతో ఆహారం తీసుకోలేక మృత్యువాత పడే అవకాశాలు ఉంటాయి. ఇలాంటి లక్షణాలు కనిపించిన వెంటనే రక్త పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి నిర్ధారణ చేసి చికిత్సలు అందించాల్సి ఉంటుంది. గొంతువాపు వ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలను వేయించుకోవాలి.

జిల్లాలోని పశువుల సమాచారం

నియోజకవర్గం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు	పందులు	కోళ్ళు
అద్దంకి	3658	87341	178129	19299	1251	63666
బాపట్ల	4195	68554	50931	10952	126	154663
చీరాల	1640	26844	33467	2723	151	44125
పర్చూరు	3676	50287	105939	8557	528	64226
రేపల్లె	6226	90187	44175	3997	468	269760
వేమూరు	2535	58551	14882	4462	695	179582
మొత్తం	21930	381764	427523	49990	3219	776022

తెల్లజాతి పశువుల్లో జబ్బవాపు వ్యాధి...

ప్రస్తుత సీజన్‌లో తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులు, లేగదూడలకు జబ్బవాపు వ్యాధి వ్యాప్తిస్తుంది. ఈ వ్యాధి వ్యాపించిన పశువులకు జబ్బ, వెన్ను, తొడ తదితర కండగల శరీర భాగాల్లో నల్లటివాపు కనిపిస్తుంది. దీంతో పశువులకు జ్వరం రావడం, మేత మేయకపోవడం, కదలలేక పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ లక్షణాలున్న పశువులకు వెంటనే చికిత్స చేయించాలి. సకాలంలో చికిత్స చేయించలేక పోతే పశువులు మరణించే అవకాశాలు ఉంటాయి. ఈ జబ్బవాపు వ్యాపించడానికి ముందు పశువులకు టీకా వేయించాలి.

టీకాలు ప్రారంభం..

జిల్లాలో ఆవులు, గేదెలు 4,03,694 ఉన్నాయి. వీటికి వ్యాధులు రాకుండా ముందస్తుగా వాక్సిన్ వేసే కార్యక్రమంలో భాగంగా టీకా కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించారు. ఇప్పటికే జిల్లాలో పశువులకు సంబంధించి 80 వేల హెచ్ఎస్ వ్యాక్సిన్ డోసులు వచ్చాయి. వీటిని జిల్లాలోని పశువుల వైద్యశాలలకు సరఫరా చేయటం జరుగుతుంది. ఇప్పటికే గొర్రెలకు సంబంధించి ఈటీ వ్యాక్సినేషన్ 4.30 లక్షల గొర్రెలకు అందించారు. వీటితోపాటు 2400 పశువులకు జబ్బవాపు వ్యాధికి సంబంధించిన టీకాలు అందించారు.

టీకాలతోనే వ్యాధులు దూరం

వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తెల్ల, నల్లజాతి పశువులతోపాటు జీవాల్లో అధికంగా వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నాయి. ముందుజాగ్రత్తగా వాటి సంరక్షణకు పశువులకు, జీవాలకు తప్పకుండా టీకాలు వేయించాలి. పశువులకు ఏదైనా అత్యవసర చిక్సితలు నిర్వహించాల్సివస్తే 1962కు కాల్‌చేస్తే సంచార వాహన సిబ్బంది వచ్చి వైద్య సేవలందిస్తారు. ఈ వాహనంలో 20 రకాల పేడ సంబంధిత, 15 రకాల రక్తపరీక్షలు చేయడానికి మైక్రోస్కోప్‌తో కూడిన ప్రయోగశాలను వాహనంలో ఏర్పాటుచేశారు. పశువుల వ్యాధిని గుర్తించి తక్షణమే వైద్యం అందించే వెసులుబాటు ఉంటుంది.

– డి.హనుమంతరావు, జిల్లా పశుస వర్ధకశాఖాధికారి



తండ్రి నాకు అనుగ్రహించువారందరును నాయొద్దకు వత్తురు; నాయొద్దకు వచ్చువానిని నేనెంత మాత్రమును బయటికి త్రోసివేయను.
– క్రైస్తవ ధర్మం

‘బలి’ కోరుతున్న సాంకేతిక విజయం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

‘ది హ్యాండ్ ఆఫ్ గాడ్’ గోల్ గురించి క్రీడా ప్రియులందరూ వినే ఉంటారు. 1986 ఫుట్‌బాల్ వరల్డ్ కప్ సందర్భంగా అర్జెంటీనా – ఇంగ్లండ్ మ్యాచ్‌లో డీగో మారడోనా చేసిన తొలి గోల్ వివాదాస్పదమైంది. డీగో చేసిన హెడర్ గోల్‌ను వాస్తవానికి చేత్తో నెట్టాడని ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో రికార్డింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల రెఫరీ దాన్ని గోల్‌గానే ప్రకటించాడు. తర్వాత నాలుగు నిమిషాలకే ‘గోల్ ఆఫ్ ది సెంచరీ’ని కొట్టిన మారడోనా, అదే ఊపులో వరల్డ్ కప్‌ను గెలుచుకోవడమే గాక ఫుట్‌బాల్ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించారు.

వివాదాస్పద గోల్‌పై ఆ తర్వాత స్పందించిన మారడోనా అది ‘సగం మారడోనా హెడ్, సగం హ్యాండ్ ఆఫ్ గాడ్’ ఫలితమని ప్రకటించాడు.

ఆంధ్రప్రదేశ్‌లో ఈసారి జరిగిన ఎన్నికల ఫలితాలను చూస్తుంటే ఏదో ‘అదృశ్య హస్తం’ (హ్యాండ్ ఆఫ్ గాడ్) పనిచేసినట్టుగా, కృత్రిమ ఓట్ల వర్షం కురిపించినట్టుగా అనిపించక మానదు. లేదంటే ఏపీలో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఇటువంటి ఫలితాలు రావాలంటే రష్యా నాయకుడు పుతిన్ లేదా తుర్కియే పాలకుడు ఎర్డోగాన్ లేదా మయన్మార్ మిలిటరీ జుంటా ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగి ఉండాలి. అలా జరగలేదు కాబట్టి ‘హ్యాండ్ ఆఫ్ గాడ్’ ప్రమేయం ఉండాలి. ఎవరా గాడ్? కేంద్ర ప్రభుత్వమా? ఎన్నికల సంఘమా... ఎవరు? కృత్రిమ ఓట్ల వర్షానికి క్లౌడ్ సీడింగ్ ఎవరు చేశారు? ఇప్పుడు జనసామాన్యం మెదళ్లను తొలుస్తున్న ప్రశ్నలివి.

ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషిన్‌లను ట్యాంపరింగ్ చేయడం ద్వారా ఫలితాలను తారుమారు చేయడం సాధ్యమేనని స్వయంగా చంద్రబాబే పలుమార్లు ప్రకటించారు. ఆయన అభిమాని వేమూరి రవి ఇంకొంచెం ముందుకెళ్లి ఈవీఎమ్‌లను ఎలా హ్యాక్ చేయవచ్చో మీడియా సమక్షంలోనే ప్రదర్శించి చూపెట్టారు. అందువల్ల ఈవీఎమ్‌ల ట్యాంపరింగ్ అనే ఆర్ట్‌పై కూటమికి స్పష్టమైన అవగాహన ఉన్నది.

రాష్ట్రవ్యాప్తంగా సాయంత్రం 5 గంటలకు 68 శాతం ఓట్లు పోలయ్యాయని ఎన్నికల సంఘం ప్రకటించింది. కానీ తుది వివరాలను ప్రకటించడానికి దాదాపు మూడు రోజుల సమయాన్ని తీసుకున్నది. ఈ అసాధారణ జాప్యంపై సందేహాలను లేవనెత్తుతూ ‘టైమ్స్ ఆఫ్ ఇండియా’ పత్రిక సైతం కథనాన్ని ప్రచురించింది.

దుబాయ్‌లో ఇటీవల కురిపించిన కృత్రిమ వర్షం ఎంత బీభత్సాన్ని సృష్టించిందో ప్రపంచమంతా చూసింది. క్లౌడ్ సీడింగ్ ఓవర్‌డోస్‌కు వాతావరణ మార్పులు కూడా తోడైన ఫలితంగా రెండేళ్లలో కురవాల్సిన వర్షమంతా ఒకేరోజు కురిసి ఎమిరేట్‌ను అతలాకుతలం చేసింది.

ఆంధ్రప్రదేశ్‌లో ఈసారి జరిగిన ఎన్నికల ఫలితాలను చూస్తుంటే ఏదో ‘అదృశ్య హస్తం’ (హ్యాండ్ ఆఫ్ గాడ్) పనిచేసినట్టుగా, కృత్రిమ ఓట్ల వర్షం కురిపించినట్టుగా అనిపించక మానదు. లేదంటే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఇటువంటి ఫలితాలు రావాలంటే రష్యా నాయకుడు పుతిన్ లేదా తుర్కియే పాలకుడు ఎర్డోగాన్ లేదా మయన్మార్ మిలిటరీ జుంటా ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగి ఉండాలి. అలా జరగలేదు కాబట్టి ‘హ్యాండ్ ఆఫ్ గాడ్’ ప్రమేయం ఉండాలి. ఎవరా గాడ్? కేంద్ర ప్రభుత్వమా? ఎన్నికల సంఘమా... ఎవరు? కృత్రిమ ఓట్ల వర్షానికి క్లౌడ్ సీడింగ్ ఎవరు చేశారు? ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ జనసామాన్యం మెదళ్లను తొలుస్తున్న ప్రశ్నలివి.

ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషిన్‌లను ట్యాంపరింగ్ చేయడం ద్వారా ఫలితాలను తారుమారు చేయడం సాధ్యమేనని స్వయంగా చంద్రబాబే పలుమార్లు ప్రకటించారు. ఆయన అభిమాని వేమూరి రవి ఇంకొంచెం ముందుకెళ్లి ఈవీఎమ్‌లను ఎలా హ్యాక్ చేయవచ్చో మీడియా సమక్షంలోనే ప్రదర్శించి చూపెట్టారు. అందువల్ల ఈవీఎమ్‌ల ట్యాంపరింగ్ అనే ఆర్ట్‌పై కూటమికి స్పష్టమైన అవగాహన ఉన్నది.

రాష్ట్రవ్యాప్తంగా సాయంత్రం 5 గంటలకు 68 శాతం ఓట్లు పోలయ్యాయని ఎన్నికల సంఘం ప్రకటించింది. కానీ తుది వివరాలను ప్రకటించడానికి దాదాపు మూడు రోజుల సమయాన్ని తీసుకున్నది. ఈ అసాధారణ జాప్యంపై సందేహాలను లేవనెత్తుతూ ‘టైమ్స్ ఆఫ్ ఇండియా’ పత్రిక సైతం కథనాన్ని ప్రచురించింది. ఆ గడువు ముగిసిన తర్వాత పోలయిన ఓట్ల సంఖ్య కూడా అనుమానాలను రేకెత్తించే విధంగానే ఉన్నది.

తుది పోలింగ్ శాతాన్ని సుమారు 81గా నిర్ధారిస్తూ మూడు రోజుల తర్వాత ఈసీ తాపీగా ప్రకటన విడుదల చేసింది. మామూలుగా పోలింగ్ సమయం ముగిసిన తర్వాత పోలింగ్ కేంద్రం ఆవరణలో నిలబడి ఉన్నవారికి స్లిప్స్ పంపిణీ చేస్తారు. వారికి మాత్రమే ఓటువేసే అవకాశం కల్పిస్తారు. అలా నిలబడిన వారికి ఈసారి ఎందుకనో స్లిప్స్ లేదా టోకెన్లు పంపిణీ చేయలేదనే వార్తలు వినవస్తున్నాయి. ఇది అనుమానించదగ్గ అంశం.

పోలింగ్ గడువు ముగిసిన తర్వాత ప్రాంగణంలో నిలబడి ఉన్నవారి సంఖ్య మనకున్న సమాచారం మేరకు ఎక్కడా యాభై నుంచి వంద దాటలేదు. వీరు ఓట్లు వేయడానికి ఇంకో రెండు, మూడు గంటలు చాలు. అంటే తొమ్మిది గంటలకల్లా పోలింగ్ పూర్తి కావాలి. కానీ అర్ధరాత్రి దాటిందాకా పోలింగ్ జరుగుతూనే ఉందట! అంటే ఆ యాభైమందే అంతసేపూ సైక్లింగ్ చేస్తున్నారా? వేలాది పోలింగ్ బూత్‌లలో గడువు ముగిసే సమయానికి 65 నుంచి 70 శాతం మధ్యనున్న పోలింగ్ శాతం తుది ప్రకటన వచ్చేసరికి 85 నుంచి 95 శాతం దాకా ఎగబాకింది.

పోలింగ్‌కు ముందు జరిగిన రాజకీయ పరిణామాలను కూడా గమనంలోకి తీసుకోవాలి. ఎన్డీఏ కూటమిలో చేరడం కోసం చంద్రబాబు పడిన పాట్లు, భరించిన అవమానాలు తెలిసినవే. కూటమిగా కుదురుకున్న తర్వాత వారు ‘ఎలక్షనీరింగ్’ మీద ప్రత్యేక దృష్టి పెట్టారు. అనేక ప్రాంతాల్లోని ప్రభుత్వాధికారులను బదిలీ చేశారు. కనీవినీ ఎరుగని విధంగా ఏ ప్రాంతంలో ఏ అధికారిని నియమించాలో కూడా ఎన్నికల సంఘానికి సూచించారు. ఈసీ కూడా కూటమి కోర్కెలన్నింటినీ మారుమాట్లాడకుండా నెరవేర్చింది. సాధారణంగా తెలుగు రాష్ట్రాల ఎన్నికలు ఎప్పుడూ తొలి ఫేజ్‌లోనే ఉంటూ వచ్చాయి. కానీ కూటమి కోరిక మేరకు ఈసారి నాలుగో ఫేజ్‌కు నెట్టివేశారు.



మొదటి మూడు దశల పోలింగ్ తర్వాత జాతీయ స్థాయిలో ఎన్డీఏలో అభద్రతా భావం మొదలైందట. పోలింగ్ సరళి తమకు అనుకూలంగా లేదనే నిర్ధారణకు ఎన్డీఏ పెద్దలు వచ్చారు. నాలుగో దశకు ఎన్నికలను వాయిదా వేయించుకున్న చంద్రబాబు అదనంగా లభించిన సుమారు నెల రోజుల సమయాన్ని ప్రత్యేక ‘ఏర్పాట్ల’ కోసం ఉపయోగించుకున్నారు. ఈ ఏర్పాట్లకు ‘హ్యాండ్ ఆఫ్ గాడ్’ పూర్తిగా సహకరించింది. దేశవ్యాప్తంగా 19 లక్షల ఈవీఎమ్‌ల మిస్సింగ్‌పై ఇప్పటికీ కేంద్రం నుంచి స్పష్టమైన సమాధానాలు రాలేదు. ఇవెక్కడున్నాయి? ఏ పనికి వినియోగిస్తున్నారు? ఎవరి సేవల కోసం ‘హ్యాండ్ ఆఫ్ గాడ్’ వీటిని వినియోగిస్తున్నారో తేలవలసి ఉన్నది.

గడచిన ఐదేళ్లుగా ప్రత్యర్థులపై లేని దాడులను ఉన్నట్లుగా చూపించి గగ్గోలు పెట్టినవారు పోలింగ్ రోజు సాయంత్రం, మరునాడు – మళ్లీ కౌంటింగ్ రోజు నుంచి గత నాలుగు రోజులుగా జరిగిన హింసాకాండపై మౌనం వహించారు. ఈ హింసాకాండ కూడా అప్పటికప్పుడు ఆవేశంతో చెలరేగినట్టు లేదు. జాగ్రత్తగా పరిశీలిస్తే ఒక క్రమం కనిపిస్తున్నది. కృత్రిమ ఓట్ల వర్షం కురిసే సమయానికి ఎవరూ పోలింగ్ కేంద్రాల వైపు వెళ్లకుండా బెదరగొట్టేందుకు దాడులు జరిగాయి. మరుసటి రోజు కూడా చాలాచోట్ల ఇవి కొనసాగాయి. మళ్లీ కౌంటింగ్ పూర్తవుతున్న సమయం నుంచి నాలుగు రోజులుగా యథేచ్ఛగా రాష్ట్రవ్యాప్తంగా దాడులు జరుగుతున్నాయి. అసాధారణమైన ఓటింగ్ సరళిని సమీక్షించడానికి ప్రత్యర్థులు గ్రామాల్లో పర్యటించే అవకాశం లేకుండా బెదరగొట్టడానికి ఈ దాడులు జరిగాయి. పోలీసు యంత్రాంగం పూర్తిగా కూటమి వ్యూహానికి తోడుగా నిలబడింది.

విచక్షణారహితంగా జరుగుతున్న ఈ దాడులు మన ప్రజాస్వామ్య భవిష్యత్తు మీద ప్రశ్నార్థకాన్ని రచిస్తున్నాయి. ఈ దాడులను ఖండించకపోగా ‘వైఎస్సార్‌సీపీ కవ్వింపు చర్యలకు రెచ్చిపోకండ’ని ముఖ్యమంత్రి కాబోయే చంద్రబాబు ట్వీట్ చేశారు. గత రెండేళ్లుగా లోకేశ్ ఒక రెడ్‌బుక్‌ను సభల్లో ప్రదర్శిస్తూ హెచ్చరికలు జారీ చేసేవారు. తాను రెడ్‌బుక్‌లో పేర్లు ఎక్కించిన వారి సంగతి అధికారంలోకి వచ్చిన తర్వాత చూస్తానని చెప్పేవారు. ఇప్పుడా రెడ్‌బుక్ హోర్డింగ్‌లను కూడళ్లలో ఏర్పాటు చేశారు. దాని సందేశమేమిటో ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు.

సందేశం గూండాతండాలకు స్పష్టంగానే అర్థమైంది. టీడీపీ వారికి చాలాచోట్ల జనసైనికులు కూడా తోడయ్యారు. ప్రత్యర్థులపై దాడులు చేస్తున్న సందర్భాల్లో పోలీసులు మౌన ప్రేక్షక పాత్రను పోషించారు. కొన్నిచోట్ల పారిపోతూ కనిపించారు. ఇప్పటివరకు బయటకొచ్చిన వీడియోల్లో ఇటువంటి దృశ్యాలెన్నో కలవరం కలిగించాయి.

నూజివీడులో వైసీపీకి చెందిన మునిసిపల్ కౌన్సిలర్‌ను వెంబడించి కత్తులతో పొడుస్తున్న దృశ్యం పిండారీల దండయాత్రను తలపించింది. ఒక హాస్టల్ నిర్వాహకుడి ఇంటిపై దాడిచేసి గృహాన్ని ఛిద్రం చేసి, ఆ పెద్దమనిషిని మోకాళ్లపై కూర్చోబెట్టి కాళ్లు పట్టించుకున్న పైశాచికత్వం భయానకంగా కనిపించింది. రాళ్ల దాడులు, కర్రలతో దాడులు, కత్తులతో దాడులు, కిడ్నాప్‌లు... ఎన్నెన్ని దృశ్యాలు? వైసీపీకి చెందిన వారి కార్యాలయాలను పెట్రోల్ పోసి తగలబెట్టారు. వాహనాలను తగులబెట్టారు. జెండా దిమ్మెలను సుత్తులతో పగులగొట్టారు. శంకుస్థాపన ఫలకాలను ధ్వంసం చేశారు. గ్రామ సచివాలయాల మీద దాడులు చేశారు. వైఎస్సార్ విగ్రహాలను తొలగించి ఈడ్చుకుంటూ అవమానించారు.

వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయంపై వైఎస్సార్ అక్షరాలు తొలగించారు. ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్‌ల వంటి విప్లవాత్మక కార్యక్రమాలను ప్రారంభించిన వైఎస్సార్ పేరు ఆరోగ్య విశ్వవిద్యాలయానికి బాగుంటుందని భావించిన ప్రభుత్వం చట్టసవరణ ద్వారా ఎన్టీఆర్ పేరును మార్చి వైఎస్సార్ పేరు పెట్టారు. బదులుగా విజయవాడ కేంద్రంగా ఏర్పడిన కొత్త జిల్లాకు ఎన్టీఆర్ పేరును పెట్టారు. ఒక అల్లరి మూక దాడి చేసి ఇప్పుడా అక్షరాలను తొలగించింది..

విశ్వవిద్యాలయాల మీద కూడా దాడులకు తెగబడ్డారు. వీసీలు, రిజిస్ట్రార్‌లు తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మారితే యూనివర్సిటీ పాలకవర్గాలను కూడా మార్చాలనే ఓ కొత్త ఆచారానికి శ్రీకారం చుట్టబోతున్నట్టు కనిపిస్తున్నది. నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు రాజీనామాలు చేయడం సంప్రదాయం కానీ, ఇవి నామినేటెడ్ పదవులు కావు. సెర్చ్ కమిటీ సిఫారసుల మేరకు గవర్నర్ చేసిన నియామకాలు. అయినా సరే తమ పార్టీవాడే వీసీగా కూర్చోవాలనే దుందుడుకుతనం ప్రజాస్వామిక పద్ధతులను దెబ్బతీస్తున్నది.

గడచిన ఐదేళ్లుగా ప్రత్యర్థులపై లేని దాడులను ఉన్నట్లుగా చూపించి గగ్గోలు పెట్టినవారు పోలింగ్ రోజు సాయంత్రం, మరునాడు – మళ్లీ కౌంటింగ్ రోజు నుంచి గత నాలుగు రోజులుగా జరిగిన హింసాకాండపై మౌనం వహించారు. ఈ హింసాకాండ కూడా అప్పటికప్పుడు ఆవేశంతో చెలరేగినట్టు లేదు. జాగ్రత్తగా పరిశీలిస్తే ఒక క్రమం కనిపిస్తున్నది. కృత్రిమ ఓట్ల వర్షం కురిసే సమయానికి ఎవరూ పోలింగ్ కేంద్రాల వైపు వెళ్లకుండా బెదరగొట్టేందుకు దాడులు జరిగాయి. మరునాడు కూడా చాలాచోట్ల ఇవి కొనసాగాయి. మళ్లీ కౌంటింగ్ పూర్తవుతున్న సమయం నుంచి 4రోజులుగా యథేచ్ఛగా రాష్ట్రవ్యాప్తంగా దాడులు జరుగుతున్నాయి. అసాధారణ ఓటింగ్ సరళిని సమీక్షించడానికి ప్రత్యర్థులు గ్రామాల్లో పర్యటించే అవకాశం లేకుండా బెదరగొట్టడానికి ఈ దాడులు జరిగాయి. పోలీసు యంత్రాంగం పూర్తిగా కూటమి వ్యూహానికి తోడుగా నిలబడింది.

విచక్షణారహితంగా జరుగుతున్న ఈ దాడులు మన ప్రజాస్వామ్య భవిష్యత్తు మీద ప్రశ్నార్థకాన్ని రచిస్తున్నాయి. ఈ దాడులను ఖండించకపోగా ‘వైఎస్సార్‌సీపీ కవ్వింపు చర్యలకు రెచ్చిపోకండ’ని ముఖ్యమంత్రి కాబోయే చంద్రబాబు ట్వీట్ చేశారు. గత రెండేళ్లుగా లోకేశ్ ఒక రెడ్‌బుక్‌ను సభల్లో ప్రదర్శిస్తూ హెచ్చరికలు జారీ చేసేవారు. తాను రెడ్‌బుక్‌లో పేర్లు ఎక్కించిన వారి సంగతి అధికారంలోకి వచ్చిన తర్వాత చూస్తానని చెప్పేవారు. ఇప్పుడా రెడ్‌బుక్ హోర్డింగ్‌లను కూడళ్లలో ఏర్పాటు చేశారు. దాని సందేశమేమిటో ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు.

భయానక వాతావరణాన్ని కల్పించడం ద్వారా ప్రతిపక్షాలను కట్టడి చేయాలని కొత్త ప్రభుత్వం భావిస్తే అది నెరవేరే అవకాశం ఉండదు. నాలుగు రోజులు ఆలస్యమైనా సరే ఎన్నికల అవకతవకలపై వారు దృష్టి సారించకుండా ఉండరు. నిజానిజాలు తవ్వితీయకుండా ఉండరు. అలాగే కొత్త ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం జనంతో కలిసి విపక్షాలు కచ్చితంగా ఉద్యమిస్తాయి. కూటమికి లభించిన విజయం సాంకేతికమైనదే. అయినా సరే, ప్రభుత్వాన్ని అదే ఏర్పాటు చేస్తుంది. అడ్డంకులేమీ ఉండవు. చేసిన హామీలను నెరవేర్చి, ప్రజాస్వామిక వాతావరణాన్ని పునరుద్ధరించితే కొత్త ప్రభుత్వం ప్రజల మన్నన పొందుతుంది.

vardhelli1959@gmail.com

యోగి ఆదిత్యనాథ్ (యూపీ సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

మోదీజీ మునుపెన్నడూ ఈ విధంగానైతే నాకు జన్మదిన శుభాకాంక్షలు చెప్పలేదు! ఆ చెప్పడంలో ఒక దగ్గరితనం ఉండేది. ఒక వెచ్చదనం ఉండేది. పక్కనే మెల్లిగా నడుస్తూ తన కుడి చేతిని నా కుడి భుజంపై వేసినట్లు ఒకసారి, తన ఎడమ చేతిని నా ఎడమ భుజంపై వేసినట్లు ఒకసారి ఉండేది. ఎదురెదురుగా కూర్చొని మాట్లాడుకున్నట్లుగా, పైకి లేస్తూ కరచాలనం అందుకున్నంత మృదువుగా, ‘ఏం యోగీజీ... బర్త్ డే పార్టీ లేదా?!’ అని అడిగినంత చనువుగా ఉండేది. శుభాకాంక్షలు చెబుతున్నప్పుడు ఆయన మాటల్లోని ఆపేక్ష నా హృదయానికి హత్తుకునేది.



పుట్టిన రోజు ఎవరికైనా ప్రతి సంవత్సరం ఒకే రోజు వస్తుంది. కానీ ఈ సంవత్సరం నా పుట్టిన రోజు ‘జూన్ 4’ కు మర్నాడే వచ్చింది. ఉత్తర ప్రదేశ్‌లో బీజేపీకి ఉన్న లోక్ సభ సీట్లు సగానికి సగంగా పడిపోయాయని ఫలితాలు వచ్చిన రెండో రోజే వచ్చింది.

“యూపీ పురోగతి కోసం: పేదలు, అణగారిన వర్గాల వారి సాధికారత కోసం కృషి చేస్తున్న యోగి ఆదిత్యనాథ్‌కు జన్మదిన శుభాకాంక్షలు. రాబోయే కాలంలో ఆయన దీర్ఘాయుష్షుతో జీవించాలని కోరుకుంటున్నా...” అని మోదీజీ ట్వీట్ చేశారు!

ఆ ట్వీట్‌లో తడి లేదు! ‘వరల్డ్ ఎన్విరాన్‌మెంట్ డే’ కి ఒక మొక్కను నాటి, ఆ మొక్క పాదులో నీళ్లు పోస్తూ దేశానికి సందేశం ఇస్తున్నట్లుగా ఉంది.

నేనూ మొక్కను నాటిన విధంగానే మోదీజీ ట్వీట్‌కు స్పందించవలసి వచ్చింది. “మీ హృదయపూర్వక, శక్తిమంతమైన శుభాకాంక్షలు నాకు అపారమైన స్ఫూర్తిని ఇచ్చాయి. మీ విజయవంతమైన మార్గదర్శకత్వంలో ‘స్వయం ఆధారిత ఉత్తర ప్రదేశ్–అభివృద్ధి చెందిన ఉత్తర ప్రదేశ్’, సంస్కృతీ పరిరక్షణ అనే భావనలు నిజరూపం దాల్చాయి...” అని... ఆయన నన్నుంచిన దూరం నుంచే ఒక అడుగైనా ముందుకు వేయకుండా ఆయన శుభాకాంక్షలకు ధన్యవాదాలు సమర్పించుకున్నాను.

విజయాలతో ఘనత పొందినవారు అపజయాలకూ బాధ్యత వహించాలి. ఉత్తర ప్రదేశ్‌లో పార్టీకి దాదాపుగా సగం సీట్లు తగ్గిపోయాయి. పన్నెండు మందిలో ఏడుగురు కేంద్ర మంత్రులు... స్మృతీ ఇరానీ, కౌశల్ కిశోర్, అజయ్ కుమార్ మిశ్రా, భాను ప్రతాప్ సింగ్, సాధ్వి నిరంజన జ్యోతి, మహేంద్రనాథ్ పాండే, సంజీవ్ బల్యాన్ ఓడిపోయారు. అసలు ఇవి కాదు ఓటములు. అయోధ్య ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గంలో బీజేపీ ఓడిపోవటం!

బీజేపీ ఓడిపోవటం కూడా కాదు. యూపీ చీఫ్ మినిస్టర్‌గా నేను ఓడిపోవటం. చీఫ్ మినిస్టర్‌గానే కాదు, రామభక్తునిగా కూడా నేను ఓడిపోవటం. అయోధ్య మందిర నిర్మాణ ఉద్యమంలో పాల్గొనటానికి ఇంటిని విడిచిపెట్టి వచ్చేసిన బాలుడిని నేను. నలభై ఏళ్లుగా బీజేపీ ఎన్నికల వాగ్దానంగా ఉన్న రామ మందిర నిర్మాణం – తీరా ఆ వాగ్దానాన్ని నెరవేర్చాక – విజయాన్ని అందించలేకపోవటం ఏంటి!

62 సీట్లున్న బీజేపీ 33 సీట్లకు పడిపోవటం కన్నా... 5 సీట్లున్న ఎస్పీ 37 సీట్లకు, ఒక సీటు ఉన్న కాంగ్రెస్ 6 సీట్లకు పెరిగిపోవటం పెద్ద ఓటమి బీజేపీకి! ఈ ఓటమికి కారణాలేంటని మోదీజీ నన్ను అడగలేదు. నేను 170 ర్యాలీల్లో మాట్లాడినదంతా... కేజ్రీవాల్ ఒక్క ర్యాలీలో మాట్లాడిన దానితో కొట్టుకుపోయినట్లుగా మోదీజీ మాత్రం గ్రహించకుండా ఉండి ఉంటారా!

“ఎన్నికలయ్యాక యోగి ఆదిత్యనాథ్‌ని మోదీజీ ముఖ్యమంత్రిగా తప్పిస్తారు” అని ప్రచారం చేశారు కేజ్రీవాల్! తప్పించే పనైతే మోదీజీకి సీట్లెందుకు ఇవ్వాలి అనుకున్నారా యూపీ ఓటర్లు?!

ఫలితాలు వచ్చి ఐదు రోజులు అవుతోంది. యూపీలో సీట్లు తగ్గటం గురించి మెల్లిగా మరిచిపోతున్నా... మోదీజీ నాకు చెప్పిన జన్మదిన శుభాకాంక్షల్లో అఫెక్షన్ తగ్గటాన్ని మాత్రం నేను జీర్ణించుకోలేకపోతున్నా!!

‘సాక్షి’ జూన్ 7 నాటి సంచికలో ప్రచురితమైన ‘వివరణ రావాలి’ ట్వీట్‌లోని సమాచారం ఫేక్. ఆ సంగతి తెలియడంతో ప్రభుత్వ మాజీ ఉన్నతాధికారి కె. సుజాతారావు ఆ ట్వీట్‌ను తొలగించారు. పాఠకులు గమనించగలరు. – ఎడిటర్

యూపీలో ‘ఇండియా’ మ్యాజిక్ అసలు కథ

అభిప్రాయం



సుధా పాయీ

2024 ఎన్నికల ఘట్టం ముగిసింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి మరో మారు అధికారం చేపట్టేందుకూ రంగం సిద్ధమైంది. అయితే ఈ ఎన్నికల్లో బీజేపీ 300 కంటే తక్కువ సీట్లకే పరిమితమయ్యేందుకు ముఖ్యకారణం ఉత్తర ప్రదేశ్ (యూపీ)లో ‘ఇండియా’ కూటమి అత్యద్భుత ప్రదర్శనే అనడంలో సందేహం అవసరం లేదు. హోరాహోరీగా ఎన్నికల్లో ఇండియా కూటమి ఏకంగా 43 స్థానాలను కైవసం చేసుకోగా (సమాజ్‌వాదీ పార్టీ 37, కాంగ్రెస్ ఆరు) ఎన్డీయే 36 సీట్లతో (బీజేపీ 33) సర్దుకోవాల్సి వచ్చింది. ఈ ఫలితాలు చాలా మందిని ఆశ్చర్యానికి గురిచేశాయి. ఎందుకంటే హిందుత్వ భావజాలానికి బాగా మద్దతున్న రాష్ట్రమిది. నరేంద్ర మోదీ నేతృత్వంలో ఇది మరింత లోతుకు చేరింది.

2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు యూపీలో 2019 నాటి కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని బీజేపీ చాలా ధీమాగానే ఉండింది. అయితే పోలింగ్ శాతం తక్కువ కావడం, మోదీ అనుకూల పవనాలేవీ లేకపోవడం, స్థానికాంశాలకు ఎక్కువ ప్రాధాన్యం లభించడం వంటి కారణాలతో బీజేపీకి గట్టి పోటీ తప్పలేదు. అయితే గత కొన్నేళ్లుగా క్షేత్రస్థాయిలో చాలా పరిణామాలు చోటు చేసుకున్నాయి. బీజేపీ వీటిని పెద్దగా పట్టించుకోలేదని ఈ ఫలితాలు రుజువు చేస్తున్నాయి. రాజకీయంగా మళ్లీ పుంజుకుంటున్న దశలో ఉన్న సమాజ్‌వాదీ పార్టీతో ‘ఇండియా’ కూటమి ఏర్పాటు, పప్పూ అన్న ఇమేజ్ చట్రం నుంచి బయటపడ్డ రాహుల్ గాంధీ, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై ప్రజల్లో... మరీ ముఖ్యంగా దళితులు, కొన్ని ఓబీసీ వర్గాల్లో పెరిగిపోయిన అసంతృప్తి; అస్తవ్యస్తంగా ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితి... వెరసి ఈ ఫలితాలు!

యూపీ ఎన్నికల్లో ‘ఇండియా’ కూటమి ప్రదర్శనకు కర్త, కర్మ, క్రియ సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవే. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో 2014 తరువాత మొదటిసారి ఓ నేత బీజేపీకి సవాలు విసిరే స్థితిలో కనిపించాడు. గత ఎన్నికల్లో ఓటమి తరువాత ఓబీసీ, దళిత వర్గాలకు చెందిన చిన్న పార్టీలన్నింటినీ కూడగట్టి అఖిలేశ్ ఒంటరిగానే యూపీలో బీజేపీ వ్యతిరేక ఫ్రంట్‌ను నిర్మించగలిగాడు. దళిత ఓటర్లను తనవైపు తిప్పుకునేందుకు బాబాసాహెబ్ వాహినిని సృష్టించాడు. వెనుకబడిన వర్గాల నేతగా తనను తాను ఆవిష్కరించుకున్న అఖిలేశ్ ఎన్నికల యుద్ధాన్ని కాస్తా హిందుత్వ– సామాజిక న్యాయాల మధ్య పోరుగా మార్చేశాడు. 2024 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ డిమాండ్లను తట్టుకుని సీట్ల సర్దుబాటు చర్చలను ఫలవంతం చేయడం ద్వారా వారికి 11 సీట్లు, తన పార్టీ, వర్గానికి 62 సీట్లు కేటాయించుకునేలా చేయగలిగాడు. అంతేకాకుండా ముస్లిం– యాదవ్‌ల పార్టీ అన్న ముద్రను పోగొట్టుకునేందుకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులతోపాటు యాదవులకు కేటాయించిన సీట్లు ఐదింటికి పరిమితం చేసుకున్నాడు. మిగిలిన సీట్లన్నింటినీ అన్ని వర్గాల వారికీ కేటాయించాడు.

రాహుల్ గాంధీపై అప్పటివరకూ ఉన్న ప్రజాభిప్రాయం 2024 ఎన్నికల్లో గణనీయంగా మారినట్లు స్పష్టమవుతోంది. భారత్ జోడో యాత్ర, భారత్ న్యాయ్ యాత్రలు ఇందుకు ఉపకరించి ఉండవచ్చు. అమేథీ, రాయ్ బరేలీల్లో కాంగ్రెస్ విజయాలు దీనికి తార్కాణంగా చెప్పుకోవచ్చు. గాంధీ కుటుంబానికి కంచుకోటలుగా ఉన్న ఈ రెండు నియోజకవర్గాలు గత ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టిన విషయం ఇక్కడ ప్రస్తావనార్హం. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన న్యాయ్ గ్యారెంటీలు కూడా చాలావరకూ ప్రజాదరణకు నోచుకున్నాయి. మరీ ముఖ్యంగా జాబ్ గ్యారెంటీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను యాభై శాతం కంటే ఎక్కువ చేసేందుకు రాజ్యాంగ మార్పులు. ఇండియా కూటమి భాగస్వాములు కలిసికట్టుగా ఎన్నికల ర్యాలీలు నిర్వహించడం కొంత ఆలస్యంగా మొదలైనప్పటికీ మే నెలలో మాత్రం దాదాపు ఆరు జరిగాయి. అన్ని సమావేశాల్లోనూ అఖిలేశ్ ప్రజాకర్షక నేతగా కనిపించారు.



‘ఇండియా’ కూటమి నేతలు క్షేత్రస్థాయిలో అధికార పక్షంపై ఉన్న అసంతృప్తిని ఒడిసిపట్టుకోవడంలో విజయం సాధించారని చెప్పాలి. కులాధారిత జనగణన, రాజ్యాంగాన్ని సమూలంగా మార్చేస్తారన్న దళితుల ఆందోళన, అగ్నివీర్, ప్రశ్నపత్రాలు తరచూ లీక్ అవుతూండటం వంటి అంశాలను సమర్థంగా వాడుకుని అధికార పక్షానికి సవాలు విసిరారు ‘ఇండియా’ కూటమి నేతలు. మతం ప్రధానంగా సాగిన బీజేపీ ప్రచారం ప్రభావం నుంచి జనాలను తమ వైపునకు మళ్లించడంలో విజయం సాధించారు. అయోధ్య రామాలయం ఉన్న ఫైజాబాద్‌లోనూ బీజేపీ ఓటమి పాలు కావడమే కాదు... విజయం సాధించిన సమాజ్‌వాదీ పార్టీ నేత అవధేశ్ సింగ్ దళిత వర్గానికి చెందిన వాడు కావడం గమనార్హం.

2014 నుంచి బహుజన్ సమాజ్ పార్టీ ఉత్తర ప్రదేశ్‌లో తన పట్టు, ప్రాభవం రెండింటినీ కోల్పోతూ వస్తోంది. ఆ కారణంగానే జాట్ కులేతరులు బీజేపీవైపు ఎక్కువగా మొగ్గారు. తద్వారా యాదవుల ఆధిపత్యం నుంచి తప్పించుకోవచ్చునని ఆలోచించారు. అయితే ఎస్పీ కాంగ్రెస్‌తో జట్టు కట్టడంతో బీఎస్పీ, బీజేపీల కంటే ‘ఇండియా’ కూటమి తమకు మేలు చేయగలదన్న నమ్మకం వాళ్లకు కలిగింది. భీమ్ ఆర్మీ/ఆజాద్ సమాజ్ పార్టీ వైపు దళితులు మొగ్గడం వెనుక కారణమూ ఇదే. చంద్రశేఖర్ ఆజాద్ ఏర్పాటు చేసిన ఈ పార్టీ చతుర్ముఖ పోరులోనూ నగీనా రిజర్వ్‌డ్ స్థానం నుంచి విజయం సాధించింది.

యూపీలో బీజేపీ కూటమి ఓటమికి మరో బలీయమైన కారణం ఆ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం రెండూ ఆర్థిక వ్యవస్థ పరిస్థితిని చర్చనీయాంశంగా చేశాయి. అధికారిక లెక్కల ప్రకారం 2017 నుంచి 2021 వరకూ యూపీ ఆర్థిక వ్యవస్థ యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలో ఆశించిన స్థాయిలో రాణించలేదు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి కేవలం 1.95 శాతం చొప్పున మాత్రమే వృద్ధి చెందింది. తలసరి ఆదాయ వృద్ధి ఏడాదికి 0.43 శాతం మాత్రమే. అంతకు మునుపు అంటే 2012–2017 మధ్యకాలంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి ఏడాదికి 6.92 శాతం చొప్పున పెరగ్గా 2007–2012 మధ్యకాలంలో బీఎస్పీ అధినేత్రి మాయవతి కాలంలో 7.28 శాతం చొప్పున పెరిగింది. యోగి ఆదిత్యనాథ్ హయాంలో శాంతిభద్రతల పరిస్థితి మెరుగైందని చాలామంది చెబుతూంటారు. అదే సమయంలో చాలా మందికి యోగి బుల్డోజర్ రాజకీయాలు అంతగా నచ్చలేదు కూడా!

యూపీలో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా యమునా, గంగ ఎక్స్‌ప్రెస్ వే, సనౌటా–పుర్కాజీ ఎక్స్‌ప్రెస్ వే, వారణాసి – నోయిడాల మధ్య ఎనిమిది లేన్ల రహదారి వంటి అనేక భారీ ప్రాజెక్టులు మొదలయ్యాయి. అలాగే కుశినగర్, జేవార్‌ల వద్ద అంతర్జాతీయ విమానాశ్రయానికీ ప్రణాళిక సిద్ధమైంది. కానీ, ఈ రెండింటికీ బీజం పడ్డది మాయావతి కాలంలో. అఖిలేశ్ ఈ ఆలోచనలను కొనసాగించారు.

మొత్తమ్మీద 2024 ఎన్నికలు హిందూత్వ భావజాలానికీ, సామాజిక న్యాయాన్ని కోరే మండల్ వర్గాలకూ మధ్య హోరాహోరీగానే సాగింది. రాముడి చుట్టూ తిరిగిన రాజకీయాలను కాస్తా ప్రజల జీవనోపాధి సమస్యల వైపు మళ్లించిన ఘనత ‘ఇండియా’ కూటమికి దక్కుతుంది. ఇంకోలా చెప్పాలంటే 2014 తరువాత మొదటిసారి బీజేపీ మతతత్వ పాచిక పారలేదని చెప్పాలి.

వ్యాసకర్త ‘మాయా, మోదీ, ఆజాద్: దళిత్ పాలిటిక్స్ ఇన్ ద టైమ్ ఆఫ్ హిందుత్వ’ రచయిత్రి (సజ్జన్ కుమార్‌తో కలిసి).

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: శు.తదియ సా.4.17 వరకు, తదుపరి చవితి, నక్షత్రం: పునర్వసు రా.9.17 వరకు, తదుపరి పుష్యమి, వర్జ్యం: ఉ.8.55 నుండి 10.38 వరకు, తదుపరి తె.5.42 నుండి 7.23 వరకు (తెల్లవారితే సోమవారం), దుర్ముహూర్తం: సా.4.46 నుండి 5.38 వరకు, అమృతఘడియలు: రా.6.56 నుండి 8.36 వరకు; రాహుకాలం: సా.4.30 నుండి 6.00 వరకు; యమగండం: ప.12.00 నుండి 1.30 వరకు; సూర్యోదయం: 5.28; సూర్యాస్తమయం: 6.29.

క్లుప్తంగా...

డాక్టర్ యనమదలకు కుప్పం రెడ్డమ్మ పురస్కారం

- 12న చిత్తూరులో ప్రదానం



సాక్షి ప్రతినిధి, కాకినాడ: చిత్తూరులో ప్రసిద్ధ కుప్పం రెడ్డమ్మ సాహితీ పురస్కారానికి కాకినాడకు చెందిన ప్రముఖ సాంక్రమిక వ్యాధుల నిపుణుడు, సైన్స్ పుస్తక రచయిత డాక్టర్ యనమదల మురళీకృష్ణ ఎంపికయ్యారు. ఈనెల 12న చిత్తూరు రాజమహల్‌లో జరిగే సాహితీ ఉత్సవంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈ విషయాన్ని ట్రస్టు శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. మురళీకృష్ణతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన నవలా రచయితలు ఎ.మునిసురేష్ పిళ్లై, కాశీపురం ప్రభాకర్‌రెడ్డి, కథానిక సంపుట రచయితలు రోహిణీ వంజారి, డాక్టర్ ఎం.సుగుణరావులను ట్రస్టు సత్కరించనుంది. హెచ్ఐవీ, ఎయిడ్స్, కోవిడ్ కష్ట కాలంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక మంది బాధితులకు కోవిడ్‌పై అవగాహన కల్పించి, వారిలో మనోధైర్యాన్ని నింపడంలో డాక్టర్ మురళీకృష్ణ చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డుతో సత్కరించనున్నట్టు కుప్పం రెడ్డమ్మ సాహితీ అవార్డు ట్రస్ట్ అధ్యక్షురాలు డాక్టర్ పి.రోజాప్రియ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సి.నిరంజన్‌రెడ్డి, వ్యవస్థాపకులు డాక్టర్ కె.రామలక్ష్మి వివరించారు. డాక్టర్ రామలక్ష్మి తన తల్లి కుప్పం రెడ్డమ్మ స్మృతికి నివాళిగా ఏటా శ్రీరామనవమికి కవులను, రచయితలను సత్కరిస్తుంటారు. ఈ సాహితీ సత్కారానికి ఎంపికైన మురళీకృష్ణ గతంలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీతో పాటు పలు సంస్థల నుంచి విశిష్ట పురస్కారాలు అందుకున్నారు.

ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడిగా సుబ్బారావు



పౌల్ట్రీ ఫెడరేషన్ నూతన కార్యవర్గం

ఉండ్రాజవరం/రామవరప్పాడు: ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ ఫెడరేషన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం కాల్దరి గ్రామానికి చెందిన కోమటపల్లి వెంకట సుబ్బారావు ఎన్నికయ్యారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని డాక్టర్ బీవీ రావు భవన్‌లో శనివారం 13 జిల్లాల పౌల్ట్రీ రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. రాష్ట్ర అధ్యక్షుడిగా కోమటపల్లి వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా టి.కుటుంబరావు, టి.జి.భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా పడాల సుబ్బారెడ్డి, కోశాధికారిగా కె.సోమిరెడ్డి, కార్యదర్శిగా ఎంఆర్‌కే రెడ్డి, సహాయ కార్యదర్శిగా రవిశేఖర్‌రెడ్డి, సభ్యులుగా రమేష్‌బాబు, శ్రీరామారావు, హేమాద్రిలను సభ్యులు ఎన్నుకున్నారు.

ట్రావెల్స్ బస్సు దగ్ధం

- ఏసీ షార్ట్ సర్క్యూటే కారణం
- ఉలవపాడు వద్ద ఘటన
- ప్రయాణికులు క్షేమం

ఉలవపాడు: ఏసీ షార్ట్ సర్క్యూట్ కారణంగా ట్రావెల్స్ బస్సు పూర్తిగా దగ్ధమైన ఘటన నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం, చాగల్లు వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి 2.30 గంటల సమయంలో చోటుచేసుకుంది. చెన్నై నుంచి 33 మంది ప్రయాణికులతో హైదరాబాద్ వెళ్తున్న తులసి ట్రావెల్స్‌కు చెందిన ఏసీ స్లీపర్ బస్సు చాగల్లు వద్దకు వచ్చేసరికి ముందు భాగంలో ఏసీ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. వెంటనే డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపివేశాడు. వెనుక ఉన్న అత్యవసర ద్వారం నుంచి 33 మంది ప్రయాణికులను కిందకు దించేశాడు. ఆ తర్వాత బస్సులో మంటలు తీవ్రమై పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. దాదాపు గంట పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులకు ప్రమాదం తప్పింది. అయితే, బస్సు కింద భాగంలో ఉన్న లగేజీల్లో ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు వంటి విలువైన సామగ్రి ఉన్నట్టు ప్రయాణికులు తెలిపారు. దాదాపు ఐదు గంటల నిరీక్షణ తర్వాత ప్రయాణికులను వేరే బస్సుల్లో పంపించారు. ఘటనపై ఉలవపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాడి.. మేడి.. ఖరీఫ్‌కు రెడీ

మొదలైన మృగశిర కార్తె



కర్నూల్‌లో దుక్కి పనుల్లో నిమగ్నమైన రైతు

సాక్షి, అమరావతి: మృగశిర కార్తె మొదలైంది. వ్యవసాయ పనిముట్లయిన కాడిమేడిలకు పూజలు చేస్తున్న రైతులు సాగు కోసం భూమిని రైతన్నలు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యేందుకు సన్నద్ధం అవుతున్నారు. అక్కడక్కడా కొన్ని చోట్ల దుక్కిదున్ని పచ్చి రొట్ట వేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల నారుమడులు వేసేందుకు సిద్ధమవుతున్నారు. రాయలసీమ జిల్లాల్లో వేరుశనగ, ఏజెన్సీ జిల్లాల్లో వరి పంట విత్తుకుంటున్నారు. ఈసారి ముందుగానే నైరుతి రుతు పవనాలు పలకరించడంతో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ ప్రకటన రైతుల్లో ఉత్సాహం నింపింది. పలుచోట్ల ఇప్పటికే సాధారణం కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదైనట్టుగా చెబుతున్నారు.

ఆర్బీకేల వద్ద అన్నదాతల సందడి

ఎన్నికలలో బిజీబిజీగా ఉన్నప్పటికీ ఖరీఫ్ సీజన్‌లో అదును దాటిపోకుండా రైతులు విత్తుకునేందుకు వీలుగా వైఎస్ జగన్ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులను పంపిణీకి సిద్ధం చేసింది. రైతులు ఆర్బీకేల్లో నిల్వ చేసిన విత్తనాల మొలక శాతం కట్టి నాణ్యతను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ దాదాపు పూర్తి కావచ్చింది. మరోవైపు రాయలసీమ జిల్లాల్లో వేరుశనగ విత్తన పంపిణీ జోరందుకుంది. వరి సహా ఇతర విత్తనాలను సైతం ఆర్బీకేల్లో నిల్వ చేశారు. విత్తనం కోసం తమ వివరాల నమోదు కోసం వస్తున్న రైతులు, ఇప్పటికే నమోదు చేసుకున్న వారు విత్తనాల కోసం వస్తుండటంతో ఆర్బీకేల్లో సందడి మొదలైంది.

పరిహారం ఆదుకుంది

గత ఖరీఫ్‌లో ఏర్పడిన కరువుకు సంబంధించిన పరిహారంతో పాటు రబీలో మిచాంగ్ తుపాన్ వల్ల పంటలు నష్టపోయిన 10.44 లక్షల మంది రైతులకు రూ.1,289.57 కోట్ల పెట్టుబడి రాయితీ కౌంటింగ్‌కు ముందే జమ చేసేందుకు జగన్ ప్రభుత్వం ఏర్పాట్లు చేయగా.. ఇప్పటికే 8.89 లక్షల మందికి రూ.1,126.45 కోట్లు జమైంది. ఇంకా 1.54 లక్షల మందికి రూ.163.12 కోట్లు జమ కావాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్‌కు ముందు జగన్ ప్రభుత్వం పెట్టుబడి రాయితీ అందించడం రైతులకు కొంత ఊరటనిచ్చింది.

ఇప్పటికే 2.30 లక్షల క్వింటాళ్ల విత్తనాల పంపిణీ

ఖరీఫ్ సాగు లక్ష్యం 85.65 లక్షల ఎకరాలుగా నిర్ణయించారు. ఇందులో వరి 39.07 లక్షల ఎకరాలు, 14.80 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 14.67 లక్షల ఎకరాల్లో పత్తి, 6.35లక్షల ఎకరాల్లో కందులు, 3.55 లక్షల ఎకరాల్లో మొక్కజొన్నతో పాటు ఇతర పంటలు సాగు చేయనున్నారు. ఇందుకోసం 6.32 లక్షల క్వింటాళ్లు అవసరమవుతాయని అంచనా వేయగా.. 6.50 లక్షల క్వింటాళ్ల విత్తనాన్ని అందుబాటులో ఉంచారు. ఇప్పటికే ఆర్బీకేల్లో 3.92 లక్షల క్వింటాళ్ల విత్తనాన్ని నిల్వ చేశారు. 3.09 లక్షల క్వింటాళ్ల విత్తనాల కోసం 4.84 లక్షల మంది రైతులు ఆర్బీకేల్లో నమోదు చేసుకున్నారు. 3.52 లక్షల మంది రైతులు 2.30 లక్షల క్వింటాళ్ల విత్తనాలను తీసుకెళ్లారు. 17.50 లక్షల టన్నుల ఎరువులు అవసరం కాగా.. ఇప్పటికే 10 లక్షల టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచారు. 5 లక్షల బాటిళ్ల నానో యూరియా, 2 లక్షల బాటిళ్ల నానో డీఏపీ ఇఫ్కో ద్వారా పంపిణీకి సిద్ధం చేశారు. కనీసం 5.60 లక్షల టన్నుల ఎరువులను ఆర్బీకేల ద్వారా సరఫరాకు సన్నాహాలు చేస్తున్నారు.

పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపులు

ఐదేళ్లుగా ఏటా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున వైఎస్ జగన్ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించింది. ఐదేళ్లలో 53.58 లక్షల మంది రైతులకు రూ.34,288.17 కోట్ల పెట్టుబడి సాయం అందింది. ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందే మే, జూన్ నెలల్లో రూ.7,500 చొప్పున రైతులు తొలివిడత పెట్టుబడి సాయం అందుకునేవారు. ఈ సొమ్ములు ఖరీఫ్‌లో విత్తనాల కొనుగోలు, వ్యవసాయ పనులకు ఎంతగానో ఉపయోగపడేవి. మళ్లీ జగన్ ప్రభుత్వం వచ్చి ఉంటే తమకు ఈపాటికే పెట్టుబడి సాయం అంది ఉండేదని రైతులు చెప్పుకుంటున్నారు. తాము అధికారంలోకి రాగానే ఏటా రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఇంకా కొలువుతీరలేదు. ఈ పరిస్థితుల్లో పెట్టుబడి సాయం ఎప్పుడు చేతికి అందుతుందో తెలియక రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్లో చోరీ

రూ.18,41,300 నగదు అపహరణ



చోరీ జరిగిన ఏటీఎంను పరిశీలిస్తున్న సీఐ శివరాముడు

కూడేరు: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన ఏటీఎం సెంటర్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ ఘటన అనంతపురం జిల్లా, కూడేరు మండలంలో చోటుచేసుకుంది. ఏటీఎంను పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు, అందులోని రూ.18,41,300 నగదును ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కూడేరులో దళితవాడకు ఎదురుగా అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారి పక్కన అనంతపురం సాయినగర్‌లోని స్టేట్ బ్యాంకు ప్రధాన శాఖ ఏటీఎం సెంటర్ ఏర్పాటు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కట్టర్‌తో ఏటీఎంను కట్ చేశారు. మిషన్‌లో ఉంచిన నగదు చోరీ చేశారు. అదే సమయంలో మిషన్‌లో షార్ట్ సర్క్యూట్ సంభవించి పైభాగం కాలిపోయింది. శబ్దం కూడా రావడంతో స్థానికుడొకరు బయటకు వచ్చి చూడగా.. ఏటీఎం సెంటర్ నుంచి కొందరు కార్లో వెళ్లిపోవడం, సెంటర్‌లో నుంచి పొగ రావడం గమనించాడు. కొంత సమయం తర్వాత విషయాన్ని పోలీసులకు తెలియజేశాడు. సీఐ శివరాముడు ఏటీఎం సెంటరును పరిశీలించారు. చోరీ జరిగిందని నిర్ధారించుకుని సమాచారాన్ని బ్యాంకు అధికారులకు అందించారు. సంబంధిత అధికారులు వచ్చి పరిశీలించారు. నగదు నిల్వ, విత్‌డ్రాలకు సంబంధించి ప్రధాన కార్యాలయం నుంచి డేటా తీసుకున్నారు. రూ.18,41,300 చోరీకి గురైనట్టు పోలీసులకు తెలిపారు. వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వర్మే మాపై దాడి చేశారు

- కారుతో ఢీకొట్టి చంపాలని చూశారు..
- వారి మనుషులతోనే దాడి చేయించుకుని మాపై రుద్దుతున్నారు
- జనసేన నేతల ఆరోపణ



వన్నెపూడిలో మీడియాతో మాట్లాడుతున్న జనసేన నేతలు

పిఠాపురం: ఇతర పార్టీల వారెవ్వరినీ కూటమిలోకి రానివ్వొద్దని పిలుపునిచ్చి.. ఆ తర్వాత వారిని టీడీపీలో చేర్చుకోవడానికి రాత్రిళ్లు వెళ్లడమే కాకుండా.. తనపై జనసేన నేతలు దాడి చేశారంటూ టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వర్మ తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ వన్నెపూడికి చెందిన జనసేన నేతలు మండిపడ్డారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో వర్మపై శుక్రవారం రాత్రి జరిగిన దాడి నేపథ్యంలో గ్రామానికి చెందిన జనసేన నేతలు శనివారం మీడియాతో మాట్లాడారు. కూటమి పార్టీల్లో ఇతర పార్టీల వారిని చేర్చుకోవద్దని చెప్పిన వర్మ.. వైఎస్సార్‌సీపీకి పనిచేసిన సర్పంచ్ ఇంటికి వెళ్లడాన్ని చూస్తుంటే.. ఆయన కూడా వైఎస్సార్‌సీపీకే పని చేసినట్టు తమకు అనుమానం వస్తోందని ఆరోపించారు. ఇతర పార్టీ నేతల ఇంటికి ఎందుకు వెళ్లారని అడగడానికి సిద్ధమైన గ్రామస్తులపై వర్మే దాడి చేశారని, వారిపైకి తన కారును విచక్షణ రహితంగా నడిపేందుకు ప్రయత్నించారని, దాని నుంచి ప్రాణాలు కాపాడుకోవడానికి తాము పరుగులు తీయాల్సి వచ్చిందని చెప్పారు. ఆ క్రమంలో వర్మతో పాటు ఉన్న వ్యక్తులే రాళ్లతో దాడి చేసుకుని, దానిని జనసేన కేడర్‌పైకి రుద్దడానికి కుట్ర చేశారని ఆరోపించారు. కూటమి కట్టుబాట్లకు కట్టుబడి ఉన్న నాయకుడే అయితే.. తమ గ్రామానికి వచ్చే ముందు కూటమిలో ఉన్న అందరికీ సమాచారం ఇచ్చి వెళ్లాల్సిందని, కానీ, ఎవ్వరికీ తెలియకుండా దొంగచాటుగా వెళ్లడం పలు అనుమానాలకు దారితీసిందన్నారు. తాను చేసిన తప్పు బయటపడకుండా ఉండేందుకు జనసేనపై వర్మ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా వర్మ ఏ పార్టీకి పని చేశారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జనసేన అధినేత పవన్‌కు వ్యతిరేకంగా పని చేసిన నేత ఇంటికి వెళ్లడం వెనుక ఉన్న కుతంత్రాలను బయటపెట్టి తీరుతామన్నారు. సమావేశంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు భవిరిశెట్టి గోపాలకృష్ణ, మొయిళ్ల వీరరాఘవరావు, దాసంశెట్టి బాబూరావు, మాజీ ఉప సర్పంచ్ దొడ్డిపట్ల బాబ్జీ, పాఠంశెట్టి తమ్మారావు తదితరులున్నారు.

కేసు నమోదు చేస్తే ఊరుకునేది లేదు : పోలీసులకు జనసేన నేత హెచ్చరిక

ఇదిలా ఉండగా వర్మ కారుపై దాడి ఘటన నేపథ్యంలో తమ కార్యకర్తలపై కేసులు నమోదు చేసినా, వారిని ఇబ్బంది పెట్టినా ఊరుకునేది లేదని జనసేన కీలక నేత ఒకరు పోలీసులను హెచ్చరించినట్లు ప్రచారం జరుగుతోంది. వర్మపై దాడి ఘటనలో ఎలాంటి కేసులూ నమోదు చేయలేదని గొల్లప్రోలు ఎస్‌ఐ బాలాజీ చెప్పారు.

ఆస్తి కోసమే బాలిక హత్య

పెంపుడు తల్లే నిందితురాలు • కేసు వివరాలను వెల్లడించిన మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు



శాన్విరెడ్డి (ఫైల్)

కంభం: ఆస్తి కోసం తొమ్మిదేళ్ల పెంచుకున్న బాలికను పెంపుడు తల్లి అతి కిరాతకంగా గొంతు కోసి హత్య చేసింది. ఈ నెల 6న ప్రకాశం జిల్లా అర్ధవీడులో చోటుచేసుకున్న ఈ ఘటనపై నమోదైన కేసును పోలీసులు ఛేదించారు. శనివారం మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు మీడియాకు కేసు వివరాలను వెల్లడించారు. రాచర్ల మండలం అనుమలవీడుకు చెందిన పుచ్చకాయల వెంకట రమణ, పుచ్చకాయల లక్ష్మీపద్మావతికి పిల్లలు లేకపోవడంతో అతని సోదరుడు వెంకట రంగారెడ్డి కుమార్తె పుచ్చకాయల శాన్విరెడ్డిని ఆరు నెలల వయసు ఉన్నప్పుడే.. అనగా 9 ఏళ్ల నాడు దత్తత తీసుకున్నారు. ప్రస్తుతం ఆ బాలిక 3వ తరగతి చదువుతోంది. ఇటీవల శాన్విరెడ్డి కన్నతల్లిదండ్రులకు, పెంచిన తల్లిదండ్రులకు ఆస్తుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. కన్నతల్లిదండ్రులు శాన్విరెడ్డిపై ఎక్కువ ప్రేమ చూపిస్తుండటాన్ని గమనించిన పెంపుడు తల్లి..ఎంత బాగా పెంచినా కన్నతల్లిదండ్రులం కాలేమని భావించింది. బాలికను చంపేస్తే తమ ఆస్తి ఎవరికీ ఇవ్వాల్సిన అవసరం ఉండదని, తామే అనుభవించుకోవచ్చని ఆలోచించింది. ఈ నెల 6న శాన్విరెడ్డి ఒంటరిగా బెడ్‌రూంలో ఫోన్ చూసుకుంటున్న సమయంలో పెంపుడు తల్లి అయిన లక్ష్మీపద్మావతి బాలిక వద్దకు వెళ్లి మొహంపై దిండు వేసి గట్టిగా నొక్కిపట్టి గొంతుకోసి హత్య చేసింది. ఆ సమయంలో ఆమె భర్త గేటు వద్ద నిలబడి ఎవరూ రాకుండా చూసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఆ తర్వాత ఓ పథకం ప్రకారం వారిద్దరూ ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు శాన్విరెడ్డిని హత్య చేశారని చుట్టుపక్కల వారిని, బంధువులను నమ్మించారు. బాలికను అర్ధవీడులోని ఓ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లగా, అప్పటికే మరణించినట్లు చెప్పడంతో తిరిగి ఇంటికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న పాప సొంత తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కన్నతండ్రి ఫిర్యాదు మేరకు అర్ధవీడు ఎస్‌ఐ అనిత కేసు నమోదు చేశారు. మార్కాపురం డీఎస్పీ బాలసుందర్‌రావు ఆదేశాల మేరకు సీఐ జె.రామకోటయ్య ఆధ్వర్యంలో కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు ఎస్‌ఐలు 3 బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. అనుమానాస్పదంగా ఉన్న పెంపుడు తల్లిదండ్రులను పోలీసులు తమదైన శైలిలో విచారించగా, తామే నేరం చేసినట్లు వారు అంగీకరించారు.

పారిశ్రామిక ప్రగతికి రోడ్‌మ్యాప్ అందిస్తాం

ఏపీ చాంబర్స్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఒక విస్పష్టమైన ప్రణాళికతో ముందుకువెళ్లాలని కొత్తగా అధికారం చేపడుతోన్న కూటమి ప్రభుత్వానికి ఏపీ చాంబర్స్ విజ్ఞప్తి చేసింది. అత్యధిక సమస్యలు ఎదుర్కొంటున్న ఎంఎస్ఎంఈలను తక్షణం ఆదుకోవాలని కోరింది. ఎన్నికల ముందు అన్ని పార్టీలకు తమ మేనిఫెస్టోలో రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి కోసం ప్రకటించాల్సిన అంశాలను అందించామని, ఇప్పుడు కొత్త ప్రభుత్వానికీ రోడ్‌మ్యాప్‌ను అందిస్తామని తెలిపింది. 2024–29లో రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి కోసం నిపుణులతో ఒక రోడ్‌మ్యాప్‌ను తయారు చేస్తున్నామని, దీన్ని త్వరలోనే సీఎం, మంత్రులు, అధికారులకు అందజేస్తామని ఏపీ చాంబర్స్ శనివారం వెల్లడించింది.

తాళ్లూరు నువ్వులకు అంతర్జాతీయ గుర్తింపు

- నువ్వు పంటకు ఇండ్ గ్యాప్ సర్టిఫికెట్
- వ్యవసాయాధికారులకు కలెక్టర్ అభినందన

తాళ్లూరు(ముండ్లమూరు): అంతర్జాతీయ స్థాయిలో 140 దేశాల్లో అమ్ముకునేందుకు అవసరమైన ఇండ్ గ్యాప్ సర్టిఫికెట్‌ను ప్రకాశం జిల్లా తాళ్లూరు మండల కేంద్రం నువ్వులు దక్కించుకున్నాయి. తాళ్లూరు మండలంలోని శివరామపురం గ్రామానికి చెందిన 15 మంది రైతులు పండించిన 150 క్వింటాళ్ల నువ్వులను యురేకా ఎనలిటికల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ బెంగళూరు వారు పరీక్షించి మంచి ఉత్పత్తులుగా నిర్ధారించారు. గ్లోబల్ మార్కెటింగ్ చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థ ఆమోదం పొంది స్కోప్ సర్టిఫికెట్ ఇచ్చారు. నువ్వుల పంట సాగులో భాగంగా శివరామపురంలో ఎంపిక చేసిన రైతులు గత ఏడాది రబీ పంట కాలంలో 14 వారాల పాటు విత్తనం నుంచి విక్రయం వరకు మేలైన సాగు పద్ధతులు పాటించారు. ఉత్పత్తులకు విలువ జోడించారు. ఎకరాకు సాగు ఖర్చు 12 వేలు కాగా, ప్రతి రైతుకు సగటున రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు దిగుబడి వచ్చిందని తాళ్లూరు మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. శనివారం ఒంగోలులోని కలెక్టర్ చాంబర్‌లో ప్రసాదరావుతో పాటు జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ డీపీఎం సుభాషిణి, వ్యవసాయశాఖ అధికారులు శశికళ, శ్రీనివాస నాయక్, వీఏఏలు రాజశేఖరరెడ్డి, రైతులు శివపార్వతి, అనిత తదితరులు కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిశారు. వీరందరినీ కలెక్టర్ అభినందించారు. పొలంబడి – మేలైన వ్యవసాయ సాగు పద్ధతులతో తాళ్లూరు మండల రైతులు నువ్వులు పండించిన విధానం అభినందనీయమని కలెక్టర్ అన్నారు.



నువ్వుల విశిష్టతను కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వివరిస్తున్న అధికారులు

జడ్జిల నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

పూర్వ అదనపు అడ్వకేట్ జనరల్ సత్యప్రసాద్



గుంటూరు (ఎడ్యుకేషన్): ఉన్నత న్యాయస్థానాల్లోని న్యాయమూర్తుల నియామకాల్లో రిజర్వేషన్ల విధానాన్ని అమలు పర్చేందుకు రాజ్యాంగ సవరణ చేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ పూర్వ అడ్వకేట్ జనరల్ ఎ.సత్యప్రసాద్ అన్నారు. ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐలా) ఆధ్వర్యంలో శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో 'న్యాయవ్యవస్థలో సామాజిక ప్రాతినిధ్యం–ప్రాధాన్యత, ఆవశ్యకత' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో సత్యప్రసాద్ మాట్లాడారు. హైకోర్టు, సుప్రీంకోర్టులలో చేపడుతున్న న్యాయమూర్తుల నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారిని నియమిస్తేనే సంపూర్ణమైన న్యాయం దక్కుతుందన్నారు. వెనుకబడిన వర్గాలకు చెందిన న్యాయ కోవిదులను మెరిట్, రోస్టర్ ప్రకారం ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తులుగా నియమించడం ద్వారానే న్యాయవ్యవస్థలో సామాజిక ప్రాతినిధ్యం, ప్రాధాన్యత చేకూరుతాయని అన్నారు. ఐలా జాతీయ వ్యవస్థాపక సలహాదారు చింతల శ్రీకాంత్.. మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని, ఆయన దార్శనికతను ముందుకు తీసుకెళ్లి యువ న్యాయవాదులకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఎస్ఎస్ఎస్ జయరాజ్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారానే న్యాయవ్యవస్థలో సామాజిక ప్రాతినిధ్యం సాధ్యపడుతుందన్నారు. ఐలా రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంతకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని న్యాయవాదులకు బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని 35 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఐలా రాష్ట్ర నాయకులు ఎ.బ్రహ్మేశ్వరరావు, టి.నరసింహుడు, యు.విష్ణుకుమార్, ఎం.అప్పారావు, ఎంఈ గీతావాణి, గుంటూరు నగర అధ్యక్షుడు మొగల్ కాలేషా పాల్గొన్నారు.

మల్లేశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ జ్యోతిర్మయి దంపతులకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉప కమిషనర్ శ్రీరామ వరప్రసాదరావు

పెదకాకాని: గుంటూరు జిల్లా పెదకాకానిలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ జ్యోతిర్మయి దంపతులు శనివారం దర్శించుకున్నారు. తొలుత శివాలయానికి చేరుకున్న న్యాయమూర్తికి ఆలయ ఉప కమిషనర్ దాసర శ్రీరామవరప్రసాదరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. జస్టిస్ పీవీ జ్యోతిర్మయి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నిత్య కల్యాణ మండపం నందు వేదపండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా, ఆలయ ఉప కమిషనర్ స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి లడ్డూ ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటం అందజేశారు.

భద్రాద్రి రాముని సేవలో జస్టిస్ మల్లికార్జునరావు



రామాలయంలో కుటుంబ సభ్యులతో జస్టిస్ మల్లికార్జునరావు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థాన ప్రధాన అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామిని దర్శించుకున్న జస్టిస్ మల్లికార్జునరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట భద్రాచలం ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వర్లు, ఆలయ ఉద్యోగి సాయిబాబు ఉన్నారు.

ఆర్‌బీకేకి పసుపు రంగు వేసిన టీడీపీ

తెనాలి రూరల్: కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ, జనసేన కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. శిలాఫలకాలను ధ్వంసం చేయడం, పేర్లు తొలగించి ఫ్లెక్సీలు వేయడం వంటివే కాకుండా రంగులూ మారుస్తున్నారు. తెనాలి ఐతానగర్‌లోని ఆర్‌బీకే సెంటర్ భవనానికి పసుపు రంగు వేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుండి విధ్వంసానికి పాల్పడుతుండడంపై ప్రజలు విస్తుపోతున్నారు.

ఇదే స్ఫూర్తితో పనిచేయండి

- బీజేపీ తెలుగు రాష్ట్రాల అధ్యక్షులకు జేపీ నడ్డా సూచన
- ఎన్నికల ఫలితాలపై రాష్ట్రాల అధ్యక్షులతో సమీక్ష

సాక్షి, న్యూఢిల్లీ: తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి ఫలితాలు వచ్చాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. కార్యకర్త నుంచి నాయకుడి వరకూ అందరూ ఈ ఎన్నికల్లో కష్టపడటం వల్లనే చెప్పుకోదగ్గ సీట్లు వచ్చాయని పేర్కొన్నారు. ఆదివారం నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా మూడోసారి ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా శనివారం ఆయన అన్ని రాష్ట్రాల పార్టీ అధ్యక్షులతో సమావేశమయ్యారు. తాజా ఫలితాలపై సమీక్ష జరిపారు. ఆయా రాష్ట్రాల అధ్యక్షులకు కీలక సూచనలను చేశారు. ఈ సమావేశానికి బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు పురందేశ్వరీ, తెలంగాణ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిలు కూడా హాజరయ్యారు. 2014, 2019 ఎన్నికలతో పోల్చి చూస్తే ఏపీలో ఓట్ల శాతం పెరగడం ఆనందంగా ఉందన్నారు. అక్కడి ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారనే సంకేతాలు వెలువడటం మంచి పరిణామమన్నారు. తెలంగాణలో పది ఎంపీ సీట్లు గెలుస్తామని అంచనా వేసినట్లు చెప్పారు. కాగా, అనుకున్నదానికంటే రెండు సీట్లు తగ్గడంపై నడ్డా అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. రెండు రాష్ట్రాల అధ్యక్షులు ఇదే స్ఫూర్తితో పని చేయాలని, కార్యకర్తలకు అన్ని రకాలుగా అండగా నిలవాలని నడ్డా సూచించారు. దేశంలో సంక్షేమం కోసం ఎన్‌డీఏ ప్రవేశపెట్టే ప్రతీ సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కీలక పాత్ర పోషించాలంటూ జేపీ నడ్డా పిలుపునిచ్చారు.

ఆదిత్యనాథ్ దాస్‌ను తొలగించండి

- తెలంగాణ నీటి పారుదల శాఖ సలహాదారుపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ నీటిపారుదల శాఖ సలహాదారు పదవి నుంచి ఆదిత్యనాథ్ దాస్‌ను తొలగించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన నియామకం తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని ఆరోపించారు. చంద్రబాబు ఆదేశాలను శిష్యుడు రేవంత్‌రెడ్డి పాటిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రమాణ స్వీకారానికి ముందే చంద్రబాబు కర్రపెత్తనం ప్రారంభమైందనడానికి ఇదే నిదర్శనం అని ఆయన పేర్కొన్నారు. జలయజ్ఞం ప్రాజెక్టుల నుంచి నిన్నటి పాలమూరు రంగారెడ్డిపై కేసులు వేసి పనులు ఆపిన వ్యవహారంలో ఆదిత్యానాథ్ దాస్‌ది కీలకపాత్ర అని ఆయన శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన వ్యక్తిని ఏ విధంగా సలహాదారుగా నియమించుకున్నారని ఆయన ప్రశ్నించారు. అధికారిగా ఆయన పట్ల తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, కానీ ఆంధ్ర కృష్ణ ప్రాజెక్టుల నుంచి నీటిని తరలించడంతో ఆయనది కీలకపాత్ర అని అన్నారు. కేఆర్ఎంబీలో తెలంగాణ వాదనను తొక్కిపట్టి ప్రాజెక్టుల మీద హక్కులు కోల్పోయేలా చేసిన వ్యక్తిని నియమించడం వెనుక కాంగ్రెస్ ఆలోచన ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో పాలమూరు మరోసారి ఎడారి అయ్యేలా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఆర్ట్ ఫెస్టివల్‌కు సందర్శకుల తాకిడి

- ఆకట్టుకుంటున్న కళాఖండాలు

సాక్షి, హైదరాబాద్: నగరం వేదికగా కొనసాగుతున్న ప్రతిష్టాత్మక 'ఇండియా ఆర్ట్ ఫెస్టివల్'కు శనివారం సందర్శకుల తాకిడి పెరిగింది. ఔత్సాహికులు సందడి చేశారు. సింగపూర్‌తో పాటు ఢిల్లీ, బెంగళూరు, గుర్గావ్, హైదరాబాద్, బరోడా, నాగ్‌పూర్, కోల్‌కతా సహా 40 నగరాలకు చెందిన 250 మంది ఆర్టిస్టుల కళాకృతులు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శనలో మాజీ మంత్రి పుష్పలీల ముఖ్య అతిథిగా పాల్గొని కళాఖండాలను తిలకించారు. ఆయిల్ పెయింటింగ్స్, అక్రెలిక్, కాన్వాస్, చార్‌కోల్ ఆర్ట్, స్కల్ప్చర్స్‌తో పాటు ఈ మధ్య కాలంలో ఆదరణ పొందుతున్న విభిన్న పెయింటింగ్‌లు ఇక్కడ ఆకట్టుకుంటున్నాయి. నాలుగు రుతువుల సారాంశాన్ని అక్రెలిక్ ఆయిల్ పెయిటింగ్ రూపంలో ఎలా చూపించవచ్చో బెంగుళూరుకు చెందిన శ్వేతా ప్రసాద్.. స్పీకింగ్ కలర్స్ ప్రదర్శనలో గమనించవచ్చు. వైల్డ్ లైఫ్ వైవిధ్యాన్ని చార్‌కోల్ పెయింగ్స్ ద్వారా ఓం ధడ్కస్ చిత్రాలు అబ్బురపరుస్తున్నాయి. ముఖ్యంగా సింగపూర్‌కు చెందిన జ్ఞాన రూపొందించిన శిల్పాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. 2వ రోజు కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖ ఆర్టిస్ట్ త్రిగుళ్ళ మురళీ వేసిన లైవ్ పెయింటింగ్ విశేషంగా ఆకట్టుకుంది. దీనితో పాటు రాము వేద్మ ఫ్లూట్, విజయ్ తబల వాయిద్యం సంగీత ప్రియులను అలరించింది. ఈ కార్యక్రమాల్లో ఫెస్టివల్ డైరెక్టర్ రాజేంద్ర పాటిల్, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ ఆర్టిస్టులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకార కార్యక్రమం కోసం రాష్ట్రపతి భవన్ వద్ద ఏర్పాట్లు

నేడు మోదీ మూడోసారి

రాత్రి 7.15 గంటలకు ప్రమాణ స్వీకారం
- మంత్రివర్గ కూర్పుపై కొనసాగుతున్న కసరత్తు
- మిత్రపక్షాలతో అమిత్‌షా, రాజ్‌నాథ్, నడ్డా మంతనాలు
- టీడీపీ నుంచి రామ్మోహన్, పెమ్మసాని
- జేడీయూ నుంచి లలన్‌సింగ్, సంజయ్ ఝాలలో ఒకరు
- మిత్రపక్షాలకు 5 నుంచి 8 బెర్తులు

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ 3.0 ఆదివారం నుంచి మొదలుకానుంది. రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం రాత్రి 7.15 గంటలకు ప్రధానిగా నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మూడుసార్లు ప్రధానిగా చేసిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును సమం చేయనున్నారు. బీజేపీకి సొంతంగా 240 సీట్లు మాత్రమే రాగా... మిత్రపక్షాలతో కలిపి ఎన్డీయే 293 సీట్లతో మెజారిటీ సాధించింది. సొంతంగా మెజారిటీ లేని నేపథ్యంలో మంత్రిపదవులపై మిత్రుల డిమాండ్లను తీర్చడం బీజేపీకి కత్తిమీద సాములా మారింది. శనివారం కూడా బీజేపీ సీనియర్ నేతలు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా మిత్రపక్షాలతో సంప్రదింపులు కొనసాగించారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు (16 సీట్లు), జేడీయూ అధ్యక్షుడు నితీశ్ కుమార్ (12 సీట్లు), శివసేన అధ్యక్షుడు, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే (7 సీట్లు)లతో మంత్రి పదవులపై చర్చలు జరిపారు. పెద్దశాఖలైన హోం, ఆర్థిక, రక్షణ, విదేశీ వ్యవహారాలతో పాటు సైద్ధాంతికంగా కీలకమైన విద్య, సాంస్కృతిక శాఖలను బీజేపీయే అట్టిపెట్టుకుంటుందని భావిస్తున్నారు. మొదటి విడతలో మిత్రపక్షాలకు ఐదు నుంచి ఎనిమిది మంత్రి పదవులు దక్కవచ్చని సమాచారం.

టీడీపీకి ఒక కేబినెట్, ఒక సహాయమంత్రి

టీడీపీ నుంచి కింజారపు రామ్మోహన్ నాయుడుకు కేబినెట్ పదవి దక్కనుంది. పెమ్మసాని చంద్రశేఖర్‌కు సహాయమంత్రి పదవి లభిస్తుందని విశ్వసనీయవర్గాల సమాచారం. రెండు పార్టీలు టీడీపీ, జేడీయూలకు ఒక్కో కేబినెట్, ఒక్కో సహాయమంత్రి పదవులు ఇవ్వనున్నారు. జేడీయూ నుంచి లలన్ సింగ్, సంజయ్ ఝాలలో ఒకరు కేబినెట్ మంత్రిగా, రామ్‌నాథ్ ఠాకూర్ సహాయమంత్రిగా ఆదివారం మోదీతో పాటు ప్రమాణ స్వీకారం చేస్తారని సమాచారం. లోక్ జనశక్తి (రాంవిలాస్) నుంచి ఆ పార్టీ అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్‌కు కేబినెట్‌లో చోటు దక్కనుంది.

ఢిల్లీకి చేరుకున్న హసీనా

మోదీ ప్రమాణస్వీకారంలో పాల్గొనేందుకు బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా, సీషెల్స్ ఉపాధ్యక్షుడు అహ్మద్ అఫీఫ్ శనివారమే ఢిల్లీ చేరుకున్నారు. నేపాల్ ప్రధాని ప్రచండ, శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, మారిషస్ ప్రధాని ప్రవింద్‌కుమార్ జుగ్నాథ్, భూటాన్ ప్రధాని తెర్సింగ్ టోబ్గేలు కూడా ప్రమాణ స్వీకారానికి హాజరుకానున్నట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. మోదీ 3.0ను సెలబ్రేట్ చేసుకునేందుకు అమెరికాలోని 22 నగరాల్లో బీజేపీ మద్దతుదారులు ఏర్పాటు చేస్తున్నారు.

న్యూయార్క్, జెర్సీ సిటీ, వాషింగ్టన్ డీసీ, బోస్టన్, అట్లాంటా, హూస్టన్, డల్లాస్, షికాగో, లాస్‌ఏంజెలెస్, శాన్‌ఫ్రాన్సిస్కో తదితర నగరాల్లో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించనున్నట్లు ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ- యూఎస్‌ఏ అధ్యక్షుడు అడపా ప్రసాద్ తెలిపారు. భారతీయ రైల్వేస్‌కు చెందిన పది మంది లోకో పైలట్లను ప్రమాణస్వీకారానికి ఆహ్వానించారు. ఇందులో భారత తొలి మహిళా లోకోపైలట్ సురేఖ యాదవ్ ఉన్నారు. రాష్ట్రపతి భవన్‌లో వీవీఐపీలకు, కాబోయే మంత్రులకు ప్రత్యేక ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేశారు. ప్రమాణ స్వీకారం ముగిశాక రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అతిథులకు విందు ఇవ్వనున్నారు. పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పలు చోట్ల నిషేధాజ్ఞలు విధించారు. ఆది, సోమవారాల్లో దేశ రాజధానిని నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించారు.

మాకింకా ఆహ్వానం రాలేదు: కాంగ్రెస్

మోదీ ప్రమాణ స్వీకారానికి కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఇంకా ఎలాంటి ఆహ్వానాలు అందలేదని పార్టీ ప్రధాన కార్యదర్శులు జైరాం రమేష్, కేసీ వేణుగోపాల్ శనివారం రాత్రి చెప్పారు. ఆహ్వానాలు వస్తే హాజరు కావడంపై ఇండియా కూటమి నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

విపక్ష నేతగా రాహుల్

సీడబ్ల్యూసీ ఏకగ్రీవ తీర్మానం
- సమయం కావాలన్న అగ్ర నేత
- ఫలితాలు మోదీకి నైతిక ఓటమి
- మరో తీర్మానానికి ఏకగ్రీవ ఆమోదం
- కాంగ్రెస్ ప్రదర్శన బాగుందంటూ కితాబు
- రాణించని రాష్ట్రాల్లో దిద్దుబాటుకు కమిటీలు

న్యూఢిల్లీ: లోక్‌సభలో విపక్ష నేతగా రాహుల్‌గాంధీ బాధ్యతలు స్వీకరించాలని కాంగ్రెస్ అత్యున్నత నిర్ణాయక విభాగమైన వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) కోరింది. పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే సారథ్యంలో శనివారం ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశం ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అయితే తనకు కాస్త సమయం కావాలని ఈ బాధ్యత స్వీకరించే విషయమై అతి త్వరలో నిర్ణయం తీసుకుంటానని రాహుల్ చెప్పారు. ఖర్గే, రాహుల్‌తో పాటు సోనియాగాంధీ, ప్రియాంకా గాంధీ వద్రా, కేసీ వేణుగోపాల్, డీకే శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదితరులు భేటీలో పాల్గొన్నారు. 32 మంది సీడబ్ల్యూసీ సభ్యులు, 26 మంది శాశ్వత ఆహ్వానితులు, 12 మంది ప్రత్యేక ఆహ్వానితులు, 29 మంది పీసీసీ అధ్యక్షులు, 18 మంది సీఎల్పీ నేతలతో పాటు మరో 35 మంది వీరిలో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై భేటీ ప్రధానంగా చర్చించింది. ''రాజ్యాంగ పరిరక్షణకు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కల్పించిన రిజర్వేషన్లను కాపాడేందుకు ఎన్నికల క్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ అద్భుతంగా పోరాడింది. సమర్థమైన ప్రత్యామ్నాయ రాజకీయ, ఆర్థిక, సామాజిక విజన్‌ను ప్రజల ముందుంచింది. వారు కూడా తమ ఓటు ద్వారా ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణకు పట్టం కట్టారు. అందుకు దేశ ప్రజలకు అభినందనలు. కాంగ్రెస్ పార్టీని పునరుజ్జీవన పథంలో నిలిపినందుకు కృతజ్ఞతలు'' అంటూ మరో తీర్మానం ఆమోదించింది. ''పదేళ్ల మోదీ పాలనను ఈ ఎన్నికల్లో ప్రజలు స్పష్టంగా తిరస్కరించారు. తన పేరుతోనే ఓట్లడిగిన మోదీకి ఇది రాజకీయ నష్టం మాత్రమే కాదు, వ్యక్తిగతంగా, నైతికంగా ఓటమి కూడా! ఆయన అవాస్తవ, విద్వేష, విభజన ప్రచారాలను ప్రజలు తిప్పి కొట్టారు'' అని తీర్మానం పేర్కొంది. ఈ ఎన్నికల్లో ఖర్గే, సోనియా, రాహుల్, ప్రియాంక పార్టీని అద్భుతంగా ముందుకు నడిపారంటూ అభినందించింది. ''ముఖ్యంగా పార్టీ అద్భుత ప్రదర్శనలో రాహుల్‌ది కీలక పాత్ర. భారత్ జోడో, భారత్ జోడో న్యాయ్ యాత్రలను స్వయంగా రూపొందించి విజయవంతం చేశారు'' అంటూ ప్రశంసించింది. ఈ ఎన్నికల్లో రాహుల్‌ను మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ అభివర్ణించారు.

విద్వేష రాజకీయాలకు చెంప పెట్టు: ఖర్గే

ఈ ఎన్నికల్లో మొత్తమ్మీద కాంగ్రెస్ ప్రదర్శన బాగున్నా పలు రాష్ట్రాల్లో అనుకున్న ఫలితాలు సాధించలేకపోయామని సీడబ్ల్యూసీ అభిప్రాయపడింది. ఆయా రాష్ట్రాల్లో తక్షణ దిద్దుబాటు చర్యల కోసం ప్రత్యేక కమిటీలు వేయాలని భేటీ నిర్ణయించింది. ప్రారంభోపన్యాసం చేసిన ఖర్గే ఎన్నికల ఫలితాలను కాంగ్రెస్‌కు పునరుజ్జీవంగా, విద్వేష, విభజన రాజకీయాలకు చెంపపెట్టుగా అభివర్ణించారు. పార్లమెంటు బయటా లోపలా ఇండియా కూటమి కలసికట్టుగా పని చేయాలని నొక్కి చెప్పారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో అద్భుతంగా రాణించిన రాష్ట్రాల్లో ఈసారి అనుకున్న ఫలితాలు రాబట్టలేకపోయామని కర్నాటక, తెలంగాణలను ఉద్దేశించి అభిప్రాయపడ్డారు. ఎక్కడ పొరపాటు జరిగిందో తేల్చేందుకు అతి త్వరలో రాష్ట్రాలవారీగా ప్రత్యేకంగా మథనం జరుపుతామని వెల్లడించారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర జరిగిన ప్రతి చోటా కాంగ్రెస్‌కు సీట్లు, ఓట్ల శాతం పెరిగాయని ఖర్గే అన్నారు. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు కూడా పలు రాష్ట్రాల్లో అద్భుతంగా పని చేశాయంటూ అభినందించారు. ''ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ ప్రాబల్య స్థానాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ మెరుగైన ప్రదర్శన చేశాం. పట్టణ ప్రాంతాల్లో పట్టును మరింతగా పెంచుకోవాల్సి ఉంది'' అని ఖర్గే అభిప్రాయపడ్డారు. అధికారంలో ఉన్నా, లేకున్నా నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసమే కాంగ్రెస్ పోరాడుతుందని ప్రకటించారు. రాష్ట్రాలవారీ కమిటీలు పరిస్థితులను క్షుణ్నంగా సమీక్షించి అధ్యక్షునికి నివేదిక సమర్పిస్తాయని జైరాం రమేశ్ మీడియాకు తెలిపారు.



శనివారం సీడబ్ల్యూసీ భేటీ తర్వాత రాహుల్, ఖర్గే, సోనియా, ప్రియాంక, కేసీ వేణుగోపాల్ తదితరులు

పదేళ్ల తర్వాత లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష హోదా

కాంగ్రెస్ పార్టీకి పదేళ్ల తర్వాత లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష హోదా, విపక్ష నేత పదవి దక్కాయి. మొత్తం 543 లోక్‌సభ స్థానాల్లో కనీసం 10 శాతం వస్తేనే ప్రధాన ప్రతిపక్ష హోదా లభిస్తుంది. కాంగ్రెస్‌కు 2014లో 44, 2019లో 52 మాత్రమే రావడం తెలిసిందే.

నైతిక, రాజకీయ ఓటమి...
మోదీకి గద్దెనెక్కే హక్కు లేదు

- సోనియా మండిపాటు
- సీపీపీ చైర్‌పర్సన్‌గా ఎన్నిక

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ప్రధాని నరేంద్ర మోదీకి నైతిక, రాజకీయ ఓటమిగా సోనియాగాంధీ అభివర్ణించారు. ''కనుక మోదీ దేశానికి నాయకత్వం వహించే నైతిక హక్కు కోల్పోయారు. ఎందుకంటే బీజేపీని, భాగస్వామ్య పక్షాలను పూర్తిగా పక్కన పెట్టారు. కేవలం తన పేరుతోనే ప్రజా తీర్పు కోరారు. కనుక ఓటమికి ఆయనే పూర్తి బాధ్యత వహించాలి. కానీ ఆ పని చేయక పోగా మరోసారి గద్దెనెక్కేందుకు సిద్ధపడుతున్నారు'' అంటూ దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్‌గా సోనియా తిరిగి ఎన్నికయ్యారు. శనివారం సీడబ్ల్యూసీ భేటీ అనంతరం పార్లమెంటు సెంట్రల్ హాల్లో జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలంతా ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. అనంతరం ఎంపీలనుద్దేశించి ఆమె మాట్లాడారు. ''మోదీ నైజం తెలిసిన వారెవరూ ప్రజా తీర్పును ఆయన గౌరవిస్తారని, పాలన తీరుతెన్నులను మార్చుకుంటారని అనుకోరు. కనుక మోదీ సర్కారు తీరును వేయి కళ్లతో గమనించడం, ప్రజా వ్యతిరేక చర్యలను ఎప్పటికప్పుడు ఎండగట్టడం మనందరి బాధ్యత. లౌకిక, ప్రజాస్వామ్య విలువలకు పాతరేసే యత్నాలను అడ్డుకుంటూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి'' అని ఎంపీలకు ఉద్బోధించారు. ''అయితే లోక్‌సభలో కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి సభ్యుల సంఖ్య భారీగా పెరిగింది. పార్లమెంటులో మోదీ సర్కారు ఏకపక్ష పోకడలు గత పదేళ్ల మాదిరిగా సాగబోవు. చర్చల్లేకుండా బిల్లుల ఆమోదం, విపక్ష సభ్యులను అవమానించడం, సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించడం వంటివి చెల్లబోవు'' అన్నారు.

మనకు ఏకంగా శ్రద్ధాంజలి ఘటించారు...

ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఎలాగైనా కుప్పకూల్చేందుకు అధికార పార్టీ చేయని ప్రయత్నం లేదని సోనియా అన్నారు. ''పార్టీని ఆర్థికంగా కుంగదీశారు. అందరిపైనా కేసులు పెట్టి వేధించారు. చాలామంది కాంగ్రెస్‌కు ఏకంగా శ్రద్ధాంజలే ఘటించారు! కానీ బీజేపీ కుటిల యత్నాలన్నింటినీ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు మొక్కవోని దీక్షతో అడ్డుకున్నారు. కలసికట్టుగా శ్రమించి మంచి ఫలితాలు సాధించారు. వారి ధైర్యానికి మా సెల్యూట్. ఈ విజయంలో అధ్యక్షుడు ఖర్గేది కీలక పాత్ర. ఆయన మనందరికీ స్ఫూర్తిగా నిలిచారు. ఖర్గే నుంచి అందరూ ఎంతో నేర్చుకోవాలి. అలాగే చరిత్రాత్మక భారత్ జోడో యాత్రలు చేసిన రాహుల్ ప్రత్యేక అభినందనలకు అర్హుడు'' అన్నారు. పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఆశించిన ఫలితాలు సాధించకపోవడంపై ఆత్మశోధన జరగాలని ఎంపీలను కోరారు. సీపీపీ చైర్‌పర్సన్‌గా తిరిగి ఎన్నికవడం తనకెంతో భావోద్వేగపూరిత క్షణమని సోనియా అన్నారు. ''మీరంతా నాపై ఎంతో ప్రేమ చూపుతూ వస్తున్నారు. మీ నమ్మకాన్ని కాపాడుకోవడానికి శాయశక్తులా కృషి చేస్తా'' అని చెప్పారు.

లోక్‌సభలో ఎస్పీపక్ష నేతగా అఖిలేశ్ యాదవ్

లక్నో: లోక్‌సభలో సమాజ్‌వాదీ పార్టీ పక్షనేతగా అఖిలేశ్ యాదవ్ వ్యవహరిస్తారు. ఆ పార్టీ ఎంపీలు ఆయనను తమ నాయకుడిగా ఎన్నుకోనున్నారు. అఖిలేశ్ ఇప్పటికే ఉత్తర ప్రదేశ్ శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. ఆ పదవికి రాజీనామా చేయనున్నారు. ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం, లోక్‌సభ ప్రొటెం స్పీకర్ ఎన్నిక తర్వాత తమ పార్టీ పార్లమెంటరీ పక్ష నాయకుడిగా అఖిలేశ్ యాదవ్‌ను లాంఛనంగా ఎన్నుకుంటామని సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నేత రాజేంద్ర చౌదరి శనివారం చెప్పారు. అఖిలేశ్ ఉత్తరప్రదేశ్‌లోని కన్నౌజ్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా విజయం సాధించిన సంగతి తెలిసిందే.

డెన్మార్క్ ప్రధానిపై దాడి

కోపెన్‌హాగెన్/న్యూఢిల్లీ: డెన్మార్క్ ప్రధాన మంత్రి మెట్టె ఫ్రెడెరిక్సన్(46)పై దాడి జరిగింది. శుక్రవారం ఆమె రాజధాని కోపెన్‌హాగెన్‌లోని కుల్టోర్వెట్ స్క్వేర్ వద్ద సోషల్ డెమోక్రాట్ల తరఫున ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎదురుగా వచ్చిన ఓ వ్యక్తి చేతితో ప్రధానిని భుజాన్ని బలంగా నెట్టివేశాడు. దీంతో, ఆమె పక్కకు తూలారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనతో ప్రధాని ఫ్రెడెరిక్సన్‌కు ఎటువంటి గాయాలు కాలేదు కానీ, షాక్‌కు గురయ్యారని ఆమె కార్యాలయం తెలిపింది. ఘటన నేపథ్యంలో శనివారం ప్రధాని కార్యక్రమాలను రద్దు చేసుకున్నారని వివరించింది. యూరోపియన్ పార్లమెంట్‌కు ఆదివారం ఎన్నికలు జరగనుండగా ఈ పరిణామం చోటుచేసుకుంది. ఫ్రెడెరిక్సన్‌పై దాడిని ప్రధాని నరేంద్ర మోదీ ఖండించారు.

రష్యా ఆక్రమిత ఉక్రెయిన్‌లో దాడులు.. 28 మంది మృతి

కీవ్: ఉక్రెయిన్‌లోని రష్యా ఆక్రమణలో ఉన్న ఖెర్సన్, లుహాన్స్క్‌లపై జరిగిన దాడుల్లో కనీసం 28 మంది మృతి చెందారు. ఖెర్సన్‌లోని సడోవ్ పట్టణంపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన గైడెడ్ బాంబు, క్షిపణి దాడుల్లో 22 మంది చనిపోగా మరో 15 మంది గాయపడినట్లు అధికారులు చెప్పారు. అదేవిధంగా, లుహాన్స్క్ నగరంపై శుక్రవారం జరిగిన దాడిలో మరో రెండు మృతదేహాలు బయటపడటంతో మరణాల సంఖ్య ఆరుకు చేరిందని స్థానిక అధికారులు శనివారం వెల్లడించారు. దీంతోపాటు, కుబాన్, అస్త్రఖాన్,, తుల, క్రిమియా ప్రాంతాల్లో ఉక్రెయిన్ ప్రయోగించిన 25 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ శాఖ తెలిపింది. ఆక్రమిత జపోరిఝియాకు 900 కిలోమీటర్ల దూరంలోని కాకసస్ నార్త్ ఒస్సేతియాలోని సైనిక స్థావరం లక్ష్యంగా ఉక్రెయిన్ ప్రయోగించిన డ్రోన్‌ను ధ్వంసం చేసినట్లు వివరించింది.

కేబినెట్లో ఎవరెవరో...!

మోదీ 3.0 మంత్రివర్గంలో చోటు దక్కించుకునేది ఎవరన్నది ఆసక్తికరంగా మారింది. బీజేపీకి సొంతగా మెజారిటీ రాని నేపథ్యంలో ఈసారి మంత్రివర్గ కూర్పులో ఎన్డీఏ మిత్రపక్షాలకు పెద్దపీట వేయడం తప్పనిసరిగా మారింది. ఈ నేపథ్యంలో మంత్రులుగా పార్టీలవారీగా పలువురి పేర్లు విన్పిస్తున్నాయి... – న్యూఢిల్లీ

బీజేపీ

అమిత్ షా మళ్లీ హోం, రాజ్‌నాథ్‌సింగ్ రక్షణ శాఖల బాధ్యతలు చేపట్టవచ్చంటున్నారు. నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, ప్రహ్లాద్ జోషీ, జ్యోతిరాదిత్య సింధియా, జితిన్ ప్రసాద, నిత్యానంద రాయ్, రాజీవ్ ప్రతాప్ రూడీ, కిరెన్ రిజిజు కూడా మంత్రులుగా కొనసాగే వీలుంది. మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు పార్టీ అధ్యక్ష బాధ్యతలు ఇవ్వకుంటే మంత్రిగా చాన్సున్నట్టు చెబుతున్నారు. వీరితో పాటు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, డీకే అరుణ, ధర్మపురి అరవింద్, బండి సంజయ్ (తెలంగాణ), పురందేశ్వరి (ఏపీ), ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ షెకావత్, బస్వరాజ్ బొమ్మై, పీసీ మోహన్, గోవింద్ కర్జోల్, దుష్యంత్ సింగ్, సురేశ్‌గోపీ, శాంతను ఠాకూర్, జితేంద్ర సింగ్, జుగల్ కిశోర్ శర్మ, శర్బానంద సోనోవాల్, బైజులీ కలితా మేధి, బిప్లవ్ దేబ్ తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి.

జేడీ(యూ)

మూడు కేబినెట్, ఒకట్రెండు సహాయ బెర్తుల కోసం పార్టీ అధ్యక్షుడు, బిహార్ సీఎం పట్టుబడుతున్నట్టు సమాచారం. రెండు కేబినెట్ పదవులు దక్కవచ్చని జాతీయ మీడియా అభిప్రాయపడుతోంది. పార్టీ మాజీ చీఫ్ లలన్‌సింగ్‌తో పాటు భారతరత్న కర్పూరీ ఠాకూర్ కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్ పేర్లు ఇప్పటికే ఖరారైనట్టు తెలుస్తోంది.

టీడీపీ

కనీసం నాలుగు కేబినెట్ పదవులు కోరుతోంది. శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదివారం మోదీతో పాటు ప్రమాణం చేయడం ఖాయమని చెబుతున్నారు. రూ.5,705 కోట్ల ఆస్తులతో ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీపడ్డ అభ్యర్థుల్లో అత్యంత సంపన్నుడిగా రికార్డు సృష్టించిన పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, డి.ప్రసాదరావు, టి.కృష్ణప్రసాద్ పేర్లు కూడా విన్పిస్తున్నాయి.

శివసేన

రెండు బెర్తులు అడుగుతోంది. పార్టీ చీఫ్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే పేరు గట్టిగా విన్పిస్తోంది. ఆయన మాత్రం తన బదులు పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టించిన ఇతరులకు అవకాశం దక్కాలంటున్నారు.

ఎల్జేపీ

కనీసం ఒక్క బెర్తు ఖాయంగా కన్పిస్తోంది. పార్టీ చీఫ్ చిరాగ్ పాస్వాన్ మోదీతో పాటు ప్రమాణ స్వీకారం చేయవచ్చని చెబుతున్నారు.

జేడీ(ఎస్)

హెచ్.డి.కుమారస్వామికి వ్యవసాయ శాఖ కోరుతోంది.

జనసేన

వల్లభనేని బాలశౌరి పేరు విన్పిస్తోంది.

ఆరెల్డీ

పార్టీ చీఫ్ జయంత్ చౌదరికి బెర్తు ఖాయమంటున్నారు.

అప్నాదళ్ (ఎస్)

అనుప్రియా పటేల్‌కు మళ్లీ స్థానం దక్కేలా ఉంది.

గాజాలో భీకర పోరు.. 210 మంది మృతి



- 400 మందికి గాయాలు
- హమాస్ చెర నుంచి నలుగుర్ని రక్షించామన్న ఐడీఎఫ్

జెరూసలెం/గాజా: సెంట్రల్ గాజాలో నుసెయిరత్‌లో హమాస్ మిలిటెంట్లు, ఇజ్రాయెల్ సైన్యం మధ్య పోరు భీకరంగా సాగుతోంది. శనివారం నుసెయిరత్, పరిసర ప్రాంతాల్లో ఇజ్రాయెల్ దాడుల్లో 210 మంది చనిపోయినట్టు సమాచారం! 400 మంది దాకా గాయపడినట్లు హమాస్‌ను ఉటంకిస్తూ అల్‌జజీరా పేర్కొంది. మృతుల్లో పలువురు చిన్నారులున్నట్లు తెలిపింది. డెయిర్ అల్ బలాహ్‌లోని అల్-హక్సా ఆస్పత్రి మొత్తం రక్తంతో తడిచి వధశాలగా మారిపోయిందని డాక్టర్స్ వితౌట్ బోర్డర్స్ పేర్కొంది.

నలుగురు బందీలకు విముక్తి..

ఇలా ఉండగా, హమాస్ మిలిటెంట్ల చెర నుంచి బందీలను విడిపించుకునేందుకు గాజాపై యుద్ధం ప్రారంభించిన ఇజ్రాయెల్ ఆర్మీ పెద్ద విజయం నమోదు చేసుకుంది. నుసెయిరత్‌లో ఓ భవన సముదాయంపై శనివారం పట్టపగలే ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన ఆర్మీ రెండు వేర్వేరు ప్రాంతాల్లో దాచి ఉంచిన నోవా అర్గామని(25), అల్మోగ్ మెయిర్ జాన్(21), ఆంద్రీ కొజ్లోవ్(27), ష్లోమి జివ్(40) అనే నలుగురు బందీలను సురక్షితంగా తీసుకొచ్చినట్లు తెలిపింది. తాజాగా రక్షించిన నలుగురితో కలిపి ఇజ్రాయెల్ ఆర్మీ ఇప్పటి వరకు కాపాడిన బందీల సంఖ్య ఏడుకు చేరుకుంది. అమెరికా అందించిన సమాచారంతోనే బందీలను ఇజ్రాయెల్ ఆర్మీ గుర్తించి, రక్షించిందని బైడెన్ ప్రభుత్వంలోని ఓ అధికారి వెల్లడించారు. గురు, శుక్రవారాల్లోనూ ఇజ్రాయెల్ దాడుల్లో డజన్ల మంది మరణించారు.

ఆమె వీడియో వైరల్..



శనివారం ఐడీఎఫ్ రక్షించిన వారిలో అర్గామని అనే మహిళ ఉన్నారు. మిలిటెంట్లకు చిక్కిన బందీల్లో అర్గామనికి చెందిన వీడియోనే మొదటిసారిగా బయటకువచ్చింది. ఇద్దరు మిలిటెంట్లు బైక్‌పై తీసుకెళ్తుండగా 'నన్ను చంపకండి'అని ఆమె రోదిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. బ్రెయిన్ కేన్సర్ ముదిరి మృత్యుశయ్యపై ఉన్న తనకు కూతురిని చూడాలని ఉందంటూ అర్గామని తల్లి లియోరా ఏప్రిల్‌లో ఒక వీడియో విడుదల చేశారు. చెర నుంచి విడుదలైన అర్గామనితో ప్రధాని నెతన్యాహు ఫోన్‌లో మాట్లాడారు. బందీలందరినీ విడిపించే దాకా యుద్ధం ఆపబోమని స్పష్టం చేశారు.

'నీట్'పై ఉన్నత కమిటీ

1,500కు పైగా అభ్యర్థుల మార్కులపై పునఃసమీక్ష
- ప్రవేశ పరీక్షలో అవకతవకలు జరగలేదన్న ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్

న్యూఢిల్లీ: జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష(నీట్)-అండర్ గ్రాడ్యుయేట్ వైద్య ప్రవేశ పరీక్షలో ఈ ఏడాది పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏకంగా 67 మంది అభ్యర్థులకు మొదటి ర్యాంకు రావడంపై చాలామంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వీరిలో ఒకే పరీక్ష కేంద్రానికి చెందిన ఆరుగురు అభ్యర్థులున్నారు. అందుకే నీట్-2024ను రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో 1,500 మందికిపైగా విద్యార్థులకు కేటాయించిన గ్రేసు మార్కులపై పునఃసమీక్ష చేయడానికి యూజీసీ మాజీ చైర్మన్ నేతృత్వంలో నలుగురు సభ్యులతో కేంద్ర విద్యా శాఖ ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. ఈ విషయాన్ని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ సుబోధ్‌కుమార్ సింగ్ శనివారం వెల్లడించారు. కమిటీ వారంలోగా ప్రభుత్వానికి సిఫార్సులు చేస్తుందని అన్నారు. గ్రేసు మార్కులతో అర్హత ప్రమాణాలపై ప్రభావం ఉండదన్నారు. కొందరు అభ్యర్థుల ఫలితాలను పునఃసమీక్ష చేయడం వల్ల ప్రవేశాల ప్రక్రియకు ఎలాంటి విఘాతం కలగదని స్పష్టం చేశారు. నీట్ పరీక్షలో అవకతవకలు జరగలేదన్నారు. ఎన్సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాల్లో మార్పులు, కొన్ని సెంటర్లలో ఇచ్చిన గ్రేసు మార్కుల కారణంగానే అభ్యర్థులకు ఈ ఏడాది ఎక్కువ మార్కులొచ్చాయని వివరించారు. ఎక్కువ మార్కులు పొందిన విద్యార్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించాలా వద్దా అనేది కమిటీ తేలుస్తుందన్నారు. పేపరు లీక్ కాలేదన్నారు. నీట్ విషయంలో తాము రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. గ్రేసు మార్కుల కేటాయింపులో అక్రమాలు జరిగాయని, అందుకే చాలామందికి ఫస్టు ర్యాంకు వచ్చిందని తల్లిదండ్రులు ఆరోపిస్తుండటం తెలిసిందే. ఆరు సెంటర్లలో పరీక్ష నిర్వహణలో జాప్యం జరగడంతో అక్కడ రాసిన విద్యార్థులకు గ్రేసు మార్కులు ఇచ్చారు. మేఘాలయా, హరియాణాలోని బహదూర్‌గఢ్, ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ, బాలోద్, గుజరాత్‌లోని సూరత్‌తోపాటు చండీగఢ్‌లో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈసారి దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది నీట్ రాశారు. ఈ నెల 4న ఫలితాలు వెల్లడయ్యాయి.

రాయ్‌బరేలీకే రాహుల్ మొగ్గు!

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ ఎంపీగా కొనసాగాలని నిర్ణయించుకున్నట్లు పార్టీ వర్గాలు ధ్రువీకరించాయి. రాహుల్ యూపీలోని రాయ్‌బరేలీ, కేరళలోని వయనాడ్‌ల నుంచి పోటీచేసి రెండు చోట్లా నెగ్గిన విషయం తెలిసిందే. నిబంధనల ప్రకారం ఫలితాలు వెల్లడైన 14 రోజుల్లోగా రెండింటిలో ఒక స్థానానికి రాజీనామా చేయాలి. లేని పక్షంలో రెండు స్థానాలనూ కోల్పోతారు. వయనాడ్‌ను వదులుకోవాలని రాహుల్ భావిస్తున్నట్లు సమాచారం. జూన్ 17వ తేదీలోగా దీనిపై తుది నిర్ణయం వెలువడనుంది. రాహుల్ రాయ్‌బరేలీ ఎంపీగా కొనసాగాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీలో అత్యధికులు అన్నారు. 80 ఎంపీ సీట్లున్న యూపీలో కాంగ్రెస్ పునరుజ్జీవనానికి ఇది కీలకమని యూపీ నేతలన్నారు.

నితీశ్ కుమార్‌కు ప్రధాని పదవి ఆఫర్

జేడీ(యూ) నేత త్యాగి • ఖండించిన కాంగ్రెస్



కె.సి.త్యాగి

పట్నా: తమ కూటమిలో చేరితే ప్రధానమంత్రిగా నియమిస్తామంటూ బిహార్ ముఖ్యమంత్రి, జేడీ(యూ) అధినేత నితీశ్ కుమార్‌కు ఇండియా కూటమి ఆఫర్ ఇచ్చిందా? అవుననే అంటున్నారు జేడీ(యూ) సీనియర్ నాయకుడు కె.సి.త్యాగి. విపక్ష కూటమి ఇచ్చిన ఆఫర్‌ను నితీశ్ కుమార్ తిరస్కరించారని చెప్పారు. త్యాగి శనివారం ఓ వార్తా సంస్థతో మాట్లాడారు. ఇండియా కూటమికి నితీశ్ కుమార్ కన్వీనర్ కాకుండా అడ్డుకున్న వ్యక్తులే ఆయనకు ప్రధానమంత్రి పదవిని అప్పగిస్తామంటూ హామీ ఇచ్చారని వెల్లడించారు. అయితే, ఆ వ్యక్తుల పేర్లు బయటపెట్టేందుకు నిరాకరించారు. ఇండియా కూటమిలో తగిన గౌరవం లేకనే నితీశ్ బయటకు వచ్చారని గుర్తుచేశారు. తాము ఎన్డీయేలో చేరామని, ఇక వెనక్కి మళ్లే అవకాశం లేదని స్పష్టం చేశారు. కె.సి.త్యాగి వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ఖండించారు. ప్రధాన మంత్రి పదవిని ఆశ చూపి నితీశ్‌ను ఇండియా కూటమిలో చేర్చుకోవడానికి ప్రయత్నించినట్లు తమకు ఎలాంటి సమాచారం లేదని తేల్చిచెప్పారు.

సమీప భవిష్యత్తులో ఇండియా కూటమి సర్కారు

- రేపొద్దున ఏమైనా జరగొచ్చు: మమత
- టీడీపీ, జేడీయూ మాకూ మిత్రులే



కోల్‌కతా: సమీప భవిష్యత్తులో కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వం కొలువుదీరుతుందని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఇప్పుడు అధికారం కోసం ప్రయత్నించనంత మాత్రాన రాబోయే రోజుల్లో ప్రయత్నం చేయబోమని కాదన్నారు. తృణమూల్ వేచి చూసే ధోరణిని అవలంబిస్తుందని చెప్పారు. ''బీజేపీ నేతృత్వంలోని బలహీన, అస్థిర ఎన్డీఏ ప్రభుత్వం అధికారం కోల్పోతే సంతోషిస్తాను. దేశం మార్పు కోరుతోంది. తాజా ప్రజాతీర్పు మార్పు కోసమే. ఇది నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా వచ్చిన ప్రజా తీర్పు. కనుక ఆయన ప్రధాని పదవి చేపట్టకుండా మరొకరికి అవకాశం ఇచ్చి ఉండాల్సింది'' అని మమత అన్నారు. కొత్తగా ఎంపికైన తృణమూల్ ఎంపీలతో మమత శనివారం సమావేశమయ్యారు. మోదీ ప్రమాణస్వీకారానికి తృణమూల్ దూరంగా ఉంటుందని తెలిపారు. బీజేపీ అప్రజాస్వామికంగా, చట్ట విరుద్ధంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోందని అన్నారు. ''బీజేపీకి సొంతంగా మెజారిటీ లేదు. మిత్రపక్షాలపై ఆధారపడుతోంది. ప్రభుత్వాన్ని ఎలా నడుపుతుందో, ఎంతవరకు బండిని లాగుతుందో చూద్దాం. పదేళ్లుగా ఎలాంటి చర్చలు లేకుండానే బిల్లులు ఆమోదించుకునేది. ఇక అలా కుదరదు. రాజ్యాంగాన్ని కూడా మార్చలేరు'' అని మమత అన్నారు. ఎన్డీఏ పక్షాలైన టీడీపీ, జేడీయూ గురించి అడగ్గా.. 'వారు మా మిత్రులు కూడా. టీడీపీ, జేడీయూలు మాతో లేవని మీకెవరు చెప్పారు?' అని మమత ప్రశ్నించారు. ఫేక్ ఎగ్జిట్ పోల్స్‌తో స్టాక్ మార్కెట్ల ప్రభావితం చేశారని, దీనిపై దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) ఉపసంహరించాలని టీఎంసీ ఎంపీలు రాజ్యసభ, లోక్‌సభల్లో డిమాండ్ చేస్తారని తెలిపారు. బెంగాల్ 42 స్థానాలకు గాను టీఎంసీ 29 సీట్లకు కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. సుదీప్ బందోపాధ్యాయ్‌ను లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్ నేతగా మమత నియమించారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం । 9 । జూన్ । 2024

నాట్య మయూరం



మండ్య: మండ్య జిల్లా హలగూరు తాలూకా తొరెకాడనహళ్లి గ్రామంలో ఓ తోటలో నెమలి పురివిప్పి నాట్యం చేసింది. శనివారం వేకువన పచ్చటి చెట్ల నడుమ నెమలి పురివిప్పి నాట్యం చేసింది. ఈ దృశ్యాలను స్థానిక రైతులు మొబైళ్లలో బంధించారు.

న్యూస్‌రీల్

చెరువులోకి పడిన కారు, నలుగురికి గాయాలు



చెరువులో పడ్డ కారు

దొడ్డబళ్లాపురం: అదుపు తప్పిన కారు చెరువులోకి బోల్తాపడ్డ ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డ సంఘటన బెంగళూరు, మైసూరు ఎక్స్‌ప్రెస్‌వే మార్గంలోని చెన్నపట్టణ తాలూకా సంకలగెరె గేట్ వద్ద చోటుచేసుకుంది. బెంగళూరు నుంచి మైసూరు వైపు వెళ్తున్న స్కోడా కారు అతి వేగంగా హైవే నుంచి సర్వీస్ రోడ్డులోకి తిరుగుతుండగా అదుపుతప్పి పక్కనే ఉన్న చెరువులోకి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. చెన్నపట్టణ ట్రాఫిక్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

శివమొగ్గకు మంత్రి పదవి దక్కేనా?

శివమొగ్గ: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ మంత్రివర్గంలో శివమొగ్గ ఎంపీ, బీఎస్ యడియూరప్ప పెద్ద కుమారుడు బీ.వై.రాఘవేంద్రకు మంత్రి పదవి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక నాయకులు అనుకుంటున్నారు. రాఘవేంద్ర ఇటీవల 4వ సారి ఎంపీగా గెలిచారు. 2009 నుంచి ఆయన వరుసగా ఎన్నికవుతూ వస్తున్నారు. ఆయనతో పాటు కుమారునికి పదవి కోసం యడియూరప్ప గట్టిగా లాబీయింగ్ చేపట్టినట్లు స్థానిక నాయకులు అనుకుంటున్నారు. ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం తరువాతే మంత్రి మండలిపై స్పష్టత వస్తుంది.

ఎస్ఐ సస్పెండ్

మైసూరు: స్వాధీనం చేసుకున్న వాహనం దాఖలాలు, మొబైల్ ఫోన్లను సొంతదార్లకు ఇవ్వడానికి రూ. 50 వేలు లంచం తీసుకుంటూ లోకాయుక్తకు చిక్కిన కువెంపు నగర ఎస్ఐ రాధను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. గతనెల 30న పోలీస్ స్టేషన్‌లోనే లంచం తీసుకుంటుండగా లోకాయుక్త అధికారులు కాపుగాచి అరెస్ట్ చేశారు. అదే రోజు ఆమెను జుడీషియల్ కస్టడీకి తరలించారు. 48 గంటల పాటు జైలులో ఉన్న ఎస్ఐను మైసూరు నగర సీపీ రమేశ్ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

దోపిడీకి పాల్పడిన ఆరుగురు అరెస్టు

దొడ్డబళ్లాపురం: రాత్రి ఇంటికి వెళ్తున్న బీటెక్ విద్యార్థిని అడ్డగించిన రౌడీషీటర్ మరో ఆరుగురు విద్యార్థులతో కలిసి దోపిడీకి పాల్పడ్డ సంఘటన నెలమంగల తాలూకా సోలదేనహళ్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గోపిచంద్, తేజ్‌దీప్, గంగమ్మగుడి వీధికి చెందిన రౌడీషీటర్ శరత్, ఇతడి అనుచరులు మంజునాథ్, చేతన్‌గౌడ, చేతన్‌కుమార్ అరెస్టైనవారు. నిందితుల నుండి రూ.18,500 నగదు, ఆటోరిక్షా, రెండు బుల్లెట్ బైక్‌లు, ఒక కారు, ఆరు మొబైళ్లు స్వాధీనం చేసుకున్నారు. రాజానుకుంట సమీపంలోని ప్రైవేటు యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్న ఇటగలపుర నివాసి విఘ్నేష్ (20)శుక్రవారం రాత్రి ఒక దాబాలో స్నేహితులతో కలిసి భోజనం చేసి ఇంటికి తిరిగి నడుచుకుంటూ వెళ్తుండగా నిందితులు అతడ్ని అడ్డగించి దోపిడీ చేసారు. సోలదేనహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పెన్‌డ్రైవ్ దర్యాప్తు పరుగులు

- సిట్ విచారణకు భవాని హాజరు
- అక్కడే ఉన్న తనయుడు ప్రజ్వల్
- హాసన్ నివాసాల్లో ప్రజ్వల్ మహజరు



ప్రజ్వల్,



కార్తీక్ గౌడ



బనశంకరి: అత్యాచార బాధిత మహిళను అపహరించిన కేసులో జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ భార్య భవానీ రేవణ్ణ శనివారం సిట్ అధికారులు విచారణ చేపట్టారు. హాసన్ జిల్లా కేఆర్ నగరలో బాధిత మహిళ అపహరణ కేసులో హైకోర్టు ఆదేశాల మేరకు బెంగళూరులో సిట్ ఆఫీసులో భవాని హాజరయ్యారు. సిట్ అధికారులు భవానీని విచారించారు. హైకోర్టు వారంరోజుల పాటు షరతులతో కూడిన మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. సీఐడీ సముదాయంలో ఉన్న సిట్ ఆఫీసుకు భవాని లాయరుతో కలిసి వచ్చారు. తాను ఏ మహిళ ను అపహరించలేదని, తనపై కుట్ర చేశారని ఆమె చెప్పారు. సుమారు 4 గంటల పాటు విచారణ చేపట్టినప్పటికీ సమాచారం లభించలేదని సమాచారం. బాధిత మహిళ తమ ఇంట్లో పనిచేస్తుందని, నేను ఆమెను అపహరించలేదని భవాని పదేపదే చెప్పారు. షరతుల ప్రకారం భవాని రోజూ మధ్యాహ్నం 1 గంట కు సిట్ విచారణకు హాజరు కావాలి. సాయంత్రం 5 గంటల వరకు విచారణ జరపవచ్చు. ఆపై ఆమెను పంపించి వేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులోనే భర్త రేవణ్ణ అరెస్టయి విడుదలయ్యారు.

సిట్ ఆఫీసులో తల్లీ తనయుడు

భవాని సిట్ ఆఫీసులో విచారణకు హాజరైనప్పుడు అక్కడే పక్కగదిలో విచారణలో కుమారుడు ప్రజ్వల్ ఉన్నారు. ఒకరినొకరు పలకరించుకోలేని పరిస్థితి ఏర్పడింది. గత ఏప్రిల్ 27 నుంచి ప్రజ్వల్‌తో తల్లి భవాని ముఖాముఖి మాట్లాడింది లేదు. ప్రజ్వల్, భవానీని వేర్వేరుగా విచారించారు.

హైకోర్టులో రేవణ్ణ అర్జీ

హాసన్ జిల్లా హొళెనరసిపుర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన లైంగిక దాడికేసు రద్దుచేయాలని జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ.రేవణ్ణ హైకోర్టులో వేసిన పిటిషన్ పై సిట్ కు హైకోర్టు నోటీస్ జారీచేసింది. జడ్జి జస్టిస్ కృష్ణ ఎస్.దీక్షిత్ ధర్మాసనం పిటిషన్‌పై ఇరు వర్గాల వాదనలను ఆలకించింది. సిట్ వాదన తెలియజేయాలని ఆదేశిస్తూ 21 తేదీకి వాయిదా వేసింది.

ప్రజ్వల్ స్నేహితునికి నోటీసులు

ప్రజ్వల్‌కు విదేశాల్లో సాయం చేసిన అతని స్నేహితున్ని విచారణకు హాజరుకావాలని సిట్ నోటీస్ జారీచేసింది. 34 రోజుల పాటు ఎవరికీ అందుబాటులోకి రాకుండా ప్రజ్వల్ జర్మనీలో మకాం వేశాడు. ఇందుకు అతని స్నేహితుడు సాయం చేసినట్లు సిట్ గుర్తించింది. దీంతో విచారణకు రావాలని నోటీసులు పంపింది.

కార్తీక్ గౌడ అరెస్టు

హాసన్‌లో నగ్నచిత్రాల పెన్‌డ్రైవ్‌లను లీక్ చేసిన కేసులో సిట్ అధికారులు శనివారం కార్తీక్‌గౌడ అనే వ్యక్తిని అరెస్ట్‌చేశారు. ఈ కేసులో ఇప్పటికే పలువురిని నిర్బంధించారు.

హాసన్‌లో నివాసాలలో తనిఖీ

యశవంతపుర: అత్యాచారం, లైంగిక వీడియోల కేసులో మాజీ ఎంపీ ప్రజ్వల్‌కు చెందిన హాసన్ జిల్లా హొళెనరసిపురలోని నివాసంలో సిట్ అధికారులు మహజరు చేశారు. చెన్నాంబిక అనే పేరు గల ఈ ఇంటికి ప్రజ్వల్‌ను తీసుకెళ్లారు. ముందుజాగ్రత్తగా గట్టి పోలీసు బందోబస్తు నడుమ ప్రత్యేక వాహనంలో బయటకు కనబడకుండా బెంగళూరు నుంచి ప్రజ్వల్‌ను తీసుకెళ్లారు. మొదట ఆ నివాసంలో విచారణ జరిపి, మళ్లీ హాసన్‌కు తరలించారు.





● పొట్టేళ్ల పౌరుషం

త్వరలో ముస్లింలకు పవిత్రమైన బక్రీద్ పర్వదినం రాబోతోంది. బెంగళూరు చామరాజపేటె ఈద్గా మైదానంలో పెద్ద ఎత్తున పొట్టేళ్లు, మేకల విక్రయాలు మొదలయ్యాయి. శనివారం మేలుజాతి పొట్టేళ్లు, మేకపోతు గాంభీర్యం చూడవచ్చు

వీడియోలతో పోకిరీ బ్లాక్‌మెయిల్

- కుటుంబం ఆత్మహత్యాయత్నం
- ఒకరు మృతి



ప్రైవేటు వీడియోలు తీసి..

మైసూరు: కామాంధుని వేధింపుల వల్ల ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్యాయత్నం చేయగా ఇందులో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన చామరాజనగర జిల్లాలోని హనూరు తాలూకాలోని మలెమహాదేశ్వర బెట్ట పరిధిలోని తాళబెట్టలో జరిగింది. వివరాలు.. మైసూరు జిల్లాలోని కేఆర్ నగర తాలూకా చందగాలు గ్రామానికి చెందిన మహాదేవనాయక (65), భార్య గౌరమ్మ (60), లీలావతి (45), రిషిత (21)తో కలిసి శుక్రవారం మహాదేశ్వర బెట్టకు వచ్చారు. శనివారం ఉదయం మహాదేశ్వర ఆలయంలో దర్శనం చేసుకొని తాళబెట్టకు నడుచుకుంటూ వెళ్లారు. అక్కడ అందరూ పురుగుల మందును తాగారు. ఇందులో మహాదేవనాయక మృతి చెందగా మిగతా ముగ్గురు చావు బతుకుల మధ్య ఉండగా స్థానికులు చూసి కొళ్లేగాల ఆస్పత్రికి తరలించారు. తమ కుటుంబానికి ఓ యువకుని వేధింపులే దీనికి కారణమని తెలిపారు. మృతుని మనవరాలిని కేఆర్ నగరకు చెందిన ఒక యువకుడు మభ్యపెట్టాడు. అతడు యువతి ప్రైవేటు వీడియోలను పెట్టుకుని బ్లాక్ మెయిల్ చేయసాగాడు. నాయక కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసినా కూడా పట్టించుకోలేదు. ఆ వీడియోలు బయటకు వస్తే కుటుంబం మర్యాద పోతుందని, సమాజంలో తలెత్తుకోలేమని భావించారు. దీంతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నట్లు తెలిపారు. మహాదేశ్వర బెట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.

వాల్మీకి నిధుల స్కాంలో మరో మంత్రి?

- శరణు ప్రకాశ్‌పై ఆరోపణలు
- తోసిపుచ్చిన మంత్రి



వైద్య విద్యామంత్రి శరణ ప్రకాశ్

శివాజీనగర: వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ. వందల కోట్ల నగదు అక్రమాలకు సంబంధించి మంత్రి బీ నాగేంద్ర తరహాలోనే మరో మంత్రి పేరు వినిపిస్తోంది. మండలిలో నగదు అక్రమాల సాక్ష్యాలను నాశనం చేయడానికి వైద్య విద్యా మంత్రి డాక్టర్ శరణ ప్రకాశ్ కార్యాలయంలోనే కుట్ర రూపొందించినట్లు కేసులో 8వ నిందితుడు, మండలి లెక్కాధికారి పరశురాం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. బెంగళూరులోని మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో పరశురాం తరఫు న్యాయవాది ఈ అఫిడవిట్‌ను సమర్పించారు. వైద్య విద్యా శాఖ మంత్రి శరణప్రకాశ్ పాటిల్ కార్యాలయంలో మే 24న సభ జరిపి, అక్రమ సాక్ష్యం నాశనం గురించి చర్చ జరిగింది. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కార్యాలయం సీసీ టీవీ చిత్రాలను స్వాధీనం చేసుకొని పరిక్షించేలా తనిఖీ అధికారులకు ఆదేశించాలని కోర్టులో విన్నవించారు.

నాకు సంబంధం లేదు: మంత్రి

వాల్మీకి మండలి సొమ్ము అక్రమ బదిలీ కేసుకు, తనకు ఎలాంటి సబంధం లేదని, అఫిడవిట్‌లో పేర్కొన్న రోజున తాను కార్యాలయానికి వెళ్లలేదని మంత్రి శరణప్రకాశ్ పాటిల్ చెప్పారు. శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన, సిట్ విచారణలో ఉన్న నిందితుడు అఫిడవిట్ ఇచ్చాడని తెలిసింది. కార్యాలయంలో తాను ఒకరిని భేటీ చేశాను. ఈ నేపథ్యంలో అక్కడి పుటేజీని కాపాడాలని అన్నారు.

సాక్ష్యాలను నాశనం చేయలేదు: దద్దల్

వాల్మీకి అభివృద్ధి మండలి అధ్యక్షుడు, కాంగ్రెస్ నేత బసనగౌడ దద్దల్ నిధుల మళ్లింపు ఆధారాలను తుడిచిపెట్టాలని చూశారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై దద్దల్ శనివారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు తన రాజీనామాకు డిమాండ్ చేస్తున్నారు. అది వారి ధర్మం. అయితే కేసులో నేను ఏ విధమైన సాక్ష్యం నాశనం చేయలేదు. ఇది కంప్యూటర్ యుగం, అన్ని కూడా వాటిలోనే ఉంటాయి అని చెప్పారు. ఎలాంటి తనిఖీకై నా తాను సహకరిస్తానన్నారు. అంతర్‌రాష్ట్రాలకు నగదు బదిలీ అయినట్లు తెలిసింది, ఇది ఎస్టీలకు చెందిన సొమ్ము, వందకు వందశాతం సొమ్మును తప్పకుండా తీసుకొస్తాం. ముఖ్యమంత్రి కోరితే పదవికి రాజీనామా చేస్తాను అని చెప్పారు.





శనివారం ధార్వాడలో వర్షంలో వెళ్తున్న తల్లీతనయుడు, బెళగావి మార్కెట్ వీధిలో రెయిన్‌కోట్లు, గొడుగులతో జనం

ముమ్మరంగా కుంభవృష్టి

యశవంతపుర: రాష్ట్రంలో ముంగారు వానలు జోరుగా సాగుతున్నాయి. బెంగళూరు చుట్టుపక్కల శనివారం సాయంత్రం వానలు పడ్డాయి. 7 జిల్లాలలో ఆరెంజ్, 12 జిల్లాలలో ఎల్లో అలర్ట్‌ను ప్రకటించారు. కుండపోత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కరావళి ఉత్తర కన్నడ, ఉడుపి, ఉత్తర కర్ణాటక, జిల్లాలైన బాగలకోట, బెళగావి, హావేరి, విజయపుర, ధారవాడ జిల్లాలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. దక్షిణ కన్నడ, గదగ్, రాయచూరు, యాదగిరి, కలబురగి, చిక్కమగళూరు, దావణగెరె, చిత్రదుర్గతో పాటు 12 జిల్లాలలో వర్షాల వల్ల ఎల్లో అలర్ట్‌ను ప్రకటించారు.

మహాబలేశ్వర ఆలయంలోకి నీరు

ఉత్తర కన్నడ, ఉడుపిలో పడుతున్న వానలతో గోకర్ణ మహాబలేశ్వరస్వామి దేవస్థానం జలావృతమైంది. శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మహాబలేశ్వర ఆలయంలో గర్భగుడిలోని ఆత్మలింగం వరకు నీరు చేరింది. ఆ నీటిని సిబ్బంది బయటకు తోడిపోశారు.



ధార్వాడ శివార్లలో పొలాల్లో కురుస్తున్న వాన. గత ఏడాది కంటే ఈసారి ఎక్కువగానే వర్షాలు పడడంతో పొలం పనులు జోరుగా సాగుతున్నాయి

బావకు బామ్మర్ది సవాల్



బెంగళూరులో కుమార బంగారప్ప ఇంటి ముందు రాజ్, శివు అభిమానుల ధర్నా

- హీరో శివరాజ్‌కుమార్‌పై కుమార బంగారప్ప హేళన పోస్టు
- ఇంటిని ముట్టడించిన అభిమానులు

శివాజీనగర: ప్రముఖ నటుడు శివ రాజ్‌కుమార్‌ను బావమరిది కించపరిచేలా మాట్లాడడం చర్చనీయాంశమైంది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో శివమొగ్గలో శివు భార్య గీత కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆ బాధలో ఉండగానే బావమరిది హేళనలు ఆయన అభిమానులను మరింత వేదనకు గురిచేశాయి. బీజేపీ నాయకుడు కుమార బంగారప్ప ఇంటిని హ్యాట్రిక్ హీరో శివరాజ్ కుమార్ అభిమానులు శనివారం ముట్టడించారు. కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్, శివరాజ్ కుమార్ కుటుంబాల గురించి కుమార ఇటీవల చులకనగా మాట్లాడారు. అది తమకు బాధకు గురి చేసిందని, ఆయన బయటికి వచ్చి క్షమాపణ చెప్పాలని అభిమానులు పట్టుబట్టారు. బెంగళూరులో సదాశివనగరలో ఉన్న కుమార బంగారప్ప ఇంటి గేట్ లోపలికి చొరబడి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శివు, రాజ్‌కుమార్ ఫొటోలను ప్రదర్శించారు. పరిస్థితి తీవ్రస్థాయికి చేరుతుండగా స్థలానికి చేరుకుని వారిని అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. ఇంటి నుంచి వెళ్లాలని పోలీసులు అభిమానులను హెచ్చరించారు. ఆ తరువాత కేఎస్ఆర్‌పీ పోలీసులతో అధిక భద్రత కల్పించారు. ఈ సందర్భంగా పలువురు అభిమానులను పట్టుకొని పోలీసులు అరెస్ట్ చేశారు. సమీప పార్కు చుట్టుపక్కల నిల్చున్నవారిని సైతం నిర్బంధించారు.



బావమరిది కుమార బంగారప్ప

హేళనగా కుమార పోస్టు

తన సోదరుడు, మంత్రి మధు బంగారప్ప, సోదరి గీతాను, గీతా భర్త శివరాజ్‌కుమార్ గురించి సోషల్ మీడియాలో హేళనగా రాశారు. శివరాజ్‌కుమార్ నిరుద్యోగిగా ఉండాల్సిన అవసరం లేదు. మా గ్రామ జాతరలో నృత్యం చేసే పనికి దరఖాస్తు వేసుకోవచ్చని ఎద్దేవా చేశారు. నా చెల్లెలు గీతా.. సినిమా డ్యాన్సర్ కాబట్టి ఊరికే ఉండాల్సిన పని లేదు. దొడ్డమనె వ్యవహారం చాలా ఉంటుంది. వేరేవారికి అవకాశం లభించరాదు. బెదిరించడం, భయపెట్టడం, హుషార్ అనే మాటలు ఏమున్నా గొంతు లోపలే, నాలుగు గోడల లోపలే ఉండాలి. మా సైన్యం ఆన్‌లోనే ఉంటుంది అని హెచ్చరికలు చేశారు.



శివ రాజ్‌కుమార్- గీత దంపతులు

రాత్రివేళ హాహాకారాలు

- మైసూరులో క్లోరిన్ గ్యాస్ లీక్
- 50 మందికి పైగా తీవ్ర అస్వస్థత



బాధితులకు ఆస్పత్రిలో చికిత్స అందజేస్తున్న దృశ్యం, పలువురికి ఆక్సిజన్ ఇచ్చారు

మైసూరు: మైసూరులోని పాతకేసెరెలో వరుణ కాలువ వద్ద శుక్రవారం రాత్రి హానికారక గ్యాస్ లీక్ అయిన ప్రమాదంలో సుమారు 50 మందికి పైగా ప్రజలు అస్వస్థతకు గురయ్యారు. ఓ గుజరి షాపు యజమాని, కార్మికుల నిర్లక్ష్యం వలన ఈ ప్రమాదం జరిగింది. అనూహ్యంగా జరిగిన సంఘటనతో ఆ ప్రాంత వాసులు నానా ఇబ్బందులు పడ్డారు.

గుజరీలో సిలిండర్లు కట్..

వివరాలు.. వరుణ కాలువ వద్దనున్న మహ్మద్ అనే వ్యక్తి గుజరి షాపు నడుపుతున్నారు. మూడు నెలల క్రితం దావణగెరె నుంచి కొంత గుజరి తీసుకొచ్చాడు. ఇందులో కొన్ని క్లోరిన్ వాయువుతో కూడిన సిలిండర్‌లు కూడా ఉన్నాయి. శుక్రవారం రాత్రి సిలిండర్‌లను కార్మికులు ముక్కలుగా కత్తిరించసాగారు. ఆ సమయంలో క్లోరిన్ వాయువు లీకై చుట్టుపక్కల వ్యాపించింది. కొన్ని క్షణాల్లోనే పరిసరాల్లో ఘాటైన వాసన వ్యాపించి ప్రజలు ఊపిరి ఆడకుండా ఇబ్బందులు పడ్డారు. దగ్గు, తలనొప్పి, వాంతులు, ఎదలో నొప్పి, కళ్లు తిరుగుతున్నాయంటూ ఎక్కడివారక్కడే పడిపోయారు. ఏం ఉపద్రవం జరిగిందోనని అందరూ తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

ఆస్పత్రులకు తరలింపు

రఫి, అర్షద్, సుహైల్ పాషా, సుల్తాన్, షాబాజ్, వహీద్, సల్మా బాను, ఆస్మా బాను, ఆయేషా బాను, నోమాన్, సజ్మా తదితరులు తీవ్రంగా అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబీకులు, స్థానికులు కలిసి వారిని కేఆర్‌తో పాటు సమీప ఆస్పత్రులకు తరలించారు. విషయం తెలిసి వైద్యులు, అంబులెన్సుల్లో అక్కడికి చేరుకున్నారు. ప్రస్తుతం వారికి ఆస్పత్రుల్లో చికిత్స కొనసాగుతోంది. కొన్ని గంటల వరకూ అక్కడ క్లోరిన్ వాసన ఇబ్బంది పెట్టింది. నరసింహరాజు పోలీసులు గుజరి యజమానిపై కేసు నమోదు చేశారు.



క్లుప్తంగా

ఆధ్యాత్మిక ప్రవచనకారులకు అవార్డులు



గౌరవ పురస్కారం అందుకున్న ధర్మప్రచారకర్తలు

రాయచూరు రూరల్: మానవ కళ్యాణ కోసం ఆధ్యాత్మిక రంగంలో భారతీయ సనాతన, సంప్రదాయాల గురించి ధర్మ ప్రవచనం చేసిన ప్రచారకర్తలు బిందా సింగబాళ, అంజలి గాడ్గిల్‌కు జూన్ 5న ఫ్రాన్స్ సెనేట్‌లో భారత్ గౌరవ అవార్డులను అందించారు. పార్లమెంట్ ఉపాధ్యక్షుడు డొమినిక్ థియోపాల్, సభ్యులు ఫెడరల్ బౌవెల్, బాలాజీ ట్రస్ట్ అధ్యక్షుడు నరేష్ పూరి మహరాజ్, సంస్కృతి యువ సంస్థ అధ్యక్షుడు సురేష్ మిశ్రాలున్నారు.

అవినీతికి బాధ్యతగా రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న హన్మంతప్ప నాయక్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్ల అవినీతికి బాధ్యతగా రాజీనామా చేయాలని అఖిల కర్ణాటక వాల్మీకి సంఘం అధ్యక్షుడు హన్మంతప్ప నాయక్ పేర్కొన్నారు. శనివారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి మండలి అధ్యక్షుడు, గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్, తెలంగాణ కాంగ్రెస్ ఎన్నికల ఇంచార్జి, మంత్రి ఎన్ఎస్ బోసురాజులపై క్రిమినల్ కేసు నమోదు చేసి రాజీనామా చేయాలని కోరడాన్ని తప్పుబట్టారు.

నేటి నుంచి రాయచూరు ఉత్సవాలు



మాట్లాడుతున్న లక్ష్మణ్

రాయచూరు రూరల్: నగరంలో ఆదివారం నుంచి మంగళవారం వరకు రాయచూరు చారిత్రక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర శామియాన, డెకరేటర్స్ సౌండ్, పబ్లిసిటీ క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. శనివారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం కార్యక్రమాలను ఆర్డీఏ అధ్యక్షుడు రాజశేఖర్ రామస్వామి ప్రారంభిస్తారన్నారు. సోమ, మంగళవారం కార్యక్రమాల్లో స్వామీజీలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. ప్రభుత్వం శామియాన, డెకరేటర్స్, సౌండ్, పబ్లిసిటీ క్షేమాభివృద్ధి సంఘాన్ని కార్మిక శాఖ ఆధీనంలో చేర్చి తమను గుర్తించి ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి శామియాన, డెకరేటర్స్, సౌండ్, పబ్లిసిటీ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు.

భారీ వర్షాలతో ఆల్మట్టికి వరద

రాయచూరు రూరల్: గత వారం రోజుల నుంచి మహారాష్ట్రతో పాటు ఉత్తర కర్ణాటక, కళ్యాణ కర్ణాటకలోని కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో విస్తారంగా వానలు కురుస్తుండడంతో ఆల్మట్టి జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతున్నాయి. ఉత్తర కర్ణాటకలోని బెళగావి, బాగల్‌కోటె, విజయపుర జిల్లాల్లో కృష్ణా నదీ తీర ప్రాంతంలోని ఉప నదుల్లో కూడా వరద మొదలైంది. ప్రస్తుతం ఆల్మట్టి డ్యాంకు ఇన్‌ఫ్లో రూపంలో 2.578 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నాయి. కృష్ణా నది జన్మ స్థానం మహాబలేశ్వర్‌లోనూ ఇటీవల అధికంగా వర్షాలు కురిశాయి.

అపరిశుభ్రంగా ఏపీఎంసీ యార్డు



వ్యర్థాలు, చెత్తాచెదారంతో నిండిన ఏపీఎంసీ పరిసరాలు



ఏపీఎంసీలో అధ్వానంగా, బురదమయమైన రోడ్లు

- బురదలోనే కూరగాయలు, పండ్ల అమ్మకాలు
- రైతులు, వ్యాపారులకు తప్పని తీవ్ర ఇబ్బందులు
- ఏళ్ల తరబడి పట్టించుకోని పాలకులు, అధికారులు

సాక్షి,బళ్లారి: నగరంలోని ఏపీఎంసీ యార్డు మార్కెట్ అధ్వానంగా మారింది. వర్షం వచ్చిందంటే బురదలోనే కూరగాయలు, పండ్ల అమ్మకాలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి ఏపీఎంసీలోని కూరగాయలు, పండ్ల మార్కెట్‌లో అడుగు తీసి అడుగు వేయలేని విధంగా బురదమయంగా మారింది. వర్షాకాలంలో ఏపీఎంసీలో ఆరు నెలల పాటు వ్యాపారులు, రైతులు నరకం అనుభవించాల్సిందే. చిరు జల్లులు పడినా అక్కడ బురదమయంగా మారుతుంది. బురదకు తోడు అక్కడ పందులు, పశువులు విపరీతంగా తిరుగాడటంతో వాటి మధ్యలోనే కూరగాయల అమ్మకాలు సాగిస్తుంటారు. ఏపీఎంసీలో వానాకాలంలో దుర్వాసన వెదజల్లుతుంది. బురద వల్ల విపరీతంగా దోమలు పెరిగిపోవడం వల్ల రాత్రిళ్లు కాదు, పగలు కూడా దోమల వల్ల జనం ఇబ్బందులు పడుతున్నారు. దోమల వల్ల జ్వరాల బారిన పడి పలువురు అస్వస్థతకు గురై ఆస్పత్రుల చుట్టూ తిరుగుతుంటారు.

కరువైన కనీస మౌలిక వసతులు

పరిశుభ్రమైన వాతావరణంలో కూరగాయలు, పండ్ల అమ్మకాలు సాగించాలని అధికారులు, పాలకులు సూచిస్తుంటారు కాని ఆ దిశగా వాటిని అమ్మకాలు చేసేందుకు అనువైన స్థలంలో రోడ్లు, సిమెంట్ కాంక్రీట్ ప్లాట్‌ఫారాలు వేయకపోవడంతో పాటు బురదమయంగా మారుతోంది. శాశ్వత నివారణ చర్యలు చేపట్టడంలో పాలకులు విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బళ్లారి ఏపీఎంసీకి జిల్లాలోని రైతులే కాకుండా చుట్టుపక్కల జిల్లాలైన అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన సరిహద్దు ప్రాంత రైతులు కూడా ఇక్కడకు కూరగాయలు, పండ్లు తీసుకుని వచ్చి అమ్మకాలు సాగిస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధ్వానంగా ఉన్న ఏపీఎంసీ మార్కెట్‌లో కాలం గడుపుతూ ఎన్నాళ్లకు ఏపీఎంసీ మార్కెట్ బాగుపడుతుందో అని ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. నిత్యం పెద్ద ఎత్తున వ్యాపార లావాదేవీలు జరిగే ఏపీఎంసీ అభివృద్ధి గురించి సంబంధిత పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఏపీఎంసీకి వచ్చిపోయే జనంతో పాటు వ్యాపారులకు శాపంగా మారింది.

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా..

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఏపీఎంసీ పరిస్థితి తయారైంది. బురదలో పందులు తిరుగాడి, పొర్లాడిన ప్రాంతంలో కూరగాయలు, ఆకుకూరలు అమ్మకాలు సాగించడం వల్ల వాటిని తీసుకెళ్లిన నగర వాసులు కూడా రోగాలు బారిన పడుతున్నారు. గత్యంతరం లేక వాటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంటోందని ప్రజలు వాపోతున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు ఏపీఎంసీలో సంచరించినప్పుడల్లా అరచేతిలో స్వర్గం చూపించినట్లుగా ఏపీఎంసీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని హామీలు ఇస్తున్నారే కాని అమలు చేయడం లేదని ఏపీఎంసీలో వ్యాపారులు, వినియోగదారులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వచ్చిందంటే వ్యాపారం చేయడానికి వీలు ఉండదని ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి అధ్వానంగా ఉన్న ఏపీఎంసీ ఆవరణను, పరిసరాలను బాగు చేయాలని వ్యాపారులు, నగర వాసులు కోరుతున్నారు.

ఆ డబ్బును తిరిగి ఇవ్వరూ

బనశంకరి: వాల్మీకి అభివృద్ధి మండలి నగదు అక్రమాలలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి జేడీఎస్ లేఖ రాసింది. వాల్మీకి సముదాయానికి చేరాల్సిన వందలాది కోట్ల రూపాయలను మాజీ మంత్రి బి.నాగేంద్ర ద్వారా రాహుల్ గాంధీ తెలంగాణ కాంగ్రెస్ ఎన్నికల ఖర్చుకు తరలించారని ఆరోపించింది. ఆ మేరకు ఎక్స్‌లో లేఖను పోస్ట్ చేసింది. దయచేసి ఆ నగదును వెనక్కి తిరిగి ఇవ్వాలని అందులో డిమాండ్ చేసింది. కాంగ్రెస్ పార్టీ మింగేసిన డబ్బు ఎప్పటికీ వెనక్కి రాదని తమకు తెలుసని, కానీ చివరి ప్రయత్నంగా మీకు విన్నవిస్తున్నామని, నగదు వెనక్కి ఇవ్వాలని కోరింది.

సైకిల్‌పై జిల్లాధికారి నగర సంచారం



సైకిల్‌పై వీధులను పరిశీలిస్తున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటె: రెండో శనివారం సెలవు రోజు కావడంతో జిల్లాధికారి దివాకర్ సైకిల్‌పై నగరంలోని వివిధ వార్డుల్లో పర్యటించారు. గతవారం నుంచి వర్షాలు కురుస్తుండటంతో రాయబసవ కాలువలో పేరుకొన్న ప్లాస్టిక్ సీసాలు, ఇతర చెత్త చెదారం, వ్యర్థ పదార్థాలను తొలగించాలని పౌర కార్మికులకు సూచించారు. అదే విధంగా ప్రతినిత్యం రోడ్లను మరింత పరిశుభ్రంగా చేసేందుకు అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేయాలని నగరసభ అధికారిని ఆదేశించారు. రోడ్లపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో అపరిశుభ్రతగా ఉన్న మరుగుదొడ్డిని శుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని ఆర్‌టీసీ అధికారులకు సూచించారు. ఆయన వెంట అధికారులు మనోహర్, చంద్రప్ప, ఇంజినీర్ భారతి, నగరసభ సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు విస్తరించాలి

రాయచూరు రూరల్: జిల్లాలో రోటరీ క్లబ్ సామాజిక సేవల విస్తరణకు సభ్యులు కృషి చేయాలని అంతర్జాతీయ రోటరీ క్లబ్ సభ్యుడు కేపీ నాగేష్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలో నూతనంగా ఎన్నికైన రోటరీ క్లబ్ సభ్యులకు రెండు రోజుల శిక్షణ శిబిరాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. రోటరీలో అధికారం, పదవులు ముఖ్యం కాదన్నారు. నిస్వార్థంగా సమాజ సేవ చేయాలనే తపన మనందరిలో మెదలాలన్నారు. కార్యక్రమంలో శివగిరీష్, శివశంకర్, శరణబసవ, రంగలింగనగౌడ, త్రివిక్రం జోషిలున్నారు.

సమన్వయంతో వ్యాధుల బెడద అరికట్టండి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సదాశివప్రభు

హొసపేటె: మలేరియాతో సహా డెంగీ, చికెన్ గున్యా, ఎక్స్ ఫాలిటీస్, ఎలిఫెంటియాసిస్ సహా వివిధ వ్యాధుల నివారణ కోసం ఆరోగ్య శాఖ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు తెలిపారు. జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ కార్యాలయంలోని కేస్వాన్ హాల్‌లో నిర్వహించిన జిల్లాలో వ్యాధుల నియంత్రణపై ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైనందున దోమలు ఇప్పటికే ఎక్కువగా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బ్రెయిన్ ఫీవర్, ఎలిఫెంటియాసిస్ బారిన పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖల సహకారంతో కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాలని ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. విజయనగర జిల్లా మున్సిపల్ కౌన్సిల్ లార్వా, వివిధ మున్సిపాలిటీలు, పట్టణ పంచాయతీ అధికారులు, సిబ్బంది బీటీఐ స్ప్రేయింగ్, టెమిఫాస్ స్ప్రేయింగ్ వంటివి చేయాలన్నారు. దోమలను చంపే ధూమపాన చర్యలకు సంబంధించిన వస్తువుల స్టాక్‌ను ఉంచాలని, ఘన వ్యర్థాలను సరిగ్గా పారవేయాలన్నారు. కాలువల్లో నీరు నిలవకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. మున్సిపల్ కౌన్సిల్ ప్రతి రోజు చెత్త వాహనాలను తుంగలో తొక్కి పట్టణ పంచాయతీలోని వికిరణ వ్యాధులపై ఆడియోలను ప్రదర్శించాలన్నారు. మున్సిపాలిటీలో ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంప్‌ల నిర్మాణం, దోమల వికర్షక వలల ఏర్పాటును ప్రవేశ పెట్టాలన్నారు. నీటి సరఫరా పైపులకు లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

గోవా మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

హుబ్లీ: ధార్వాడ జిల్లాలోని కలఘటిగి పట్టణంలోని యల్లాపుర– కలఘటిగి జాతీయ రహదారిలో డాబా వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న లక్షలాది రూపాయల విలువ చేసే గోవా మద్యాన్ని కలఘటిగి పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు కలఘటిగి పోలీసులు ఓ కారులో తరలిస్తున్న వివిధ బ్రాండ్ల అక్రమ గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకొని జగదీశ్ సోడా, ప్రతాప్ అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో పోలీస్ మహంతేష్ గౌడ, గోపాల్ పిరగి, రవిపూజార్ లోకేశ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. కాగా నిందితులను పట్టుకున్న పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

హుబ్లీ: వీరశైవ ధర్మ పంచపీఠాల్లో ప్రముఖమైన ఉత్తరప్రదేశ్ కాశీ జ్ఞానపీఠంలో శతాబ్దాల చరిత్ర కలిగిన జగద్గురు విశ్వారాధ్య గురుకుల పాఠశాలలో ప్రస్తుతం విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. కాశీ జ్ఞానపీఠం సీనియర్ జగద్గురువు డాక్టర్ చంద్రశేఖర శివాచార్య భగవత్పాదులు, చిన్న జగద్గురువు డాక్టర్ చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య భగవత్పాదుల సంకల్పం మేరకు విద్యాభ్యాసానికి అవకాశం కల్పించారు. సంబంధిత గురువులు, ప్రముఖ విద్వాంసులు సదరు జ్ఞానపీఠం ద్వారా వివిధ సేవల్లో కీలక పాత్ర వహిస్తున్నారు. ప్రధాని మోదీ ఈ గురుకులంలో శతాబ్ది ఉత్సవాలను గతంలో ప్రారంభించారు. ఈ గురుకులంలో హిందీ, సంస్కృత భాషలతో పాటు భారతీయ ప్రాచీన శాస్త్రాలు న్యాయం, వ్యాకరణం, వేదాంతం, సాహిత్యం తదితర విషయాలపై నిపుణులైన విద్వాంసులు బోధిస్తారు. విశ్వవిద్యాలయాల్లో అధ్యయనం, అధ్యాపన కోసం నిర్దిష్ట పరిచిన పాఠ్యాంశాలను గురుకులంలో బోధిస్తారు. ఆసక్తిగల వారు బెళగావి జిల్లా చిక్కోడిలోని శ్రీ శైల శాస్త్రిని 9008967789 నెంబరులో సంప్రదించాలని, జూలై 2న జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కాశీపీఠం మేనేజర్ శివానంద హిరేమఠ తెలిపారు.

మారువేషంలో ప్రజలకు టోకరా



పోలీస్ అధికారిగా మారువేషంలో ఉన్న వ్యక్తి

రాయచూరు రూరల్: సైబర్ నేరగాళ్లను నమ్మవద్దని పోలీసులు ప్రజలకు పలు మార్లు ప్రచారం చేసి హెచ్చరించినా డబ్బుకు ఆశ పడి మోసపోయిన ఉదంతం బయట పడింది. మొబైల్ ఫోన్ నుంచి మీపై ఫలానా స్టేషన్‌లో కేసు నమోదు అయిందని ఫోన్ ద్వారా సమాచారం చేరవేస్తాడు. భయపడిన ప్రజలు స్టేషన్, గొడవలు వద్దంటూ దూరంగా ఉన్నా ఫోన్ చేసి పోలీసుల పేరుతో రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్న వైనం అధికమైంది. రాయచూరులోని హరిజనవాడకు చెందిన కృష్ణ అనే వ్యక్తి నుంచి రూ.30 వేలు, తెలంగాణలోని నిజామాబాద్‌లో విష్ణు సేట్ వద్ద నుంచి రూ.50 లక్షలు తీసుకున్నట్లు సమాచారం. ఫోన్ కాల్ పేరుతో పోలీస్ దుస్తులు ధరించి స్టేటస్‌లో చూపించి ఈ నంబర్‌కు ఫోన్‌పే చేయాలని సూచిస్తున్నారు. సైబర్ నేర పరిశోధన అధికారుల విచారణలో లొకేషన్‌లో హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, కరీంనగర్, కర్నూలు వంటి ప్రాంతాలను చూపిస్తుందని ఎస్పీ నిఖిల్ వెల్లడించారు.

కోలారు వార్తలు...

ఆర్‌సీహెచ్ డాక్టర్‌కు వీడ్కోలు



విజయకుమారికి వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

కోలారు : జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో ఆర్‌సీహెచ్ డాక్టర్‌గా విధులు నిర్వహించి నివృత్తి పొందిన డాక్టర్ విజయకుమారికి శనివారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సన్మానం అందుకుని ఆమె మాట్లాడుతూ వైద్య వృత్తి తనకెంతో సంతృప్తినిచ్చిందన్నారు. వృత్తి జీవితంలో తనకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ ప్రసన్న, డాక్టర్ ఏవీ నారాయణస్వామి, డాక్టర్ విజేత దాస్ తదితర సిబ్బంది ఉన్నారు.

పిల్లల్లో సేవాభావం పెంచాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: విద్యార్థుల్లో శాస్త్రీయ మనోభావం, సేవా భావాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని సూలూరు జీపీ అధ్యక్షుడు పెమ్మశెట్టిహళ్లి సురేష్ తెలిపారు. శనివారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బెళ్లూరు రమామణి అయ్యంగార్ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి నిర్వహించిన జాతీయ సేవా శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులను పాఠాలకే పరిమితం చేయకుండా వారిలో సంస్కారం, శారీరక శ్రమ పెంచాలన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సంయోజకుడు గజేంద్ర, జీపీ సభ్యురాలు గాయత్రమ్మ మునిరెడ్డి పాల్గొన్నారు.

సంస్థ సమాజ సేవ శ్లాఘనీయం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: వీరేంద్ర హెగ్డే నేతృత్వంలోని శ్రీక్షేత్ర ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు శ్లాఘనీయమని సంస్థ బెంగళూరు విభాగం రీజినల్ డైరెక్టర్ శీనప్ప తెలిపారు. శనివారం నగరంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన పదాధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంస్థ చేపడుతున్న అనేక సామాజిక సేవా కార్యక్రమాలను సక్రమంగా అమలు చేయడం కోసం కమిటీని ఏర్పాటు చేశారన్నారు. సమాజంలో శాంతి సామరస్యాలు నెలకొనడానికి, ప్రజలను ఆర్థికంగా ముందుకు తీసుకు రావడానికి వీరేంద్ర హెగ్డే ప్రయత్నిస్తున్నారన్నారు. మహాత్మాగాంధీ కలలు కన్న రామరాజ్యం నెలకొల్పడానికి గ్రామీణాభివృద్ధి సంస్థ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బెంగళూరు ప్రాదేశిక విభాగం ప్రణాళికాధికారి తిమ్మయ్య నాయక, కోలారు జిల్లా జనజాగృతి వేదిక అధ్యక్షుడు వాసుదేవ్, ఉపాధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దారి సరిచేయాలని నిరసన



దారిలో నిలిచిన నీటిలోకి దిగి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కోలారు: ఇటీవల కురిసిన వానలకు బంగారుపేట తాలూకా మాగేరి గ్రామానికి వెళ్లే దారిలో నీరు నిలవడంతో వెంటనే దారికి మరమ్మతులు చేసి సరిచేయాలని గ్రామస్తులు మోకాలి లోతు గుంతలో దిగి నిరసన తెలియజేశారు. వర్షం నీరు వెళ్లే కాలువను మూసివేయడం వల్ల దారి గుంతలమయమై వర్షం నీరు నిలిచి సంచారానికి తీవ్ర ఆటంకం కలుగుతోందన్నారు. అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరిచి దారికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

రోడ్డు భద్రతపై జాగృతి జాతా



జాగృతి జాతాను ప్రారంభిస్తున్న దృశ్యం

కేజీఎఫ్ : రోడ్డు భద్రతపై జిల్లా పోలీసులు శనివారం నగరంలో జాగృతి జాతా నిర్వహించారు. రాబర్ట్‌సన్‌పేట సీఐ రామకృష్ణయ్య మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలన్నారు. అతివేగంగా వెళ్లడాన్ని మానుకోవాలన్నారు. బైక్ వీలింగ్, ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించడం వంటివి చేయకూడదన్నారు. ద్విచక్రవాహనాల్లో ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. జాగృతి జాతాను బస్టాండు, రాబర్ట్‌సన్ పేట, ఆండర్‌సన్ పేట సర్కిల్‌లతో పాటు తాలూకాలోని క్యాసంబళ్లి గ్రామంలో ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది నిర్వహించారు.



శ్రీ సత్యసాయి సహస్ర నామార్చనను పఠిస్తున్న భక్తులు



నృత్య ప్రదర్శనలోని ఘట్టాలు







సాయి ప్రేమ అనంతం

- చిన్నారుల నృత్యనీరాజనం

ప్రశాంతి నిలయం: సర్వ దేవతల భక్తిగీతాలను ఆలపిస్తూ చక్కటి నృత్యరీతులతో బాలవికాస్ చిన్నారులు మైమరిపింపజేశారు. సాయి ప్రేమ అనంతం పేరుతో అనంతపురం జిల్లాకు చెందిన 2,500 మంది సత్యసాయి భక్తులు పర్తియాత్ర పేరుతో ప్రశాంతి నిలయానికి విచ్చేశారు. రెండు రోజుల పర్తియాత్రలో భాగంగా సత్యసాయి సన్నిధిలో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 1008 నామాలతో శ్రీ సత్యసాయి సహస్రనామార్చన చేశారు. చక్కటి భక్తిగీతాలు ఆలపిస్తూ నృత్య ప్రదర్శన నిర్వహించారు. చిన్నారుల నృత్య ప్రదర్శనతో భక్తులు పరవశించిపోయారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే వేషధారణలో విద్యార్థుల నృత్య ప్రదర్శన మంత్రముగ్ధుల్ని చేసింది.

చెట్ల వినాశనం భవితకు ప్రమాదకరం



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

శ్రీనివాసపురం: మనకు అవసరమైన ఆక్సిజన్ అందిస్తున్న చెట్లను నాశనం చేసుకుంటూ వెళితే భవిష్యత్తు తరాలు అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని పోలీస్ ఇన్‌స్పెక్టర్ గౌరవనహళ్లి తెలిపారు. శనివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వేణు విద్యాలయ విద్యార్థులతో పట్టణ ప్రజలకు మొక్కలను పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని మొక్కలను నాటడం ద్వారా నిత్యం నిర్వహించాలన్నారు, ప్రపంచ పర్యావరణ దినోత్సవ ఔన్నత్యం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకుని మొక్కలను నాటి పెంచి పోషించడం పరిపాటిగా చేసుకోవాలన్నారు. మానవాళితో పాటు ఇతర ప్రాణి పక్షులకు ఆక్సిజన్ ఎంతో అవసరం అన్నారు. ఇలాంటి ప్రాణ వాయువును మనకు అందిస్తున్న చెట్లను సంరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ పరిసరాల పట్ల తగినంత అవగాహన కలిగి పర్యావరణ రక్షణకు కట్టుబడాలన్నారు.ఈ సందర్భంగా ఎస్ఐ డీ.నారాయణప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవుల నాశనంతో కరువు తాండవం

కేజీఎఫ్: అడవుల నాశనంతో సమయానికి సరిగా వానలు కురవక కరువు తాండవిస్తోందని సామాజిక అటవీశాఖ అధికారి మంజునాథ్ తెలిపారు. అడవుల అభివృద్ధి ప్రాధాన్యతను గుర్తించి శనివారం చేపట్టిన అరణ్యీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. జెడ్పీ, టీపీ సహకారంతో సామాజిక అటవీ సంరక్షణ పథకంలో భాగంగా అరణ్యీకరణ చేపట్టినట్లు చెప్పారు. మనిషి దురాశతో అడవులు మాయమై వాటి స్థానంలో కాంక్రీట్ ఆవరించుకుంటోందన్నారు. ఈ పరిస్థితి నివారణ కోసం అటవీశాఖ సిబ్బంది శ్రమ వహించి అరణ్యీకరణతో ఉత్తమ పరిసరాలను నిర్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నగరంలోని కోరమండల్, బాలఘట్ట కాలనీల పక్కన ఉన్న బీజీఎంఎల్ కంపెనీకి చెందిన ప్రాంతంలో అధికారుల అనుమతితో 40 హెక్టార్ల విస్తీర్ణంలో వివిధ రకాల మొక్కలను నాటి పోషిస్తున్నారన్నారు. రెండేళ్ల క్రితం నాటిన 7 వేల మొక్కలు నేడు పెద్ద చెట్లుగా మారి ప్రాణులు, పక్షులకు నీడనిస్తున్నాయన్నారు. జింకలు, నెమళ్లకు నీటిని అందించడానికి చెట్ల నీడన గుంతలను తవ్వి వాటిలో నీటిని నింపుతున్నారన్నారు. చెట్లు, మొక్కల సంరక్షణ కోసం అటవీశాఖ సిబ్బంది అహర్నిశలు కాపలా కాస్తున్నారన్నారు.



మొక్కలను నాటుతున్న అటవీశాఖ అధికారులు

క్లుప్తంగా

పేపర్ బాయ్ గణేష్ మరో అద్భుత సాధన



బాగేపల్లి: బాగేపల్లిలో పేపర్ బాయ్‌గా పని చేస్తున్న గణేష్ మరో విజయం అందుకున్నారు. పట్టణంలో ఇంటింటికి వార్త పత్రికలను చేరవేయడం ద్వారా ఆయన పేపర్ గణేష్‌గా పేరు పొందాడు. నిరుపేద కుటుంబంలో పుట్టిన గణేశ్‌కు చిన్న వయసులోనే తండ్రి మరణించాడు. రెండేళ్ల క్రితం బీఏలో 5వ ర్యాంకు సాధించిన గణేశ్ ఎంఎస్‌డబ్ల్యులో 4వ ర్యాంకు సాధించాడు. ప్రతిభకు పేదరికం అడ్డు కాదని, కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించాడు.

పంటల బీమా పరిహారానికి చర్యలు తీసుకోవాలి

శివాజీనగర: గత ఏడాది కరువు కారణంగా పంటల దెబ్బతిన్న దృష్ట్యా పరిహారం కోసం బీమా కంపెనీలతో సంప్రదింపులు చేయాలని వ్యవసాయ మంత్రి ఎన్.చలువరాయస్వామి అధికారులకు సూచించారు. శనివారం వికాససౌధలో జలవనరుల శాఖ, రాష్ట్ర విత్తన మండలి, వ్యవసాయ అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఖరీఫ్‌కు పంటల బీమా నమోదుకు రైతుల్లో జాగృతి కల్పించాలని అన్నారు.

ఇజ్రాయేల్ ప్రతినిధులతో చర్చలు:
కొత్త వ్యవసాయ విధానాలపై వ్యవసాయ మంత్రి చెలువరాయస్వామి ఇజ్రాయేల్ దేశ ప్రతినిధులతో సమాలోచనలు జరిపారు. వాతావరణ మార్పులు, నీరు పరిమిత వినియోగం, శాస్త్రీయ వ్యవసాయ తదితర విషయాలపై మంత్రి చర్చించారు. ఇజ్రాయేల్ దేశపు ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



దాతలను సన్మానించిన దృశ్యం

గౌరిబిదనూరు: విద్యార్థులు దాతలు అందించే సహాయ సహకారాలతో ఉత్తమ విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని బెంగుళూరు జేబీఎం ఒగిహోరా కంపెనీ అధికారి వెంకటేశ్ తెలిపారు. శనివారం తాలూకా నక్కలపల్లి గ్రామంలోని ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో బెంగుళూరు జెబిఎం ఒగిహోరా కంపెనీ అధికారులు అందించిన ఉచిత నోటు పుస్తకాలను వితరణ చేసి మాట్లాడారు. గ్రామీణ విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, తల్లి తండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా దాతలు అరుణ్ కుమార్, వెంకటేశ్‌లను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్యోపాధ్యాయులు జయప్రకాశ్, నాగరాజప్ప, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

15న తెలుగు పాస్టర్లు, సంఘ పెద్దల సమావేశం

శివాజీనగర: నగరంలోని వినాయకనగర, విద్యారణ్యాపురలో ఉన్న గాడ్స్‌గ్రేస్ బాప్టిస్ట్ చర్చిలో ఈ నెల 15న కర్ణాటక తెలుగు క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో తెలుగు పాస్టర్ల, సంఘ పెద్దల సమావేశం జరుగనుందని కేటీసీఎంఎఫ్ సంస్థాపక అధ్యక్షుడు బిషప్ రెవరెండ్ ఎం.బెంజిమన్, ప్రధాన కార్యదర్శి రెవరెండ్ వీ.సోలోమన్, కోశాధికారి రెవరెండ్ ఏ.జీ.జయానందం శనివారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. బెంగళూరు, కోలార్, చిక్కబళ్లాపుర తదితర జిల్లాల్లో సేవలందిస్తున్న పాస్టర్లను ఆధ్యాత్మికంగా బలపరచాలనే ఉద్దేశ్యంతో కేటీసీఎంఎఫ్ పని చేస్తున్నట్లు తెలిపారు. శనివారం జరిగే పాస్టర్ల సమావేశంలో ప్రసంగీకులు డాక్టర్ రెవరెండ్ ఎఫ్రాతా సారథి దైవ వర్తమానాన్ని వినిపిస్తారని తెలిపారు.

యువకుడికి దేహశుద్ధి



యశవంతపుర: ప్రైవేట్ బస్సులో యువతితో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడికి దేహశుద్ధి చేసిన ఘటన మంగళూరు బల్లాళ్‌బాగ్ వద్ద శనివారం జరిగింది. నాగనూరు నుంచి బస్సు ఎక్కిన యువతి వెనుక సీట్లో కుర్చొని ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు ఫోన్‌లో తమ బంధువులకు సమాచారం ఇచ్చింది. బల్లాల్‌బాగ్ వద్ద బస్సు దిగుతుండగానే యువతి వైపు వారు యువకుడిని పట్టుకుని చితకబాది పాండవేశ్వర పోలీసులకు అప్పగించారు.

రౌడీ హత్య కేసులో నలుగురి అరెస్ట్



అరెస్టయిన నిందితులు

యశవంతపుర: హాసనలో నటోరియస్ రౌడీ రవికుమార్ అలియాస్ చైల్డ్ రవి హత్య కేసులో నిందితులను ప్రీతమ్, కీర్తి, రంగనాథ్ అలియాస్ రంగ, అమిత్ అలియాస్ అమ్మిలను పోలీసులు అరెస్ట్ చేశారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వచ్చిన మూడో రోజున రౌడీ చైల్డ్ రవిని కారులో వెంబడించి హత్య చేశారు. పాతకక్షలు కారణంగా హత్య చేసినట్లు పోలీసుల విచారణలో బయట పడింది. ఆధిపత్యం కోసం హత్య చేసిన్నట్లు తెలిసింది.

విధి వంచిత బాలల ఆత్మబంధువు

- బుద్ధిమాంద్య పిల్లలను అక్కున చేర్చుకుంటున్న పుట్టరామారాధ్య
- పాతికేళ్లు పూర్తి చేసుకున్న శ్రీ శారదామాత ప్రత్యేక పాఠశాల
- ప్రత్యేక బాలలకు విద్యాబుద్ధులు



బాలలకు యూనిఫారమ్, నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న పుట్టరామారాధ్య



పాఠశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పిల్లలతో తల్లిదండ్రులు

శివాజీనగర: వయసు పెరిగినా వాళ్లింకా పసివాళ్లే, ఆకలి దప్పుల గురించి నోరు తెరచి చెప్పలేరు. అలాంటి విధి వంచిత బాలలను అక్కున చేర్చుకుని ప్రేమ ఆప్యాయతలను చూపిస్తున్నారు బెంగళూరు శివాజీనగరలోని పుట్టరామారాధ్య. శ్రీ శారదామాత ప్రత్యేక పాఠశాల అంధకార బతుకుల్లో వెలుగులు నింపే ప్రయత్నం చేస్తోంది. బుద్ధిమాంద్యం, అంగవైకల్యంతో బాధపడే వారి బాగోగులు చూడటానికి తల్లిదండులే సుముఖంగా లేని రోజుల్లో అటువంటి వారికి విద్యా బుద్ధులు అందించడానికి శ్రమిస్తున్నాడు ఓ మహానుభావుడు. విధివంచిత బాలల కోసం శివాజీనగర నియోజకవర్గ పరిధిలోని రామస్వామి పాళ్యార్డులో ఒక ప్రత్యేక పాఠశాలను నడుపుతున్నారు. అంతే కాదు వారికి అవసరమైన వైద్య సౌకర్యాలూ కల్పిస్తున్నారు. ఆయనే పుట్టరామారాధ్య.

సేవా నిరతి:
కన్నడ భాషలో ఎంఏ పూర్తి చేసిన పుట్టరామారాధ్య తొలుత పాత్రికేయుడిగా పనిచేశారు. తరువాత కొద్ది కాలం వ్యాపారం చేశారు. అవేవీ ఆయనకు సంతృప్తి నివ్వలేదు. సమాజానికి తనవంతు సహాయపడాలని నిర్ణయించుకున్నారు. బుద్ధిమాంద్యం, అంగవైకల్యంతో బాధపడుతున్నవారి బాగోగులు చూడాలని, వారు సొంత కాళ్లపై నిలబడేలా విద్యాకుసుమాలు అందించాలని సంకల్పించారు. 1998లో నగరంలోని జయమహల్‌లో 49 మంది విద్యార్థుల్లో 13 మంది ఉపాధ్యాయులను నియమించి శ్రీ శారదామాత ప్రత్యేక బాలల పాఠశాలను ప్రారంభించారు. ఈ పాఠశాలకు చామరాజపేట, బసవేశ్వనగర్, నందిని లేఔట్, ముద్దమ్మగార్డన్, ఎం.ఆర్.ఎస్.పాళ్య తదితర ప్రాంతాల నుంచి పాఠశాలకు మూగ, చెవిటి, బుద్ధిమాంద్య, అంగవైకల్య బాలలను తల్లిదండ్రులు తీసుకొచ్చేవారు. ఇందుకోసం వాహనాలను ఏర్పాటు చేశారు. ఆ తరువాత ముద్దమ్మగార్డెన్‌లో పాఠశాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ పాఠశాలను ఏర్పాటు చేసి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంది.

ప్రత్యేక విద్యాబోధన:
ప్రస్తుతం పాఠశాలలో ఎల్‌కేజీ నుండి ఏడవ తరగతి వరకు విద్యా బోధన సాగుతోంది. సుమారు 60 మంది పిల్లలు ఉన్నారు. వీరికి ఉదయమే 9 గంటలకు ప్రార్థనతో పాఠశాల ఆరంభమవుతుంది. మధ్యాహ్నం 3 గంటలకు ముగుస్తుంది. మధ్యాహ్నం భోజనం స్కూల్లోనే అందజేస్తున్నారు. బోధన విషయానికి వస్తే ప్రత్యేక బాలలు కాబట్టి వారిలోని చైతన్యశక్తిని పెంచేలా ఉంటుంది. నడవడిక, ఇతరులను పలకరించడం, అక్షరాలు, బొమ్మలను గుర్తించడం తదితరాల బోధన ప్రత్యేకరీతిలో సాగుతోంది.

సిబ్బంది సేవాతత్పరత:
సంస్థలో చేరే పిల్లల మానసిక పరిస్థితులను డాక్టర్లతో పరీక్షించిన అనంతరం పాఠశాలలో చేర్చుకుంటారు. ప్రస్తుతం పాఠశాల నిర్వహణకు నెలకు వేలాది రూపాయలు ఖర్చు పెడుతూ వస్తున్నారు. ఉపాధ్యాయులకు, సిబ్బంది కూడా పెద్ద మనసుతో నామమాత్రపు జీతాలు తీసుకొంటూ అభాగ్య బాలలకు చదువు, వృత్తిశిక్షణ ఇస్తున్నారు. గత 25 ఏళ్లకు పైగా పాఠశాల నిర్వహణలో ఆయన ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారు. వీరికి విద్యాబుద్ధులు నేర్పటానికి ఆరుగురు ఉపాధ్యాయులు ముగ్గురు ఆయాలు ఉన్నారు. బుద్ధిమాంద్య బాలలు ఎక్కడ ఉన్నా ఈ పాఠశాల ఉపాధ్యాయులు వెళ్లి తమ బడిలో చేర్పించాలని అడుగుతారు. ప్రతి వేసవి సెలవుల్లో ఇంటింటికి వెళ్లి అలాంటి బాలలు ఉన్నారా? అని ఆరా తీస్తారు.

ఆ పిల్లలే తమ పిల్లలుగా...
విద్యార్థులను పూర్తి స్థాయిలో తీర్చిదిద్దాలంటే ప్రభుత్వ సహాయంతో పాఠశాల దాతల సహాయం కూడా చాలా అవసరమని పుట్టరామారాధ్య అన్నారు. కొందరు దాతలు, ప్రభుత్వం ఇచ్చే సాయమే పాఠశాలకు ఊతం. అయితే ఈసారి గత కొన్ని నెలలు ప్రభుత్వ సాయం అందకపోవటంతో అధికారులు చుట్టూ తిరుగుతూ పుట్టరామారాధ్య నానా అవస్థలు పడుతున్నారు. తక్షణమే ప్రభుత్వ నిధులు విడుదల చేసి పాఠశాల కుంటుపడకుండా చూడాలని ఆయన కోరుతున్నారు. భర్తకు చేదోడు వాదోడుగా ఉన్న సంస్థ అధ్యక్షురాలు లీలావతమ్మ ఇటీవల మరణించారు. వీరికి సంతానం లేదు. అయినా పాఠశాలకు వచ్చే పిల్లలనే తమ పిల్లలుగా చూసుకొంటున్నారు. చుట్టు పక్కల ప్రాంతాలవారు ముద్దమ్మ గార్డెన్, 4వ క్రాస్, ముద్దమ్మ గార్డెన్ ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పుట్టరామారాధ్య కోరుతున్నారు.



పాఠశాలకు వచ్చిన బుద్ధిమాంద్య విద్యార్థిని



పాఠశాల నిర్వాహకుడు పుట్టరామారాధ్య



పాఠశాల వార్షికోత్సవంలో బుద్ధిమాంద్య పిల్లలతో సాంస్కృతి కార్యక్రమాలు

రెండు కార్లు ఢీ.. ఒకరి మృతి

యశవంతపుర: జాతీయ రహదారి 206లో రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. శివమొగ్గ జిల్లా సాగర తాలూకాలో శనివారం ఈ ఘటన జరిగింది. భద్రావతికి చెందిన అజయ్ (21) మృతి చెందారు. సాగర తాలూకా ఉళ్లూరు సమీపంలోని మంచాలె గ్రామం వద్ద సాగరకు చెందిన సయ్యద్ నూరుల్లా సాగరకు కారులో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఓమ్ని వ్యాన్ ఢీకొంది. దీంతో వ్యాన్‌లో ఉన్న అజయ్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదం యువకుడు...
బస్సు– బైకు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన బెళగావి తాలూకా ఖనగాంవ గ్రామంలోజరిగింది. సుళేబావికి చెందిన లోక (29) మృతుడు. బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బస్సు బోల్తా పడింది. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. బైకిస్టు మృతి చెందాడు. మారిహాళ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కారు దగ్ధం



మంటలను అర్పుతున్న పోలీసులు

యశవంతపుర: నడుస్తున్న కారులో ఆకస్మికంగా మంటలు చెలరేగి వాహనం మొత్తం కాలి బూడిదైన ఘటన చిక్కమగళూరు జిల్లా కడూరు తాలూకా సరస్వతిపురగేటు వద్ద జరిగింది. చిక్కమగళూరు నుంచి హుబ్లీకి వెళ్తున్న స్విఫ్ట్ కారు సరస్వతిపుర గేట్ వద్దకు రాగానే ఒక్కసారి మంటలు కనిపించాయి. దీంతో డ్రైవర్ అప్రమత్తమై కారును రోడ్డు పక్కలో నిలిపి వేయడంతో కారులోని నలుగురు బయట పడ్డారు. సమాచారం అందుకున్న కడూరు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి వచ్చేలోపే కారు మొత్తం కాలిపోయింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు తెలిసింది.

దొంగ అరెస్ట్

మైసూరు: మైసూరు నగరంలోని ఓ కళ్యాణ మండపంలో ఓ మహిళ నుంచి బంగారు నగలు చోరీ చేసిన దొంగను నగరంలోని నజరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ. 4.75 లక్షల విలువైన నగలు స్వాధీనం చేసుకున్నారు. గతనెల 31న సిద్ధార్థ నగరలోని కనక భవనం చౌల్ట్రీలో వ్యానిటీ బ్యాగ్‌లో ఉన్న బంగారు నగలు చోరీ అయ్యాయి. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు.

దుకాణాలు ఆహుతి



కాలిపోతున్న దుకాణాలు

యశవంతపుర: ఆకస్మికంగా మంటలు ఏర్పడి ఐదు దుకాణాలు కాలిపోయిన ఘటన హావేరి జిల్లా హిరేకెరూరు తాలూకా చిక్కేరూరు గ్రామంలో జరిగింది. ఎలెక్ట్రిక్ దుకాణం, బేకరి, బాంబే దుకాణం, చెప్పులు షాపు, హోటల్ కాలి బూడిదయ్యాయి. మంటలు పెద్ద ఎత్తున చెలరేగడంతో చుట్టుపక్కల వారిలో భయాందోళన నెలకొంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. స్థానిక ఎమ్మెల్యే యుబి బణకార్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. హంసభావి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించినా ఓడించారు



మాట్లాడుతున్న మరితిబ్బెగౌడ

మండ్య: మండలి ఎన్నికల్లో నాలుగుసార్లు విజయం సాధించి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానని, అయినా కూడా తనను ఓడించారని దక్షిణ ఉపాధ్యాయ నియోజకవర్గం ఓటమి పాలైన కాంగ్రెస్ అభ్యర్థి మరితిబ్బేగౌడ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడ, మాజీ సీఎం కుమార స్వామి మద్దతు లేకుండానే గడిచిన నాలుగుసార్లు శాసన మండలి ఎన్నికల్లో తాను విజయం సాధించానని, ఈ ఎన్నికల్లో వారి ప్రభావం కనిపించలేదని అన్నారు.

కళాకారులకు ప్రాధాన్యత ఇవ్వాలి



భరతనాట్యం చేస్తున్న దృశ్యం

మండ్య: కళలను ప్రోత్సహించి కళాకారులను కాపాడుకోవాలని నటుడు ప్రథమ్ అన్నారు. మండ్య తాలూకా సుండహళ్లి సిద్దయ్యనకొప్పలు గేట్ వద్ద ఉన్న కావేరి టెక్నికల్ మహా విద్యాయం ఆధ్వర్యంలో నిర్వహించిన కావేరి కళాంజలి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ...కన్నడ సినీ కళాకారులు ఇటీవల రోజుల్లో ఇబ్బందులు పడుతున్నారని, కారణం ప్యాన్ ఇండియా అన్నారు. సినిమా రంగంలో కన్నడ కళాకారులకు, ప్రాధాన్యత ఇవ్వడం లేదని, స్థానికేతరులను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. కన్నడ సినిమాలలో మొదటి ప్రాధాన్యత కన్నడ వారికే ఇవ్వాలన్నారు.

దేవాలయంలో చోరీ

పావగడ: పట్టణ పరిధి రొప్పం గ్రామంలోని కంబదూరు మారెమ్మ దేవాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. రాత్రి వర్షం కురుస్తున్న సమయంలో దొంగలు ఆలయ తాళాన్ని పగుల గొట్టి అమ్మవారి మెడలో ఉన్న బంగారు తాళి, నాగపడగలు, వెండి ఆభరణాలు, నగదు దొంగతనం చేశారు. మొత్తం రూ. 2 లక్షల విలువైన ఆభరణాలు చోరీ అయ్యాయని ఆలయ సమితి పదాధికారి రాజేశ్ తెలిపారు. స్థానిక పోలీసులు శనివారం ఉదయం ఆలయాన్ని పరిశీలించి వేలి ముద్రలు సేకరించారు. త్వరలో దొంగలను పట్టుకుంటామని సీఐ సురేశ్ తెలిపారు.

ఆకతాయి అరెస్ట్

యశవంతపుర: అన్యమతానికి చెందిన యువతి ప్రైవేట్ ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాలకు అప్‌లోడ్ చేసి తనను ప్రేమించాలని బ్లాక్‌మెయిల్ చేస్తున్న నిందితుడిని కొడగు సిద్ధాపుర పోలీసులు అరెస్ట్ చేశారు. కొడగు నెల్యాహుదికేరిరి చెందిన అఫ్రీద్ (21)ను ముంబై విమానాశ్రయంలో అరెస్ట్ చేశారు. అఫ్రీద్ ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఆమె అతని ప్రేమను నిరాకరించింది. ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లిన నిందితుడు ఆమెతో కలిసి ఉన్న ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాలలో అప్‌లోడ్ చేశాడు. శుక్రవారం విదేశాల నుంచి ముంబై విమానాశ్రయంలో దిగుతుండగానే పోలీసులు అరెస్ట్ చేశారు.

హోసూరు వార్తలు..

పాముల సయ్యాట



సూళగిరి ప్రాంతంలో పాములు

క్రిష్ణగిరి: సూళగిరి సమీపంలోని అటవీ ప్రాంతంలో పాముల జంట సరసాలు జనం కంటబడ్డాయి. పట్టణంలోని కే.కే.నగరం ప్రాంతంలో పట్టపగలే సుమారు గంట పాటు పాముల జంట చేరి సల్లాపాలు సాగించాయి. ఇది చూసి ఆ ప్రాంత ప్రజలు భయాందోళలకు గురయ్యారు. సూళగిరి పట్టణానికి ఆనుకొని అటవీ ప్రాంతం ఉండడంతో తరచూ పాములు చొరబడుతున్నాయని, భయం భయంగా జీవిస్తున్నామని తెలిపారు. అటవీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

బైక్ ప్రమాదంలో విద్యార్థి మృతి

క్రిష్ణగిరి: బైక్ ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన ఘటన క్రిష్ణగిరి పట్టణ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు తిరుపత్తూరు జిల్లా రాజపాళ్యం ప్రాంతానికి చెందిన సంతోష్‌కుమార్ (19) వేలూరు జిల్లా పాన్నేరిలోని ప్రైవేట్ కళాశాలలో బికాం చదువుతున్నాడు. మిత్రుడు గౌతమ్(19)తో కలిసి బైక్‌లో క్రిష్ణగిరికి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన ఇరువురిని స్థానికులు చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంతోష్‌కుమార్ చనిపోగా, గౌతమ్‌కు సీరియస్‌గా ఉంది. క్రిష్ణగిరి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్
బేరికె సమీపంలోని కే.ఎస్.దొడ్డి ప్రాంతంలో పోలీసులు నిర్వహించిన సోదాల్లో గోవిందన్ (66) అనే వ్యక్తి ఇంట్లో రూ. 12 వేలు విలువ చేసే కర్ణాటక మద్యం సీసాలు లభించాయి. వాటిని స్వాధీనపరుచుకొని గోవిందన్‌ను అరెస్ట్ చేశారు.

మామిడి రసాల తయారీ పరిశ్రమ పరిశీలన



పరిశీలిస్తున్న కలెక్టర్

హోసూరు: మామిడి ఉత్పత్తిలో పేరుపొందిన క్రిష్ణగిరి జిల్లాలో ఒక జిల్లా ఒక ప్రాజెక్ట్ పథకం కింద మామిడి రసాల తయారీ పరిశ్రమలను అభివృద్ధి పరుస్తున్నారు. అందులో భాగంగా క్రిష్ణగిరి జిల్లా కావేరిపట్టణం సమీపంలోని జగదాబ్ గ్రామం వద్ద నిర్వహిస్తున్న మామిడి రసాల తయారీ పరిశ్రమను శనివారం కలెక్టర్ శరయు పరిశీలించారు. రైతుల నుంచి మామిడి కొనుగోలు వివరాలు, శుభ్రపరిచే విధానం, ఆధునిక యంత్రాలతో మామిడి రసాలను తయారు చేసే విధానం, టిన్‌ల ద్వారా శీతల గిడ్డంగిలో భద్రపరచడం, దేశ విదేశాలకు ఎగుమతి వివరాలను పరిశ్రమాధిపతుల వద్ద అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... క్రిష్ణగిరి జిల్లాలో పెద్ద ఎత్తున రైతులు ఎక్కువ విస్తీర్ణంలో మామిడి సాగు చేపడుతున్నారని, రైతుల వద్ద గిట్టుబాటు ధరలకు మామిడిని కొనుగోలు చేసి ప్రోత్సహించాలని, పరిశ్రమల్లో మామిడి రసం తయారీలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. కలెక్టర్ వెంట అధికారులు ప్రసన్న బాలమురుగన్, రామమూర్తి, మాధవన్ తదితరులు ఉన్నారు.

అటవీ భూమిని ఆక్రమించి లేఔట్‌కు రోడ్డు నిర్మాణం



అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణ పనులు



అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన లేఔట్

- పట్టించుకోని అధికారులు

క్రిష్ణగిరి: సూళగిరి యూనియన్‌లో ప్రైవేట్ లేఔట్‌లో ప్లాట్‌ల విక్రయాల కోసం ప్రభుత్వ ఆస్తులను వినియోగించుకొంటున్నారని, అటవీ శాఖకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించుకొని విలువైన చెట్లను తొలగించి చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులను అధికారులు అడ్డుకోవాలని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సూళగిరి తాలూకా బి.కురుబరపల్లి సమీపంలోని వెంకటపతికొటాయ్ గ్రామం వద్ద వ్యక్తి అటవీశాఖకు చెందిన స్థలాన్ని ఆక్రమించి రాత్రికి రాత్రే జేసీబీ యంత్రాల ద్వారా చెట్లను తొలగించి భూమిని చదును చేసి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. అటవీ శాఖాధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రేయసి వదిలి వెళ్లిందని ఆత్మహత్య

కెలమంగలం: గొడవలు జరిగి ప్రేయసి వదిలి వెళ్లిపోవడంతో ప్రియుడు ఉరివేసుకొన్న ఘటన కెలమంగలం వద్ద జరిగింది. వివరాల మేరకు డి.తమండ్రపల్లి గ్రామానికి చెందిన శివ(25) హోసూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో కార్మికునిగా పనిచేసేవాడు. అదే పరిశ్రమలో పనిచేస్తున్న మైసూరుకు చెందిన ఖుషి అనే అమ్మాయితో పరిచయమేర్పడి ఇరువురూ ప్రేమించుకొన్నారు. కొద్దిరోజులుగా హోసూరులో అద్దె ఇంట్లో సహజీవనం చేయసాగారు. కానీ ఇద్దరి మధ్య తరచుగా గొడవలు జరగడంతో ఖుషి కోపగించుకొని మైసూరుకు వెళ్లిపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన శివ డి.తమండ్రపల్లిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. కెలమంగలం పోలీసులు విచారణ చేపట్టారు.

సూర్యఘర్ పథకం ప్రారంభం

బనశంకరి: దేశంలో కోటి ఇళ్లపై సోలార్లు అమర్చడం ద్వారా ఉచిత విద్యుత్ అందించే సూర్యఘర్ పథకాన్ని అమల్లోకి తీసుకురాగా రాష్ట్రంలో దీనిపై ప్రచార వాహనాన్ని ఇంధనశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి గౌరవ్‌గుప్తా ప్రారంభించారు. శనివారం బెస్కాం కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం గృహ వినియోగానికి మాత్రమే అందించే సూర్యఘర్ పథకాన్ని ఆధునీకరించిన ఇంధన శాఖ సూర్య రథయాత్రను గౌరవ్ గుప్త ప్రారంభించి మాట్లాడారు. ఈ పథకం అమలుకు రాష్ట్రంలో పది వేల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దీనిపై విస్తృత ప్రచారం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి దినేశ్‌జగదాళే, బెస్కాం మేనేజింగ్ డైరెక్టర్ మహంతేశ్‌బీళగి పాల్గొన్నారు.

బాలికల హాస్టల్లో షార్ట్ సర్క్యూట్


- మంటలు చెలరేగి పొగ
- ముగ్గురు బాలికలకు అస్వస్థత



భయంతో హాస్టల్ బయట ఉన్న విద్యార్థినులు



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ శుభ కల్యాణ్, మాజీ మంత్రి సొగడు శివణ్ణ



షార్ట్ సర్క్యూట్ జరిగిన విద్యుత్ బాక్స్ ఇదే

తుమకూరు: తుమకూరు నగరంలోని బీహెచ్ రోడ్డులో ఉన్న సంక్షేమ శాఖ హాస్టల్లో శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఏర్పడి ఒక్కసారిగా పొగ కమ్ముకోవడంతో ముగ్గురు బాలికలు అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్ భవనంలో ఉన్న కింది ఫ్లోర్‌లో విద్యుత్ కనెక్షన్ ఉన్న బాక్స్‌లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు వచ్చాయి. బాక్స్ కాలిపోయి పొగ ఏర్పడింది. ఒక్కసారిగా కరెంట్ పోయి పొగ చుట్టుకోవడంతో విద్యార్థినులు భయాందోళనకు గురయ్యారు. ఏమి జరిగిందోనని గట్టిగా కేకలు వేస్తూ బయటకు పరుగు తీశారు. విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. సమాచారం అందుకున్న కలెక్టర్ శుభ కల్యాణ్, మాజీ మంత్రి సొగడు శివణ్ణ హాస్టల్ వద్దకు వచ్చి బాలికలకు ధైర్యం చెప్పారు. వెంటనే మరమ్మతులకు కలెక్టర్ ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం



ఘటనా స్థలంలో మృతదేహాలు



ప్రమాద దృశ్యం

హోసూరు: హోసూరు– క్రిష్ణగిరి జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. వివరాలు...సేలం నుంచి క్రిష్ణగిరి మీదుగా హోసూరు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును పేరండపల్లి సమీపంలో ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ప్రమాదం జరగడంతో క్రిష్ణగిరి–హోసూరు మార్గంలో సుమారు ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతుల వివరాల కోసం విచారణ చేస్తున్నారు.



రామోజీరావు భౌతికకాయం వద్ద విషణ్ణ వదనంతో ఆయన సతీమణి రమాదేవి






రామోజీ రావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న నిర్మల సీతారామన్, చిరంజీవి, పవన్, రామోజీ కుమారుడిని పరామర్శిస్తున్న కేటీఆర్

పెదపారుపూడి టు ఫిలింసిటీ

- వ్యవసాయ కుటుంబం నుంచి మీడియా అధిపతిదాకా రామోజీరావు ప్రస్థానం
- భిన్నమైన వ్యాపారాల్లో విజయంతో గుర్తింపు

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ కుటుంబంలో పుట్టిన రామోజీరావు.. పరస్పరం భిన్నమైన రంగాల్లో వ్యాపారాలను ప్రారంభించి విజయం సాధించారు. యాడ్ ఏజెన్సీలో పనిచేయడం మొదలుపెట్టి.. ఎరువుల వ్యాపారం, చిట్‌ఫండ్స్, పచ్చళ్లు, మీడియా వంటి ఎన్నో రంగాలకు విస్తరించారు. రామోజీరావు ఏపీలోని కృష్ణా జిల్లా పెదపారుపూడి గ్రామంలో 1936 నవంబరు 16న జన్మించారు. ఆయన తండ్రి వెంకట సుబ్బారావు రైతు. తల్లి వెంకట సుబ్బమ్మ గృహిణి. పెదపారుపూడి, గుడివాడలలో పాఠశాల విద్య, ఇంటర్, డిగ్రీ (బీఎస్సీ) గుడివాడలోనే పూర్తి చేశారు. 1961 ఆగస్టు 19న పెనమలూరుకు చెందిన తాతినేని వెంకట సుబ్బయ్య, వాణీదేవిల రెండో కుమార్తె రమాదేవితో రామోజీరావుకు వివాహం జరిగింది.

మొదట యాడ్ ఏజెన్సీలో చేరి..

బీఎస్సీ పూర్తిచేసిన రామోజీరావు.. తన కుటుంబం చేసే వ్యవసాయానికే పరిమితం కాకుండా వ్యాపార రంగంలోకి రావాలని నిర్ణయించుకున్నారు. అడ్వర్టైజింగ్ రంగం వైపు ఆసక్తి కలగడంతో.. ఢిల్లీ వెళ్లి ఓ అడ్వర్టైజింగ్ ఏజెన్సీలో చేరారు. అక్కడ మూడేళ్లు పనిచేశాక హైదరాబాద్‌కు వచ్చారు. 1962 అక్టోబర్‌లో హైదరాబాద్‌లో మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థను, 1965లో కిరణ్ యాడ్స్ పేరిట అడ్వర్టైజ్‌మెంట్ ఏజెన్సీని ప్రారంభించారు. తర్వాత ఇతర వ్యాపారాలవైపు దృష్టి సారించారు. 1967–1969 మధ్య వసుంధర ఫెర్టిలైజర్స్ పేరిట ఎరువుల వ్యాపారం చేశారు. ఆ సమయంలోనే వ్యవసాయ సమాచారంతో కూడిన అన్నదాత పత్రికను ప్రారంభించారు. 1970లో ఇమేజెస్ ఔట్‌డోర్ యాడ్ ఏజెన్సీని, విశాఖపట్నంలో డాల్ఫిన్ హోటల్‌ను ప్రారంభించారు. అప్పటికే పత్రికారంగంపై ఆసక్తి ఉన్న ఆయన.. విశాఖపట్నం కేంద్రంగా ఈనాడు పత్రికకు శ్రీకారం చుట్టారు. స్థానిక వార్తలకు ప్రాధాన్యమివ్వటం, గ్రామాల్లోనూ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవడం, వేగంగా పంపిణీ చేయడం ద్వారా పత్రికను పాఠకులకు చేరువ చేశారు.



రామోజీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చంద్రబాబు నాయుడు, భువనేశ్వరీ

ఎలక్ట్రానిక్ మీడియాతోనూ..: పాత్రికేయ రంగంలో మార్పులను ముందుగానే గుర్తించిన రామోజీరావు.. మొదట్లో వినోదం ప్రధానాంశంగా ఈటీవీ చానల్‌ను ప్రారంభించారు. తర్వాత పూర్తి న్యూస్ చానల్ ఈటీవీ2ను ప్రారంభించారు. రాష్ట్రం విడిపోయినప్పుడు ఏపీ, తెలంగాణలకు విడివిడి న్యూస్ చానళ్లను ఏర్పాటు చేశారు. ఇక 'ప్రియ'పేరిట రామోజీ ప్రారంభించిన పచ్చళ్ల వ్యాపారం కూడా సక్సెస్ అయింది. వివిధ రంగాల్లో రామోజీ సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 2016లో పద్మవిభూషణ్‌తో సత్కరించింది.

రామయ్య నుంచి రామోజీగా మార్చుకుని..: రామోజీరావు తాత పేరు రామయ్య. ఆయన వ్యవసాయం చేసేవారు. రామోజీ జన్మించడానికి కొన్నిరోజుల ముందు రామయ్య మరణించారు. దీంతో తాత పేరే మనవడికి పెట్టారు. కానీ రామయ్య అనే పేరు పాతదిగా అనిపించడంతో.. ఆయన తన పేరును రామోజీగా మార్చుకున్నారని చెబుతారు.

తెల్ల వస్త్రాలంటే మక్కువ..: రామోజీరావు ఎప్పుడు చూసినా తెలుపు రంగు వస్త్రధారణతోనే కనిపిస్తారు. ఆయనకు తెలుపు రంగు వస్త్రాలంటే ప్రత్యేక మక్కువే దీనికి కారణమని చెబుతారు. వదులుగా ఉండే తెలుపు రంగు హాఫ్‌హ్యాండ్స్ షర్టు, అదే రంగు ప్యాంటు, మ్యాచింగ్‌గా తెలుపు రంగు షూస్ ధరించేవారు. ఎప్పుడైనా ప్రత్యేక సందర్భాల్లో తప్ప ఎప్పుడూ తెలుపు వస్త్రధారణతో ఉండేవారు.

పత్రికారంగానికి ఎనలేని సేవలందించారు

- రామోజీరావు మరణం దిగ్భ్రాంతికి గురిచేసింది
- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రామోజీరావు మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. 'తెలుగు పత్రికారంగానికి దశాబ్దాలుగా ఆయన ఎనలేని సేవలందించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. రామోజీరావు కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని వైఎస్ జగన్ సామాజిక మాధ్యమం ఎక్స్(ట్విట్టర్)లో శనివారం పోస్టు చేశారు.

ప్రముఖుల దిగ్భ్రాంతి

- రామోజీరావు మరణంతో దేశం మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగానికి చెందిన దిగ్గజాన్ని కోల్పోయింది. ఆయన ఈనాడు దినపత్రిక, ఈటీవీ న్యూస్ నెట్‌వర్క్, ఫిల్మ్ సిటీ సహా అనేక సంస్థలను నెలకొల్పిన వినూత్న వ్యాపారవేత్త. సమాజ హితంపై ఆయనకు ఉన్న దృష్టి కారణంగా పద్మ విభూషణ్ వరించింది. ఆయన కుటుంబ సభ్యులకు నా సానుభూతి ప్రకటిస్తున్నాను. – ద్రౌపది ముర్ము, రాష్ట్రపతి
- రామోజీరావు మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. భారతీయ మీడియాను విప్లవాత్మకంగా మార్చిన దార్శనికుడు. పాత్రికేయ, సినీరంగంపై రామోజీరావు చెరగని ముద్ర వేశారు. మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగంలో రామోజీ సరికొత్త ప్రమాణాలు నెలకొల్పారు. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. రామోజీరావు కుటుంబానికి, అభిమానులకు ప్రగాఢ సానుభూతి. ఓం శాంతి. –నరేంద్ర మోదీ, ప్రధాని
- భారతీయ మీడియా పరిశ్రమలో అగ్రగామిగా నిలిచిన పద్మవిభూషణ్ రామోజీరావు మృతికి నా సంతాపం. జర్నలిజం, సినిమా, వినోదానికి ఆయన చేసిన కృషి మీడియా ల్యాండ్‌స్కేప్‌ను మార్చింది. – రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత
- మీడియా, వినోద రంగాల్లో ఆయన బహుముఖ ప్రజ్ఞ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఈ సమయంలో వారి కుటుంబ సభ్యులకు నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను. –ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కడ్
- భారతీయ మీడియా, సినీ రంగాల్లో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన దిగ్గజం రామోజీరావు. తెలుగు జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు, నిజాయితీని పెంపొందించారు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. – రాష్ట్ర ఇన్‌చార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

తెలుగు వారి కీర్తిని చాటిన వ్యక్తి: చంద్రబాబు

రామోజీ మరణవార్త తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న చంద్రబాబు హైదరాబాద్ తిరిగి వచ్చారు. భార్య భువనేశ్వరితో కలిసి ఫిలింసిటీకి వెళ్లి రామోజీ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం మీడియాతో బాబు మాట్లాడుతూ, రామోజీరావును యుగపురుషుడిగా అభివర్ణించారు. నిత్యం సమాజహితం కోసం, తెలుగుజాతి కోసం పనిచేసిన వ్యక్తి రామోజీ అని అన్నారు.

- రామోజీరావు మృతిపట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం తెలుగు పత్రికా, మీడియా, వ్యాపార రంగాలకు తీరని లోటని అన్నారు. – తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి
- రామోజీ రావు పలు రంగాల్లో వ్యాపారవేత్తగా, మీడియా సంస్థల వ్యవస్థాపకుడిగా విశేష సేవలను అందించారు. – కేసీఆర్
- రామోజీరావులో అందరూ గంభీరమైన వ్యక్తిని చూసుంటారు. నేను మాత్రం ఆయనలో చిన్న పిల్లాడిని చూశాను. ఆయనకు పెన్నులంటే ఇష్టం. ప్రజారాజ్యం పార్టీ నడుపుతున్న సమయంలో ఒక పెన్ను బహూకరిస్తే దాన్ని చూసి ఆయన మురిసిపోయారు. – చిరంజీవి
- ప్రమాణ స్వీకారం తర్వాత వచ్చి ఆయన్ను కలుద్దామనుకున్నా. కానీ, ఇంతలోనే దురదృష్టవశాత్తూ కన్నుమూశారు. ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు అండగా ఉండాలి. – పవన్ కళ్యాణ్

ప్రముఖుల సంతాపం..

రామోజీరావుకు నివాళులు అర్పించిన వారిలో బీజేపీ అగ్రనేతలు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, తమిళనాడు సీఎం ఎంకె స్టాలిన్, మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సినీనటులు నాగార్జున, వెంకటేశ్, మోహన్‌బాబు, రాజేంద్రప్రసాద్, కళ్యాణ్‌రామ్, నరేష్, కె.రాఘవేంద్రరావు, అశ్వనీదత్, బోయపాటి శ్రీను, రాజమౌళి, కీరవాణి, ఎస్.వి.కృష్ణారెడ్డి, ఇళయరాజా, మంచు విష్ణు, విజయేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు. – సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్

రామోజీ స్వగ్రామంలో విషాద ఛాయలు

పెదపారుపూడి: రామోజీరావు మరణంతో ఆయన స్వగ్రామం కృష్ణా జిల్లా పెదపారుపూడిలో విషాదఛాయలు అలుముకున్నాయి. తెల్లవారుజామున నిద్ర లేవడంతోనే రామోజీ మరణవార్త వినాల్సి వచ్చిందని గ్రామస్తులు కన్నీటిపర్యంతమయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



రామోజీరావు ఒకప్పుడు ఉన్న ఇల్లు

ఈ సందర్భంగా గ్రామస్తులు రామోజీతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. రామోజీరావు 2015లో తన స్వగ్రామం పెదపారుపూడిని దత్తత తీసుకుని సుమారు రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేశారని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, పశు వైద్యశాల, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, ప్రాథమిక పాఠశాలలకు నూతన భవనాలు, అంగన్‌వాడీ కేంద్రం, సీసీ రోడ్లను నిర్మించారని చెప్పారు.

'ఫిలింసిటీ'తో ఒకే చోట సినీ సామ్రాజ్యం!

- హైదరాబాద్ అబ్దుల్లాపూర్‌మెట్‌లో విశాలమైన రామోజీ ఫిలింసిటీ

సాక్షి, హైదరాబాద్: తెలుగునాట పలు వ్యాపారాలతో జాతీయ స్థాయిలో పేరు సంపాదించిన రామోజీరావు 1996లో రంగారెడ్డి జిల్లాలో ఓ సినిమా సామ్రాజ్యాన్నే స్థాపించారు. చలనచిత్ర నిర్మాణానికి సంబంధించిన సకల సేవలను ఒకేచోట అందిస్తూ 1,666 ఎకరాల్లో 'రామోజీ ఫిలిం సిటీ'ని నిర్మించారు. ఈ స్టూడియో ప్రపంచంలోనే అతిపెద్దదిగా గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కింది కూడా. ఇక్కడ కేవలం తెలుగు సినిమాలు, సీరియల్స్ మాత్రమేకాదు.. ఇతర భాషా చిత్రాలు కూడా షూటింగ్ జరుపుకొన్నాయి. 1997లో తొలిసారిగా 'మా నాన్నకు పెళ్లి' సినిమా పూర్తిస్థాయిలో ఫిలింసిటీలోనే నిర్మితమైంది. ఇటీవలి భారీ సినిమాలు బాహుబలి, బాహుబలి-2, ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలు కూడా కొంతమేర ఇక్కడే షూటింగ్ జరుపుకొన్నాయి.

వివిధ భాషల్లో సినిమాలు..: రామోజీరావు తెలుగులోనే కాదు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ.. ఇలా పలు భాషల్లో కలిపి దాదాపు 80కిపైగా సినిమాలను నిర్మించారు. హిందీలో నేరుగా ఓ సినిమా నిర్మించగా.. మూడు రీమేక్‌లు ఉన్నాయి. రామోజీరావు హిందీలో నిర్మించిన తొలి రీమేక్ 'నాచే మయూరి'(1986). తెలుగులో 'మయూరి'. క్లాసికల్ డ్యాన్సర్ సుధాచంద్ర బయోపిక్‌గా ఆ మూవీ రూపొందింది. తర్వాత విజయశాంతి లీడ్ రోల్‌లో టి.కృష్ణ దర్శకత్వం వహించిన తెలుగు చిత్రం 'ప్రతిఘటన'సూపర్ హిట్ కావడంతో దానిని హిందీలో 'ప్రతిఘట్'(1987) పేరుతో రీమేక్ చేశారు. అలాగే తెలుగు సూపర్ హిట్ మూవీ 'నువ్వే కావాలి'ని 'తుజే మేరీ కసమ్' (2003) పేరిట హిందీలో రీమేక్ చేశారు. రామోజీరావు నేరుగా నిర్మించిన హిందీ చిత్రం 'తోడా తుమ్ బద్లో తోడా హమ్'(2004).

అధైర్యపడొద్దు.. మళ్లీ అధికారంలోకొస్తాం

- ప్రజా తీర్పును గౌరవించాలి
- భవిష్యత్ కార్యాచరణకు సిద్ధంగా ఉండాలి
- మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం అర్బన్: వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధైర్యపడొద్దని.. మళ్లీ అధికారంలోకి వస్తామని మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ధైర్యం చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో శనివారం ఆయన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసినవారందరికీ కొట్టు సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాల్లో ప్రజాతీర్పును గౌరవించాలన్నారు. కులమతాలు, పార్టీలకతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందించామని గుర్తు చేశారు. ఐ-ప్యాక్ టీమ్ వల్ల ఉపయోగం ఏమీ లేదన్నారు. కంప్యూటర్ చదువులు చదివినవారికి రాజకీయాలపై అవగాహన ఉండదన్నారు. ఈ విషయాన్ని గమనించకుండా వారు చెప్పిన మాయమాటలను నమ్మడం ఓటమికి ఒక కారణమని భావిస్తున్నామన్నారు. భవిష్యత్ కార్యాచరణకు అందరం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎవరికి ఎటువంటి అవసరం వచ్చినా అండగా ఉంటానన్నారు. నియోజకవర్గంలో సుమారు రూ.1,100 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వాటిలో కొన్ని పూర్తవగా, మరికొన్ని కొనసాగుతున్నాయని చెప్పారు. వాటన్నింటిని పూర్తిచేసేందుకు కొత్త ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు.

12 మంది బీసీలకు మంత్రి పదవులు ఇవ్వాలి

బహుజన సమాజ్‌వాది పార్టీ ఏపీ కో–ఆర్డినేటర్ జె.పూర్ణచంద్రరావు

సాక్షి, అమరావతి: చంద్రబాబు కేబినెట్‌లో కనీసం 12 మంది బీసీలకు, ఐదుగురు ఎస్సీలకు, ఐదుగురు ఎస్టీలకు, ఇద్దరు మైనార్టీలకు మంత్రులుగా చోటు కల్పించాలని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, బహుజన సమాజ్‌వాది పార్టీ ఏపీ కో–ఆర్డినేటర్ జె.పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఆయన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు కేబినెట్‌లో స్థానం కల్పించాల్సిన అవసరం లేదన్నారు. ఎక్కువ సార్లు ఎమ్మెల్యేలుగా గెలిచారనే సాకుతో మంత్రి పదవులు ఇవ్వాలనే దృక్పథాన్ని కూడా మార్చుకోవాలన్నారు. కేబినెట్‌లో బీసీలకు నామమాత్రపు మంత్రులుగా కాకుండా ప్రధానమైన శాఖలు ఇచ్చి స్వేచ్ఛతో పని చేసుకునేలా వెసులుబాటు కల్పించాలన్నారు. ముఖ్యంగా పాలనా వికేంద్రీకరణ జరిగినప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఏపీలో ప్రకృతి వ్యవసాయం భేష్

- రాష్ట్రంలో జాంబియా దేశ అత్యున్నత ప్రతినిధి బృందం పర్యటన
- రాయలసీమలో పర్యటిస్తున్న బృందం సభ్యులు
- రైతు సాధికార సంస్థ అధికారులతో సమావేశం
- ఏపీ స్ఫూర్తితో జాంబియా దేశంలో అమలుకు సన్నాహాలు
- త్వరలో జాంబియాలో పర్యటించనున్న రైతు సాధికార సంస్థ ప్రతినిధి బృందం
- ఏపీలో అమలవుతున్న కార్యక్రమాలపై అక్కడి మహిళా రైతులకు శిక్షణ
- అంతర్జాతీయ సంస్థగా రైతు సాధికార సంస్థకి గుర్తింపు



రైతు సాధికార సంస్థ అధికారులతో భేటీ అయిన జాంబియా దేశ ప్రతినిధి బృందం

సాక్షి, అమరావతి: రైతు సాధికార సంస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు ఖండాంతరాలు దాటుతున్నాయి. ఏపీ స్ఫూర్తితో దేశంలోని వివిధ రాష్ట్రాల్లోనే కాకుండా విదేశాల్లో కూడా ప్రకృతి వ్యవసాయం అమలుచేసేందుకు ఆయా దేశాలు ఆసక్తి చూపుతున్నాయి. ఇందులో భాగంగా.. రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించేందుకు 45 దేశాల ప్రతినిధులు పర్యటించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం అమలుతీరు చాలా బాగుందని జాంబియా దేశ ప్రతినిధి బృందం కితాబిచ్చింది. నిజానికి.. రాష్ట్రంలోని 10 లక్షల 35 వేల మంది రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరిస్తున్నారు. 4,120 గ్రామాల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా అమలవుతోంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రభుత్వాలు, సామాజిక సంస్థలు, దాతృత్వ సంస్థల భాగస్వామ్యంతో రాష్ట్రంలో రైతు సాధికార సంస్థ కలిసి పనిచేస్తోంది. దీంతో.. ప్రపంచంలో విస్తృత స్థాయిలో ఆగ్రో ఎకాలజీ కార్యక్రమాన్ని నడుపుతున్న సంస్థగా గుర్తింపు పొందిన రైతుసాధికార సంస్థ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలో.. రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని పరిశీలించి తమ దేశంలో అమలుచేసేందుకు జాంబియా దేశ ప్రతినిధి బృందం రాష్ట్రంలో పర్యటిస్తోంది. ఈనెల 7న రాష్ట్రానికి చేరుకున్న ఆ దేశ అత్యున్నత ప్రతినిధి బృందం 21 వరకు అనంతపురం జిల్లాలోని వివిధ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తుంది. జిల్లా కేంద్రంలోని ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్) ప్రాజెక్టు కార్యాలయంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్, రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేటివ్ ఆఫీసర్ లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో శిక్షణ పొందడంతో పాటు క్షేత్రస్థాయిలో బృంద సభ్యులు లోతైన అధ్యయనం చేస్తున్నారు. జాంబియా దేశంలో ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాన్ని అమలుచేయాలనే ఉద్దేశ్యంతో వచ్చిన ఈ బృందంలో జాంబియా ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ శాఖతోపాటు మరో రెండు సామాజిక సంస్థలైన కస్సీ వ్యవసాయ శిక్షణా కేంద్రం (కేఏటీసీ), వాల్సో నాస్కా శిక్షణా క్షేత్రం ప్రతినిధులు కూడా ఉన్నారు. ఇక ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు అమలుచేస్తున్న ×లెర్నింగ్ బై డూయింగ్×' విధానంలో జాంబియా ప్రతినిధి బృందం రెండువారాల పాటు ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాల అమలులో భాగస్వాములై అధ్యయనం చేస్తుంది.

ప్రపంచానికే ఏపీ ఆదర్శం..

ప్రకృతి వ్యవసాయంపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకునే క్రమంలో భాగంగా జాంబియా ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ శాఖ శనివారం రైతు సాధికార సంస్థ ఉన్నతాధికారులతో సమావేశమై చర్చించింది. ఈ సందర్భంగా జాంబియా ప్రతినిధి బృందం సభ్యులు మాట్లాడుతూ.. ఏపీలో గడిచిన ఐదేళ్లుగా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు ప్రపంచానికే ఆదర్శంగా ఉన్నాయని ప్రశంసించారు. తమ ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ శాఖ తరఫున 2023లో ఓ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం కూడా ఏపీలో పర్యటించిందని వివరించారు. అంతర్జాతీయ భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా ఏపీ రైతు సాధికార సంస్థ జాంబియాతో కలిసి పనిచేసేందుకు తొలి అడుగువేయడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. జాంబియా బృందం పర్యటన ముగిసిన అనంతరం రైతు సాధికార సంస్థ తరఫున ఓ సీనియర్ సాంకేతిక బృందం జాంబియా దేశంలో పర్యటించి అక్కడ కాలానుగుణంగా అమలు చేయాల్సిన కార్యక్రమాలను సూచిస్తుంది. సామాజిక మార్పు కోసం పనిచేసే వంద మందికి పైగా భాగ్యస్వామ్యం కలిగిన ఎస్‌హెచ్‌డబ్ల్యూ (నా) నెట్‌వర్క్ సహకారంతో ప్రకృతి వ్యవసాయ జ్ఞానాన్ని జాంబియా దేశానికి ఏపీ అందించనుంది.

దర్శిలో బార్‌కు తాళం వేసిన టీడీపీ నేతలు

- మూడు రోజులుగా మూసి ఉన్న బార్ అండ్ రెస్టారెంట్
- యజమానులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీస్, ఎక్సైజ్ శాఖలు
- జిల్లా ఎస్పీని కలుస్తామంటున్న బాధితులు

దర్శి: ప్రకాశం జిల్లా దర్శి పట్టణంలో నూతన సంస్కృతికి తెరలేచింది. ఎన్నికల్లో టీడీపీ గెలిచిన వెంటనే నరసరావుపేటకు చెందిన కొందరు వ్యక్తులు దర్శి వచ్చి ఓ బార్ అండ్ రెస్టారెంట్‌కు తాళాలు వేశారు. మూడు రోజులుగా బార్ అండ్ రెస్టారెంట్ తాళాలు ఇవ్వకుండా నిర్వాహకులను ఇబ్బందిపెడుతున్నారు. దీంతో ఎన్నడూ లేనివిధంగా ఈ కొత్త సంస్కృతి ఏమిటని జిల్లా అంతటా చర్చనీయాంశంగా మారింది. ఇందుకు సంబంధించిన వివరాలు... ఎన్నికల కౌంటింగ్ ముగిసిన మరుసటి రోజు నరసరావుపేటకు చెందిన కొందరు టీడీపీ నాయకులు దర్శి వచ్చి పట్టణంలోని కేబీ బార్ అండ్ రెస్టారెంట్‌కు తాళాలు వేశారు. ఆ తర్వాత 'పోలీస్ స్టేషన్‌లో తేల్చుకుందాం రండి..' అని చెప్పి వెళ్లారని బార్‌లో పని చేసేవారు చెబుతున్నారు. నిర్వాహకులు వెంటనే పోలీసులను ఆశ్రయించగా.. వారు తమకు సంబంధం లేదని, ఎక్సైజ్ వారిని సంప్రదించండని చేతులు దులిపేసుకున్నారు. అనంతరం ఎక్సైజ్ అధికారులను నిర్వాహకులు కలవగా.. 'బార్ మూసేస్తే పోలీసులను కలవండి. మాకు ఎలాంటి సంబంధం ఉండదు' అని బదులిచ్చారు. ఇలా ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్నారు. దీంతో మూడు రోజులుగా కేబీ బార్ అండ్ రెస్టారెంట్ తెరవలేదు. ఈ విషయంపై బార్ నిర్వాహకులు మాట్లాడుతూ 'నరసరావుపేటకు చెందిన కొందరు టీడీపీ నాయకులు తమ బార్ అండ్ రెస్టారెంట్‌కు తాళాలు వేసి ఇబ్బంది పెడుతున్నారు. ఇక్కడ పోలీసులను ఆశ్రయించినా పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకువెళతాం' అని చెప్పారు.



మూసివేసి ఉన్న కేబీ బార్ అండ్ రెస్టారెంట్

వైఎస్సార్‌సీపీ కార్యకర్త, వలంటీర్‌పై కర్రలతో దాడి

ఇద్దరికీ రక్త గాయాలు




గాయపడిన శివసాయి, రవీంద్ర

దెందులూరు: ఏలూరు జిల్లా దెందులూరు మండలం శ్రీరామవరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కొత్తపల్లి రవీంద్ర, వలంటీర్ చిలకా శివసాయిపై శనివారం రాత్రి ఆరుగురు టీడీపీ కార్యకర్తలు కర్రలతో దాడి చేసి గాయ పరిచారు. రక్త గాయాలు కావడంతో బాధితులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తాము ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా బలవంతంగా బండి ఆపి దాడి చేశారని బాధితులు వాపోయారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండు శిలా ఫలకాలు ధ్వంసం

సంతనూతలపాడు (చీమకుర్తి): ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలంలో టీడీపీ నాయకులు శనివారం రెండు చోట్ల శిలా ఫలకాలను ధ్వంసం చేశారు. సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకంతో పాటు అదే మండలంలోని గురవారెడ్డిపాలెంలో సచివాలయ భవనం నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కూడా ధ్వంసం చేశారు. ఈ ఘటనలపై విచారిస్తున్నట్లు స్థానిక ఎస్సై దేవకుమార్ తెలిపారు.



సంతనూతలపాడులో ధ్వంసమైన జెడ్పీ హైస్కూల్ ఇండోర్ స్టేడియం శిలాఫలకం

వార్డు సభ్యుడిపై చంద్రగిరి ఎమ్మెల్యే అనుచరుల దాడి

- తల, భుజానికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
- తిరుపతి రుయా ఆస్పత్రికి తరలింపు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇర్షాద్. (ఇన్‌సెట్‌లో)తలపై గాయం

భాకరాపేట(తిరుపతి జిల్లా): చిన్నగొట్టిగల్లు పంచాయతీ వార్డు సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇర్షాద్‌పై శనివారం రాత్రి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అనుచరులు దాడి చేశారు. మసీదులో ఇర్షాద్ నమాజు చేసుకుని ఇంటికి వెళుతుండగా ఫోన్ వచ్చింది. మార్గం మధ్యలో ఉన్న ఇటుకల బట్టీ పక్కనే కూర్చొని మాట్లాడుతున్నాడు. ఇది గమనించిన పులివర్తి నాని అనుచరులు ముఖాలకు గుడ్డలు కట్టుకుని వచ్చి ఒక్కసారిగా రాడ్లతో ఇర్షాద్‌పై దాడి చేశారు. ఆయన తలకు తీవ్ర గాయం అయింది. ఎడమ చేయి భుజం విరిగింది. బాధితుడి అరుపులకు దగ్గరలో ఉన్న ఇళ్లలో నుంచి జనం బయటకు రావడంతో దాడికి పాల్పడిన వారు వెళ్లిపోయారు. స్థానికులు ఇర్షాద్‌ను హుటాహుటిన చిన్నగొట్టిగల్లు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉంది. భాకరాపేట సీఐ మస్తాన్‌వలి, ఎస్‌ఐ విజయకుమార్‌నాయక్ ఆస్పత్రికి వచ్చి ఇర్షాద్ వద్ద వివరాలు ఆరా తీశారు.

సాక్షి
ఫ్యామిలీ
బెంగళూరు
ఆదివారం ॥ 9-6-2024



డ్యాన్సమ్నాస్టిక్

నృత్య ప్రదర్శనలో ఆకట్టుకునే అందమైన డ్రెస్ అనేది కామన్. ఆర్షియా మాత్రం భయపెట్టే డ్రెస్‌తో, హారర్ లుక్‌తో స్టేజీ మీదికి వచ్చింది.

'ఇదేం లుక్కు బాబోయ్' అనుకునేలోపే తన అద్భుత నృత్యప్రతిభతో ప్రేక్షకులను అబ్బురపరిచింది.

'అమెరికాస్ గాట్ టాలెంట్' టీవీ షో న్యాయనిర్ణేతలు 'వావ్' అనుకునేలా చేసింది.

జమ్మూ కశ్మీర్‌కు చెందిన 13 ఏళ్ల ఆర్షియా శర్మ స్వదేశం దాటి వేరే దేశానికి రావడం ఇదే తొలిసారి. ఈ ఇంటర్నేషనల్ షోలో పాల్గొనడానికి ముందు ఆర్షియా శర్మ లిటిల్ మాస్టర్స్, సూపర్ డ్యాన్సర్ 4 లాంటి షోలతో ప్రేక్షకులను ఆకట్టుకుంది.

అంతర్జాతీయ వేదికపై చప్పట్లతో 'ఆహా' అనిపించుకున్న ఆర్షియా ప్రత్యేకత ఏమిటి... అనే విషయానికి వస్తే....

డాన్స్‌కు జిమ్నాస్టిక్స్ జోడించి 'వారెవ్వా' అనేలా చేసింది. ఆర్షియ 'డ్యాన్సమ్నాస్టిక్' వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

వైరల్

వర్కలా బాయ్స్

ఇటీవల 'మంజుమ్మల్ బాయ్స్' సినిమా పెద్ద హిట్ అయ్యింది. బిలంలో పడ్డ స్నేహితుణ్ణి బయటకు లాగడం కథ. ఇక్కడ మనం 'వర్కలా బాయ్స్'ని చూడొచ్చు. కర్నాటక నుంచి కేరళ విహారానికి వచ్చిన ఒక మహిళ వర్కలా బీచ్‌లో ఫోన్ జారవిడిచింది. అది అక్కడి రాళ్ల కింద చాలా లోతులో పడింది. అసలే అది ఐఫోన్. ఇంకేముంది వర్కలా అగ్నిమాపక దళం రంగంలోకి దిగింది. 7 గంటలు శ్రమించాక... ఏమైంది?



విహారంలో అపశృతులు దొర్లితే మనసు పాడవుతుంది. కర్నాటక నుంచి కేరళలోని వర్కలాకు విహారానికి వచ్చిన ఒక మహిళ అక్కడి బ్లాక్ బీచ్‌లో ఉండగా పొరపాటున ఫోన్ జారింది. అది రాళ్ల కట్ట ఉన్న బీచ్. ఫోన్ రాళ్ల సందులో నుంచి లోపలికి పడిపోయింది. లక్షన్నర రూపాయల విలువ చేసే ఐఫోన్. వెంటనే ఆమె బస చేసిన హోటల్ సిబ్బంది, వర్కలా అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. రాళ్లు తొలగించి ఫోన్ తీసే వీలు లేదు. తాడుతో తీగతో బయటకు లాగడం కూడా కష్టమైంది. దానికితోడు బీచ్‌లో భారీ అలలు, వాన పనికి అంతరాయం కలిగించాయి. దాంతో మరుసటి రోజు ఉదయం వచ్చి సుమారు ఏడు గంటలు కష్టపడి ఆ ఫోన్‌ని వెలికి తీశారు. అమ్మయ్య. కథ సుఖాంతం అయ్యింది. సుఖాంతం సంతోషమే కదా ఇస్తుంది. మంజుమ్మల్ బాయ్స్‌లో కూడా కథ సుఖాంతం కావడం వల్లే అది అంత పెద్ద హిట్ అయ్యిందని అనుకోవచ్చా?

త్రీ సాంగ్‌మం

ఒక భాషలో మొదలైన పాట ఆ భాషలోనే ఆగిపోతుంది. అయితే ఈ పాట విషయంలో అలా జరగలేదు.

మలయాళంలో మొదలైన పాట హిందీలోకి వచ్చింది. ఆ తరువాత బెంగాలీలోకి వచ్చి ఎండ్ అయింది.

ఎక్కడా కృత్రిమత్వం అనిపించదు.

హాయిగా వినాలనిపిస్తుంది.

మ్యాటర్‌లోకి వస్తే... స్మితాదేవ్ అనే ఇన్‌స్టాగ్రామ్ యూజర్ 'ఎ డక్కడ్ బెటాలియన్' అనే మలయాళ సినిమాలోని 'ఎన్ జీవనే' పాటను మూడు భాషల్లో చక్కగా పాడింది. స్మిత గొంతుకకు, ఆమె మల్టీ లింగ్వల్ టాలెంట్‌కు నెటిజనులు జేజేలు పలికారు.

హిందీ సంగతి సరే, మలయాళీ పాటను సహజంగా పాడడం అనేది గొప్ప విషయం. అచ్చం మలయాళీ సింగర్ పాడినట్లుగా ఉంది' అని ఒక నెటిజన్ స్పందించాడు.

'ఈ పాట పుణ్యమా అని మళయాళం, బెంగాలీ భాషల ధ్వనిలోని కొన్ని అద్భుతమైన సారూప్యతలను గమనించే వీలు కలిగింది' అంటూ స్పందించాడు ఒక విశ్లేషకుడు.

'మీ పాట మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లలో ఉండేలా చూడండి' అని ఒక ఇన్‌స్టాగ్రామ్ యూజర్ అడిగాడు.



కృతి రికార్డ్



అస్సాంలోని అభయపురికి చెందిన కృతి శిఖా 41 నిమిషాల 34 సెకన్లలో నిరంతరాయంగా 21 పాటలు పాడి 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించింది. తొమ్మిదేళ్ల కృతి శిఖా పాడిన పాటల్లో అస్సామీతో పాటు హిందీ పాటలు కూడా ఉన్నాయి.

చిన్నారి కృతి శిఖా 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సాధించడం ఇది రెండోసారి.

తల్లిదండ్రులు గాయకులు కావడంతో ఇంటినిండా సంగీత వాతావరణమే కనిపిస్తుంది. చిన్నారి కృతి 'ఇండియా బుక్ ఆఫ్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సాధించిన సందర్భంగా గ్రామస్థులు సంబరాలు జరుపుకున్నారు.

'ఈ రికార్డ్ కృతి ప్రతిభకు మాత్రమే కాదు సాంస్కృతిక వైవిధ్యానికి కూడా అద్దం పడుతుంది. భాషా సామరస్యత అనే భావనను పెంపొందిస్తుంది' అంటూ ఒక యూజర్ స్పందించాడు.

హైలో హైలెస్సో పరుపే కదా నా పడవ

మంటలు రేగే కాలంలో వానే కదా అమృతం. ఎండకు తిక్క రేగిన వారు వానలో చిలిపి చేష్టలు చేస్తారు. పూణెలో వాన వస్తే రోడ్డు వరద కట్టింది. ఒక కుర్రాడు పరుపు తీసి ప్రయాణం కట్టాడు.

'అల్లావుద్దీన్ మాయా కంబళితో గాల్లో ఎగిరాడు. ఇతను నీటిలో దూసుకుపోతున్నాడు' అని ఒక నెటిజన్ కామెంట్ చేశాడు ఈ కుర్రాడి వీడియో చూసి. 'టాక్సులు కట్టిన ప్రజలు వాన కురిసినప్పుడు రోడ్లను ఈ మాత్రం సరదా కోసం వాడుకోవచ్చు' అని మరొక నెటిజన్ కామెంట్ చేశాడు. 'రేపేదో ఆఫీసు పని వొత్తిడి ఉన్నట్టుంది ఇతనికి. దానిని పోగొట్టుకోవడానికి ఇదో మంచి ఉపాయం' అన్నారింకొకరు.



సంగతి ఏమంటే పూణెలో వాన పడింది. రుతుపవనాలు కాస్త ముందే వచ్చాయి. ఎండలతో మండిపోయిన ఊరిలో ఈ వానతో అందరి ప్రాణాలు లేచొచ్చాయి. ఒక కుర్రాడికి ఏమనిపించిందో ఏమో పాత పరుపొకటి రోడ్డు మీద వేసి ప్రవాహంలో అలా సాగిపోయాడు. వాహన దారులు కూడా అతనికి దారి ఇచ్చారు. మరి పోలీసులు ఏమైనా ఫైన్ వేస్తారో ఏమో... లేదంటే వాళ్లూ టోపీలు పక్కన పెట్టి తడుస్తున్నారో ఏమో.

ఎర్రటి ఎండలో చల్లని హృదయం



భయానకమైన ఎండలో పెద్ద ఏసీ మెషిన్‌తో ఫ్లైఓవర్ దాటడానికి ఆపసోపాలు పడుతున్న రిక్షా కార్మికుడిని చూసిన ఒక మహిళ బాధ పడింది. అయితే ఆమె బాధ పడి ఊరుకోలేదు. అతడి దగ్గరకు పరుగెత్తుకు వెళ్లింది. రిక్షాను నెట్టుతూ అతడు ఫ్లై ఓవర్ దాటేలా సహాయపడింది. ఆ తరువాత లంచ్‌బాక్స్, వాటర్ బాటిల్ అతడికి ఇచ్చింది. తలపై కప్పుకోవడానికి టవల్ కూడా ఇచ్చింది. దారిన పోయే వాళ్లెవరో ఈ దృశ్యాన్ని వీడియో తీసి 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈ వీడియోకు అనూహ్యమైన స్పందన వచ్చింది.

'ఎక్కడో ఒకచోట కష్టపడుతున్న వ్యక్తుల్ని చూస్తుంటాం. బాధ అనిపిస్తుందిగానీ, నేను మాత్రం ఏం చేయగలను అని సర్దిచెప్పుకుంటాం. అయితే మన వంతుగా వారికి కొద్దో గొప్పో సహాయపడగలిగితే అది గొప్ప సంతృప్తిని ఇస్తుంది' అంటూ ఒక యూజర్ కామెంట్ పెట్టాడు.

హెల్త్

అప్లాస్టిక్ అనీమియా అంటే..?

సాధారణంగా ఎర్రరక్తకణాల్లో ఐరన్ లోపం వల్ల రక్తహీనత (అనీమియా) రావడం మామూలే. కానీ ఎముకల్లో ఉండే మూలుగ ఫెయిల్ కావడం వల్ల ఎర్ర రక్తకణాలను పుట్టించే ప్రక్రియ దెబ్బతిని 'అప్లాస్టిక్ అనీమియా' వచ్చే అవకాశం ఉంది. చిన్నశ్రమకే ఎక్కువగా ఆయాసం రావడం, చిన్న గాయానికే ఎడ తెరపిలేని రక్తస్రావం, చీటికిమాటికీ ఇన్ఫెక్షన్లు రావడం వంటి పరిణామాలు చోటు చేసుకునే ఈ 'అప్లాస్టిక్ అనీమియా'పై అవగాహన కోసం...

కిడ్నీ, హార్ట్, లివర్ వంటి వాటిలాగే కొన్నిసార్లు ఎముక మూలుగ కూడా ఫెయిల్ కావచ్చు. మూలుగ (బోన్ మ్యారో)లో ఎర్ర, తెల్ల రక్తకణాలనూ, ప్లేట్‌లెట్స్‌నూ పుట్టించే మూలకణాలు పుడుతూ ఉంటాయి. మూలుగ ఫెయిల్యూర్ కారణంగా ఎర్రరక్తకణాలను పుట్టించే మూల కణాలు దెబ్బతిన్నందువల్ల అప్లాస్టిక్ అనీమియాతో రక్తహీనత ఏర్పడుతుంది. అలాగే తెల్లరక్తకణాలనూ, ప్లేట్‌లెట్లనూ పుట్టించే ప్రక్రియ కూడా దెబ్బతింటుంది.



కారణాలు

చాలా సందర్భాల్లో అప్లాస్టిక్ అనీమియా ఏ కారణం లేకుండానే వస్తుంది.

● ఇది తెగుళ్ల నివారణకు వాడే పురుగుమందులకూ లేదా రేడియేషన్‌కు ఎక్స్‌పోజ్ కావడం వల్ల. ● ఆర్థరైటిస్, లూపస్ వంటి వాటికి చికిత్స తీసుకుంటున్న క్రమంలోనూ; మహిళల్లో గర్భధారణ సమయంలోనూ; హెపటైటిస్, పర్వోవైరస్ వంటి ఇన్ఫెక్షన్లు సోకినప్పుడు. ● కొందరిలో వంశపారంపర్యంగా లేదా ఇతరత్రా జన్యుపరమైన జబ్బుల వల్ల. ● అరుదుగా కొందరిలో మైలోడిస్ప్లాస్టిక్ సిండ్రోమ్ లేదా మరికొందరిలో హైపో సెల్యులార్ బోన్ మ్యారో అనే ఒక రకం బ్లడ్ క్యాన్సర్‌కు ముందు దశగా. ● అరుదుగా సంభవించే పారాక్సిసిమాల్ నాక్టర్నల్ హీమోగ్లోబిన్యూరియా అనే సమస్యలో 'పైగా' (పీఐజీఏ) అనే జన్యుమార్పిడి జరిగినప్పుడు ఎర్రరక్తకణాలకు సంబంధించిన ప్రోటీన్ లోపించడం వల్ల వ్యాధినిరోధక వ్యవస్థ తన సొంత కణాలనే దెబ్బతీసినప్పుడు.

నిర్ధారణ పరీక్షలు


సీబీపీ, లివర్ ఫంక్షన్ టెస్ట్, కిడ్నీ ఫంక్షన్ టెస్ట్‌ల వంటి రక్తపరీక్షలతోపాటు బోన్ మ్యారో పరీక్ష.

లక్షణాలు

ఎర్ర రక్త కణాల సంఖ్య విపరీతంగా తగ్గడం వల్ల... ● పాలిపోయినట్టుగా కనిపించడం ● మెట్లు ఎక్కలేకపోవడం. చిన్న పనులకే తీవ్రమైన అలసట, నిస్సత్తువ ● చురుగ్గా ఉండలేకపోవడం, దృష్టి కేంద్రీకరించలేకపోవడం ● శ్వాస తీసుకోలేకపోవడం, తీవ్రమైన ఆయాసం ● గుండె స్పందనల వేగం పెరగడం

రక్షణాత్మకమైన తెల్లరక్తకణాలు తగ్గడం (న్యూట్రోపీనియా) వల్ల... ● త్వరత్వరగా జ్వరం, ఇన్ఫెక్షన్లు సోకడం ● మూత్రాశయం (బ్లాడర్) ఇన్ఫెక్షన్ల వల్ల మూత్రవిసర్జనలో తీవ్రమైన నొప్పి ● ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ సోకితే... దగ్గు, తీవ్రమైన ఆయాసం ● నోటిపొక్కులు ● మాటిమాటికీ సైనస్ ఇన్ఫెక్షన్లు, ముక్కుదిబ్బడ ● చర్మ రోగాలు

ప్లేట్‌లెట్లు తగ్గడం (థ్రాంబోసైటోపీనియా) వల్ల... ● చిన్న గాయమైనా ఆగకుండా రక్తస్రావం కావడం ● యువతులు, మహిళలకు దీర్ఘకాలం కొనసాగే రుతుస్రావం ● ముక్కు నుంచి రక్తస్రావం (ఎపిస్టాక్సిస్) ● చర్మం కింద ఎర్రటి రక్తపు చుక్కలు (పెటీకీ) కనిపించటం ● బ్రష్ చేసుకున్న తర్వాత పంటి చిగుర్ల నుంచి రక్తస్రావం... ఇలా ఆగకుండా రక్తస్రావం అవుతుండటం ఒక్కోసారి మెడికల్ ఎమర్జెన్సీకి దారితీయవచ్చు.



డాక్టర్ ప్రవీణ్ అడుసుమిల్లి
సీనియర్ మెడికల్ & హిమటో ఆంకాలజిస్ట్
హైదరాబాద్

చికిత్స

సాధారణంగా ఏదైనా తీవ్రమైన పరిస్థితికి దారితీస్తే తప్ప చికిత్స అవసరం ఉండకపోవచ్చు.


అయితే తీవ్రమైన అప్లాస్టిక్ అనీమియాలో రక్త మార్పిడి, జ్వరం వంటి కేసుల్లో యాంటీ బయాటిక్స్ ఇవ్వడం. ఫంగల్ ఇన్ఫెక్షన్లకు యాంటీఫంగల్ మెడిసిన్స్ ఇవ్వడం.

సపోర్టివ్ చికిత్సగా... కొన్ని దుష్పరిణామాల్ని (కాంప్లికేషన్లను) నివారించేందుకు చికిత్స అవసరం. సకాలంలో చికిత్స అందకపోతే ప్రాణాపాయానికీ దారితీసే ప్రమాదమూ ఉంది.

● సొంత వ్యాధినిరోధక వ్యవస్థ దీనికి కారణం కాబట్టి కొన్ని సందర్భాల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గించే క్రమంలో 'ఇమ్యూనో సప్రెసివ్ థెరపీ'.

పరిస్థితి తీవ్రమై మరో ప్రత్యామ్నాయం లేనప్పుడు చివరగా...

● దాత నుంచి సేకరించి... ఎముక మూలుగ మార్పిడి (బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్) లేదా మూలకణ మార్పిడి చికిత్స (స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్) ● దాత నుంచి సేకరించిన మూలుగతో ట్రాన్స్‌ప్లాంట్ థెరపీకి వీల్లేని సందర్భాల్లో అత్యాధునిక చికిత్సలైన 'ఎల్ట్రాంబొపాగ్', 'రోమిప్లాస్టిమ్' అనే అత్యాధునికమైన సరికొత్త చికిత్సలు.



టీనేజీ అమ్మాయిల ముఖం మీద అవాంఛిత రోమాలా?



టీనేజీ అమ్మాయిల దగ్గరనుంచి నడివయసు స్త్రీల వరకు కొందరికి ముఖం మీద అవాంఛిత రోమాలు కనిపిస్తుంటాయి. ఇలా అవాంఛిత రోమాలు కనిపించటాన్ని హిర్సుటిజమ్' అంటారు.

వెంట్రుకలు అసాధారణంగా పెరిగే సమస్యను 'హైపర్ ట్రైకోసిస్' అంటారు. ఇది వారసత్వంగా కానీ, కొన్ని రకాల మందుల ప్రభావం వల్ల గానీ రావచ్చు. ఈ 'హైపర్ ట్రైకోసిస్' సమస్యలో రోమాలు ప్రధానంగా ముంజేతులు (ఫోర్ ఆర్మ్స్), కాళ్ల (లోవర్ లెగ్స్) మీద మాత్రమే ఎక్కువగా కనిపిస్తాయి. అలా కాకుండా హిర్సుటిజమ్ సమస్యలో మాత్రం అవాంఛిత రోమాలు ముఖం మీద, పై పెదవుల మీద (మీసం తరహాలో), గడ్డం మీద, ఛాతీ పైన, పొట్ట, వీపు, తొడల మీద దళసరిగా పెరుగుతాయి.



డాక్టర్ శ్రావణి తాన్న
సీనియర్ కన్సల్టెంట్
ఎండోక్రైనాలజిస్ట్, వైజాగ్

కారణాలు

● ఈ హిర్సుటిజమ్ సమస్య ప్రధానంగా 80 శాతం మందిలో యాండ్రోజెన్ హార్మోన్ ఎక్కువగా ప్రవించడం వల్ల వస్తుంది. వీళ్లలోని 70 – 80 శాతం మందిలో పీసీఓఎస్ సమస్య కూడా ఉండవచ్చు.

● కొన్నిసార్లు ఎడ్రినల్ ట్యూమర్స్, థైరాయిడ్, ఒవేరియన్ ట్యూమర్స్, ఇతర జన్యు సమస్యలు ఏమైనా ఉన్నప్పుడు.

చికిత్స

- ఇతరత్రా ఎండోక్రైన్ సమస్యలు లేకుండా కేవలం మామూలుగా వెంట్రుకలు ఎక్కువగా పెరిగే 'హైపర్ ట్రైకోసిస్'కు కొన్ని బేసిక్ ప్రొసీజర్స్ అయిన వ్యాక్సింగ్, షేవింగ్, హెయిర్ రిమూవల్ క్రీమ్స్‌తో రోమాల తొలగింపు వంటివి సరిపోతాయి.
- ఎండోక్రైన్ సమస్యలు లేకుండా రోమాల పెరుగుదల ఉంటే ఎలక్ట్రోలైసిస్ వంటి కొన్ని అధునాతన ప్రక్రియలు అవసరం.
- ఎండోక్రైన్ సమస్యలు ఉన్నప్పుడు కొన్ని రక్తపరీక్షల ద్వారా థైరాయిడ్/ఎడ్రినల్ వంటి గ్రంథులకు సంబంధించిన సమస్యలు ఉన్నాయా... అన్న విషయాన్ని నిర్ధారణ చేసుకుని అందుకు అనుగుణంగా చికిత్స చేయాలి.
- అవాంఛిత రోమాల సమస్యతో పాటు రుతుసంబంధమైన సమస్యలున్నా, ముఖం మీద మొటిమలు (యాక్నే) ఎక్కువగా ఉన్నప్పుడు, గొంతు మగ వారిలా ఉన్నప్పుడు సమస్యను తీవ్రంగా పరిగణించి ఎండోక్రైన్ నిపుణుల ఆధ్వర్యంలో చికిత్స జరగాలి.

ఒకే పోశ్చర్‌లో చాలాసేపు ఉంటే వచ్చే...

స్టాటిక్ లోడింగ్ అనర్థాల నుంచి రక్షణ ఇలా..!



ఒకే భంగిమ (పోశ్చర్)లో చాలాసేపు కూర్చుని ఉండటం వల్ల వచ్చే అనర్థాలను 'స్టాటిక్ లోడింగ్' అంటారు. కంప్యూటర్‌తో పనిచేసేవారు, వైద్యరంగంలోని హెల్త్-కేర్ గివర్స్, చాలాసేపు కదలకుండా కూర్చుని పని చేసే వారందరికీ ఈ స్టాటిక్ లోడింగ్ తిప్పలు తప్పవు. వీళ్లలో మెడ, ఒళ్లు నొప్పులు, ఏకాగ్రత లోపించడం, రక్తప్రసరణ వేగం తగ్గడంతోపాటు శ్వాస ప్రక్రియలో ఉచ్ఛ్వాస నిశ్వాసలు మందగించడం వల్ల ఆక్సిజన్ సరఫరా తగ్గవచ్చు. అలాగే తీవ్రమైన అలసట, సుదీర్ఘకాలం కంప్యూటర్‌పై టైపింగ్ వల్ల వేళ్ల నొప్పులూ, ఒకే భంగిమలో చాలాసేపు ఉండటంతో కీళ్లనొప్పులు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలు వస్తాయి.

ఈ అనర్థాల నివారణకు...

■ టేబుల్ మీద కంప్యూటర్ కంటికి ఎదురుగా ఉండేలా ఏర్పాటు చేసుకోవడం ■ కంప్యూటర్ స్క్రీన్‌ను తదేకంగా చూడకుండా... అప్పుడప్పుడూ విశ్రాంతినివ్వడం ■ పని ప్రదేశంలోని సీటు, టేబుల్ తగినంత దూరంలో పొందిగ్గా ఉండేలా జాగ్రత్త తీసుకోవడం ■ ప్రతి గంటసేపు పని తర్వాత ఒకసారి లేచి నిలబడి తిరగడం, వీలైతే కాసేపు బ్రేక్ తీసుకోవడం ■ రోజూ కనీసం 30 – 45 నిమిషాల పాటు వాకింగ్ వంటి తేలికపాటి వ్యాయామం చేయడం.



నార్వే చెస్ విజేత మాగ్నస్ కార్ల్‌సన్

వరల్డ్ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ సొంతగడ్డపై జరిగిన ప్రతిష్టాత్మక నార్వే చెస్ టోర్నమెంట్‌లో చాంపియన్‌గా నిలిచాడు. మొత్తం 17.5 పాయింట్లతో అతను అగ్ర స్థానంలో నిలిచాడు. అతను ఈ టోర్నీని గెలుచుకోవడం ఆరో సారి కావడం విశేషం. శనివారం జరిగిన చివరి రౌండ్‌లో ఫాబియానో కరువానా (అమెరికా)ను ఓడించాడు. అమెరికా గ్రాండ్‌మాస్టర్ హికారు నకమురు 15.5 పాయింట్లతో రెండో స్థానం సాధించగా... భారత ఆటగాడు ఆర్. ప్రజ్ఞానంద 14.5 పాయింట్లతో మూడో స్థానం సాధించడం విశేషం. చివరి రౌండ్‌లో నకమురపై ప్రజ్ఞానంద గెలుపొందాడు. మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ఐదో స్థానంతో (10 పాయింట్లు) ముగించింది. చివరి రౌండ్‌లో అనా ముజిచుక్ (ఉక్రెయిన్) చేతిలో హంపి ఓటమిపాలైంది. మరో భారత ప్లేయర్ ఆర్.వైశాలి (12.5 పాయింట్లు) నాలుగో స్థానం దక్కించుకుంది. వైశాలి కూడా ఆఖరి రౌండ్‌లో పియా క్రామ్లింగ్ (స్వీడన్) చేతిలో ఓడింది. మహిళల సమరంలో చైనాకు చెందిన వెంజున్ జు (19 పాయింట్లు) టైటిల్ సాధించింది.

దాయాది సమరానికి 'సై'



- నేడు ప్రపంచకప్‌లో భారత్, పాకిస్తాన్ మ్యాచ్
- జోరు మీదున్న టీమిండియా
- ఒత్తిడిలో పాక్ బృందం
- రా.గం.8.00 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

అక్టోబర్ 23, 2022...మెల్‌బోర్న్ మైదానంలో భారత్, పాకిస్తాన్ మ్యాచ్...రవూఫ్ బౌలింగ్‌లో కోహ్లి రెండు అద్భుత సిక్సర్లతో టీమిండియాను గెలిపించిన తీరును మన అభిమానులెవరూ మరచిపోలేరు. 'గ్రేటెస్ట్ మూమెంట్ ఇన్ టి20 వరల్డ్ కప్ హిస్టరీ' అంటూ తొలి సిక్స్‌కు కితాబిచ్చింది. ఇప్పుడు మళ్లీ టి20 వరల్డ్ కప్‌లో అలాంటి అద్భుత క్షణాల కోసం ఇరు జట్ల మధ్య మరో మ్యాచ్‌కు సమయం ఆసన్నమైంది. నాటి పోరు తర్వాత టి20 ఫార్మాట్‌లో ఇరు జట్లు తలపడనుండటం ఇదే తొలిసారి.

న్యూయార్క్: టి20 వరల్డ్ కప్‌లో మాజీ చాంపియన్లు, దాయాది జట్లు భారత్, పాకిస్తాన్ మధ్య పోరుకు రంగం సిద్ధమైంది. గ్రూప్ 'ఎ'లో భాగంగా నాసా కౌంటీ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే మ్యాచ్‌లో పాక్‌ను టీమిండియా ఎదుర్కొంటుంది. తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై సునాయాసంగా నెగ్గిన భారత్ ఉత్సాహంగా కనిపిస్తుండగా... చిన్న జట్టు అమెరికా చేతిలో ఓడిన పాక్‌పై తీవ్ర ఒత్తిడి ఉంది. అమెరికాలో క్రికెట్‌కు ప్రాచుర్యం కల్పించడంలో భాగంగా ఐసీసీ ఈ మ్యాచ్‌కు భారీ స్థాయిలో ప్రచారం నిర్వహించింది. న్యూయార్క్ అభిమానుల కోసం తక్కువ సమయంలో 34 వేల సామర్థ్యం గల స్టేడియాన్ని నిర్మించింది. పిచ్‌పై ఇప్పటికే చాలా విమర్శలు వస్తున్నాయి.

అక్షర్ స్థానంలో కుల్దీప్!

ఐర్లాండ్‌పై సునాయాసంగా గెలిచిన భారత జట్టులో ఎలాంటి ఆందోళన లేదు. టాపార్డర్‌లో రోహిత్, కోహ్లి, పంత్ ఖాయం కాగా...సూర్యకుమార్, దూబే, పాండ్యాలతో బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. గత మ్యాచ్‌లో విఫలమైనా...అసలు సమయంలో ఎలా చెలరేగాలో కోహ్లికి బాగా తెలుసు. పాండ్యా, జడేజా బ్యాటింగ్ అవసరం లేకుండా టీమ్ విజయాన్ని పూర్తి చేసుకుంది. టాప్–7 వరకు బ్యాటింగ్ సామర్థ్యం ఉంది కాబట్టి జట్టు ఒక మార్పు చేయవచ్చు. అక్షర్ పటేల్ స్థానంలో కుల్దీప్ యాదవ్ జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. గత కొంత కాలంగా కుల్దీప్ మంచి ఫామ్‌లో ఉండటంతో పాటు పాక్‌పై మంచి రికార్డు కూడా ఉంది. పిచ్ స్పిన్‌కు అనుకూలించే అవకాశం ఉంటే మాత్రం ముగ్గురు పేసర్లు బుమ్రా, సిరాజ్, అర్ష్‌దీప్‌లలో ఒకరిని తప్పించి కుల్దీప్‌ను ఎంపిక చేస్తారు.

గందరగోళంలో...

మరో వైపు పాకిస్తాన్ పరిస్థితి మాత్రం ఇబ్బందికరంగా ఉంది. యూఎస్ చేతిలో అనూహ్యంగా ఓడిపోవడంతో అన్ని వైపులనుంచి విమర్శలు వస్తున్నాయి. ఓటమికంటే ఆ మ్యాచ్‌లో పేలవ ఆట తీరు చూస్తే జట్టులో సమస్య ఏమిటో అర్థమవుతుంది. ఓపెనర్లుగా రిజ్వాన్, బాబర్ ఏమాత్రం ప్రభావం చూపలేకపోతున్నారు. అటు కెప్టెన్సీలో కూడా లోపాలతో బాబర్ తీవ్ర ఒత్తిడిలో ఉన్నాడు. మిడిలార్డర్ కూడా బలహీనంగా కనిపిస్తోంది. యూఎస్‌తో కేవలం 159 పరుగులకే పరిమితమైంది. సుదీర్ఘకాలంగా ఈ ఫార్మాట్‌లో ఆడుతున్నా బౌలర్లు షాహీన్ అఫ్రిది, రవూఫ్, నసీమ్ కనీస స్థాయి ప్రదర్శన ఇవ్వడం లేదు. 2021 వరల్డ్ కప్ మ్యాచ్‌లో మినహాయిస్తే ప్రతీ సారి భారత్ చేతిలో భంగపడిన టీమ్ ఈ సారి ఏం చేస్తుందనేది చూడాలి.

టి20 ప్రపంచకప్‌లో నేడు
వెస్టిండీస్ X ఉగాండా
వేదిక: ప్రొవిడెన్స్ : ఉదయం గం. 6 నుంచి
ఒమన్ X స్కాట్లాండ్
వేదిక: నార్త్ సౌండ్: రాత్రి గం. 10:30 నుంచి
స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం


చాంపియన్ స్వియాటెక్

- నాలుగో సారి ఫ్రెంచ్ ఓపెన్ గెలిచిన పోలండ్ స్టార్
- ఫైనల్లో జాస్మిన్ పావ్లినిపై ఘన విజయం


స్వియాటెక్

పారిస్: వరల్డ్ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ ఎర్ర మట్టిపై తన జోరును కొనసాగిస్తూ 'హ్యాట్రిక్' నమోదు చేసింది. గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో వరుసగా మూడో ఏడాది ఆమె చాంపియన్‌గా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో స్వియాటెక్ (పోలండ్) 6–2, 6–1 స్కోరుతో 12వ సీడ్ జాస్మిన్ పావ్లిని (ఇటలీ)పై ఘన విజయం సాధించింది. 2022, 2023, 2024లలో వరుసగా ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గిన స్వియాటెక్...అంతకు ముందు 2020లో కూడా ఇక్కడ విజేతగా ట్రోఫీని అందుకుంది. 2022 యూఎస్ ఓపెన్ కలిసి ఆమె ఖాతాలో మొత్తం ఐదు గ్రాండ్‌స్లామ్‌లు ఉన్నాయి. గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో ఫైనల్ చేరిన ఐదు సార్లూ స్వియాటెక్ టైటిల్ దక్కించుకోవడం విశేషం. 2007 (జస్టిన్ హెనిన్) తర్వాత ఫ్రెంచ్ ఓపెన్‌ను వరుసగా మూడు సార్లు గెలిచిన తొలి మహిళా ప్లేయర్‌గా ఆమె నిలిచింది.

తొలి సారి ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్ చేరిన పావ్లిని బలమైన ప్రత్యర్థి జోరు ముందు నిలవలేకపోయింది. తొలి సెట్‌లో స్వియాటెక్ సర్వీస్‌ను బ్రేక్ చేసి పావ్లిని 2–1తో ముందంజ వేసినా...అది అక్కడితో సరి. పోలండ్ స్టార్ ఆ తర్వాత తన స్థాయికి తగ్గట్లు చెలరేగిపోయి వరుసగా 10 గేమ్‌లను గెలుచుకుంది. ఫలితంగా తొలి సెట్‌ను గెలుచుకోవడంతో పాటు రెండో సెట్‌లోనూ 5–0తో విజయానికి చేరువైంది. ఈ స్థితిలో తర్వాతి గేమ్‌ను ఎలాగో పావ్లిని గెలుచుకోగలిగినా...తర్వాతి గేమ్‌ను అలవోకగా సొంతం చేసుకొని స్వియాటెక్ సంబరాలు చేసుకుంది. 68 నిమిషాల్లో ముగిసిన ఈ పోరులో స్వియాటెక్ 18 విన్నర్లు కొట్టగా...18 అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్స్‌తో పావ్లిని తన ఓటమిని ఆహ్వానించింది. విజేతగా నిలిచిన స్వియాటెక్‌కు 24 లక్షల యూరోలు (సుమారు రూ. 22 కోట్లు) ప్రైజ్‌మనీగా లభించాయి.


పావ్లిని

నేడు పురుషుల ఫైనల్
అల్కరాజ్ (స్పెయిన్) X జ్వెరెవ్ (జర్మనీ)
సా.గం.6.00 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

గట్టెక్కిన దక్షిణాఫ్రికా

న్యూయార్క్: టి20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా చెమటోడ్చి రెండో విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్ 'డి'లో శనివారం జరిగిన పోరులో సఫారీ 4 వికెట్లతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. టాస్ నెగ్గిన సఫారీ ఫీల్డింగ్ ఎంచుకోగా మొదట బ్యాటింగ్ చేపట్టిన నెదర్లాండ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసింది. ఓపెనర్లు మైకేల్ లెవిట్ (0), మ్యాక్స్ ఓ డౌడ్ (2) సహా టాపార్డర్‌లో విక్రమ్‌జీత్ (12) కూడా నిరాశపరిచారు. ఈ దశలో సైబ్రాండ్ (45 బంతుల్లో 40; 2 ఫోర్లు, 1 సిక్స్) దక్షిణాఫ్రికా బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నాడు. లోయర్ ఆర్డర్ బ్యాటర్ లోగాన్ వాన్ బీక్ (23; 3 ఫోర్లు) అండతో జట్టు స్కోరును వంద పరుగులు దాటించాడు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా ఐదో ఓవర్ ముగియకముందే 12 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోవడంతో వన్డే వరల్డ్‌కప్ మ్యాచ్ ఫలితం పునరావృతమవుతుందేమో అనిపించింది. అయితే ట్రిస్టన్ స్టబ్స్ (37 బంతుల్లో 33; 1 ఫోర్, 1 సిక్స్)కు జతయిన మిల్లర్ (51 బంతుల్లో 59 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఐదో వికెట్‌కు 65 పరుగులు జోడించి పరిస్థితి చక్కబెట్టాడు. అనంతరం అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు.



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మిల్లర్

బంగ్లా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో...

లంకపై 2 వికెట్లతో గెలుపు

డాలస్: టి20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ శుభారంభం చేసింది. శనివారం గ్రూప్ 'డి'లో చివరి వరకు ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో బంగ్లా 2 వికెట్ల తేడాతో శ్రీలంకపై విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రిషాద్ హొస్సేన్ (3/22), ముస్తఫిజుర్ (3/17), తస్కీన్ అహ్మద్ (2/25) ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేయగా, అనంతరం తౌహీద్ హృదయ్ (20 బంతుల్లో 40; 1 ఫోర్, 4 సిక్స్‌లు) మెరుపులతో బంగ్లా విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 20 ఓవర్లలో 9 వికెట్లకు 124 పరుగులే చేసింది. ఓపెనర్ నిసాంక (28 బంతుల్లో 47; 7 ఫోర్లు, 1 సిక్స్) మినహా మిగతా బ్యాటర్లంతా విఫలమయ్యారు. అనంతరం బంగ్లాదేశ్ 19 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 125 పరుగులు చేసి గెలిచింది. లిటన్ దాస్ (38 బంతుల్లో 36; 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడగా... తుషార 4, హసరంగ 2 వికెట్లు తీశారు. టోర్నీ లంకకు ఇది వరుసగా రెండో ఓటమి. తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలోనూ ఓడింది.


రిషాద్ హొస్సేన్

అఫ్గానిస్తాన్ సంచలనం

- 84 పరుగులతో చిత్తుగా ఓడిన కివీస్
- గెలిపించిన గుర్బాజ్, ఫజల్, రషీద్



ఫజల్ హక్, గుర్బాజ్ సంబరాలు

గయానా: టి20 ప్రపంచకప్‌లో మరో సంచలన ఫలితం నమోదైంది. పటిష్టమైన న్యూజిలాండ్‌పై బ్యాటింగ్‌లో చెలరేగి... అనంతరం బౌలింగ్‌తో కూల్చేసి... అఫ్గానిస్తాన్ భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. గ్రూప్ 'సి'లో శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో అఫ్గాన్ 84 పరుగుల తేడాతో 2021 రన్నరప్ న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన అఫ్గానిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. కివీస్ ఆటగాళ్ల ఫీల్డింగ్ వైఫల్యాలు అఫ్గాన్ చెప్పుకోదగ్గ స్కోరు చేసేందుకు దోహదం చేశాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రహ్మానుల్లా గుర్బాజ్ (56 బంతుల్లో 80; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగాడు. గుర్బాజ్, ఇబ్రహీమ్ జద్రాన్ (41 బంతుల్లో 44; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 87 బంతుల్లో 103 పరుగులు జోడించారు. అనంతరం న్యూజిలాండ్ సాధారణ లక్ష్యమే అయినా... అఫ్గన్ బౌలింగ్ పదును ముందు కనీసం 16 ఓవర్లు కూడా ఆడలేకపోయింది. పేస్‌తో ఫజల్ హక్ ఫరూఖీ (4/17), స్పిన్‌తో రషీద్ ఖాన్ (4/17) ఇరు వైపుల నుంచి దాడికి దిగడంతో కివీస్ అనూహ్యంగా 15.2 ఓవర్లలో 75 పరుగులకే కుప్పకూలింది. అలెన్ (0), కాన్వే (8), కెప్టెన్ విలియమ్సన్ (9), మిచెల్ (5) పట్టుమని పది పరుగులైనా చేయలేకపోయారు. గ్లెన్ ఫిలిప్స్ (18), మ్యాట్ హెన్రీ (12) ఇద్దరు మాత్రమే రెండంకెల స్కోరు సాధించారు.

ఆస్ట్రేలియా 201/7

బ్రిడ్జ్‌టౌన్: ఆసీస్ బ్యాటర్లంతా సమష్టిగా రాణించడంతో ఇంగ్లండ్‌పై భారీ స్కోరు సాధ్యమైంది. శనివారం ప్రపంచ కప్ గ్రూప్ 'బి'లో జరిగిన లీగ్ మ్యాచ్‌లో తొలుత ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. హెడ్ (18 బంతుల్లో 34; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), వార్నర్ (16 బంతుల్లో 39; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), కెప్టెన్ మార్ష్ (25 బంతుల్లో 35; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), స్టొయినిస్ (17 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మ్యాక్స్‌వెల్ (25 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్) ధాటిగా ఆడారు. జోర్డాన్‌కు 2 వికెట్లు దక్కాయి.

సినిమా


కీర్తి సురేష్

బాలీవుడ్ కాలింగ్

ప్రతి ఏడాది బాలీవుడ్ తారలు కొంతమంది టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుంటారు. అలాగే దక్షిణాది హీరోయిన్లు కూడా బాలీవుడ్ ఎంట్రీ ఇస్తుంటారు. ఈ ఏడాది కొందరు సౌత్ హీరోయిన్లను బాలీవుడ్ పిలిచింది. బాలీవుడ్ నుంచి కాల్ అందుకుని, ప్రస్తుతం అక్కడ సినిమాలు చేస్తున్న దక్షిణాది కథానాయికల గురించి తెలుసుకుందాం.

కాస్త ఆలస్యంగా...

దక్షిణాదిలో అగ్ర కథానాయికల్లో కీర్తి సురేష్ ఒకరు. నటిగా సౌత్‌లో తన సత్తా ఏంటో సిల్వర్ స్క్రీన్‌పై చూపించిన కీర్తి సురేష్ బాలీవుడ్‌లోనూ టాప్ హీరోయిన్ల జాబితాలో చోటు సంపాదించుకోవాలని నిర్ణయించుకున్నట్లున్నారు. ఈ క్రమంలోనే హిందీ చిత్రం 'బేబీ జాన్'కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వరుణ్ ధావన్ హీరోగా నటించిన ఈ సినిమాలో కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటించారు. హిందీలో కీర్తికి ఇది తొలి చిత్రం కాగా ఈ చిత్రదర్శకుడు కాలీస్ (తమిళ డైరెక్టర్)కు కూడా హిందీలో ఇదే తొలి చిత్రం. తమిళంలో అట్లీ దర్శకత్వం వహించిన 'తేరి' సినిమాకు హిందీ రీమేక్‌గా 'బేబీ జాన్' తెరకెక్కింది. జ్యోతిదేశ్ పాండే, మురాద్ ఖేతనీ, అట్లీ, ప్రియా అట్లీ ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమాను మే 31న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ వాయిదా పడింది. కొత్త తేదీ పై స్పష్టత రావాల్సి ఉంది. అలాగే కీర్తి సురేష్, రాధికా ఆప్టే లీడ్ రోల్స్‌లో హిందీలో ఓ యాక్షన్ వెబ్ సిరీస్ కూడా రూపొందుతోంది. ఇదిలా ఉంటే... 'బేబీ జాన్' చిత్రాని కన్నా ముందే కీర్తికి బాలీవుడ్ ఆఫర్ వచ్చింది. అజయ్ దేవగన్ హీరోగా నటించిన హిందీ చిత్రం 'మైదాన్'లో ముందు హీరో యిన్‌గా కీర్తి సురేష్‌ను తీసుకున్నారు ఈ చిత్రదర్శకుడు అమిత్ శర్మ. కానీ ఆ తర్వాత కీర్తి సురేష్ ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోగా, ప్రియమణి నటించారు. 'మైదాన్' ఈ ఏడాది ఏప్రిల్ 10న రిలీజైంది. ఇలా కీర్తి సురేష్ బాలీవుడ్ ఎంట్రీ కాస్త ఆలస్యమైంది.


సమంత

కెరీర్‌లో యాభైకి పైగా సినిమాల్లో నటించి, దక్షిణాదిన స్టార్ హీరోయిన్ జాబితాలో చేరిపోయారు సమంత. హిందీలో 'ఫ్యామిలీ మేన్' సీజన్ 2 వెబ్ సిరీస్‌లో చేసిన రాజ్యలక్ష్మి పాత్రతో ఉత్తరాదిన కూడా పాపులారిటీ సంపాదించుకున్నారు. ఇదే జోష్‌లో ఇండియన్ వెర్షన్ 'సిటాడెల్' వెబ్ సిరీస్‌ను కూడా పూర్తి చేశారామె. వరుణ్ ధావన్ హీరోగా నటించిన ఈ హిందీ సిరీస్ త్వరలోనే స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ఇలా హిందీలో రెండు వెబ్ సిరీస్‌లు చేసిన సమంత ఇంకా అక్కడ ఒక్క సినిమా కూడా చేయలేదు. గతంలో రణ్‌వీర్ సింగ్, విక్కీ కౌశల్, రాజ్‌కుమార్ రావుల సినిమాల్లో సమంత హీరోయిన్‌గా నటిస్తారనే ప్రచారం సాగింది. కానీ అప్పట్లో ఆమె అనారోగ్య పరిస్థితుల కారణంగా కుదర్లేదట. ఇప్పుడు ఆ సమయం వచ్చిందట. ఓ హిందీ చిత్రం కోసం సమంత ఇటీవల కథ విన్నారని బాలీవుడ్‌లో వార్తలు వస్తున్నాయి. సో... హిందీలో సమంత నటించే తొలి చిత్రంపై స్పష్టత రావడానికి కొన్ని రోజులు ఎదురుచూడక తప్పదు.


సాయి పల్లవి


సంయుక్తా మీనన్

ఏక్ దిన్

హీరోయిన్ సాయి పల్లవికి సౌత్‌లో మంచి క్రేజ్ ఉంది. ఈ క్రేజ్‌ను బాలీవుడ్‌లోనూ రిపీట్ చేయాలనుకుంటున్నారీ బ్యూటీ. బాలీవుడ్ సూపర్ స్టార్ ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ నటించిన చిత్రం 'ఏక్ దిన్' (ప్రచారంలో ఉన్న టైటిల్)లో నటించారు సాయి పల్లవి. హిందీలో సాయి పల్లవి నటించిన తొలి చిత్రం ఇదే. ఈ సినిమా మేజర్ షూటింగ్ జపాన్‌లో జరిగింది. ఆమిర్ ఖాన్ ఓ నిర్మాతగా ఉన్న ఈ 'ఏక్ దిన్' సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ ఏడాదే విడుదల చేయాలనుకుంటున్నారు. దక్షిణాది భాషల్లో కూడా ఈ చిత్రాన్ని విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారట ఆమిర్ ఖాన్. మరో వైపు మరో హిందీ చిత్రం 'రామాయణ్'లో సాయి పల్లవి నటిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ హీరోగా నటిస్తున్నారు. సీతారాములుగా సాయి పల్లవి, రణ్‌బీర్ నటిస్తున్న ఈ భారీ చిత్రానికి నితీష్ తివారి దర్శకత్వం వహిస్తున్నారు. యశ్, నమిత్ మల్హోత్రా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 2025 చివర్లో ఈ సినిమా తొలి భాగాన్ని విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారని బాలీవుడ్ టాక్.

కబురొచ్చింది

ప్రస్తుతం తెలుగులో ట్రెండింగ్ హీరోయిన్లలో శ్రీలీల ఒకరు. నటన పరంగా ఈ బ్యూటీకి ప్రేక్షకులు మంచి మార్కులే వేశారు. అందువల్లే రవితేజ 'ధమాకా', మహేశ్‌బాబు 'గుంటూరు కారం' వంటి సినిమాల్లో హీరోయిన్‌గా నటించగలిగారు. తాజాగా శ్రీలీలకు బాలీవుడ్ నుంచి కబురొచ్చిందని టాక్. బాలీవుడ్ స్టార్ హీరో సైఫ్ అలీఖాన్ తనయుడు ఇబ్రహీం అలీఖాన్ హీరోగా 'దిలేర్' అనే సినిమా రూపొందుతోంది. కృణాల్ దేశ్‌ముఖ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్‌లో ఇద్దరు హీరోయిన్లకు చోటు ఉందట. ఓ హీరోయిన్ పాత్ర కోసం మేకర్స్ శ్రీలీలను సంప్రదించారని సమాచారం. కథ నచ్చడంతో శ్రీలీల కూడా ఓకే చెప్పారని వినికిడి. అదే నిజమైతే శ్రీలీలకు ఇదే తొలి హిందీ చిత్రం అవుతుంది.

కేరాఫ్ మహారాజ్ఞి

'బింబిసార, సార్, విరూపాక్ష, డెవిల్' వంటి తెలుగు సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు సంయుక్తా మీనన్. అలాగే మలయాళ, తమిళ, కన్నడ చిత్రాల్లోనూ హీరోయిన్‌గా నటించి పాపులర్ అయ్యారామె. ఇప్పుడు బాలీవుడ్ ఎంట్రీకీ రెడీ అయ్యారు. కానీ హీరోయిన్‌గా కాదు... ఓ లీడ్ రోల్‌లో... కాజోల్, ప్రభుదేవా లీడ్ రోల్స్‌లో 'మహారాజ్ఞి: క్వీన్ ఆఫ్ క్వీన్స్' అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. చరణ్‌తేజ్ ఉప్పలపాటి ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీకి దర్శకుడు. ఈ సినిమాలో సంయుక్తా మీనన్ ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. ఈ సినిమాలో కాజోల్‌కు చెల్లి పాత్రలో కనిపిస్తారట సంయుక్త. నసీరుద్దీన్ షా, ఆదిత్య సీల్, ఛాయా కదమ్ వంటివారు ఈ సినిమాలోని ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. వెంకట అనీష్, హర్మాన్ బవేజా ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

ఇలా బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న దక్షిణాది కథానాయికల జాబితాలో మరికొంతమంది ఉన్నారు.


శ్రీలీల





ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు... నటుడు మోహన్‌బాబు, సంగీత దర్శకుడు ఇళయరాజా, నిర్మాత నాగ సుశీల, నటుడు నాగార్జున

కాంచనలో మృణాల్?

'సీతారామం, ఫ్యామిలీ స్టార్' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు హిందీ హీరోయిన్ మృణాల్ ఠాకూర్. మరోవైపు తమిళం నుంచి కూడా ఆమెకు అవకాశాలు వస్తున్నాయి. శివ కార్తికేయన్ హీరోగా ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో రూపొందుతున్న ఓ తమిళ సినిమాలో తొలుత మృణాల్ ఠాకూర్‌నే హీరోయిన్‌గా అనుకున్నారు. అయితే ఈ చాన్స్ కన్నడ భామ రుక్మిణీ వసంత్ దక్కించుకున్నారు. ఇప్పుడు మృణాల్ కోలీవుడ్ ఎంట్రీ గురించి మళ్లీ వార్తలు వస్తున్నాయి. హారర్ హిట్ ఫ్రాంచైజీ 'కాంచన'లో రానున్న 'కాంచన 4'లో మృణాల్‌ని తీసుకున్నారట. రాఘవా లారెన్స్ నటించి, దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో ఓ హీరోయిన్‌గా మృణాల్ నటించనున్నారని టాక్. మరి.. వార్తల్లో ఉన్నట్లు 'కాంచన 5'లో మృణాల్ నటిస్తే తమిళంలో ఆమెకు ఇదే తొలి చిత్రం అవుతుంది.


మృణాల్

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా పెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

గ్రూప్-2 మెయిన్స్ వాయిదా వేయాలి

నిరుద్యోగ జేఏసీ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన గ్రూప్-2 నోటిఫికేషన్‌కు సంబంధించి మెయిన్స్ పరీక్షను రెండు నెలలు వాయిదా వేయాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే ప్రిలిమినరీ పరీక్ష పూర్తవగా ఇంతలోనే ఎన్నికలు వచ్చిన నేపథ్యంలో చాలా మంది నిరుద్యోగులు, అభ్యర్థులు మెయిన్స్‌కు సన్నద్ధం కావడానికి ఆటంకం ఏర్పడిందన్నారు. కనీసం రెండు నెలలు మెయిన్స్ పరీక్షలను వాయిదా వేసి, డిప్యూటీ డీఈఓ మెయిన్స్‌కు 1:100 రేషియోతో మెయిన్స్‌కు ఎంపిక చేయాలని, కానిస్టేబుల్స్‌కు సంబంధించిన కోర్టు కేసును పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఎడ్‌సెట్-2024కు 86.67 శాతం హాజరు

ఏయూ క్యాంపస్: రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఎడ్‌సెట్-2024 ప్రవేశ పరీక్షకు 86.67 శాతం హాజరు నమోదైందని కన్వీనర్ ఆచార్య టి.వెంకట కృష్ణ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 52 కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్ష జరిగినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు 10,805 మంది దరఖాస్తు చేయగా, 9,365 మంది హాజరయ్యారని తెలిపారు. ఏయూలో రిజిస్ట్రార్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ ఎడ్‌సెట్ కీ శనివారం విడుదల చేశారు.


మూడు రోజులు తేలికపాటి వర్షాలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో మరో మూడు రోజులు తేలికపాటి వర్షాలు కురవనున్నాయి. ప్రస్తుతం దిగువ ట్రోపో ఆవరణంలో దక్షిణ, నైరుతి దిశ నుంచి గాలులు వీస్తున్నాయి. మరోవైపు నైరుతి రుతుపవనాలు కోస్తాంధ్రలోని విస్తరిస్తున్నాయి. ఫలితంగా కోస్తాంధ్ర, రాయలసీమల్లో వచ్చే మూడు రోజులు అక్కడక్కడా తేలికపాటి వానలు కురిసే అవకాశాలున్నాయి. ఉరుములు, మెరుపులతోపాటు పిడుగులు కూడా సంభవిస్తాయని ఐఎండీ తెలిపింది. ఆదివారం విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉందని, ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. కాగా.. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు ప్రకాశం జిల్లా బెస్తవారిపేటలో అత్యధికంగా 3.6 సెం.మీ., దుత్తలూరు (నెల్లూరు) 3.2, యాడికి (అనంతపురం) 2.8 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

తుంగభద్ర ఆయకట్టుకు సమృద్ధిగా నీళ్లు అందేనా?

ఈఏడాది టీబీ డ్యామ్‌లో 170 టీఎంసీల లభ్యత!

- తుంగభద్ర బోర్డు, మూడు రాష్ట్రాల అధికారులు అంచనా
- గతేడాది ఎల్‌నినో ప్రభావంతో బేసిన్‌లో కనిష్ట వర్షపాతం
- దాంతో డ్యామ్‌లోకి 114.58 టీఎంసీల ప్రవాహం
- ఆయకట్టులో ఆరుతడి పంటలు సాగుచేసుకున్న రైతులు



సాక్షి, అమరావతి: నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని వాతావరణ సంస్థ(ఐఎండీ) అంచనాల నేపథ్యంలో ఈ ఏడాది తుంగభద్ర డ్యామ్‌లో 170 టీఎంసీల లభ్యత ఉంటుందని తుంగభద్ర బోర్డు, ఏపీ, కర్ణాటక, తెలంగాణ జలవనరుల అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత నీటి సంవత్సరంలో అంటే ఈనెల 1 నుంచి తుంగభద్ర బేసిన్‌లో కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల ఇప్పటికి 0.67 టీఎంసీలు తుంగభద్ర డ్యామ్‌లోకి చేరాయి. ఇక శనివారం డ్యామ్‌లోకి 1,490 క్యూసెక్కులు చేరాయి. గతేడాది ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు సక్రమంగా కురవలేదు. దాంతో తుంగభద్ర డ్యామ్‌లోకి కేవలం 114.58 టీఎంసీల ప్రవాహం వచ్చింది. తాగునీటి అవసరాలకుపోను మిగతా నీటితో ఆరుతడి పంటలను ఆయకట్టు రైతులు సాగుచేశారు. ఈ ఏడాదైనా తుంగభద్ర డ్యామ్‌లో నీటి లభ్యత పుష్కలంగా పెరుగుతుందని.. ఆయకట్టుకు సమృద్ధిగా నీళ్లందాలని రైతులు ఆశిస్తున్నారు.

కేటాయింపుల మేరకైనా లభ్యత ఉండేనా..

తుంగభద్ర డ్యామ్‌లో 230 టీఎంసీల లభ్యత ఉంటుందని అంచనా వేసిన బచావత్ ట్రిబ్యునల్.. కర్ణాటకకు 151.49, ఏపీకి 72 (హెచ్చెల్సీ 32.50, ఎల్లెల్సీ 29.50, కేసీ 10.00), తెలంగాణకు 6.51 (రాజోలిబండ డైవర్షన్ స్కీం) టీఎంసీల చొప్పున కేటాయించింది. ఏటా పూడిక పేరుకుపోతుండటంతో డ్యామ్ నిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తోంది. 2016లో నిర్వహించిన సర్వేలో డ్యామ్ సామర్థ్యం 105.78 టీఎంసీలని తేలింది. తగ్గిన నిల్వ సామర్థ్యం.. నీటిలభ్యత ఆధారంగా దామాషా పద్ధతిలో మూడు రాష్ట్రాలకు తుంగభద్ర బోర్డు పంపిణీ చేస్తూ వస్తోంది. గతేడాది తుంగభద్ర డ్యామ్‌లోకి కేవలం 114.58 టీఎంసీల ప్రవాహమే వచ్చింది. అంటే.. బచావత్ ట్రిబ్యునల్ అంచనా వేసిన దాంట్లో కేవలం 49.81 శాతం మేర మాత్రమే తుంగభద్ర డ్యామ్‌లో నీటి లభ్యత ఉన్నట్లు స్పష్టమవుతోంది. తుంగభద్ర డ్యామ్‌లోకి 2016–17లో కేవలం 85.719 టీఎంసీలే చేరాయి. డ్యామ్ చరిత్రలో అదే కనిష్ట వరద ప్రవాహం కావడం గమనార్హం. ఈ ఏడాదైనా బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపుల మేరకైనా నీటి లభ్యత ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు.

తుంగభద్ర డ్యామ్‌లోకి గత పదేళ్లుగా వచ్చిన ప్రవాహం వివరాలు

నీటి సంవత్సరం	వచ్చిన నీరు (టీఎంసీల్లో)
2014-15	348.04
2015-16	113.81
2016-17	85.71
2017-18	125.39
2018-19	357.66
2019-20	419.60
2020-21	299.53
2021-22	410.21
2022-23	606.64
2023-24	114.58

నాలుగేళ్లూ పుష్కలంగా నీటి లభ్యత..

తుంగభద్ర డ్యామ్‌లోకి 2015 నుంచి 2018 వరకు అరకొరగానే ప్రవాహం వచ్చింది. ఇక 2019–20 నుంచి 2022–23 వరకు నాలుగేళ్లు టీబీ డ్యామ్‌లో బచావత్ ట్రిబ్యునల్ అంచనా వేసిన దానికంటే అధికంగా లభ్యత నమోదైంది. బేసిన్‌లో భారీ వర్షాలు కురవడంతో డ్యామ్‌లోకి వరద ప్రవాహం కొనసాగింది. నీటి లభ్యత పుష్కలంగా ఉండటంతో రాయలసీమ, కర్ణాటక, తెలంగాణలోని ఆయకట్టు రైతులు భారీ ఎత్తున పంటలు సాగుచేయడంతో సస్యశ్యామలమైంది. దిగుబడులు భారీగా రావడం .. గిట్టుబాటు ధర దక్కడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

వీఏఏ పదోన్నతుల ప్రక్రియ నిలిపివేత

సాక్షి, అమరావతి: వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో సేవలందిస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ)లకు వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో గ్రేడ్-2)గా పదోన్నతి కల్పించే ప్రక్రియను తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు నిలుపుదల చేయాలని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 10,778 ఆర్బీకేల్లో 6,500 మంది వీఏఏలు సహా 14,323 మంది సిబ్బందితో పాటు 1,573 బహుళార్థ వ్యవసాయ విస్తరణ అధికారులు సేవలందిస్తున్నారు. వీఏఏల విద్యార్హతలు, సీనియార్టీ ఆధారంగా వారికి ఏఈవో గ్రేడ్-2గా పదోన్నతులు కల్పించాలని వైఎస్ జగన్ ప్రభుత్వం ఫిబ్రవరి 29న ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మార్గదర్శకాలు రూపొందించి సీనియారిటీ జాబితా సిద్ధం చేయాలని మార్చి మొదటి వారంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారులకు ఆదేశాలు ఇచ్చింది. అయితే ఇంతలో ఎన్నికల షెడ్యూల్ విడుదలవడం, కోడ్ అమలులోకి రావడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ నెల 6 నుంచి ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో జిల్లా వ్యవసాయాధికారులు వీరి పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేసేందుకు సన్నద్ధమయ్యారు. ఈ మేరకు పలు జిల్లాల్లో ఇప్పటికే సీనియారిటీ జాబితాలు కూడా సిద్ధం చేశారు. అయితే కొన్ని జిల్లాల్లో ఈ పదోన్నతుల ప్రక్రియపై పలు సంఘాల నుంచి అభ్యంతరాలు, ఆరోపణలు వ్యక్తమయ్యాయి. అలాగే కొత్త ప్రభుత్వం కొలువు దీరే సమయంలో పదోన్నతుల ప్రక్రియ చేపట్టడం సరికాదని అధికారులు భావించారు. దీంతో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ ప్రక్రియను నిలిపివేయాలని చేవూరు హరికిరణ్ ఆదేశాలు జారీ చేశారు.

బాబు ప్రమాణ స్వీకారానికి విస్తృత ఏర్పాట్లు

- గన్నవరం ఐటీ పార్కు సమీపంలోని 12 ఎకరాల స్థలం సిద్ధం
- వీవీఐపీల కోసం ఎయిర్‌పోర్టులో ప్రత్యేక హెలీప్యాడ్‌లు

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే కార్యక్రమానికి కృష్ణా జిల్లా గన్నవరం ఐటీ పార్కు వద్ద అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 12వ తేదీ ఉదయం 11.27 గంటలకు చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా నిర్వహించే సభ కోసం గన్నవరం మండలం కేసరపల్లిలోని ఐటీ పార్కు సమీపంలో 12 ఎకరాల స్థలాన్ని సిద్ధం చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీతో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, రాజకీయ ప్రముఖులు వస్తుండడంతో అందుకు అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టారు. ఆ ప్రాంతంలోని ముళ్ల పొదలను తొలగించి చదును చేశారు. ప్రాంగణాన్ని మూడు ప్రాంతాలుగా విభజించి ఒకచోట వేదిక నిర్మిస్తున్నారు. వీవీఐపీలు, వీఐపీలు, మీడియాతో పాటు నాయకులు, కార్యకర్తల కోసం మిగిలిన ప్రాంతాన్ని బ్లాకులుగా విభజించారు. ప్రముఖుల కోసం గన్నవరం విమానాశ్రయంలో ప్రత్యేకంగా పదికి పైగా హెలిప్యాడ్‌లు ఏర్పాటు చేయబోతున్నారు. వీవీఐపీలు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి సభా వేదిక వద్దకు వచ్చి వెళ్లేందుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమానికి వచ్చే ప్రముఖులకు వసతి సౌకర్యం కూడా ఇస్తున్నారు. సభకు వచ్చే ప్రజలకు మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేయనున్నారు. పార్కింగ్ కోసం సమీపంలోని వీఐపీ లేఅవుట్, గంగరాజు, విమానాశ్రయం, వెటర్నరీ కళాశాల, మేధా టవర్స్, పెట్రోల్ బంక్ వద్ద గల పార్కింగ్ ప్రదేశాలను ఎంపిక చేశారు. సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రదేశాలకు చేరుకునేందుకు వీలుగా అప్రోచ్ రహదారులను నిర్మిస్తున్నారు. ఏర్పాట్ల గురించి శనివారం ఎయిర్‌పోర్టులోని కాన్ఫరెన్స్ హాలులో ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులతో సమావేశమై చర్చించారు. సమావేశంలో అదనపు డీజీ ఎస్. బాగ్చి, ఐజీలు రాజశేఖర్‌బాబు, అశోక్‌కుమార్, విజయవాడ పోలీస్ కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు బాలాజీ, ఢిల్లీ రావు, కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పాల్గొన్నారు.

సీఎస్ సమీక్ష

కార్యక్రమ ఏర్పాట్లపై శనివారం విజయవాడ తన క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అధికారులతో సమీక్షించారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్ సహా పలువురు ప్రముఖులు హాజరు కానున్న దృష్ట్యా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను సీఎస్ ఆదేశించారు. విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డీజీపీ హరీశ్‌కుమార్ గుప్త, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ముఖ్య కార్యదర్శులు ఎం.రవిచంద్ర, శశిభూషణ్‌కుమార్, పౌర సరఫరాలు, ఉద్యాన శాఖల కమిషనర్లు అరుణ్‌కుమార్, శ్రీధర్, సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్, ఏపీ జెన్కో సీఎండీ చక్రధర్‌బాబు, ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్, ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్‌కుమార్, గన్నవరం విమానాశ్రయం డైరెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఫైబర్ నెట్'తో సహా పలు కార్పొరేషన్ల చైర్మన్ల రాజీనామా

ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ పదవికి మల్లాది విష్ణు కూడా..

నరసరావుపేట/గుంటూరు రూరల్/మధురానగర్/గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని పలు కార్పొరేషన్లకు చైర్మన్లుగా వ్యవహరిస్తున్న పలువురు తమ పదవులకు శనివారం రాజీనామా చేశారు. ఏపీ స్టేట్ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ పదవికి మల్లాది విష్ణు రాజీనామా చేసి ఆ పత్రాన్ని ఏపీ స్టేట్ ప్లానింగ్ బోర్డు అధికారులు, ప్రభుత్వానికి పంపించారు. ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తన పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. షేక్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ షేక్ ఆషాబేగం ఖాజావలి తన రాజీనామా లేఖను బీసీ వెల్ఫేర్ డిపార్టుమెంట్ ప్రత్యేక చీఫ్ సెక్రటరీకి పంపించారు. ఏపీ రాష్ట్ర కుమ్మర, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ మండేపూడి పురుషోత్తం తన పదవికి రాజీనామా చేసి సంబంధిత పత్రాన్ని ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి పంపారు.

భూదాన్ బోర్డు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి రాజీనామా

సాక్షి, అమరావతి: భూదాన్ యజ్ఞ బోర్డు చైర్మన్ పదవికి తాడి విజయభాస్కర్‌రెడ్డి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను శనివారం రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పంపారు.

హరీశ్ కుమార్ రాజీనామా

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పదవులు పొందినవారు వరుసగా రాజీనామాలు చేస్తున్నారు. తాజాగా యాదవ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవికి నాన్యంపల్లె హరీశ్ కుమార్ శనివారం రాజీనామా చేశారు. తన రాజీనామాను ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ–సీఈవోకి పంపారు. దీన్ని వెంటనే ఆమోదించాలని కోరారు.

ఎంతో కష్టపడ్డాం.. మంత్రి పదవి ఇవ్వండి

చంద్రబాబును కోరుతున్న సీనియర్, జూనియర్ ఎమ్మెల్యేలు.. లోకేశ్ చుట్టూ అదే పనిగా చక్కర్లు

ఎవరికీ హామీ ఇవ్వని తండ్రీకొడుకులు

మంత్రివర్గం, కీలక పదవులపై పార్టీ నేతల్లో ఉత్కంఠ

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీలో మంత్రి పదవులపై ఉత్కంఠ నెలకొంది. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటు నేపథ్యంలో చంద్రబాబు ఢిల్లీ రాజకీయాలపైనే ఎక్కువగా దృష్టి కేంద్రీకరించడంతో రాష్ట్ర మంత్రివర్గంపై ఇంకా పూర్తిస్థాయి కసరత్తు జరపలేదని చెబుతున్నారు. మంత్రులుగా ఎవరిని తీసుకోవాలనే దానిపై ప్రాథమికంగా ఒక అవగాహనకు వచ్చినా ఇంకా కచ్చితమైన నిర్ణయం తీసుకోలేదని సమాచారం. అయితే, మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్న చాలామంది తమకు అవకాశం ఇవ్వాలని చంద్రబాబుపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చాలా కష్టపడ్డామని, ఎంతో చేశామని తమకు అవకాశం ఇవ్వాల్సిందేనని పలు జిల్లాలకు చెందిన సీనియర్లు ఆయన్ను కోరుతున్నారు. నేరుగా ఆయన్ను కలిసి తమకు అవకాశం కల్పించాలని కోరడంతోపాటు వివిధ మార్గాల ద్వారా ఆయనపై ఒత్తిడి పెంచుతున్నారు.



లోకేశ్ చుట్టూ చక్కర్లు..

చంద్రబాబుతోపాటు ఆయన తనయుడు లోకేశ్ పార్టీలో కీలకంగా ఉండడంతో అనేకమంది ముందు ఆయన్ను కలుస్తున్నారు. ఎన్నికలకు ముందు లోకేశ్ పలువురికి మంత్రి పదవులు ఇస్తానని హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇప్పుడు వారంతా తమకిచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతున్నారు. నిత్యం ఆయన్ను కలుస్తూ తమ గురించి ఆలోచించాలని విన్నవించుకుంటున్నారు. అయితే, ఫలితాల తర్వాత ఇప్పటివరకు ఎవరికీ చంద్రబాబు ఆయన తనయుడు లోకేశ్ మంత్రి పదవి హామీ ఇవ్వలేదని తెలుస్తోంది. జనసేన, బీజేపీకి మంత్రి పదవులు ఇవ్వాల్సి వుండడం, టీడీపీలోనే ఆశావహులు ఎక్కువగా ఉండడంతో ఎవరికీ ఏ విషయం చెప్పకుండా ఇంకా ఏమీ ఆలోచించలేదని సర్దిచెబుతున్నారు.

తమ సంగతి చూడాలంటున్న సీనియర్లు..

ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం ముగిసిన తర్వాత చంద్రబాబు మంత్రివర్గ కూర్పుపై దృష్టిపెడతారని చెబుతున్నారు. భవిష్యత్తులో తాము పోటీచేసే అవకాశం ఉండకపోవచ్చని, ఈసారి ఎలాగైనా మంత్రిగా అవకాశం ఇవ్వాలని పలువురు సీనియర్లు ఆయన్ను కోరుతున్నారు. గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కళా వెంకట్రావు, అయ్యన్నపాత్రుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వంటి నేతలు ఈ కోవలో ఉన్నారు. సామాజికవర్గ నేపథ్యంలో తమకు అవకాశం ఇవ్వాలని బొండా ఉమామహేశ్వరరావు వంటి నేతలు గట్టిగా అడుగుతున్నట్లు సమాచారం. క్లిష్ట సమయంలో పార్టీ కోసం పనిచేసిన తమకు ఎలాగైనా మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని పయ్యావుల కేశవ్, ధూళిపాళ్ల నరేంద్ర, నిమ్మల రామానాయుడు వంటి నేతలు ఒత్తిడి తెస్తున్నారు.

లోకేశ్‌పై ఆశలు పెట్టుకున్న జూనియర్లు..

మరోవైపు.. లోకేశ్ అండతో పార్టీలో ఎదిగిన నేతలు, ఆయన ద్వారా సీటు దక్కించుకుని గెలిచిన జూనియర్లు తమకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని అడుగుతుండడం చర్చనీయాంశమైంది. పెదకూరపాడు నుంచి గెలిచిన భాష్యం ప్రవీణ్ వంటి నేతలు ఇలాంటి వారిలో ఉన్నారు. అయితే, అందరికీ మంత్రి పదవులు ఇవ్వలేమని చూస్తామని మాత్రమే లోకేశ్ చెబుతున్నట్లు తెలిసింది. సీనియర్ నాయకులకు సైతం ఇప్పటివరకు మంత్రి పదవుల హామీ లభించలేదు. సాధారణంగా అయితే చంద్రబాబు ఈపాటికి మంత్రి పదవుల కోసం అభిప్రాయ సేకరణ, సామాజిక సమీకరణలు, సీనియారిటీ వంటి అంశాల ప్రాతిపదికగా కసరత్తు చేయాల్సి వుంది. కానీ, ఇప్పుడు అదేమీ లేకపోవడంతో ఎవరికి మంత్రి పదవులు దక్కుతాయో, ఆయన మనసులో ఏముందోనని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. సీనియర్లు తమకు అవకాశం వస్తుందా? లేదా? అని చంద్రబాబుకి సన్నిహితంగా ఉండే వారి నుంచి తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే, మంత్రివర్గం, కీలక పదవుల గురించి ఎలాంటి విషయాలు బయటకు చెప్పకపోవడంతో పార్టీ నేతలు ఉత్కంఠకు లోనవుతున్నారు.

జనసేనకు నాలుగు మంత్రి పదవులు!

చంద్రబాబు నుంచి సంకేతాలు..

కేంద్రంలో రాష్ట్రానికిచ్చే పదవులు, రాష్ట్రంలో బీజేపీకి కేటాయించే పదవుల ఆధారంగా జనసేనకు ఐదో పదవి

నాదెండ్ల మంత్రివర్గంలో ఉంటారని పార్టీలో చర్చ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జనసేన పార్టీకి నాలుగుకు తక్కువకాకుండా మంత్రి పదవుల కేటాయింపు ఉంటుందని ఆ పార్టీకి చంద్రబాబు నుంచి స్పష్టమైన సంకేతాలు వచ్చాయి. కేంద్ర కేబినెట్‌లో రాష్ట్రానికి దక్కే పదవులతో పాటు రాష్ట్ర మంత్రివర్గంలో బీజేపీకి కేటాయించే పదవులను బట్టి జనసేనకు ఐదో మంత్రి పదవి ఆధారపడి ఉన్నట్లు తెలుస్తోంది. నిజానికి.. కేంద్రమంత్రి పదవులతో పాటు రాష్ట్ర మంత్రివర్గంలోనూ ఏ పార్టీకి ఎన్ని పదవులన్న దానిపై శనివారమే కొంత స్పష్టత వస్తుందని భావించినప్పటికీ.. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇద్దరూ రాజకీయేతర కార్యక్రమాలతో బిజీగా ఉండడంతో ఇరువురి మధ్య ఈ అంశం చర్చకు రాలేదని జనసేన వర్గాలు తెలిపాయి. మరోవైపు.. రాష్ట్ర కేబినెట్‌లో జనసేన నుంచి అధినేత పవన్‌కళ్యాణ్‌తో పాటు పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తప్పక ఉంటారని పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది. అలాగే, జనసేనలో మిగిలిన పదవులు ఎవరికన్నది టీడీపీలో మంత్రి పదవుల కేటాయింపుపై ఆధారపడి ఉంది. అయితే, పవన్ ఇప్పటివరకు ఎవరికీ మంత్రి పదవులపై హామీ ఇవ్వలేదని.. చంద్రబాబుతో భేటీ అనంతరమే ఆయన ఆ వివరాలు వెల్లడిస్తారని పార్టీలో చర్చ జరుగుతోంది.

వీరే ఆశావహులు..

ఈ ఎన్నికల్లో జనసేన పోటీచేసిన మొత్తం 21 స్థానాల్లో 15 ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోనే పోటీచేసింది. దీంతో.. పవన్, నాదెండ్లకు కాకుండా జనసేనకు ఇంకెన్ని మంత్రి పదవులు దక్కినా అవి ఆ మూడు జిల్లాలోని వారికే ఇచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ జనసేనకు ఐదో మంత్రి పదవి దక్కిన పక్షంలో విజయనగరం జిల్లా నెలిమర్ల నుంచి గెలిచిన లోకం నాగమాధవి లేదా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులలో ఒకరికి అవకాశం కల్పించే అవకాశం ఉంది. ఇక జనసేనలో కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, దేవవరప్రసాద్, కందుల దుర్గేష్, బొమ్మిడి నారాయణ నాయకర్ మంత్రి పదవుల రేసులో ఉన్నారు.

'చిరుధాన్యాల' మోదీ



మోదీ చిత్రపటంతో విజయ్ కుమార్

ప్రధానిగా మోదీ పదవీ బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో విశాఖకు చెందిన చిత్రకారుడు మోకా విజయ్ కుమార్ చిరుధాన్యాలతో మోదీ చిత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. వారం పాటు శ్రమించి మోదీతో పాటు ఛత్రపతి శివాజీ చిత్రాలను తయారు చేశారు. ఇవి ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. - ఏయూ క్యాంపస్

రామోజీ కన్నుమూత

▶ మొదటి పేజీ తరువాయి

ఆయన భౌతికకాయాన్ని శనివారం ఉదయం 7.45 గంటలకు రామోజీ ఫిలింసిటీకి తీసుకొచ్చారు.

సినీ, రాజకీయ ప్రముఖుల నివాళులు

రామోజీ మరణ వార్త తెలిసి రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులు, అభిమానులు సంతాపం వ్యక్తం చేశారు. ఫిలింసిటీలో రామోజీ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు దంపతులు, నారా లోకేశ్ దంపతులు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, సినీ నటులు చిరంజీవి, రాజేంద్రప్రసాద్, మంచు మనోజ్, త్రివిక్రమ్, రాజమౌళి, కీరవాణి, సాయికుమార్‌తోపాటు ఇతర సినీ, వ్యాపార, రాజకీయ ప్రముఖులు ఫిలింసిటీలో నివాళులు అర్పించారు. రామోజీతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

ఆదివారం ఉదయం 10 గంటలకు ఫిలింసిటీలోని నాగన్‌పల్లి–అనాజ్‌పూర్ గ్రామాల మధ్యలో ప్రత్యేకంగా నిర్మించిన స్మృతివనంలో రామోజీరావు భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.



రామోజీరావు అంత్యక్రియల కోసం నిర్మించిన స్మృతి వనం

రామోజీరావు అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సీడబ్ల్యూసీ సమావేశాల కోసం ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో ఫోన్‌లో మాట్లాడి ఈ మేరకు సూచనలు చేశారు. దీంతో ఏర్పాట్లను పర్యవేక్షించాల్సిందిగా రంగారెడ్డి కలెక్టర్, రాచకొండ పోలీస్ కమిషనర్‌లను సీఎస్ ఆదేశించారు.

బతికుండగానే రామోజీ స్మృతివనం

ఇబ్రహీంపట్నం రూరల్: రామోజీరావు తాను బతికి ఉండగానే ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి–అనాజ్‌పూర్ మధ్యలో ప్రత్యేక స్మృతి వనాన్ని నిర్మించుకున్నారు. ఇప్పుడు ఆయన అంత్యక్రియలను ఈ స్మృతివనంలోనే నిర్వహించనున్నారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి శనివారం స్మృతి వనాన్ని పరిశీలించి.. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపించేందుకు ఏర్పాట్లు చేయించారు.

అల్లర్లపై హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలి

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు ఆనంద్రప్రకాష్ డిమాండ్



పాలకొల్లు అర్బన్: ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం రాష్ట్రంలో అల్లర్లపై హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. పోలీసుల సమక్షంలోనే అల్లరిమూకలు చెలరేగిపోయి పార్టీలతో సంబంధం లేకుండా మహిళలు, యువకులు, వృద్ధులపై దాడులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. పోలీసులు తమ సమక్షంలోనే ఈ దాడులు జరుగుతుంటే ప్రేక్షక పాత్ర పోషించారన్నారు. పిఠాపురంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మపై దాడి చేశారన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్‌లపైనా దాడులు చేస్తున్నారన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయాల శిలాఫలకాలను పగలగొడుతున్నారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి ఘటనలు విచారకరమన్నారు. ఈ నెల ఆరో తేదీ వరకు ఎన్నికల కోడ్ కొనసాగినప్పటికీ పోలీసులు అల్లరిమూకలపై చర్యలు తీసుకోలేదన్నారు.

కేంద్ర కేబినెట్‌లోకి రామ్మోహన్‌నాయుడు?

- పెమ్మసాని, వేమిరెడ్డిలకు సహాయ మంత్రి పదవులు
- జనసేన–బీజేపీ ఎంపీల్లో ఒకరికి కూడా..!



రామ్మోహన్



పెమ్మసాని



వేమిరెడ్డి

సాక్షి, అమరావతి: శ్రీకాకుళం ఎంపీ కింజరపు రామ్మోహన్‌నాయుడుకి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కినట్లు తెలిసింది. ప్రధాని మోదీ మంత్రివర్గంలో ఆయనను కేబినెట్ హోదాలో తీసుకోనున్నట్లు సమాచారం. ఎన్డీయే మంత్రివర్గంలో టీడీపీకి మూడు కేంద్ర మంత్రి పదవులు ఇవ్వడానికి బీజేపీ అంగీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. వాటిలో ఒకటి కేబినెట్ మంత్రి హోదాతో కాగా మరో రెండు సహాయ మంత్రి పదవులను ఇస్తామని చెప్పగా అందుకు చంద్రబాబు అంగీకరించినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. కేబినెట్ హోదా మంత్రి పదవికి రామ్మోహన్ నాయుడు పేరును చంద్రబాబు ఖరారు చేసినట్లు చెబుతున్నారు. అలాగే, సహాయ మంత్రి పదవులకు గుంటూరు, నెల్లూరు ఎంపీలు పెమ్మసాని చంద్రశేఖర్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల పేర్లను ఆయన ఖరారు చేసినట్లు సమాచారం. ప్రధానమంత్రితో పాటు వీరు ముగ్గురూ ఆదివారం మంత్రులుగా ప్రమాణం చేస్తారని టీడీపీ నేతలు చెబుతున్నారు. చంద్రబాబు కుటుంబానికి అత్యంత సన్నిహితుడుగా, మూడుసార్లు ఎంపీగా గెలిచిన రామ్మోహన్ నాయుడుకి ఈసారి కేంద్రమంత్రి పదవి ఖాయమని ముందు నుంచి ప్రచారం జరుగుతోంది.

జనసేన–బీజేపీకి ఒకటి..

జనసేన, బీజేపీల నుంచి కూడా ఒకరికి కేంద్ర సహాయ మంత్రి పదవి దక్కే అవకాశమున్నట్లు తెలుస్తోంది. జనసేనకు మంత్రి పదవి ఇస్తే మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరికి అవకాశం ఉండవచ్చని చెబుతున్నారు. అలాగే, బీజేపీ తరఫున అయితే సీఎం రమేష్ లేదా పురందేశ్వరిలో ఒకరికి ఛాన్స్ ఉండవచ్చని చెబుతున్నారు.

నేటి నుంచి పాడేరు మోదకొండమ్మ జాతర

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): గిరిజనుల ఆరాధ్య దైవం మోదకొండమ్మ ఉత్సవాలకు పాడేరు ముస్తాబైంది. ఆదివారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. 750 మంది పోలీస్ సిబ్బందితో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారిని బంగారు ఆభరణాలు, పూలదండలతో అలంకరించారు. సతకంపట్టు వద్ద ప్రత్యేక మండపాన్ని నిర్మించారు. ఆదివారం ఉదయం ఐదు గంటల నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా...

రామోజీ మృతికి గవర్నర్ సంతాపం

సాక్షి, అమరావతి: ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతికి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ సంతాపం తెలిపారు. తెలుగు జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పడంలో రామోజీరావు ప్రసిద్ధి చెందారని కొనియాడారు. జర్నలిజం, సాహిత్యం, సినిమా, విద్యా రంగాల్లో ఎనలేని సేవలందించిన రామోజీరావును కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించిందని గుర్తుచేశారు. రామోజీ కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపారు. ఈ మేరకు గవర్నర్ కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసింది.

మీడియా రంగంలో రామోజీది చెరగని ముద్ర: బీజేపీ

సాక్షి, అమరావతి: 'తెలుగు మీడియా రంగంలో చెరగని ముద్రవేసి, తెలుగు భాషకు ఎనలేని సేవలు చేసిన ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మరణానికి చింతిస్తున్నాం. వారికి సద్గతులు కలగాలని కోరుకుంటున్నాం.' అని రామోజీరావు మృతికి బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ సంతాపం తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

తెలుగు భాషకు రామోజీ సేవలు మరువలేనివి: పురందేశ్వరి

రామోజీరావు లేరన్న వార్త తెలుగు జాతిని శోకసంద్రంలో ముంచివేసిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మరొక ప్రకటనలో పేర్కొన్నారు. మీడియా, సినీ రంగాలకు ఎంతో సేవచేసిన మహోన్నత వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. తెలుగు భాషకు ఆయన చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు.

రామోజీరావు మృతికి మండలి చైర్మన్ సంతాపం

భీమవరం/దేవరపల్లి: రామోజీరావు మరణం పత్రికారంగానికి తీరని లోటని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. సామాన్య ఉద్యోగిగా జీవితం ప్రారంభించిన రామోజీ అంచెలంచెలుగా ఎదిగి ఈనాడు పత్రికను స్థాపించి అనతికాలంలోనే మీడియా రంగ దిగ్గజంగా ఎదిగారన్నారు. రామోజీ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తానేటి వనిత సంతాపం

రామోజీరావు మృతికి రాష్ట్ర మాజీ హోం మంత్రి తానేటి వనిత సంతాపం తెలిపారు. ఆయన మరణం మీడియా, సినీరంగాలతోపాటు తెలుగు ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

హైదరాబాద్‌లో చేపప్రసాదం పంపిణీ

అబిడ్స్/గన్‌ఫౌండ్రీ/ సిరికొండ: బత్తిన కుటుంబం ఆధ్వర్యంలో ఉబ్బసం రోగుల కోసం చేపప్రసాదం పంపిణీ కార్యక్రమం హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో శనివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్,జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది అస్తమా రోగుల సౌకర్యార్థం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. 32 కౌంటర్ల ద్వారా చేపప్రసాదం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో 60 వేల చేపపిల్లలను శనివారం రాత్రి వరకు విక్రయించినట్లు మత్స్యశాఖ అధికారులు చెప్పారు. ఆదివారం వరకు చేప ప్రసాదం పంపిణీ జరుగనుందన్నారు.

రాష్ట్రంలో రెండు రోజులు సంతాప దినాలు

సాక్షి, అమరావతి: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత 'పద్మవిభూషణ్' చెరుకూరి రామోజీరావు మరణించడంతో రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజులు సంతాప దినాలను ప్రకటించింది. ఈ నెల 9, 10 తేదీలను సంతాప దినాలుగా ప్రకటిస్తూ శనివారం ఉత్తర్వులను జారీ చేసింది. ఈ రెండు రోజులు రాష్ట్రంలో అధికారికంగా ఎటువంటి వినోద కార్యక్రమాలు నిర్వహించకూడదని, జాతీయ పతకాన్ని అవనతం చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కాగా, హైదరాబాద్‌లో ఆదివారం జరిగే రామోజీరావు అంత్యక్రియల్లో రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధులుగా ఆర్పీ సిసోడియా, సాయిప్రసాద్, రజత్ భార్గవ పాల్గొనాలని ప్రభుత్వం మరో ఉత్తర్వు జారీ చేసింది. ఈ ముగ్గురు అధికారులు రామోజీరావు పార్థీవదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున నివాళి అర్పించనున్నారు.

రామోజీ మరణం బాధాకరం

- ఆయనే లేనప్పుడు మార్గదర్శిపై ఆయనతో ఫైట్ ఉండదు
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్



రాజమహేంద్రవరం సిటీ: ఈనాడు, మార్గదర్శి సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మరణం బాధాకరమని మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై న్యాయ పోరాటం చేస్తున్న న్యాయవాది, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. రామోజీ మృతికి ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. రాజమహేంద్రవరం ప్రకాశం నగర్‌లోని బుక్ హౌస్‌లో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. రామోజీరావు ఎవరితోనూ రాజీ పడకుండా ఒక యోధుడిలా పూర్తి జీవితం గడిపారన్నారు. ఆయనను కలుద్దామని చాలాసార్లు ప్రయత్నం చేసినా కలవలేకపోయానని, అదొక్కటే అసంతృప్తి ఉందని అన్నారు. అనేక మందితో కబురు చేసినా కలిసే అవకాశం రాలేదన్నారు. ఏ రంగంలోకి ప్రవేశించినా సెలబ్రిటీ స్థాయికి రామోజీరావు ఎదిగారన్నారు. దేశంలోనే పలుకుబడి కలిగిన ఏకైక వ్యక్తి రామోజీ అని, అటువంటి వ్యక్తిని మరెక్కడా చూడలేదని పేర్కొన్నారు. రామోజీరావుపై, మార్గదర్శిపై చేస్తున్న న్యాయ పోరాటంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, ఆయనే లేనప్పుడు ఇక ఆయనపై ఫైట్ ఉండదని అన్నారు.

వేటకు వేళాయే!

మరో 5 రోజుల్లో ముగియనున్న వేట నిషేధం

వేట సామాగ్రి సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు



వేట సాగిస్తున్న మత్స్యకారులు(ఫైల్)



వలల బాగుచేసుకుంటున్న మత్స్యకారులు

నరసాపురం

సముద్రంలో వేట నిషేధం గడువు ముగుస్తోంది. మరో ఐదురోజుల్లో మళ్లీ సముద్రంలో వేట ప్రారంభం కానుంది. దీంతో జిల్లాలో నరసాపురం తీరప్రాంతంలో వేట సాగించే మత్స్యకారులు వేటకు సమాయాత్తమవుతున్నారు. రెండు నెలలుగా వలలు మూలనపెట్టి ఇళ్లకే పరిమితమైన మత్స్యకారులు వేట సామగ్రి సిద్ధం చేసుకుంటున్నారు. వలలు, బోట్ల మరమ్మతులు చేసుకుంటున్నారు. ఈ నెల 14 అర్ధరాత్రి నుంచి మళ్లీ సముద్రంలో వేట ప్రారంభం కానుంది. చేపల పునరుత్పత్తి సీజన్ కావడంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సముద్రంలో వేట నిషేధం అమలు చేస్తుంది. ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకూ ఈ నిషేధం అమల్లో ఉంటుంది. ఈ 61 రోజులు మత్స్యకారులు ఖాళీగా ఉంటారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అండగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకాన్ని అమలు చేసేది. వరుసగా ఐదేళ్లపాటు పథకం ద్వారా వేట సాగించే ఒక్కో మత్స్యకారుడికి రూ.10 వేల సాయం అందించేవారు. మే నెలలోనే పథకం సొమ్ము మత్స్యకారుల ఖాతాల్లో జమయ్యేది. ఈ ఏడాది ఎన్నికల కారణంగా మత్స్యకార భరోసా పథకం అమలు కాలేదు.

తీరంలో జోరుగా వేట

జిల్లాలో 19 కిలోమీటర్ల మేర తీరప్రాంతం ఉన్న నరసాపురంలో ప్రతిరోజూ జోరుగా వేట సాగుతుంది. బంగాళాఖాతానికి కీలకమైన ప్రాంతంలో ఉండటం, గోదావరి సముద్రంలో కలిసే ప్రదేశం కావడంతో ఇక్కడి తీరంలో మత్స్యసంపద అపారంగా దొరుకుతుంది. నెల్లూరు, విశాఖ, మచిలీపట్నం, విశాఖపట్నం తదితర జిల్లాలకు చెందిన సుమారు 150 బోట్లు ఇక్కడ నిత్యం సముద్రంలో వేటసాగిస్తాయి. ఏడాదికి రూ.300 కోట్లకు పైగానే మత్స్యసంపద దొరుకుతుంది. దాదాపుగా 2 వేల మంది వరకూ పూర్తిగా వేటనే నమ్ముకుని ఇక్కడ బతుకుతున్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే 2019లోనే మత్స్యకార భరోసా పథకాన్ని జగన్ అమలు చేశారు. ఐదేళ్లపాటు ఐదు దఫాలుగా రూ.10 వేల చొప్పున అందించారు.

వేట కోసం ఎదురు చూస్తున్నాం



వేట సమయం ఎప్పుడొస్తుందా? అని ఎదురు చూస్తున్నాం. ఇంకో రెండు వారాల్లో వేట ప్రారంభమవుతుంది. మాకు వేరే పని తెలియదు. ఈ రెండు నెలలు ఖాళీగానే ఉన్నాం. గత ప్రభుత్వంలో మాకు వేట నిషేధ సమయంలో ఐదేళ్ల పాటు మత్స్యకార భరోసా పథకంలో రూ.10 వేలు చొప్పున అందించారు.

– పెమ్మాడి నాగరాజు, మత్స్యకారుడు, నరసాపురం

చేపలు బాగా దొరుకుతాయి



రెండు నెలలు నుంచి సముద్రంలో వేటలేదు. ఇప్పుడు వేటకు వెళితే చేపల బాగా దొరుకుతాయి. చేపలు పైకి బాగా తేలి వలలకు చిక్కుతాయి. మాకు సముద్రంలో ఈ నెల సీజన్. తుఫాన్‌లు పట్టకూడదు. ఇప్పుడు వాతావరణం భయపెడుతుంది. శుక్రవారం అర్ధరాత్రి నుంచే వేటకు వెళతాం.

– మైలా ఏడుకొండలు, పీఎం లంక, మత్స్యకారుడు

వైద్య విద్యకు యమా క్రేజ్

ఏటా నీట్ యూజీ రాసే విద్యార్థుల సంఖ్య హెచ్చింపు

సాక్షి, అమరావతి: మెడలో స్టెతస్కోప్.. ఒంటిపై తెల్లటి ఆప్రాన్.. డాక్టర్ అనే పిలుపు.. ఈ గౌరవంపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో రోజురోజుకు మక్కువ పెరుగుతోంది. ఏటా నీట్–యూజీ రాస్తున్న విద్యార్థుల సంఖ్య పెరుగుదలే ఇందుకు నిదర్శనం. 2019లో జాతీయ స్థాయిలో 15,19,375 మంది విద్యార్థులు ఈ పరీక్షకు రిజిస్ట్రేషన్ చేసుకోగా 14,10,755 మంది పరీక్ష రాశారు. అదే ఈ ఏడాది రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి సంఖ్య 24,06,079కు పెరగ్గా, అందులో 23,33,297 మంది పరీక్ష రాశారు. అంటే.. 2015తో పోలిస్తే 2024లో నీట్ రాసిన విద్యార్థుల సంఖ్య 9,22,542 పెరిగింది. అంటే.. ఆరేళ్లలో ఏడాదికి సగటున 1.53 లక్షల చొప్పున విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వచ్చింది.

అత్యధికంగా యూపీ..

దేశంలోనే అత్యధికంగా యూపీ రాష్ట్రం నుంచి ఈ ఏడాది 3.35 లక్షల మంది విద్యార్థులు నీట్ రాశారు. వీరిలో 1,65,047 (49 శాతం) విద్యార్థులు అర్హత సాధించారు. అలాగే, మహారాష్ట్ర నుంచి 2.75 లక్షల మంది పరీక్ష రాయగా 51.79 శాతం, రాజస్థాన్ నుంచి 1.74 లక్షల మందికి గాను 69.32 శాతం మంది అర్హులయ్యారు. పక్కనున్న తెలంగాణాలో 77,849 మంది పరీక్ష రాయగా 60.84 శాతం .. ఏపీలో 64,931 మందికి గాను 67.54 శాతం (43,858 మంది) అర్హత పొందారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

దారి సరిచేయాలని నిరసన



దారిలో నిలిచిన నీటిలోకి దిగి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

కోలారు: ఇటీవల కురిసిన వానలకు బంగారుపేట తాలూకా మాగేరి గ్రామానికి వెళ్లే దారిలో నీరు నిలవడంతో వెంటనే దారికి మరమ్మతులు చేసి సరిచేయాలని గ్రామస్తులు మోకాలి లోతు గుంతలో దిగి నిరసన తెలియజేశారు. వర్షం నీరు వెళ్లే కాలువను మూసివేయడం వల్ల దారి గుంతలమయమై వర్షం నీరు నిలిచి సంచారానికి తీవ్ర ఆటంకం కలుగుతోందన్నారు. అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరిచి దారికి మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

ఆధ్యాత్మిక ప్రవచనకారులకు అవార్డులు



గౌరవ పురస్కారం అందుకున్న ధర్మప్రచారకర్తలు

రాయచూరు రూరల్: మానవ కళ్యాణ కోసం ఆధ్యాత్మిక రంగంలో భారతీయ సనాతన, సంప్రదాయాల గురించి ధర్మ ప్రవచనం చేసిన ప్రచారకర్తలు బిందా సింగబాళ, అంజలి గాడ్గిల్‌కు జూన్ 5న ఫ్రాన్స్ సెనేట్‌లో భారత్ గౌరవ అవార్డులను అందించారు. పార్లమెంట్ ఉపాధ్యక్షుడు డొమినిక్ థియోపాల్, సభ్యులు ఫెడరల్ బౌవెల్, బాలాజీ ట్రస్ట్ అధ్యక్షుడు నరేష్ పూరి మహరాజ్, సంస్కృతి యువ సంస్థ అధ్యక్షుడు సురేష్ మిశ్రాలున్నారు.

అవినీతికి బాధ్యతగా రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న హన్మంతప్ప నాయక్

రాయచూరు రూరల్: రాష్ట్రంలో మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్ల అవినీతికి బాధ్యతగా రాజీనామా చేయాలని అఖిల కర్ణాటక వాల్మీకి సంఘం అధ్యక్షుడు హన్మంతప్ప నాయక్ పేర్కొన్నారు. శనివారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి మండలి అధ్యక్షుడు, గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్, తెలంగాణ కాంగ్రెస్ ఎన్నికల ఇంచార్జి, మంత్రి ఎస్ఎస్ బోసురాజులపై క్రిమినల్ కేసు నమోదు చేసి రాజీనామా చేయాలని కోరడాన్ని తప్పుబట్టారు.


నేటి నుంచి రాయచూరు ఉత్సవాలు



మాట్లాడుతున్న లక్ష్మణ్

రాయచూరు రూరల్: నగరంలో ఆదివారం నుంచి మంగళవారం వరకు రాయచూరు చారిత్రక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర శామియాన, డెకరేటర్స్ సౌండ్ పబ్లిసిటీ క్షేమాభివృద్ధి సంఘం అధ్యక్షుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. శనివారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం కార్యక్రమాలను ఆర్డీఏ అధ్యక్షుడు రాజశేఖర్ రామస్వామి ప్రారంభిస్తారన్నారు. సోమ, మంగళవారం కార్యక్రమాల్లో స్వామీజీలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. ప్రభుత్వం శామియాన, డెకరేటర్స్, సౌండ్, పబ్లిసిటీ క్షేమాభివృద్ధి సంఘాన్ని కార్మిక శాఖ ఆధీనంలో చేర్చి తమను గుర్తించి ఆదుకోవాలన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి శామియాన, డెకరేటర్స్, సౌండ్ పబ్లిసిటీ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశామన్నారు.

భారీ వర్షాలతో ఆల్మట్టికి వరద



ఆల్మట్టి రిజర్వాయర్(ఫైల్)

రాయచూరు రూరల్: గత వారం రోజుల నుంచి మహారాష్ట్రతో పాటు ఉత్తర కర్ణాటక, కళ్యాణ కర్ణాటకలోని కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో విస్తారంగా వానలు కురుస్తుండడంతో ఆల్మట్టి జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతున్నాయి. ఉత్తర కర్ణాటకలోని బెళగావి, బాగల్‌కోటె, విజయపుర జిల్లాల్లో కృష్ణా నదీ తీర ప్రాంతంలోని ఉప నదుల్లో కూడా వరద మొదలైంది. ప్రస్తుతం ఆల్మట్టి డ్యాంకు ఇన్‌ఫ్లో రూపంలో 2.578 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నాయి. కృష్ణా నది జన్మ స్థానం మహాబలేశ్వర్‌లోనూ ఇటీవల అధికంగా వర్షాలు కురిశాయి.

అపరిశుభ్రంగా ఏపీఎంసీ యార్డు



వ్యర్థాలు, చెత్తాచెదారంతో నిండిన ఏపీఎంసీ పరిసరాలు



ఏపీఎంసీలో అధ్వానంగా, బురదమయమైన రోడ్లు

- బురదలోనే కూరగాయలు, పండ్ల అమ్మకాలు
- రైతులు, వ్యాపారులకు తప్పని తీవ్ర ఇబ్బందులు
- ఏళ్ల తరబడి పట్టించుకోని పాలకులు, అధికారులు

సాక్షి,బళ్లారి: నగరంలోని ఏపీఎంసీ యార్డు మార్కెట్ అధ్వానంగా మారింది. వర్షం వచ్చిందంటే బురదలోనే కూరగాయలు, పండ్ల అమ్మకాలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి ఏపీఎంసీలోని కూరగాయలు, పండ్ల మార్కెట్‌లో అడుగు తీసి అడుగు వేయలేని విధంగా బురదమయంగా మారింది. వర్షాకాలంలో ఏపీఎంసీలో ఆరు నెలల పాటు వ్యాపారులు, రైతులు నరకం అనుభవించాల్సిందే. చిరు జల్లులు పడినా అక్కడ బురదమయంగా మారుతుంది. బురదకు తోడు అక్కడ పందులు, పశువులు విపరీతంగా తిరుగాడటంతో వాటి మధ్యలోనే కూరగాయల అమ్మకాలు సాగిస్తుంటారు. ఏపీఎంసీలో వానాకాలంలో దుర్వాసన వెదజల్లుతుంది. బురద వల్ల విపరీతంగా దోమలు పెరిగిపోవడం వల్ల రాత్రిళ్లు కాదు, పగలు కూడా దోమల వల్ల జనం ఇబ్బందులు పడుతున్నారు. దోమల వల్ల జ్వరాల బారిన పడి పలువురు అస్వస్థతకు గురై ఆస్పత్రుల చుట్టూ తిరుగుతుంటారు.

కరువైన కనీస మౌలిక వసతులు

పరిశుభ్రమైన వాతావరణంలో కూరగాయలు, పండ్ల అమ్మకాలు సాగించాలని అధికారులు, పాలకులు సూచిస్తుంటారు కాని ఆ దిశగా వాటిని అమ్మకాలు చేసేందుకు అనువైన స్థలంలో రోడ్లు, సిమెంట్ కాంక్రీట్ ప్లాట్‌ఫారాలు వేయకపోవడంతో పాటు బురదమయంగా మారుతోంది. శాశ్వత నివారణ చర్యలు చేపట్టడంలో పాలకులు విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బళ్లారి ఏపీఎంసీకి జిల్లాలోని రైతులే కాకుండా చుట్టుపక్కల జిల్లాలైన అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన సరిహద్దు ప్రాంత రైతులు కూడా ఇక్కడకు కూరగాయలు, పండ్లు తీసుకుని వచ్చి అమ్మకాలు సాగిస్తుంటారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధ్వానంగా ఉన్న ఏపీఎంసీ మార్కెట్‌లో కాలం గడుపుతూ ఎన్నాళ్లకు ఏపీఎంసీ మార్కెట్ బాగుపడుతుందో అని ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. నిత్యం పెద్ద ఎత్తున వ్యాపార లావాదేవీలు జరిగే ఏపీఎంసీ అభివృద్ధి గురించి సంబంధిత పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఏపీఎంసీకి వచ్చిపోయే జనంతో పాటు వ్యాపారులకు శాపంగా మారింది.

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా..

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా ఏపీఎంసీ పరిస్థితి తయారైంది. బురదలో పందులు తిరుగాడి, పొర్లాడిన ప్రాంతంలో కూరగాయలు, ఆకుకూరలు అమ్మకాలు సాగించడం వల్ల వాటిని తీసుకెళ్లిన నగర వాసులు కూడా రోగాలు బారిన పడుతున్నారు. గత్యంతరం లేక వాటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంటోందని ప్రజలు వాపోతున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు ఏపీఎంసీలో సంచరించినప్పుడల్లా అరచేతిలో స్వర్గం చూపించినట్లుగా ఏపీఎంసీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని హామీలు ఇస్తున్నారే కాని అమలు చేయడం లేదని ఏపీఎంసీలో వ్యాపారులు, వినియోగదారులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం వచ్చిందంటే వ్యాపారం చేయడానికి వీలు ఉండదని ఆరోపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి అధ్వానంగా ఉన్న ఏపీఎంసీ ఆవరణను, పరిసరాలను బాగు చేయాలని వ్యాపారులు, నగర వాసులు కోరుతున్నారు.

సమన్వయంతో వ్యాధుల బెడద అరికట్టండి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సదాశివప్రభు

హొసపేటె: మలేరియాతో సహా డెంగీ, చికెన్‌గున్యా, ఎక్స్ ఫాలిటీస్, ఎలిఫెంటియాసిస్ సహా వివిధ వ్యాధుల నివారణ కోసం ఆరోగ్య శాఖ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు తెలిపారు. జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా పంచాయతీ కార్యాలయంలోని కేస్వాన్ హాల్‌లో నిర్వహించిన జిల్లాలో వ్యాధుల నియంత్రణపై ఇంటర్ డిపార్ట్‌మెంటల్ కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైనందున దోమలు ఇప్పటికే ఎక్కువగా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బ్రెయిన్ ఫీవర్, ఎలిఫెంటియాసిస్ బారిన పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖల సహకారంతో కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాలని ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. విజయనగర జిల్లా మున్సిపల్ కౌన్సిల్ లార్వా, వివిధ మున్సిపాలిటీలు, పట్టణ పంచాయతీ అధికారులు, సిబ్బంది బీటీఐ స్ప్రేయింగ్, టెమిఫాస్ స్ప్రేయింగ్ వంటివి చేయాలన్నారు. దోమలను చంపే ధూమపాన చర్యలకు సంబంధించిన వస్తువుల స్టాక్‌ను ఉంచాలని, ఘన వ్యర్థాలను సరిగ్గా పారవేయాలన్నారు. కాలువల్లో నీరు నిలవకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. మున్సిపల్ కౌన్సిల్ ప్రతి రోజు చెత్త వాహనాలను తుంగలో తొక్కి పట్టణ పంచాయతీలోని వికిరణ వ్యాధులపై ఆడియోలను ప్రదర్శించాలన్నారు. మున్సిపాలిటీలో ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంప్‌ల నిర్మాణం, దోమల వికర్షక వలల ఏర్పాటును ప్రవేశ పెట్టాలన్నారు. నీటి సరఫరా పైపులకు లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

హుబ్లీ: వీరశైవ ధర్మ పంచపీఠాల్లో ప్రముఖమైన ఉత్తరప్రదేశ్ కాశీ జ్ఞానపీఠంలో శతాబ్దాల చరిత్ర కలిగిన జగద్గురు విశ్వారాధ్య గురుకుల పాఠశాలలో ప్రస్తుతం విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. కాశీ జ్ఞానపీఠం సీనియర్ జగద్గురువు డాక్టర్ చంద్రశేఖర శివాచార్య భగవత్పాదులు, చిన్న జగద్గురువు డాక్టర్ చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య భగవత్పాదుల సంకల్పం మేరకు విద్యాభ్యాసానికి అవకాశం కల్పించారు. సంబంధిత గురువులు, ప్రముఖ విద్వాంసులు సదరు జ్ఞానపీఠం ద్వారా వివిధ సేవల్లో కీలక పాత్ర వహిస్తున్నారు. ప్రధాని మోదీ ఈ గురుకులంలో శతాబ్ది ఉత్సవాలను గతంలో ప్రారంభించారు. ఈ గురుకులంలో హిందీ, సంస్కృత భాషలతో పాటు భారతీయ ప్రాచీన శాస్త్రాలు న్యాయం, వ్యాకరణం, వేదాంతం, సాహిత్యం తదితర విషయాలపై నిపుణులైన విద్వాంసులు బోధిస్తారు. విశ్వవిద్యాలయాల్లో అధ్యయనం, అధ్యాపన కోసం నిర్దిష్ట పరిచిన పాఠ్యాంశాలను గురుకులంలో బోధిస్తారు. ఆసక్తిగల వారు బెళగావి జిల్లా చిక్కోడిలోని శ్రీ శైల శాస్త్రిని 9008967789 నెంబరులో సంప్రదించాలని, జూలై 2న జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కాశీపీఠం మేనేజర్ శివానంద హిరేమఠ తెలిపారు.

వర్షంతో ఇళ్లు ధ్వంసం



వర్షానికి దెబ్బతిన్న ఇంటిని చూపుతున్న బాధితులు

హొసపేటె: గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు విజయనగర జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి. కూడ్లిగి తాలూకాలోని గుడేకోటె ఫిర్కాలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షం, వీచిన గాలి కారణంగా ఇంటి గోడ కూలింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కూడ్లిగి తాలూకా కే.రాయాపుర గ్రామానికి చెందిన తిప్పన్న, హులికుంటి గ్రామానికి చెందిన హొన్నప్ప, గ్రామానికి చెందిన దానమ్మ, శరణప్పల ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దేవదాయ శాఖ అధికారులు పంచనామా నిర్వహించి ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక అందజేశారు. బాధితులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందజేస్తామన్నారు. గత వారం రోజుల నుంచి భారీగా వర్షాలు కురుస్తున్నాయని, మట్టి ఇళ్లలో నివాసం ఉండేవారు అప్రమత్తంగా ఉండాలని చౌడప్ప తెలిపారు.

మారువేషంలో ప్రజలకు టోకరా




పోలీస్ అధికారిగా మారువేషంలో ఉన్న వ్యక్తి

రాయచూరు రూరల్: సైబర్ నేరగాళ్లను నమ్మవద్దని పోలీసులు ప్రజలకు పలు మార్లు ప్రచారం చేసి హెచ్చరించినా డబ్బుకు ఆశ పడి మోసపోయిన ఉదంతం బయట పడింది. మొబైల్ ఫోన్ నుంచి మీపై ఫలానా స్టేషన్‌లో కేసు నమోదు అయిందని ఫోన్ ద్వారా సమాచారం చేరవేస్తాడు. భయపడిన ప్రజలు స్టేషన్, గొడవలు వద్దంటూ దూరంగా ఉన్నా ఫోన్ చేసి పోలీసుల పేరుతో రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేస్తున్న వైనం అధికమైంది. రాయచూరులోని హరిజనవాడకు చెందిన కృష్ణ అనే వ్యక్తి నుంచి రూ.30 వేలు, తెలంగాణలోని నిజామాబాద్‌లో విష్ణు సేట్ వద్ద నుంచి రూ.50 లక్షలు తీసుకున్నట్లు సమాచారం. ఫోన్ కాల్ పేరుతో పోలీస్ దుస్తులు ధరించి స్టేటస్‌లో చూపించి ఈ నంబర్‌కు ఫోన్‌పే చేయాలని సూచిస్తున్నారు. సైబర్ నేర పరిశోధన అధికారుల విచారణలో లొకేషన్‌లో హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, కరీంనగర్, కర్నూలు వంటి ప్రాంతాలను చూపిస్తుందని ఎస్పీ నిఖిల్ వెల్లడించారు.

భారీ వర్షం.. గ్రామం జలమయం



గ్రామంలో ఏరులా పారుతున్న వర్షం నీరు



ఆకర్షిస్తున్న నీటిలోని మంటప ప్రతిబింబం

హొసపేటె: విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకాలోని మహదేవపుర సమీపంలో నరిగుడ్డ నుంచి వర్షం నీరు గ్రామంలోకి భారీగా వచ్చి చేరుతోంది. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు వాగులా ప్రవహిస్తోంది. వర్షం నీరు ఏరులా మహదేవపుర గ్రామంలోకి ప్రవహించడంతో గ్రామస్తులు భయపడుతున్నారు. వర్షం ఇలాగే కురిస్తే గ్రామంలో చాలా నష్టం జరిగే అవకాశం ఉంది. ఈ విషయమై సంబంధిత అధికారులు వెంటనే తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. మరో వైపు విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా గుడేకోటెలో ఉన్న పురాతన కాలం నాటి మంటపం వర్షం నీటిలో ప్రతిబింబిస్తూ చూపరులను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. ప్రకృతి ఒడిలో ఉన్న ఈ మంటపాన్ని చూస్తే హంపీని చూసిన అనుభూతి కలుగుతోంది.

యోగా దినోత్సవానికి కసరత్తు షురూ

హుబ్లీ: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ధార్వాడలోని మదిహాళ జోషి కళ్యాణ మంటపంలో శుక్రవారం నుంచి చురుగ్గా ఏర్పాట్లు చేసి అభ్యసన ప్రక్రియ ప్రారంభించారు. పతంజలి యోగా పీఠం కర్ణాటక ఇన్‌చార్జి అంతర్జాతీయ యోగా గురువు భవర్‌లాల్ ఆర్య మార్గదర్శకత్వంలో యోగాభ్యాసం చేస్తున్నారు. భవర్‌లాల్ ఆర్య మాట్లాడుతూ ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం జరగనున్న సందర్భంగా ఏ వృత్తిలో ఉన్న వారైనా ప్రతి రోజు ఉదయం ఓ గంట పాటు యోగా చేయాలన్నారు. దీంతో రాష్ట్రాన్ని యోగా ముక్త, రోగ రహితంగా తీర్చిదిద్దవచ్చన్నారు. యోగామయ కర్ణాటక అభియాన ద్వారా ప్రతి జిల్లాలో కనీసం 100 మంది యోగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి తాలూకా, గ్రామ, వార్డు, ఫిర్కా స్థాయిల్లో ఉచిత యోగా శిబిరం, యోగా కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆసక్తి గల వారు హుబ్లీలోని పతంజలి యోగా పీఠం రాష్ట్ర కార్యాలయం, కేశ్వాపుర లేదా 9008100887 నెంబరులో సంప్రదించాలని కోరారు.

నాణ్యమైన బోధనకు పెద్దపీట వేయండి



కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బళ్లారిఅర్బన్: నాణ్యమైన విద్యాబోధనకు ఉపాధ్యాయులు ప్రాధాన్యతను ఇవ్వాలని ఎమ్మెల్సీ వైఎం సతీష్ పిలుపునిచ్చారు. వీరశైవ విద్యావర్థక సంఘం కొట్టూరుస్వామి ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో దాతల దినోత్సవం, ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగత కార్యక్రమంతో పాటు విద్యార్థి సంఘాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో నాణ్యత గల విద్యాబోధన కొరత నివారణకు ఉపాధ్యాయులు గురుతర బాధ్యత వహించాలన్నారు. తద్వారా సమాజంలో సత్పౌరులను తీర్చిదిద్దాలన్నారు. సంఘం ఎదుగుదలలో దాతల పాత్ర కీలకమన్నారు. ఈ దిశలో సంఘం అప్పగించే బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. కొట్టూరుస్వామి మఠం బసవలింగ మహాస్వామి, సంఘం అధ్యక్షుడు అల్లం గురుబసవరాజు, ప్రముఖులు టీ.కొట్రప్ప, డాక్టర్ అరవింద్ పాటిల్, ఉపాధ్యక్షుడు జానెకుంటె బసవరాజ్, కోశాధికారి బైలువద్దిగేరి ఎర్రిస్వామి, నరేంద్ర బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ ఏ.హిరేమఠ, ఎం.శరణబసవనగౌడ, భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు. బీఈడీలో ప్రతిభ చూపిన విద్యార్థి రుద్రేశ్‌ను అతిథులు సన్మానించారు.

చెట్ల వినాశనం భవితకు ప్రమాదకరం



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

శ్రీనివాసపురం: మనకు అవసరమైన ఆక్సిజన్ అందిస్తున్న చెట్లను నాశనం చేసుకుంటూ వెళితే భవిష్యత్తు తరాలు అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని పోలీస్ ఇన్‌స్పెక్టర్ గౌరవనహళ్లి తెలిపారు. శనివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వేణు విద్యాలయ విద్యార్థులతో పట్టణ ప్రజలకు మొక్కలను పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని మొక్కలను నాటడం ద్వారా నిత్యం నిర్వహించాలన్నారు, ప్రపంచ పర్యావరణ దినోత్సవ ఔన్నత్యం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకుని మొక్కలను నాటి పెంచి పోషించడం పరిపాటిగా చేసుకోవాలన్నారు. మానవాళితో పాటు ఇతర ప్రాణి పక్షులకు ఆక్సిజన్ ఎంతో అవసరం అన్నారు. ఇలాంటి ప్రాణవాయువును మనకు అందిస్తున్న చెట్లను సంరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ పరిసరాల పట్ల తగినంత అవగాహన కలిగి పర్యావరణ రక్షణకు కట్టుబడాలన్నారు. ఈసందర్భంగా ఎస్ఐ డీ.నారాయణప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడవుల నాశనంతో కరువు తాండవం

కేజీఎఫ్: అడవుల నాశనంతో సమయానికి సరిగా వానలు కురవక కరువు తాండవిస్తోందని సామాజిక అటవీశాఖ అధికారి మంజునాథ్ తెలిపారు. అడవుల అభివృద్ధి ప్రాధాన్యతను గుర్తించి శనివారం చేపట్టిన అరణ్యీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. జెడ్పీ, టీపీ సహకారంతో సామాజిక అటవీ సంరక్షణ పథకంలో భాగంగా అరణ్యీకరణ చేపట్టినట్లు చెప్పారు. మనిషి దురాశతో అడవులు మాయమై వాటి స్థానంలో కాంక్రీట్ ఆవరించుకుంటోందన్నారు. ఈ పరిస్థితి నివారణ కోసం అటవీశాఖ సిబ్బంది శ్రమ వహించి అరణ్యీకరణతో ఉత్తమ పరిసరాలను నిర్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నగరంలోని కోరమండల్, బాలఘట్ట కాలనీల పక్కన ఉన్న బీజీఎంఎల్ కంపెనీకి చెందిన ప్రాంతంలో అధికారుల అనుమతితో 40 హెక్టార్ల విస్తీర్ణంలో వివిధ రకాల మొక్కలను నాటి పోషిస్తున్నారన్నారు. రెండేళ్ల క్రితం నాటిన 7 వేల మొక్కలు నేడు పెద్ద చెట్లుగా మారి ప్రాణులు, పక్షులకు నీడనిస్తున్నాయన్నారు. జింకలు, నెమళ్లకు నీటిని అందించడానికి చెట్ల నీడన గుంతలను తవ్వి వాటిలో నీటిని నింపుతున్నారన్నారు. చెట్లు, మొక్కల సంరక్షణ కోసం అటవీశాఖ సిబ్బంది అహర్నిశలు కాపలా కాస్తున్నారన్నారు.

రోడ్డు భద్రతపై జాగృతి జాతా

కేజీఎఫ్ : రోడ్డు భద్రతపై జిల్లా పోలీసులు శనివారం నగరంలో జాగృతి జాతా నిర్వహించారు. రాబర్ట్‌సన్‌పేట సీఐ రామకృష్ణయ్య మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలన్నారు. అతివేగంగా వెళ్లడాన్ని మానుకోవాలన్నారు. బైక్ వీలింగ్, ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించడం వంటివి చేయకూడదన్నారు. ద్విచక్రవాహనాల్లో ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. జాగృతి జాతాను బస్టాండు, రాబర్ట్‌సన్ పేట, అండర్‌సన్ పేట సర్కిల్‌లతో పాటు తాలూకాలోని క్యాసంబళ్లి గ్రామంలో ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది నిర్వహించారు.

సైకిల్‌పై జిల్లాధికారి నగర సంచారం



సైకిల్‌పై వీధులను పరిశీలిస్తున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటె: రెండో శనివారం సెలవు రోజు కావడంతో జిల్లాధికారి దివాకర్ సైకిల్‌పై నగరంలోని వివిధ వార్డుల్లో పర్యటించారు. గతవారం నుంచి వర్షాలు కురుస్తుండటంతో రాయబసవ కాలువలో పేరుకొన్న ప్లాస్టిక్ సీసాలు, ఇతర చెత్త చెదారం, వ్యర్థ పదార్థాలను తొలగించాలని పౌర కార్మికులకు సూచించారు. అదే విధంగా ప్రతినిత్యం రోడ్లను మరింత పరిశుభ్రంగా చేసేందుకు అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేయాలని నగరసభ అధికారిని ఆదేశించారు. రోడ్లపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో అపరిశుభ్రతగా ఉన్న మరుగుదొడ్డిని శుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఆయన వెంట అధికారులు మనోహర్, చంద్రప్ప, ఇంజినీర్ భారతి, నగరసభ సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు విస్తరించాలి



నాగేష్‌ను సన్మానించిన సభ్యులు

రాయచూరు రూరల్: జిల్లాలో రోటరీ క్లబ్ సామాజిక సేవల విస్తరణకు సభ్యులు కృషి చేయాలని అంతర్జాతీయ రోటరీ క్లబ్ సభ్యుడు కేపీ నాగేష్ పిలుపునిచ్చారు. శనివారం నగరంలో నూతనంగా ఎన్నికైన రోటరీ క్లబ్ సభ్యులకు రెండు రోజుల శిక్షణ శిబిరాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. రోటరీలో అధికారం, పదవులు ముఖ్యం కాదన్నారు. నిస్వార్థంగా సమాజ సేవ చేయాలనే తపన మనందరిలో మెదలాలన్నారు. కార్యక్రమంలో శివగిరీష్, శివశంకర్, శరణబసవ, రంగలింగనగౌడ, త్రివిక్రం జోషిలున్నారు.

గోవా మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్

హుబ్లీ: ధార్వాడ జిల్లాలోని కలఘటిగి పట్టణంలోని యల్లాపుర– కలఘటిగి జాతీయ రహదారిలో డాబా వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న లక్షలాది రూపాయల విలువ చేసే గోవా మద్యాన్ని కలఘటిగి పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు కలఘటిగి పోలీసులు ఓ కారులో తరలిస్తున్న వివిధ బ్రాండ్ల అక్రమ గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకొని జగదీశ్ సోడా, ప్రతాప్ అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో పోలీస్ మహంతేష్ గౌడ, గోపాల్ పిరగి, రవిపూజార్ లోకేశ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. కాగా నిందితులను పట్టుకున్న పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

పర్యావరణ పరిరక్షణతో మానవాళికి మేలు



మొక్కలను నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హొసపేటె: పర్యావరణాన్ని పరిరక్షిస్తే మానవాళికి మేలు జరుగుతుందని మొరబనహళ్లి జీపీ ఉపాధ్యక్షుడు కరియప్ప అన్నారు. ఆయన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మొరబనహళ్లిలోని గొల్లరహట్టి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పర్యావరణంపై అవగాహన పెంచడానికి ఈ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారన్నారు. మనిషితో సహా ఇతర జంతువులు, పక్షులు, ప్రతి జీవి ఆహారం, గాలి, నీరు తదితరాల కోసం పర్యావరణంపై ఆధారపడుతున్నాయన్నారు. అయితే మనిషి ఆధునిక జీవితంపై మోజు పెంచుకుని పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాడన్నారు. తద్వారా గాలి, నీరు, నేల తదితరాలన్నీ మనిషి దురాశతో కలుషితమైందన్నారు. భావి తరాలకు మంచి పర్యావరణం కోసం మొక్కలను నాటాలని, వాటిని ప్రతి ఒక్కరూ పెంచి పోషించాలన్నారు. జీపీ అధ్యక్షురాలు దుర్గమ్మ ఉపాధ్యాయులు అంజప్ప, సుమప్రియ, కవితా రాథోడ్, విద్యార్థులు హాజరయ్యారు.

న్యాయవాదుల సంఘానికి ఎన్నిక

హుబ్లీ: ధార్వాడ జిల్లా కలఘటిగి తాలూకా న్యాయవాదుల సంఘం నూతన అధ్యక్షుడిగా అణ్ణప్ప టీ.ఓలేకార్‌ను ఎన్నుకున్నారు. శనివారం న్యాయవాదుల సంఘం సభామందిరంలో జరిగిన అధ్యక్ష పదవి ఎన్నికల్లో అణ్ణప్ప ఓలేకార్, వీబీ శివనగౌడర్, మంజునాథ్ దనేగౌండ పోటీ చేశారు. ఉపాధ్యక్షులుగా కేవీ గుడిహాళ, ప్రధాన కార్యదర్శిగా టీబీ దస్తికొప్ప, కోశాధికారిగా శోభ బళిగార, మహిళా ప్రతినిధిగా గీతా మట్టి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆర్‌సీహెచ్ డాక్టర్‌కు వీడ్కోలు

కోలారు: జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖలో ఆర్‌సీహెచ్ డాక్టర్‌గా విధులు నిర్వహించి నివృత్తి పొందిన డాక్టర్ విజయకుమారికి శనివారం డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సన్మానం అందుకుని ఆమె మాట్లాడుతూ వైద్య వృత్తి తనకెంతో సంతృప్తినిచ్చిందన్నారు. వృత్తి జీవితంలో తనకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ ప్రసన్న, డాక్టర్ ఏవీ నారాయణస్వామి, డాక్టర్ విజేత దాస్ తదితర సిబ్బంది ఉన్నారు.